మిసిమి

మాసపత్రిక

సంపుటి 32 సంచిక 9

సెప్టెంబర్ - 2021

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం

KALA JYOTHI Since 1946

Printed & Published by

BAPANNA ALAPATI

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

Hyderabad - 500 020.

Ph: 040 - 27612436, 27645538.

పత్రిక ప్రతి నెలా ఒకటవ తేది మీ ముంగిట వాలుతుంది...

ప్రతి : ₹ 30/- సంవత్సరానికి : ₹ 360/-

విదేశాలకు ప్రతి : $ 3.00 సంవత్సరానికి : $ 36.00 (by Air Mail)

కార్యదర్శి : వి. ఆశారాణి

ఫోన్ : 040 - 27645536. సెల్ : 994 951 6567.

LIBRARY OF CONGRESS

LCCN 91-903060

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

ISSN 2454-4329

E-mail: **misimi90monthly@gmail.com**

www.misimimonthly.com

e-magazine : www.kinige.com/misimi

facebook.com/misimimaasapathrika

YouTube : **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

మిసిమి

సెప్టెంబర్ నెల సూచికలు...

సల్మాన్ రష్దీ

కమ్మతెమ్మెరలు : ... 5
శీతవేళ రానీయకు... : దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి... 7
ప్రవాస సాహిత్యం – 12 – సల్మాన్ రష్దీ : డా. రమేష్‌ప్రసాద్ రావెళ్ల... 13
ఇండాలజీ : డా. అవధానం రఘుకుమార్... 18
యలవర్తి నాయుడమ్మ – 3 : కాట్రగడ్డ శేషగిరిరావు... 23
డా. సి.ఆర్. రావు : డా. నాగసూరి వేణుగోపాల్.. 30
జంట గ్రామాలు : గార రంగనాథం... 32
నాగరకత : వల్లభనేని అశ్వినీకుమార్... 40
పండిత రమా బాయి సరస్వతి : ఆచార్య యన్. లక్ష్మీ అయ్యర్... 47
సాహిత్యంలో ఈ శతాబ్దం నోబెల్ తారలు : ముక్తవరం పార్థసారథి... 51
ఎలుకల బోను – నేను : కిల్లాడ సత్యనారాయణ... 53
ఇంగ్లాండులో హిందూ దేవాలయాలు : తంగెడ విశ్వేశ్వర ప్రసాద్... 57
నాటకరంగ చరిత్ర : పతివాడ సూర్యనారాయణ... 63
ధర్మపురి – కృష్ణగిరిలో జైన మత వైభవం! : ఎం.ఎస్. రామస్వామిరెడ్డి... 69
తెలుగు నవల: అప్పుడు–ఇప్పుడు : వి. రాజా రామమోహనరావు... 71
జలియన్ వాలా బాగ్ మారణకాండ : వేలూరి కృష్ణమూర్తి... 74
'బహుళ' నవల: కఠోర సత్యాలు : శిరంశెట్టి కాంతారావు... 78
చదవండి... : *మిసిమి*... 80


డా. సి.ఆర్. రావు

రమా బాయి

మారణకాండ

అట్టమీద బొమ్మలు

పలుకరాదటే... చిలుకా
(చిత్రకారుడు: ఫ్రెడరిక్ పియరీ (1851-1921)


సముఖములో
(చిత్రకారుడు - ఆంద్రీ కోహెన్)


రాయబారమెందులకే...
(చిత్రకారుడు: రెష్మి తస్మిరన్)

నీలికనుల నీరెందులకే...
(చిత్రకారుడు: రెష్మి తస్మిరన్)

కమ్మతెమ్మెరలు

"…. **మిసిమి** రచనలు రుచి మరిగిన పాఠకులు ఖండాంతరాల్లోకి విస్తరించి ఉన్నారు. **మిసిమి** రచనలు అంతరాలను అదిమిపట్టి, పాఠకుల హృదయ స్పందనలు ఒక్కటి చేస్తున్నాయి. **మిసిమి** రచనల మూలంగానేకాబోలు ఓరుగల్లులోని రామప్ప దేవాలయాన్ని U.N.O. గుర్తించింది. ఠాగూర్ *గీతాంజలి* లో 'నీ గాలిపాట నా చెవిన పడింది, నా చూపు నీపై పడింది, నా చూపు నిన్ను బంధించి నాకందించిందం'ని అంటారు. అలాగే రామప్ప దేవాలయ వైభవాన్ని, **మిసిమి** రచనల ద్వారా వెలుగులోకి తెచ్చింది అనిపిస్తుంది. **మిసిమి** రచనలు పాఠకుని హృదయాన్ని అలంకరిస్తాయి. ముదిమిలోని పాఠకులు తమ గతాన్ని అవలోకనం చేసుకుని, నిండుగా ఊపిరి తీసుకొనేవిధంగా రచనలు సాగిస్తున్న తీరు ఆదర్శనీయం. కిల్లాడ సత్యనారాయణగారి రచనలు ముఖ్యంగా యువతకు శీలనిర్మాణానికి తోడ్పడే విధంగా వారి రచనలు ఒక్కొక్కటీ మహనీయులను వివేకానందులు, రామకృష్ణ పరమహంస, బౌద్ధం, జిడ్డు కృష్ణమూర్తి, సర్వేపల్లి రాధాకృష్ణ, ఠాగూర్ తదితరులను ఆవిష్కరిస్తున్న తీరు అద్వితీయం. పాఠకుల హృదయ స్పందననెరిగి తెలుగు రచనలలోని విలువలను నింపుతున్న (రుచులను మేళవించి) ప్రతి నెల పాఠకులకు అందిస్తున్న ఎడిటర్‌గారికి హృదయపూర్వక అభినందనలు. ఈ స్రవంతి ఇలాగే నిరంతరం కొనసాగి తెలుగు తోటలో ప్రవహించి పాఠకుల హృదయాల్ని తడిపి ఆనందాన్ని, ఔన్నత్యాన్ని పూయిస్తాయని ఆశిస్తూ…"

– *జి. జయంతి డానియేల్, హైదరాబాద్*

"…. శ్రీ సంగీతరావుగారి గోలోక పయనం జూన్ – జులై – 2021 **మిసిమి** ద్వారానే తెలిసింది. వారి ప్రజ్ఞాపాటవాలు ప్రపంచానికి, రసికలోకానికి తెలుసు. ఆ సువర్ణానికి సువాసన వారి వినమ్రత. ఇది కప్పుకున్న శాలువా కాదు. హృదయ పరిమళం. వ్రాసిన పప్పు వేణుగోపాలరావునీ, మిమ్మల్నీ సరస్వతి కటాక్షిస్తుంది… నా నమోవాకాలు…"

– *వి.ఎ.కె. రంగారావు, చెన్నై*

"…. **మిసిమి** జూన్–జులై – 2021 మాసాలకు ఒకే సంచికగా వచ్చినా కలకాలం పరిశీలనాత్మకమైన సంచికగా నిలిచిపోయే పుటం పెట్టిన మిలమిలల **మిసిమి** పసిడి బొమ్మగా నిలిచిపోతుందనిపిస్తుంది.. జాయింట్ సంచికలో రెండు మూడు రచనలు వర్తమానంలో, భవిష్యత్తులో కూడా పదేపదే ఉల్లేఖించదగినట్లుగా ఉన్నాయి. 1. మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీగారి 'మహాత్ముని' బిరుదుకు ఆకారాలను అపురూపంగా కాటా చంద్రహాస్‌గారు చిత్రించిన తీరు కత్తిమీద సాముకు, పదాల పొందికకు అనిర్వచనీయమైన నిర్వచనం – రసాత్మకమైన వాక్యాల పడుగుపేక చంద్రహాస్‌గారు గాంధీ మహాత్ముని గౌరవించిన తీరు, దీన్ని **మిసిమి** ప్రౌఢ వయస్సుకు ఎదిగినా కన్నె ప్రాయపు, (ఇంతవరకూ వెలువడిన సంచికలన్నింటిలోనూ, తన సోయగాన్ని మురిపించే తీరులో ముచ్చటపడదగ్గ సంచికగా ఉదహరించటానికి అర్హత సంపాదించుకున్న) 'చిన్నదాన్ని'గా చిరునవ్వును చిలకరించినవానిగా భద్రపరచుకోవచ్చు. 2. కీర్తిశేషులైన శ్రీ ఆలపాటి రవీంద్రనాథ్‌గారి వ్యక్తిత్వం వికసించటానికి యౌవనంలో నీరు పోసి పెంచిన తెనాలి పట్టణంలో, సాహిత్య సరిగమలు వినిపిస్తున్న సహృదయ వైద్యులు పాటిబండ్ల దక్షిణామూర్తిగారు తమ మిత్రుడు డా. కడియాల వాసుదేవరావుగారి గురించి కుదించి రాసుకున్న జ్ఞాపకాల జలపాతపు సెలయేటి నిగనిగల అలల అలరింపు. ఎందరో మహానుభావుల్ని జ్ఞాపకం చేసుకున్న ఆ పట్టణపు పరిమళాలు – (ఇటీవలీ రోదసిలోకి ఝుమ్మంటూ దూసుకెళ్లి తిరిగొచ్చిన శిరీష ముత్తాతగారు బండ్ల పుల్లయ్యగారు 1940 దశాబ్దంలో తెనాలి పట్టణాన్ని పరిమళింపజేసిన ప్రముఖులు కావటం విశేషం) – 'వెదజల్లారు'. (కీ.శే. బండ్ల పుల్లయ్యగా దేశభక్తి 1947 ఆగస్ట్ 14–15 తారీఖుల్లో ఎలా వ్యక్తమైందో మరోసారి చెప్పుకుందాం).. 3. చెరుకువాడ వెంకట్రామయ్యగారి స్పందన క్లుప్తంగానైనా కుసుమించిన పుష్పం – **మిసిమి** పాఠకుణ్ణి పరవశింపజేస్తున్న భాగ్యశాలుల్లో భాగ్యం పంచుకుంటున్న

సహృదయుల్లో సంపంగి పూవు ఆశారాణిగారిని గురించి వెలువరించిన పితృహృదయ స్పందనలు.. మూగచూపుతోనే మోదం కలిగిస్తున్న ఆమోదచిత్రం, వడ్డాది పాపయ్యగారి చిత్రాలంకరణలను చేరువకు తెస్తున్నాయి – అట్టమీది హావభావాలు.."

– బాలంరాజు కృష్ణంరాజు, హైదరాబాద్

"…. జూన్ – జులై – 2021 **మసిమ** వచ్చింది. **మసిమ** రాగానే సంబరాలు చేసుకున్న ఆనందం నాకు. మహాత్ముని కష్టాలు – మహాత్మునికే తెలుసు అంటూ మనకూ ఆ కష్టాలు వివరించారు రచయిత శ్రీ చంద్రహాస్. పరిశీలనాత్మకమైన రచన. మహాత్ముడైనా ఆయన మనిషి. మనందరిలాగా మహాత్మునిలోనూ రాగద్వేషాలు, మోహపారవశ్యం ఉన్నాయి. సహజ మానవత్వ లక్షణాలు కలిగినవాడే కానీ మానవాతీతుడేం కాదు. ఆయన క్రమశిక్షణ – నిరాడంబరత – సమయ పాలన – 'కొల్లాయిగట్టితేనేమి' తన అహింసాతత్వ సాధనలో ఆంగ్ల ప్రభుత్వాన్ని గడగడలాడించాడు. ఆయన మూడవతరగతిలో రైలులో ప్రయాణం చేసినా వారికీ వారి అనుచరులకూ ఎంత ఖర్చు అయ్యేదో! "ఈ దరిద్ర నారాయణుడికి ఇంత ఖర్చు!" అని సరోజినీ నాయుడు ఆటపట్టించేవారని విన్నాము. సరళాదేవి విషయంలో మహాత్ముని బ్రహ్మచర్యం కట్టలు తెంచుకున్నది. రాజాజీ హెచ్చరించకపోతే ఈ దేశ భవిష్యత్తు ఎలా ఉండేదో ఊహించగలము! కులమతాలకతీతంగా జీవనం సాగించినా ముస్లింలు అంటే కొంత ఆకర్షణ ఉండేదాయన మనస్సులో! సత్యశోధన మహాత్ముని నిజాయితీకి నిదర్శనం. అయినా సరళాదేవిని ఎందుకు దాచిపెట్టారో తెలియదు కదా! గాంధీలో గొప్ప ఆకర్షణ శక్తి ఉన్నది. ఆయన జీవన విధానం విశిష్టవంతమైనది. అయినా ఆయన మానవుడే! పట్రాయని సంగీతరావు గారి గురించి వేణుగోపాలరావుగారి రచనలో సంగీతరావుగారి సౌజన్యతా – కళాత్మక సంగీత మాధుర్యమూ దర్శించాను. గురుపుత్రుని ఆదరించి, గౌరవించిన శ్రీ ఘంటసాలవారి ఔన్నత్యం సృహృదయతా – ఆయనకే చెల్లుతుంది సుమా! జ్ఞాపకాల జలపాతం చదివి మురిసిపోయాను. డా. దక్షిణామూర్తిగారు, వాసుదేవరావుగారిని సన్నిహితంగా ఆత్మీయంగా చూశారు కనుకనే గొప్పగా వ్రాశారు. రచయితకు ధన్యవాదాలు. కిల్లాడ సత్యనారాయణగారి చిత్రకూటం చదువుతూ వారితో ప్రయాణం చేసినంత అనుభూతి కలిగింది. వారు ఏది వ్రాసినా మనసుపెట్టి వ్రాస్తారు. ధన్యవాదాలు.. **మసిమ** ఈ తరంవారికి సాహిత్య దీపం. పాతతరంవారికి జ్యోతిదర్శనం…"

– చెరుకువాడ వెంకట్రామయ్య, విస్సాకోడేరు, భీమవరం

"…. **మసిమ** పఠనానందంలో మునిగి తేలుతున్నాను. సంయుక్త శతపత్ర సుందరి జూన్–జులై – 2021 **మసిమ** సంచికలో తెలుగువారు గుర్తుచేసుకోవలసిన ఇద్దరు ప్రముఖ వ్యక్తులు – 1. కీ.శే. యలవర్తి నాయుడమ్మగారు, 2. కీ.శే. డా. కె.వి. రావుగార్ల జీవిత విశేషాల గురించి ప్రచురించబడిన విస్తృత వ్యాసాలను శ్రద్ధతో చదివి ఎన్నో విషయాలు ఆకళింపు చేసుకున్నాను. ధన్యవాదాలు. మనమంతా గర్వించదగిన మరొక వ్యక్తి, శతాధిక వయస్కులు ప్రొ. సి.ఆర్ రావుగారు. వీరు గణాంక శాస్త్రానికి గీతాచార్యులు – వీరి శతజయంతి వేడుకలు వారి శిష్యులు, అభిమానులు. సెప్టెంబర్ 2020లో ప్రపంచవ్యాప్తంగా జరిపి వారిపై తమ అత్యున్నత గౌరవాన్ని వ్యక్తం చేసుకొన్నారు. గణాంక పాఠ్య పుస్తకాలలో వీరి పేరున్న ధీరమ్స్ ఎన్నెన్నో. ఆంధ్రా యూనివర్శిటీలో స్టాటిస్టిక్స్ పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థిగా నేను, వారి కొన్ని ధీరమ్స్‌ను అధ్యయనం చేయడం ఒక మరపురాని అనుభూతి. **మసిమ** సత్సాంప్రదాయాలకు అనుగుణంగా ప్రొ. రావుగారి జీవిత విశేషాలను, వారి గణాంక శాస్త్ర పరిశోధనల ప్రభావాలను వివరిస్తూ మీరు వారిపై ఒక వ్యాసాన్ని ప్రచురించమని నా వినతి. …"

– రాయవరపు సత్యనారాయణ, ముంబయి/కాకినాడ

శీతవేళ రానీయకు... శిశిరానికి చోటీయకు

– దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి

*ఎప్పుడో, ఎక్కడో, ఎవరో – తాము నిర్వహించబోయే సభాకార్యక్రమాలకు అధ్యక్ష పీఠాన్ని అలంకరించవలసిందిగా అభ్యర్థించగా – కృష్ణశాస్త్రి స్పందన ఆయన మాటల్లోనే విందాం. అప్పటికే మూగబోయిన తన కంఠనాళాల మౌనగానాన్ని, హృదయ వేదనను, వయస్సు భారాన్ని – అన్నిటినీ అధిగమించి, తన సునిశిత ఆలోచనా ధారను, మొక్కవోని తన ఆశావాదాన్ని వినిపించారు, అక్షరాల సరాలతో... ఈ అరుదైన పత్రం నా చేతికి ఎలా వచ్చింది? గౌరవనీయులైన **మిసిమి** పాఠకులకు ప్రత్యేకం ఈ కృష్ణ ప్రసంగ వ్యాసం.*

(ఆమె మహా సౌందర్యవతి! ఒకప్పుడు. ఇప్పుడు మన్మథుడు వదిలి వెళ్లిపోయిన శిథిల గృహం.)

ఇప్పటి నా స్థితి శిథిల మందిరంలో అంధకారంలాగునా... కంఠ ద్వారందాకా వచ్చి, మాట ఇవతల పడలేక గిలగిలలాడుతుంటే ఎలాగుంటుందో మీకు తెలుసునా? నేనొకసారి అంధ బాలికా వసతి గృహంలో ఆ పిల్లలు 'పాట కావాలి అన్నయ్యా...' అంటే వాళ్లలో ఒక పిల్ల తెలియక, కనపడక నా ఒడిలోనే కూర్చుంది. చనిపోయిన నా కూతురులాగున.

తెలుసు మాకు – వెలుగు ఏదో, చీకటి ఏదో –
మా చెవులకు కళ్లుంటాయి –
మా చేతులు చూస్తాయి
అని మొదలుపెట్టి వ్రాశాను.
చూడలేని కన్ను మూగది, మాటాడలేని గొంతు గ్రుడ్డిది.
నా కంఠం రాయి, నా కంఠం రేయి
నా కంఠం అహల్య, ఏ శ్రీ చరణ స్పర్శ లభించని అహల్య!
అయినా నేను నెపం ఎన్నను నిస్పృహ చెందను

దేవులపల్లి
వెంకట కృష్ణశాస్త్రి

విశ్వాసికి మానవునిలో అచంచల విశ్వాసం ఉన్నవానికి అలాగ ఏడవటం, తప్పు పట్టటం నేరం.

నాకన్న దుస్థితిలో ఉన్న కోట్లమంది సంగతి?

John Wesley methodist profet కి ఒక స్నేహితుడుండేవాడు. అతను ఎప్పుడూ 'ఇలాగు ఉన్నాను ఖర్మం, ఇంత పాడుగా' అంటూ నసపెట్టేవాడు. ఒకసారి లండన్ వీధిలో గుడ్డి, మూగ, కుష్టు భిక్షకుడు వెళ్తున్నాడు. అప్పుడు వెస్లీ అన్నాడు – "There goes John Wesley but for the grace of God' అని.

అయితే లోకంలో పేదతనమే కాదు, ఎక్కడ గుడ్డితనము, మూగతనము, బాధ, వేదన ఉన్నా దానిని తొలగించడం నీది, నాది బాధ్యత.

నీవు, నేను పోయాక నీకోసం, నాకోసం మన ఆలుబిడ్డలు మాత్రమే కాక, ఏ ఒక్క ఇతరుని కన్ను చెమ్మగిల్లినా, నీవు, నేను నిజంగా బ్రతికామన్నమాట! అవునా?

* * *

మనిషి నిత్య పథికుడు. తొలి మానవుడెవడో కాని వానివద్ద నుంచి ఆగకుండా ప్రయాణం ముందుకు చేసుకుని వస్తున్నాడు మనిషి. కనుకే మనం ఇలా ఉన్నాం.

కవి మరిన్ని. ఒకచోట ఆగిపోవడానికి కవికి అధికారం లేదు.

నేను "వచ్చినదాకానే రండి, తరువాత వద్దు" అనలేదు. యుగాల నుండి వస్తూవున్న అనుభవాలను, సత్యాలను తన జోలిలో దారిబత్తెంలాగున వేసుకుంటూ వస్తాడు. వాటిలో కుళ్లినవి, పనికిరానివి ఇవతల పారేస్తూ.

కంట్లో నలక పడినవానిలాగున చచ్చినా నడవలేడు. పీతలాగున అడ్డంగానూ నడవలేడు. ఎక్కడో ఎక్కడ నుంచో ఎంత దూరం నుంచో నడుస్తూ వచ్చినవాడే ఇంకా ముందుకు వెళ్లి తీరుతాడు అనిపిస్తుంది.

వీడు ఇక్కడ ఉండిపోడురా అని కూడా అనిపిస్తుంది.

కనుక ఆ జోలిలో పనికివచ్చేవి, శిథిలం కానివి, సత్యమైనవి ఉంటాయి. వద్దన్నా ఉండి తీరుతాయి.

ఠాగోర్ అంటాడు – Light is young - the Ancient Light - Shadows are of the moment - They are born old'–

కనుక వెలుగు, యౌవనం, సత్యం అన్నీ ఒక్కటే. యౌవనం అంటే అదృష్టం!

మంచో చెడో. నువ్వు ఎవరితో పోతావు అని నన్నడిగితే గోతిలోనికి తీసుకుపోయినా యువజనంతోనే పోతాను అంటాను.

యౌవనం అంటే భావికాలం. అసలు మానవునికే మరో పేరు భవిష్యత్. అయితే చచ్చినా, గిలగిలామని కొట్టుకు చచ్చినా, సంప్రదాయంతో పూర్తిగా సంబంధం లేకుండా తెంచుకోలేవు.

ఎంచేత?

వెలుగు తరుణమైనదే కాక సనాతనమైనది కూడా. Light is not only young - but it is a also ancient.

ఎంత అద్భుతంగా ఉండి ఉంటుందో – నిరవధికాకాశం క్రింద నిలబడి, గాలిలో లేత చెట్లులా ఊగుతూ అసంఖ్యాకమైన నక్షత్రాలకేసి చూస్తుంటే మొదటి మానవునికి!

అయితే ఆ మొదటి మానవుడు నేను కదలను అంటే మనందరం బట్టలు విప్పుకొని, ఆకులు మేస్తూ ఆరుబయట ఉంటాం.

సైన్సు (శాస్త్రం – జ్ఞాన వికాసం) గొప్పది, అద్భుతమైనది. సైన్స్ లేకపోతే మనకు బట్ట కుట్టటం ఉండదు. ఇల్లు కట్టటం ఉండదు – ఇదంతా సైన్సే కదా. సైన్సు అంటేనే ప్రగతి – అభ్యుదయం.

ఇక రచయితలకు నాది ఒక హెచ్చరిక కూడా ఉంది.

మన తెలుగు రెండు భాషలుగా ఉంది. కావ్య భాష, వాడుక భాష. రచయితకు ఏ ఒక్కటైనా క్షుణ్ణంగా రావాలి. రెండూ వస్తే చాలా గొప్ప. మన భాష, నుడికారం తెలియాలి. మనం అందరం వ్యావహారిక భాష అనే వ్రాసేది మన సొంత (Personal) వ్యావహారికం. గురజాడ కన్యాశుల్కం లోది లోకంలో వాడుక భాష!

కోట్లమందితో రచయితకు సన్నిహిత సంబంధం ఉండాలి.

కారణాలు ఇవి:

ఒకటి, జీవద్భాష బాగా రావడానికి!

రెండు, లోకం – జనం, ఎన్నడూ వట్టిపోని 'రిజర్వాయరు' 'డైనమో' వాని నుంచి మనం జీవనం నింపుకొంటుండాలి. వాని నుంచి చైతన్యం (Charge) చేసుకోవాలి. జీవల్లోకంలో నుంచి మనకు వస్తువూ కావాలి. సృష్టించే శక్తినిచ్చే కరుణా కావాలి.

ఇక్కడ కూర్చుని, మదరాసులోనో, బొంబాయిలోనో మనం "కొట్టండీ – దంచండీ – చంపండీ – మానవుడా... లేరా" అంటే కుదరదు.

ఇక కవి మాటకు జీవం (warmth) ఉండదు. మానవ మహాసాగరంలో పడిపోవాలి. అప్పుడే ఆ శరీరానికి జీవించి ఉన్నవాని శరీరంవలె warmth ఉంటుంది. లేకపోతే ఎంత సుందరంగా చెప్పినా అది నిర్జీవమూర్తే.

ఇంకొక సంగతి.

ఇవాళ పద్యం వ్రాస్తాను అనీ, కూర్చునీ ఒక అందమైన Phrase కాని Image కాని వస్తే దాని చుట్టూ ఒక కృతి అల్లడం లాభం లేదు. ఆ సమాసం, ఆ Image వదులుకోలేక.

ఆ Image సమాసం దగ్గరకు వచ్చేసరికి భేష్ అంటాం. ఆ నిమిషానికి తెలియనివాళ్లం.

అలాగే ఒక కృతి (Poem)లోనే Series of beautiful image and phrases ఉండవచ్చు...

కానీ అన్నీ కలిసి ఒకే ఒక జీవన్మూర్తి కావాలి. లేకపోతే అందమైన కిటికీలూ, తలుపులూ, ప్రక్కప్రక్క పెట్టినట్లవుతుంది. మందిరం మాత్రం కాదు. దానిలో ఏది తీసేసినా మందిర రూపం అంతా కూలిపోతుంది.

సెసిల్ డె లూయి అన్నట్లు Those images quarrel among themselves and tear the poem to pieces.

ఇవన్నీ చెప్తే, ఈ ముసలి పీనుగుకు కుళ్లూ, అసూయా అనుకుంటారు.

నాకు చాలామంది రచనలు బాగుండవు.

1. జీవన్మూర్తులకు ఉండే వేడి, warmth లేక –

2. ఒకే ఒక మూర్తిలో (inevitable)గా ప్రతీ పదమూ, image ఉండదుగనుక.

రవీంద్రుడే అన్నట్టు the whole universe is a lyric, in which every part or thing must agree with the other parts or things.

సాహిత్య రూపాలన్నిటిలో కవిత్వం ఎక్కువగా ఆత్మాశ్రయం; లిరిక్ మరీని.

ఏదో సంఘటనో, ఏదో వస్తువో కవి అంతరంగాన్ని స్పృశించి, దానిని ఊపి, ఆవహించి, తన సొంత అనుభవంగా అయిపోయి, అతి విశిష్ట వాణి ద్వారా లిరిక్ అయి వెలువడుతుంది.

లిరిక్‌లో బుద్ధికి కన్న, మెదడుకన్న హృదయానికి అధిక్యం. లిరిక్ వ్యక్తపరిచేది హృదయ భావం (Truth of the emotions).

"I will fly to thee on the viewless wings of poetry, though the dull brain perplexes and retards" అన్నట్లు (Keats కాబోలు).

లిరిక్‌లో ప్రతి శబ్దానికీ పరిమళం ఉంటుంది; ప్రత్యేక వర్ణం ఉంటుంది. ఆ శబ్దానికి పర్యాయపదం ఉండదు. విధిగా ఖచ్చితంగా అదే అక్కడ ఉండాలి. అది (Inevitable word). అక్కడ అది తప్ప వేరొక మాట నప్పదు.

నిజమైన కవికి పర్యాయపదాలంటూ ఉంటాయా?

ఇంక లిరిక్‌లో ఒక శబ్దానికి మరొక శబ్దం ప్రాణమిత్రం, ఆప్తబంధువు. పదాలు పనిగట్టుకొని దగ్గర చుట్టాలను పిలుచుకొని చుట్టూ చేర్చుకుంటాయి. అవి చెట్టపట్టాలు వేసుకోవాలి; అడుగులో అడుగు కలిపి ఒకే ఒక అడుగుగా నడవాలి. వాటిలో వాటికి ఏ పొరపరా మెరమెరా ఎక్కడా రాకుండా ఉండాలి; కలిసి కట్టుగా విహారం చేయాలి అవి. లయ చెడకుండా, స్వరం తప్పకుండా, అపశ్రుతి రాకుండా. ఒకే గొంతులో నుంచిలాగ, కలిసి పాడాలి అవి.

వాటికి ఒకే ఒక బొంది; ఒకే ఒక ప్రాణం.

లిరిక్ రాగతాళాలతో గేయమే కానక్కరలేదు. పద్యం కావచ్చు, వచనం కావచ్చు. రవీంద్రుడేనా ఒకచోట ఇలాగ వ్రాశాడు?

"లిరిక్‌లో ఛందసూ భావమూ కరిగి కలిసి ఒకటైపోతాయి (the expression and the expressed are one). విడదీస్తే అవి ఒకదానినొకటి మింగేసే శక్తులు. వాటి సహజ వైరుధ్యాన్ని పోగొట్టి సమన్వయించాలి; లేకపోతే తక్కువరకం కవిత్వం తయారవుతుంది" అని.

కొన్ని రచనలలో నగలు, భావాలను ఊపిరాడనీయవు. కొన్ని రచనలు, జిగీ బిగువూ నగా లేక, జావగా, చప్పగా జారిపోతాయి.

కొందరికి చెప్పే నోరుండదు. కొందరికి నోరుండి చెప్పేది ఉండదు.

ఏ సృష్టికయినా, కవి సృష్టికే కాదు – ఈ సమన్వయం కావాలి; మన ముందు పరస్పర విరుద్ధాలయిన వస్తువులు ఉన్నాయి. వాటి నిత్య సంఘర్షణలో నుంచి ఏకత్వం సృష్టించాలి. ఆ శ్రమ పడడానికి ఓపిక లేక సంఘర్షణను అలక్ష్యం చేస్తాము. అప్పుడు సృష్టి కూడా జరగదు.

ఈ లోకం, ఈ సృష్టి, అంతా కలసి అత్యద్భుతమైన ఒక లిరిక్. మన జీవితం ఆ పాట వినడంవంటిది.

పాటలో అందాన్ని, తీయదనాన్ని ఆస్వాదించడానికి తుదివరకూ ఆగనక్కరలేదు. పాట ఉండనే ఉంది.

పాట మొదలుపెట్టగానే దాని అంతం కోసం ఆరాటపడటం; పాటతో పాటు మనమూ సాగుతాము; ప్రతి చిన్న మెలకువనూ స్పృశిస్తూ.

లోకం అనే పాటలో కూడా భాగాలు. మనల్ని అలసటపెట్టవు, విసిగించవు. ఆ భాగాలలో ఉన్న ఏకత్వం మనం గ్రహించినకొద్దీ మన ఆనందం పెరుగుతుంది.

కవిత్వానికి పదాలకన్నా కూడా వాటి కూడికవల్లా కూర్పువల్లా జనించే గానంవంటిది మరీ అవసరం.

పింగళి సూరన్న అన్నట్లు "పొసగ ముత్తెపు సరుల్ పోహళించినయట్లు."

మల్లెనో మందారాన్నో ఒక మూసలో (crucible) పడవేసి కాల్చివేస్తే, దాని వన్నె, వాసనా ఏ కారణంవల్ల కలిగాయో తెలియదు. అందుకే ఒక భాషలో వెలిసిన కవితా సృష్టిని వేరొక భాషలో రూపొందించడానికి చేసే ప్రయత్నం వ్యర్థమని షెల్లీ అన్నాడు. "చెట్టు మళ్లీ విత్తు నుంచే పుట్టాలి; లేకపోతే పూయదు!" అని.

"Charmed magic casements, opening on the foam of perilous seas in the fairy lands foam"

"ఈ పంక్తులు ఆంగ్ల లిరిక్ శిల్పకళకు విజయ స్తంభాలు. వీటిలోని ప్రతి పదానికీ అంతులేని స్ఫోరక శక్తి ఉన్నది. వీటిని వినగానే ఎందుకో కళ్లు చెమ్మగిల్లుతాయి". అన్నాడు ఒక ఆంగ్ల విమర్శ శిఖామణి.

వీటిని మరొక భాషలోకి అనువదించడం ఎలాగ?

అర్థం మాత్రం అయితే తేలికే.

కాని దీనిలోని ప్రతి పదమూ ఒక గవాక్షం. దానిలో నుంచి విజగాలైన వింత లోకాల వరకూ పరచుకొన్న కడలుల కరళ్లపై మరిగి రేగే నురుగులూ అవీ కనపడతాయి.

ఇటువంటివి మన మహాకావ్యాలలో నుంచి ఎన్నో చూపించవచ్చు; నన్నయ్యగారి భారతంలో నుంచి మరీని. నన్నయ్య వంటి గొప్ప లిరిక్ కవి తెలుగు కవులలో లేడు. తిక్కన్న అంత నాటకకర్త dramatist భారత సాహిత్యంలోనే ఉన్నాడా అనిపిస్తుంది.

మన ఆంధ్ర భారత భాగవతాలు అనువాదాలు కావా అని అంటారేమో: ఏమో, నాకు తెలియదు.

ఆ సంగతి తెలుసుకోవాలనీ లేదు. అవి నాకు చాలు.

వాటిని రచించిన కవులది మాత్రం అతిలోకమైన ప్రతిభ. వారున్నూ ఋషులే.

కాక ఆ మహాకావ్యాలలోని ప్రత్యంశమూ వారి సంస్కృతిలోని భాగం; ప్రతి సంఘటనా వారికి పరమ సత్యం; వారి జీవితమూ వారి సమాజమూ వాటిలోని గాథలతో పరమార్థాలతో నిండిపోయి ఉన్నాయి. కనుక ఆంధ్ర భారత భాగవతాలు మళ్లీ భూగర్భంలో నుంచి మొలిచి నిలువునా పూచి నిలిచిన మహా కల్పవృక్షాలు.

అంటే చెట్టు మళ్లీ విత్తు నుంచే పుట్టింది.

ఓపిక లేక, ఒళ్లు సరిగ్గా లేక, ఉగ్రమైన వేసంగి ఎండను తట్టుకొని నిలవలేక, ఏదో అది ఇదీ తోచినట్లు గిలికాను. సారం మాత్రం ఇది.

నిత్య పథికుడైన మానవుడు ముందుకే సాగాలి. సాగి తీరతాడు అనిన్నీ, కవి మరిన్నీ అనిన్నీ.

ఇక వేగమే లక్షణంగాగల ఈనాడు మరీ తొందరగా లోకం మారుతుంది.

కనుక వెనుకాల నిదానంగా కాళ్లీడ్చుకుంటూ మనం నడిస్తే దారి ప్రక్కన ధూళిలో రాలిపోతాము.

మృత్యుశైథిల్యాన్ని, శుష్కవైరాగ్యాన్నీ కౌగిలించుకొని కూర్చోకూడదు. అయినా సంప్రదాయంలో సత్యమైనది మనతో ఉండి తీరతాయి కదా! వానిని చచ్చినా వదులుకోలేము.

ఇక విరోధి అయినవాడో, విరోధపక్షం అనుకున్నదో, మంచిమాట చెప్పి, మంచి పని చేస్తానంటే దానినీ ఖండించడం, నిరసించడం నేరం, తప్పు! ఉదాహరణకు Bonded Labour పోవాలి. లంచగొండితనం పోవాలని ఒకరు అంటున్నారు గనుక, "అది రైటే కాదు, వ్యతిరేకిస్తాను" అనడం చాలా చాలా నేరం.

మనం రచయితలం. 'మంచి'వైపు, మనం. అంతే! మనకు మతం, కులం, పక్షం లేదు. "మంచి అన్నది మాల అయితే మాల నేనౌదున్" అని మన గురజాడ అన్నట్లు. కనుక విశాల మానవత, ప్రేమ, కరుణ, మానవ మహాసాగరంలో మునగడం, మొదలైనవి మరవకండి. ఇవి ఎవరు కాదంటారు?

రచయితలం అందరం – "ముందుకు నడవవద్దు – అంతా ప్రతీదీ పాత్రలోనే ఉంది" తినేవారు తప్ప – అందరం కలుద్దాం. కలిసి ఊరికే రచనలు చేయటమే కాదు – కార్యోత్సాహం చూపిద్దాం.

శారీరక శ్రమ కూడా పడదాం.

మనస్సుక్కూడా అది ములుకర్ర. నాకు 1914 నుంచి ఎన్నేళ్లో, నా చిన్ననాటి కార్యోప్పనయూ, సంఘ బహిష్కారమూ, క్రూరమైన Persecutionకి హింసలకు పాల్పడడమూ, అన్నీ జ్ఞాపకం వస్తున్నాయి.

అభ్యుదయ రచయితల సంఘం, రచనలతో ఆగక, సమావేశాలతో సంతృప్తి పడక, లోక రంగాల్లో నిరంతర కార్యోత్సాహాలలో పడిపోతేనే శ్రీశ్రీ అన్నట్లు:

"పదండి ముందుకు" అన్న గేయానికి లాభం ఉంది.

ఇక నేను ఊరికే అన్నానుగాని, చచ్చినా ముసలిని గాను.

ఈ నా గీతం వినండి:

శీతవేళ రానీయకు!
శిశిరానికి చోటీయకు!
పూలకారు ఏ నాటికీ
పోనీయకు! పోనీయకు!
జాగ్రత్త! జాగ్రత్త! జాగ్రత్త!
జాగ్రత్త! జాగ్రత్త! జాగ్రత్త
ఉగ్రమైన వేసంగి ఎండ
ఆగ్రహించి పైబడనీ,
ఒక్కుమ్మడిగా వర్షామేఘం
వెక్కివెక్కి ఏడ్చేయనీ.

శీతవేళ రానీయకు!
శిశిరానికి చోటీయకు!
చైత్రంలో తొగరెక్కే కోర్కెలు!
శరత్తులో కైపెక్కే కలలు!
శీతసమయం మగతా నిదురా!
శిశిరకాలం మరణం, మసనం!

శీతవేళ రానీయకు!
శిశిరానికి చోటీయకు!

వీట లేదనీ చెప్పించు;
వీలు లేదనీ పంపించు!
వీధివాకిటను జరాపద ధ్వని
వినబడగానే వెంటనే –
వీట లేదనీ చెప్పించు
వీలు లేదనీ పంపించు!
శీతవేళ రానీయకు
శిశిరానికి చోటీయకు!!





(రెండు దశాబ్దాలకు వినిపించిన మిత్రుడు ఎమ్.వి.ఎస్. ప్రసాద్ పంపిన చరిత్ర పుటలు)

ప్రవాస సాహిత్యం – 12
సల్మాన్ రష్దీ

– రమేష్ ప్రసాద్ రావెళ్ల



సల్మాన్ రష్దీ

సల్మాన్ రష్దీ గత నలుభై ఐదు సంవత్సరాలలో పదునాలుగు నవలలు, ఒక కథాసంపుటి, అయిదు వ్యాససంపుటిలుపైగా ప్రచురించారు. తన రెండవ నవల *Midnight's Children (1981)*తో ప్రపంచ ప్రఖ్యాతి గడించారు. ఈ నవలలో ప్రధానపాత్ర, కథకుడు సలీమ్ సినాయ్. సలీమ్ తన స్నేహితురాలు, కాబోయే భార్య పద్మకు తన ముప్పది ఏళ్ల జీవిత చరిత్రను చెప్పినట్లుగా ఉంటుంది నవల కథనం. సలీమ్‌కి ఊరగాయల ఫాక్టరీ ఉంది. అందులో పద్మ కార్మికురాలు. సలీమ్ ఆగస్టు 15, 1947 అర్ధరాత్రి, ఇండియాకు స్వాతంత్ర్యం వచ్చిన మొదటి గంటలో బొంబాయిలో జన్మించాడు. ఈ నవల ఒక విధంగా స్వతంత్ర భారతదేశం మొదటి ముప్పది సంవత్సరాల చారిత్రిక ఘటనలపై అన్యాపదేశం, రూపకం. ఇండియా, పాకిస్తాన్ విభజన తరువాత పరిణామాలు, రెండు దేశాల మధ్య పోరాటాలు, భాషోద్యమాల ఆందోళనలు, బంగ్లాదేశ్ అవతరణ, ఇందిరాగాంధీ ఎమర్జెన్సీవంటి ఘటనలు ఇందులో చోటుచేసుకొన్నాయి. ఈ నవలలో మూడు భాగాలు. మొదటి భాగం ఇండియాలోనూ, రెండవ భాగం పాకిస్తానులోనూ, మూడవభాగం బంగ్లాదేశ్, ఇండియాలో జరిగిన సంఘటనలు ఉంటాయి. రష్దీ తాను పుట్టిపెరిగిన బొంబాయిలోని బడుగు జీవితాలను చిత్రీకరించారు.

ఈ నవల మూడు తరాల చరిత్ర. సలీమ్ తాత ఆదం అజీజ్ బొంబాయిలో డాక్టరు. విదేశాల్లో చదువుకొన్నాడు. 1919లో అమృతసర్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ కాల్పులలో చిక్కుకొన్నాడు, అదృష్టవశాత్తు చావునుండి తప్పించుకొన్నాడు. అక్కడ బ్రిటిష్‌వారు వేయికి పైగా భారతీయులను అమానుషంగా కాల్చివేసారు. రెండువేలమంది గాయపడ్డారు. అందులో స్త్రీలు, బాలబాలికలు కూడా ఉన్నారు. సలీమ్ పుట్టిననాటికి వారిది సంపన్న కుటుంబం. సలీమ్ నిజంగా ఆ కుటుంబంలో పుట్టినవాడుగాదు. హాస్పిటల్‌లో నర్సుల తప్పిదంవల్ల ఇద్దరు బిడ్డల మార్పు జరుగుతుంది. సలీమ్ ఒక పేద కుటుంబీకుల బిడ్డ. సినాయ్ దంపతుల కొడుకు బొంబాయి మురికి వాడల్లో ఆ పేద కుటుంబీకుల ఇంట్లో పెరుగుతాడు. అతని పేరు శివ.

సలీమ్, శివతో పాటు అదే గంటలో దేశంలో పుట్టినవారు వేయిన్నొకటిమంది. వాళ్లలో ప్రతివారికి ఒక ప్రత్యేక శక్తి ఉంటుంది. ఒక కేరళ కుర్రవాడు అద్దంలోకి వెళ్లి, దేశంలో ఏ అద్దంలోకి అయినా ప్రత్యక్షం కాగలడు. ఒక గోవా అమ్మాయి తన చూపులతో చేపలను సృష్టించగలదు. ఇంకో బాలుడు ఘటోత్కచుడిలాగా ఎంత ఎత్తుకైనా ఎదగగలడు. ఇలాంటి మాంత్రిక శక్తులు ఎన్నో. సలీమ్ శక్తి వాసనలు గుర్తుపట్టడం. పైగా వారికి మనస్సులతో మాట్లాడుకోగల దూర సంవాద శక్తి కూడా లభిస్తుంది.

ఈ నవలాకాలం షుమారు 1915 నుండి 1977వరకు – అంటే స్వాతంత్ర్యానికి ముప్పది ఏళ్ళు ముందు నుండి ముప్పది ఏళ్ల తరువాతవరకు. చారిత్రిక

ఘట్టాలతో పాటు పాత్రలకు సంబంధించి ఎన్నో ఉపకథలుంటాయి. అందులో కొన్నిటికి మాంత్రిక వాస్తవికత (Magical realism)జోడు చేయటంతో ఈ నవల చదువరికి ఐంద్రజాలిక భ్రమను కలిగిస్తుంది. అదే పట్టున జలియన్ వాలాబాగ్ వధలు, బ్రిటిష్‌వాళ్ళ క్రూర వలస పాలనా విధానం, బొంబాయి మురికివాడల్లోని పేదల బ్రతుకులువంటి నిజాలు పాఠకులకు దిగ్భ్రాంతిని, భయాన్ని కలుగచేస్తాయి. ఈ సాహిత్య ప్రక్రియలన్నీ సమపాళ్ళలో ఉండటం ఈ నవల విజయానికి కారణం.

Midnight's Children నవలకు 1981లో బుకర్ ప్రైజ్ లభించింది. ఇంగ్లీష్ స్పీకింగ్ యూనియన్ సాహిత్య బహుమతి, జేమ్స్ టైట్ బహుమతి కూడా వచ్చాయి. 1993లోనూ, మళ్ళీ 2008లోనూ, రష్దీ ఈ నవలకు బెస్ట్ ఆఫ్ బుకర్ బహుమతిని అందుకొన్నారు. 2003లో రాయల్ షేక్స్‌పియర్ కంపెనీ ఈ నవలను నాటకంగా ప్రదర్శించింది. బిబిసి ఈ నవలను రేడియో నాటికగా ప్రసారం చేసింది. పదునైదు పైగా పునర్ముద్రణలు పొందినది. ఒక్క యునైటెడ్ కింగ్డమ్ దేశంలోనే పదిలక్షల కాపీలు అమ్ముడుపోయాయట. నవల పేరుతోనే దీప మెహతా దర్శకత్వంలో 2012లో మూవీగా వచ్చింది. ఇందులో శ్రియా శరణ్, రాహుల్ బోస్, షబానా ఆజ్మీ, సీమా బిస్వాస్, అనుపమ్ ఖేర్ నటించారు.

- *ఈ తరంలో వచ్చిన ఇంగ్లీషు నవలల్లో ఇది ఎంతో ప్రధానమైనది. – న్యూ యార్క్ రివ్యూ ఆఫ్ బుక్స్*
- *అరుదైన జీవితలాలస కనపడుతుంది, అలాగే జీవితంలోని క్రూరత్వాన్ని, దురవస్థను చూపిస్తుంది. రష్దీ మంత్రం వేయగలడు, ఆగ్రహాన్ని చూపించగలడు. ఈ నవల చాలవరకు అవినీతి, అపజయం, ఆవేదన, అర్థంలేని హత్యలతో కూడిన కేటలాగ్. – గార్డియన్*
- *పది పన్నెండు గట్టి కథాత్మకాలను సమైక్యం చేయడంతో ఈ నవల సాగుతుంది. రచయత వాటిని ఏకీకరణ చేసిన పద్ధతి చూడటానికి సొంపుగా ఉంటుంది. – న్యూ యార్క్ టైమ్స్*
- *ఈ నవల హడావుడిగా ఉంటుంది, నిదానంగానూ ఉంటుంది. హాస్యము, దైవికము తోడయి ఉంటాయి. స్పష్టాస్పష్ట భూయిష్ఠము. అద్భుత భయానక రసాలు మిళితమై ఉంటాయి.*

– ఇండియా టుడే

The Satanic Verses (1988)లో గాబ్రియెల్ ఫరిష్టా, సలాడిన్ చంచా ప్రధాన పాత్రలు. ఇద్దరూ ఇంగ్లండులో నివసించే ఇండియన్ ముస్లిములు. గాబ్రియెల్ హిందీ సినిమా నటుడు. హిందూ దేవుళ్ళ పాత్రలు నటించి ఎన్నో విజయవంతమైన సినిమాల్లో పాల్గొన్నాడు, పేరుప్రఖ్యాతలు గడించాడు. సలాడిన్ ఇంగ్లండులో డబ్బింగు ఆర్టిస్టుగా పనిచేస్తుంటాడు. నవలా ప్రారంభంలో ఇద్దరూ ఇండియా నుండి ఇంగ్లండుకి ప్లేనులో వస్తుంటారు. ఆ విమానాన్ని దుండగులు హైజాక్ చేస్తారు. విమానం పేలిపోయి సముద్రంలో పడిపోతుంది. ఇద్దరూ ప్రమాదం నుండి తప్పించుకొని, బ్రతికి బయటపడతారు. గాబ్రియెల్ తాను దేవదూతనయ్యానని అనుకొంటాడు. మానసిక వైకల్య వ్యాధికి లోనవుతాడు. సలాడిన్ భూతంలాగా మారిపోతాడు. సలాడిన్‌ని పోలీసులు వేధిస్తారు.

గాబ్రియెల్ తన ప్రేయసి ఆలీ కోన్‌తో చేరువవుతాడు. ఆలీ కోన్ బ్రిటిష్ పర్వతారోహకురాలు. గాబ్రియెల్ మానసిక వ్యాధి ముదిరిపోవటంతో వారిరువురి మధ్య సంబంధం దెబ్బతింటుంది. సలాడిన్ భూతదశ నుండి మనిషిగా మారిపోతాడు. విమానం నుండి ఇద్దరూ పడిపోయినప్పుడు గాబ్రియెల్ తనను ప్రమాద స్థితిలో వదిలివేశాడన్న కోపంతో సలాడిన్ గాబ్రియెల్‌పై పగపెంచుకొంటాడు. గాబ్రియెల్‌కి అనుమానాలు, అసూయలతో కూడిన మానసికవ్యాధి, వెర్రితనం పెరుగుతాయి. ఆ మానసిక వ్యాధి పెరిగి, గాబ్రియెల్ తనను తానే నాశనం చేసుకొంటాడని, సలాడిన్ ఆ వ్యాధిని పెంచటానికి ప్రయత్నిస్తుంటాడు.

ఇద్దరూ ఇండియా వెళ్లుతారు. ఆలీ కూడా వెళుతుంది. ఒకరోజు ఆ మానసిక వ్యాధి ప్రబలినప్పుడు, గాబ్రియెల్ అసూయ, అనుమానాలతో ఆలీని పెక్కు అంతస్థుల భవనం నుండి క్రిందికి త్రోసివేస్తాడు. తాను ఆత్మహత్య చేసుకొంటాడు. సలాడిన్ తనకు ఎన్నడో దూరం అయిన తండ్రితో సఖ్యపడుతాడు. ఇండియాలో

స్థిరపడుతాడు. ఈ మూలకథలో అంతర్గతంగా ఇంకో కథనాత్మకం ఉంటుంది. అది మాంత్రిక వాస్తవికత ప్రక్రియపై ఆధారపడి ఉంటుంది. గాబ్రియెల్‌కి మతపూర్వక స్వప్నాలు వస్తుంటాయి. ఆ స్వప్నాలలో ముస్లిమ్ ప్రవక్త మొహమద్ చరిత్ర గాబ్రియెల్‌కి కానవస్తుంది. మొహమ్మద్ మొదట్లో బహుదైవవాదం ప్రతిపాదించినట్లు, తరువాత అది సైతానువల్ల కలిగిన తప్పిదం అని తెలుసుకొని, ఆ వాదాన్ని పరిత్యజించినట్లు, గాబ్రియెల్‌కి స్వప్నాలు వస్తాయి. ప్రవక్త మొహమ్మద్ అనుచరుడొకరు ఖురాన్‌లోని కొన్ని భాగాలను తాను మార్చినట్లు చెప్పటం కూడా ఒక స్వప్నంలో వస్తుంది. ఇంకొక స్వప్నసీమలో ఆయేషా అనే పల్లెటూరి పిల్లకు దైవదూత గాబ్రియెల్ కలలోకి వచ్చి, ఉపదేశాలు చెబుతాడు. ఆయేషా తన గ్రామస్థులను తీసుకొని, మక్కాకు వెళుతుంది. తామందరు మక్కాకు అరేబియన్ సముద్రంపై నడిచి వెళ్ళగలమని వారికి నచ్చచెప్పుతుంది. వాళ్ళందరూ సముద్రంలో మునిగిపోయారని కొందరంటారు. మరికొందరు అయేషా బృందం నిజంగానే నీళ్ళపై నడిచారని అంటారు.



The Satanic Verses నవల 1988 లోబుకర్ ప్రైజ్ చిన్న లిస్టులోకి వెళ్ళింది. విట్ బ్రెడ్ బహుమతి గెల్చుకొన్నది. ఇంగ్లండులో వలసకు వచ్చినవారు బ్రిటిష్ సమాజంలో ఇమడలేక, వెనక్కు తమ దేశాలకు వెళ్ళిపోలేక పడే ఇబ్బందులను, మానసిక వ్యధలను రష్దీ చిత్రీకరించారని విమర్శకులు ప్రశంసించారు. కాని అతి క్రూర విధి విపాక స్థితిలో, జీవితం ఒకోసారి కళను అనుసరిస్తుందనే భావనలో, మాంత్రిక వాస్తవికత ప్రక్రియలోని వాస్తవికత మాంత్రికాన్ని కాటు వేసింది. ఈ నవలలో సల్మాన్ రష్దీ ప్రవక్త మొహమ్మద్‌ను అవమానపరిచారని, దైవ నింద చేశారని, ఇస్లాం మతానికి పరాభవం చేశారని ప్రపంచమంతా ముస్లిం మత తీవ్రవాదులు ఆందోళనలు చేశారు. ఆ ఆందోళనలలో ఎందరో చనిపోయారు. ఈ నవల జపానీయ అనువాదకర్తను టోక్యోలో హత్య చేసారు. ఇటాలియన్ అనువాదకర్తపైనా, నార్వేజియన్ ప్రచురణకర్త పైనా హత్యాయత్నాలు జరిగాయి. వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. టర్కీ భాషలోకి అనువాదం చేసిన రచయత మీద చేసిన హత్యాప్రయత్నంలో అతడు తప్పించుకొన్నాడు గాని 37 మంది చని పోయారు. రష్దీ పై మరణ శాసనం, ఫత్వా విడుదల చేసినారు. బ్రిటిష్ ప్రభుత్వము రష్దీకి రక్షణ కల్పించింది గాని, ఆయన తన జాగ్రత్తలతో అయిదేళ్ళు పైన అజ్ఞాతవాసంలో గడిపారు. ఈ నవల ఇండియాలో నిషేధింపబడినది. సల్మాన్ రష్దీ బొంబాయిలో కాశ్మీర్ ముస్లిమ్ కుటుంబంలో జన్మించారు. హైస్కూలు చదువులు బొంబాయిలో చేసిన తరువాత కేంబ్రిడ్జి యూనివర్సిటీలో చదివారు. బ్రిటన్‌లోనే స్థిరపడి, రచనావ్యాసంగం కొనసాగించారు. 2000 లో అమెరికాకు మకాం మార్చారు. MIT, ఎమరీ యూనివర్సిటీ, న్యూ యార్క్ యూనివర్సిటీలలో ప్రొఫెసర్‌గా పనిచేసారు. The Satanic Verses తరువాత తనపై వచ్చిన ఫత్వా మూలంగా, ముస్లిమ్ దేశాల్లో జరిగిన హింసాత్మక చర్యలవల్ల, తన అజ్ఞాతవాసం మూలంగా, సాహిత్య పేజీలలో ఒక చిన్న స్థానం ఆక్రమించే రష్దీ న్యూస్ పేపర్లలో మొదటి పీజీలలోకి వచ్చారు. అమెరికా వచ్చాక సెలెబ్రిటీ అయినారు. హాలీవుడ్ నటీనటులలాగా రష్దీ వార్తలు గాసిప్ ఊకదంపుడు కాలమ్సులో వస్తుంటాయి.

The Moor's Last Sigh (1995) నాలుగు తరాల భారతీయ కుటుంబ చరిత్ర. కథాకాలం ఇరువదో శతాబ్దం మొదటి నుండి చివరివరకు. డ గామా జొగో; కుటుంబం కొచ్చిన్‌లో స్థిరపడ్డ పోర్చుగీసువారు. ఈ కుటుంబ యాత్ర కొచ్చిన్‌లో మొదలవుతుంది. చిన్న ఎత్తున దినుసుల వ్యాపారం మొదలెడతారు. ఆ వ్యాపారం పెరగటంతో సంపన్నులవుతారు. రెండోతరంలో బొంబాయికి మారతారు. ఒడుదుడుకులు, కటుంబ సమస్యలు, సంఘర్షణలు ఉంటాయి. ఈ నవల పై నవలలాగానే రష్దీ నమూనాలో ఉంటుంది. నవలా కాలం, స్థానం విస్తృతంగా ఉంటాయి. ఎన్నో ఉపకథలుంటాయి. సమకాలీన రాజకీయ, సాంఘిక సమస్యలపై విశ్లేషణలు ఉంటాయి. మాంత్రిక వాస్తవికతతో కూడిన ఘట్టాలు ఉంటాయి. ఇందులో జవహర్లాల్ నెహ్రూ వ్యక్తిగత జీవితంపై కొన్ని వివరాలు ఉండటంతో, ఈ పుస్తకం ఇండియాలో నిషేధింపబడినది. బబ్రీ మసీదు కలహాలు, 1993లో జరిగిన బొంబాయి బాంబు ప్రేలుడు, శివసేన పెరుగుదలవంటి విషయాలపై విశ్లేషణ ఉంటుంది. ఈ నవల 1995 బుకర్ ప్రైజ్ చిన్న లిస్టులోకి వెళ్ళింది. విట్ బ్రెడ్ బహుమతి, అరిస్టియాన్ యూరోపియన్ సాహిత్య బహుమతి ఈ నవలకు లభించాయి.

Quichotte (2019) కీషాట్ ఒక నవలలో నవల. ముఖ్యపాత్ర శామ్ము కాంప్ అమెరికాలో స్థిరపడిన ఇండియన్ రచయత. గూఢచారి నవలలు వ్రాశాడు కాని అవేమీ విజయవంతం కాలేదు. తను వ్రాసిన వాటికంటే గొప్ప నవలను కొత్త తరహాలో వ్రాయాలని నిశ్చయించుకొంటాడు. ఆ నవలలో ముఖ్యపాత్ర ఇస్మాయిల్ స్మైల్. ఇస్మాయిల్ అమెరికాలో ఒక ఫార్మస్యూటికల్ కంపెనీలో సేల్స్‌మన్. ఉద్యోగరీత్యా ఊళ్లన్నీ తిరుగుతూ, చౌకబారు హోటళ్ళలో టి.వి. చూస్తూ, రోజులు గడుపుతుంటాడు. సల్మా అనే మాజీ బాలీవుడ్ నటి న్యూయార్క్ నుండి ఒక టి.వి. ఛానల్‌లో టాక్‌షో నిర్వహిస్తుంటుంది. సల్మాపై స్మైల్ మోజుపడతాడు. సల్మాను కలవటం కోసం కారుప్రయాణం మొదలెడతాడు. కారులో ఒక పదిహేనేళ్ళ ఊహాపుత్రుడు ఉంటాడు. ఇదంతా శ్యామ్ వ్రాస్తున్న నవలలో ఉదంతం. ఈ నవలలోకి శామ్ కూడా ప్రవేశిస్తాడు. మాంత్రిక వాస్తవికతతోపాటు అమెరికన్ సమాజంపై వ్యాఖ్యలుంటాయి. ఈ నవల స్పానిష్ ప్రసిద్ధ రచయత సెర్వాంటెస్ 1605లో వ్రాసిన డాన్ ఖియోటే (Don Quixote) నవలకు అనుకరుణ. ఒక విమర్శకుడు అన్నట్లు ఈ నవల "గందరగోళం. కాని అందమైన గందరగోళం. ప్రతికంపనం చేసే గందరగోళం." ఇంకో విమర్శకురాలు "ఇది బహుశా రష్దీ వ్రాసిన నవలల్లో గొప్పది కాదుకాని ఒకసారి చదవచ్చును." అని వ్రాసింది.

సల్మాన్ రష్దీ ఆంగ్ల సాహిత్యంలో మాంత్రిక వాస్తవికత సాహిత్య ప్రక్రియకు ప్రతీకగా ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించుకొన్నారు. అమెరికన్ సాహిత్య విమర్శకులు ఈ ప్రక్రియ హోర్హే లూయిస్ బోర్హేజ్, గేబ్రియల్ గార్సియా మార్క్వెజ్ వంటి సౌత్ అమెరికన్ రచయితలతో మొదలైనదని వ్రాస్తుంటారు. కాని సల్మాన్ రష్దీ ఈ ప్రక్రియ రామాయణ మహాభారతా ల నుండి నేర్చుకొన్నానని 2020లో వ్రాశారు. చిత్ర బెనర్జీ దివాకరుణి కూడా తాను పురాణాల నుండి మాంత్రిక వాస్తవికతను అలవరుచుకొన్నానని అన్నారు. మహాభారతం లో శకుని మాయా పాచికలతో చేసిన జూదం, ద్రౌపదీ వస్త్రాపహరణం జరుగుతున్నప్పుడు శ్రీకృష్ణుడు అంతులేని చీరెను ద్రౌపదికి ప్రసాదించటం – ఈ రెండూ మాంత్రిక వాస్తవికతకు నిదర్శనాలు. అటులనే రామాయణం లో హనుమంతుడు సంజీవని మొక్కతో పాటు ద్రోణగిరి పర్వతాన్ని పెకలించి, ఆకాశమార్గంపై తెచ్చిన సంఘటన, వానరసేన లంకకు వారధి కట్టడం కూడా ఈ ప్రక్రియకు ఉదాహరణలు. ఈ విషయాలను యస్. అరుణ్‌కుమార్, డా. పి. సురేష్ "రామాయణ మహాభారతా లలో మాంత్రిక వాస్తవికత" అనే అంశంపై 2020లో ఒక యూరోపియన్ జర్నల్‌లో వ్రాసిన పరిశోధక వ్యాసంలో వివరించారు. అటులనే అల్లసానివారి మనుచరిత్ర లోనూ, పింగళివారి కళావూర్ణోదయం లోనూ, రామరాజభూషణుని వసుచరిత్రలోనూ ఈ సాహిత్య ప్రక్రియ ఛాయలు కనపడుతాయని నేను ఇంతకు ముందు అమితావ్ ఘోష్‌పై వ్రాసిన వ్యాసంలో వ్రాశాను.

సల్మాన్ రష్దీ 2015లో హార్వర్డ్ బిజినెస్ రివ్యూ మేగజైన్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూ నుండి కుదింపులతో కూడిన ఉటంకింపులు.

- కొత్త నవల మొదలెట్టటానికి బీజం ఎవరో ఒక వ్యక్తి గురించో, ఒక సంఘటన గురించో మనస్సులో నాటబడుతుంది. అది రోజూ ప్రొద్దున నా ఆలోచనల్లోకి వస్తుంటే, దానిపై శ్రద్ధ చూపిస్తాను. ఆ బీజం కార్యరూపం దాల్చటానికి ఎన్నో ఏళ్ళు కూడా పట్టవచ్చును.
- నేను వ్రాయటం అనే ప్రక్రియను 9 నుండి 5 గంటలవరకు చేసే ఉద్యోగంలాగానే పరిగణిస్తాను. ఆ రోజు మనస్సు బాగున్నా లేకపోయినా వ్రాయటం ఎగగొట్టను. ఆ క్రమశిక్షణను అలవాటు చేసుకొన్నాను. కొందరు రచయతలు వ్రాసేటప్పుడు ఏకాంతవానం చేస్తారు. నేను అలాకాదు. ఏరోజుకారోజు వ్రాత అయిపోగానే స్నేహితులతో బయటకు వెళ్ళతాను. ఆ అన్యోన్యత నాకు కొత్త శక్తినిస్తుంది.
- నా రచనా ప్రారంభకాలంలో రోజుకి నాలుగైదు పేజీలు వ్రాసేవాడిని. ఇప్పుడు రోజుకి ఒకటిరెండు పేజీలు మాత్రమే వ్రాస్తాను. తేడా ఏమిటంటే ఇప్పుడు వ్రాసేది దాదాపు ఫైనల్ కాపీ. తిరగ వ్రాయాల్సిన అవసరం ఉండదు.
- నా మొదటి నవల పూర్తిగా అపజయంపాలయింది. అది నాకప్పుడు చాలా బాధాకరంగా అనిపించేది. అది నాకు పాఠం నేర్పింది. కొత్తవిధంగా వ్రాయాలని నిశ్చయించుకొన్నాను. రెండో నవల *Midnight's Children* మంచి ఫలితాలను ఇచ్చింది.
- నామీద ఫత్వా వచ్చినప్పుడు నేను నా రచనా వ్యాసంగాన్ని ఆపలేదు. ప్రపంచమంతా నా చెవుల్లో అరుస్తున్ననూ, దృఢనిశ్చయంతో నా పని నేను చేసుకుపోయాను. నా పుస్తకాలు కాలక్రమంగా పక్కపక్కన పేరిస్తే, పాఠకుడు ఏవి ఫత్వా ముందు వచ్చినవో, ఏవి తరువాత వ్రాసినవో చెప్పలేడని నా విశ్వాసం.
- రచన అనేది పైనుండి పిలుపు. ఇప్పటివరకూ వచ్చిన మాస్టర్ పీస్ సాహిత్యం చదవటానికి ఒక జీవితకాలం చాలదు. కాని కొత్తపుస్తకాల గుట్టలు పర్వతాలలాగా పెరిగిపోతున్నాయి. మీకు గట్టిగా చెప్పవలసిన అవసరం ఉంటేనే వ్రాయండి. అవసరం లేదనిపిస్తే, చెట్లని కాపాడుకొమ్ము.

వచ్చే సంచికలో: చేతన్ భగత్

డా. రమేష్ ప్రసాద్ రావెళ్ల
e-mail: rravella2@gmail.com.,
1-703-338-2194 (mobile and whatsapp)

యశోద ఠాకూర్

ఎందుకురా కోపము (హిందుస్తాని కాపి – ఆది)

పల్లవి:	ఎందుకురా కోపము – మదనజనక	
	ఏమి మనసున దోచె	॥ఎందుకురా॥
చరణము 1:	గ్రక్కున నను నీ కౌగిట జేర్చగ	
	చక్కని మోవి చురుక్కున నొక్క – నీ	॥కెందుకురా॥
చరణము 2:	సరగున ననురతి నల్పగ దలచిన	
	గురుకుచములచే క్రుమ్మితినని – నీ	॥కెందుకురా॥
చరణము 3:	ధరను రేపల్లెపురవర నీమది	
	కరుణజూచి మరుకేళి గూడరా – నీ	॥కెందుకురా॥

గుంటూరు జిల్లాలోని రాచూరు – రేపల్లె సంస్థానం మాణిక్యారావు అనే బిరుదనామంగల వెలమ జమీందార్లది. రేపల్లె పట్టణంలో జమీందారు దేవిడీలోని ఆలయంలో ఉన్న వారి కులదైవం మదనగోపాలస్వామి (ఇప్పుడు వేణుగోపాలస్వామి అంటున్నారు) ఈ జావళీలోని 'రేపల్లె పురవర'.

'కేళీగోపాలమ్' - మల్లాది రామకృష్ణశాస్త్రి

ఇండాలజీ

– అవధానం రఘుకుమార్



ఇండాలజీ లేదా ఇండియన్ స్టడీస్ అనేది భారతదేశాన్ని, భారత ఉపఖండంలోని దేశాలను అధ్యయనం చేసే విధానం. క్రీ.పూ. 3,4 శతాబ్దాల నుండే భారతదేశానికి మధ్యధరా ప్రాంతాలలోని అనేక అరబ్బు, గ్రీకు దేశాల మధ్య రాకపోకలు, వ్యాపార, వాణిజ్య సంబంధాలు, సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయి. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని కేరళ, తమిళ సముద్ర ప్రాంతాలు అనేక తూర్పు ఆసియా, అరబ్బులలో, గ్రీకుతో సంబంధాలు, రాకపోకలూ ఉన్నట్టు చరిత్ర చెబుతోంది. అలెగ్జాండర్ దండయాత్ర తరువాత గ్రీకులతో ఈ దేశపు సంబంధాలు చాలా దగ్గరయ్యాయి. అనేకమంది విదేశీ యాత్రికులు భారతదేశాన్ని సందర్శించడం, వారి ప్రయాణంలో ఈ దేశాన్ని వారు పరిశీలించడం, వాటిని ట్రావెలాగ్‌గా వ్రాయడం క్రీ.పూ. నుండే ఉంది. అయితే అనేక పార్శ్వాల నుండి చాలా నిశితంగా భారత ఉపఖండాన్ని పరిశీలించడం, శోధించడం, వాటి ఆధారంగా పుస్తకాలు వ్రాయడం అనేది క్రీ.శ. 1000 సం॥ల నుండి సంఖ్యాపరంగా పెరిగింది.

ఇండియా నుండి యూరోప్‌కు మసాలా దినుసుల వ్యాపారం కూడా చాలా ప్రసిద్ధి చెందిందే. ఈ వ్యాపారాలన్నిటికి ప్రధాన అంశాలు మసాలా దినుసులు – మిరియాలు, యాలకులు, దాల్చినచెక్క, లవంగాలు.... ఇవన్నీ యూరోపియన్లు చాలా ఇష్టపడి కొనేవారు. వీటికి యూరోప్‌లో మంచి గిరాకీ. అలాగే యూరోప్‌లోని అనేక దేశాలలో భారతదేశపు సంపద ఎప్పుడూ చర్చనీయాంశమే. ఈ దేశపు వ్యాపారస్తులు ఆఫ్ఘనిస్థాన్, పెర్షియా, అరబ్, ఈజిప్టు, టర్కీ దేశాల మీదుగా చాలా ప్రమాదకరమైన కష్టాలకు ఓర్చి మరీ గ్రీకు, రోమన్ దేశాలతో ఈ వ్యాపారం చేసేవారు. అయితే భారతదేశానికి సముద్ర మార్గం కనుక్కునేందుకు యూరోపియన్లు చాలాకాలం నుండే ప్రయత్నిస్తుండేవారు. కొద్దిమంది అప్పటికే అరేబియన్ సముద్రం, ఎర్రసముద్రం, మధ్యధరా సముద్రాల మీదుగా పెర్షియన్ గల్ఫ్ ద్వారా సముద్ర వ్యాపారం చేసేవారు.

అయితే మధ్య యుగాలలో బలపడిన అరబ్ ముస్లిం వ్యాపారస్థులు ఈ మార్గాలన్నింటిపై ఆధిపత్యం సంపాదించి, యూరోప్–భారత్‌ల మధ్య ప్రత్యక్ష వ్యాపారాన్ని బాగా నిరోధించి, అన్ని వ్యాపారాలు తమ ద్వారా అధిక లాభాలకు జరిగేలా ఒత్తిడి చేసేవారు. అయితే అదేసమయంలో ప్రపంచ భౌగోళిక శాస్త్రం విస్తృతి చెందుతోంది. భూమి గుండ్రంగా ఉంది, అంటే భారత్ చేరుకోడానికి వేరే సముద్ర మార్గం అవకాశం ఉంది అనే భావన ప్రబలుతోంది. మొదట క్రిస్టఫర్ కొలంబస్ అనే ఇటలీ దేశపు నావికుడు ఇండియాకు సముద్రమార్గం కనుక్కునే ప్రయత్నంలో అమెరికాకు దారి కనుక్కున్నాడు. అయితే ఆ తరువాత పోర్చుగీసు నావికుడు 1498లో అట్లాంటిక్ సముద్రం ద్వారా, కేప్ ఆఫ్ గుడ్‌హోప్ మీదుగా మలబారు తీరప్రాంతంలోని కాలికట్‌కు చేరుకున్నాడు. అలా 1498 నుండి యూరోప్ – ఇండియా రాకపోకల దశ-దిశ మారిపోయింది. భారతదేశాన్ని యూరోప్ అర్థం చేసుకునే ప్రయత్నంలో, తరువాత వ్యాపారం పేరుతో, ఈస్ట్-ఇండియా కంపెనీ పేరుతో, ఆపైన ప్రత్యక్ష బ్రిటిష్

సామ్రాజ్యం పేరుతో జరిగిన అనేక మార్పులకు 1498వ సంవత్సరం ఒక మలుపు.

16,17 శతాబ్దాల నుండి యూరోపియన్లు, క్రిస్టియన్ మిషనరీలు అనేక ప్రత్యేక ఉద్దేశాలతో భారతదేశం గురించి అవగాహన పరచుకోడానికి ప్రయత్నించారు. అయితే ఈ "ఇండాలజీ" అనే పదం (జన్మనీ భాషలో Indologie) తొలి రోజులలో ఎక్కువగా భారతదేశం గురించి జన్మనీ దేశస్థుల అవగాహన, జ్ఞానంగా ప్రాచుర్యం పొందింది. ఆ తరువాత యూరోప్‌లోని అనేక దేశాలు భారతదేశపు అవగాహన గురించి ప్రయత్నాలు మొదలుపెట్టాయి. ఇప్పుడు ఈ పదం జన్మనీలోనేకాక అనేక యూరోప్ దేశాలలో కూడా ఒక ప్రత్యేక గుర్తింపు పొందింది. నెదర్లాండ్ దేశంలోని డచ్-ఇండియా కంపెనీ (ఇంగ్లండ్‌లోని ఈస్ట్-ఇండియా కంపెనీలాగానే) తమ కంపనీ అధికారులకు, సిబ్బందికి ఇండియాపై అవగాహన కోసం చేసిన అధ్యయనంగా "ఇండాలజీ"ని తొలి రోజులలో వాడింది.

ఆధునిక శాస్త్రాలలో ఇండాలజీ అంటే భారత, భారత ఉపఖండం యొక్క చరిత్రను, సంస్కృతిని, భాషా, సాహిత్యాలని అధ్యయనం చేయడం. మెర్రియం అనే ఆంగ్లభాషా నిఘంటువు ప్రకారం భారత దేశం, దాని ప్రజలను అధ్యయనం చేయడాన్ని "ఇండాలజీ" అంటారు. దీని మొదటి వాడుక - ఇండాలజీగా - షుమారు 1888 ప్రాంతాలలో జరిగినట్లు అదే నిఘంటువు చెబుతోంది. అయితే మరి చరిత్ర, చరిత్రకారులూ అన్నా అదే అర్థం కదా? ఇండాలజీకు, చరిత్రకు ఉన్న తేడా ఏమిటి? అంటే "చరిత్ర" ఒక దేశపు గతాన్ని గత కాలపు సంఘటనలను చదివే ప్రయత్నం చేస్తుంది. భారతదేశ చరిత్ర అంటే ఈ దేశములో జరిగిన గత సంఘటనలని అధ్యయనం చేయడం "ఇండాలజీ" అంటే భారత ఉపఖండపు చరిత్ర, సంస్కృతి, భాషలను విద్యా సంబంధంగా అధ్యయనం చేయడం అని అంటారు. కానీ ఈ పదాల అర్థాలను మరింత లోతుగా అధ్యయనం చేయలేమా?

మనకు తెలిసిన ఇలాంటి ఇంకో వదం ఓరియంటలిజం. తూర్పు దేశాల చరిత్రని, సాహిత్యాన్ని, సంస్కృతిని, కళలని అధ్యయనం చేసే లేదా అనుసరించే విషయం. ఇక్కడ తూర్పు దేశాలు లేదా అనుసరించే విషయం అంటే భూగోళపు తూర్పు ప్రపంచం అంతా సంబంధించి ఉంటుంది. అంటే ప్రాచ్యదేశాల సంస్కృతి, కళలు.... ఇలాంటి అధ్యయనం, దాని తత్త్వ విచారణ చేయడం. ఉదాహరణకు ఎడ్వర్డ్ సయిద్ అనే కొలంబియా విశ్వ విద్యాలయపు అధ్యాపకుడు - పాశ్యాత్య దేశాలు తూర్పు దేశాలను అర్థం చేసుకునే తీరునే "Orientalism" అన్నాడు "ఓరియంటలిజం" అనే తన సుప్రసిద్ధ గ్రంథంతో (Orientalism by Edward said (1978) దీని అర్థాన్ని వివరించాడు. ఓరకంగా అందులో ఈ తూర్పు దేశాలపట్ల పాశ్చాత్యుల చులకన భావమే ఉంటుందని కూడా ఆయన అభిప్రాయం.

ఈ ఆలోచనలకు దగ్గరగా ఉన్న మరో పదం "Sociology" (సమాజ శాస్త్రం). సోషియాలజీ అనే సబ్జెక్టు కూడా ఒక దేశపు సమాజ నిర్మాణాన్ని అధ్యయనం చేస్తుంది. అయితే ఇండాలజీ కేవలం సమాజ నిర్మాణాన్నే కాక, చరిత్ర, కళలు, తాత్వికత, సాహిత్యం అన్నింటినీ సమగ్రంగా పరిశీలిస్తుంది. అందువల్ల ఇండాలజీ అనేది చరిత్ర, సాహిత్యం, కళలు, తాత్వికత అనే ప్రత్యేకతలను దాటి భారతదేశము, భారత ఉపఖండాన్ని మొత్తంగా అధ్యయనం చేస్తుంది.

మనం క్రీస్తు పూర్వపు భారతదేశ చరిత్రలో అలెగ్జాండర్ దండయాత్ర గురించి, దాన్ని పురుషోత్తముడు (పోరస్) అనే తక్షశిల ప్రాంతపు రాజు ఎలా అడ్డుకుంది చదువుకున్నాము. అయితే ఆ తరువాతి కాలంలోని మౌర్యవంశ పరిపాలన కాలంలో, ముఖ్యంగా చంద్రుగప్త మౌర్య కాలంలో మెగస్తనీస్ అనే గ్రీకు రాయబారి గురించి విని ఉంటాము. మెగస్తనీస్ (షుమారు క్రీ.పూ. 350-200) కేవలం ఒక పర్యాటకుడు మాత్రమే కాదు, ప్రాచీన గ్రీకు దేశానికి చెందిన చరిత్రకారుడు, రాయబారి, భారత సమాజాన్ని పరిశీలించి తన పరిశీలనలను "ఇండికా" అనే పుస్తకంలో గ్రంథస్థం చేసిన వ్యక్తి. ఆ పుస్తకం ఇప్పుడు అందుబాటులో లేదు. కానీ భారతదేశాన్ని అనేక పార్శ్వాల నుండి పరిశీలించే ప్రయత్నంలో దానిని ఒక తొలిమెట్టుగా

భావిస్తారు. ఆ కాలపు, తదనంతరపు అనేక పుస్తకాలలో దీని ప్రస్తావన ఉంది. భారత దేశాన్ని పరిశీలించి, దాన్ని గురించి గ్రంథస్థం చేసిన తొలి విదేశీయుడుగా మనం మెగస్తనీస్‌ని గుర్తిస్తాం.

ఆ తరువాత కాలంలో ఫాహియన్, హుయత్సంగ్... లాంటి ఇతర విదేశీయులు పర్యాటకులుగా వచ్చి భారత దేశాన్ని కొంతమేర పరిశీలించి తమ అభిప్రాయాలని గ్రంథస్థం చేసినా, పదకొండవ శతాబ్దపు తొలి దశాబ్దంలో దేశంలో విస్తృతంగా పర్యటించి తన అనుభవాలని గ్రంథస్థం చేసి కొంతమేర "ఇండాలజిస్ట్"గా గుర్తింపు పొందిన మరో విదేశీ పర్యాటకుడు – అల్బెరునీ (Abu Rayan Muhammad Ahmed Al-Beruni [973-1050]) ఈయన 1017వ సంవత్సరంలో ఇండియా వచ్చి, ఉత్తర, దక్షిణ భారతదేశాలని చాలా విస్తృతంగా పర్యటించి తన అధ్యయన నివేదికను పుస్తక రూపంలో తెచ్చాడు. ఈయన ఇరాన్ దేశస్తుడు. భౌతిక శాస్త్రం, గణిత శాస్త్రం, ఖగోళ శాస్త్రం... ఇలా అనేక విషయాలలో నైపుణ్యం ఉన్నవాడు. అనేక మంది ఈయనని "ఇండాలజీ వ్యవస్థాపకుడు" అని కూడా అంటారు. పెర్షియన్, అరబిక్, సంస్కృతం, గ్రీక్ తదితర భాషలు తెలిసినవాడు. ప్రస్తుత ఆఫ్ఘన్ ప్రాంతంలో ఉన్న ఘజనీ ప్రాంతంలో చాలా కాలం ఉన్నాడు. ఆయన "తరీఖ్ అల్–హింద్" (History of India) అనే పుస్తకం వ్రాసినట్టు చెబుతారు. ఇది దాదాపు పూర్తిగా అందుబాటులో ఉన్న తొలి విదేశీ రచన.

గెరాసిమ్ లెబెడేన్ (Gerasim Lebeden [1749-1817]) అనే రష్యన్‌ని కొంతమంది ఇండాలజీ అనే సబ్జెక్టుకి ఆధ్యుడిగా భావిస్తారు. ఈయన వృత్తిరిత్యా సంగీత విధ్వాంసుడు. అయితే ఈయనని రష్యన్ ఇండాలజీకి మాత్రమే ఆధ్యుడు అని అంటారు. ఈనాటి ఆధునిక శాస్త్రపరంగా చూస్తే ఈ "ఇండాలజీ" అనే పదమే 19వ శతాబ్దపు చివరి దశాబ్దాలలో అంటే ఘుమారు 1888 నుండి ప్రచారంలోకి వచ్చినట్టు చెబుతాయి. లెబడేవ్ 1785–1797ల ప్రాంతంలో భారతదేశంలో ఉండి, అనేక భారతీయ భాషలని అధ్యయనం చేసినట్టు తెలుస్తోంది. భారతీయ భాషలనే కాదు, సాహిత్యాన్ని, సాంప్రదాయాలని కూడా ఆయన అధ్యయనం చేశారు. కలకత్తలో తొలి బెంగాల్ నాటక రంగాన్ని కూడా నెలకొల్పాడట. ఇండియా గురించి విదేశీ రచయితల అధ్యయనం, పుస్తక రచనలలో ముఖ్యంగా పద్దెనిమిదవ శతాబ్దంలో లేబడేవ్ పర్యాటక విశేషాలు చాలా ముఖ్యమైన, విలువైన విషయంగా భావించవచ్చును. ఈయన జీవితం, రచనల గురించిన సమాచారం "Russian - Indian Relations in the 18th Century" (1965) అనే పేరుతో ఉన్న పుస్తకంలో అందుబాటులో ఉన్నాయి.

అయితే ''ఇండాలజీ'' అనే నబ్జక్టు కేవలం యూరోపియన్ మరియు అరబ్ దేశాల పరిశీలకులకే పరిమితం కాలేదు. తొలుత పోర్చుగీసు, జన్మనీ, ఇంగ్లండ్‌ల చేతుల మీదుగా మొదలయ్యిన ఈ విషయం, తరువాత కాలంలో రష్యన్‌లు, ఆస్ట్రేలియనులు, అమెరికనులతో కూడా ఆసక్తి రేపింది. ప్రస్తుతం ఈ విషయాన్ని రెండు విధాలుగా అర్థం చేసుకుంటున్నారు. (1) క్లాసికల్ ఇండాలజీ (2) ఆధునిక ఇండాలజీ. క్లాసికల్ ఇండాలజీ ఎక్కువగా సంస్కృతి, ప్రాకృతాది ప్రాచీన భాషలు, సాహిత్యం, సంస్కృతి, కళలు తదితర విషయాల ఆధారంగా నిర్మించబడితే, ఆధునిక ఇండాలజీ ప్రస్తుత ఇండియా, దాని రాజకీయాలు, సమాజ శాస్త్రంల ఆధారంగా రూపుదిద్దుకుంటోంది. అంతేకాదు గత కొద్ది కాలంగా ''ద్రవిడాలజీ'' అనే ప్రత్యేక పరిశీలన కూడా మొదలయ్యింది. ఇది ద్రవిడ భాషలు, సంస్కృతి ఇత్యాదుల చుట్టూ నిర్మించబడుతోంది. గత కొద్ది కాలంగా ఈ "ఇండాలజీ" అనే సబ్జక్టు విద్యారంగంలో తన పట్టుని, ప్రాధాన్యతని కోల్పోతున్నట్టుగా తెలుస్తోంది.

ఈవేళ మనం "ఇండాలజీ" అని పలిచే, లేదా "కాసికల్ ఇండాలజీ" అని వివరించే సబ్జక్టు ఒక అధ్యయన విషయంగా 15–16 శతాబ్దాల తరువాతి కాలంలో ముఖ్యంగా పోర్చుగీస్, డచ్, ఇంగ్లాండ్, ఫ్రాన్సులు భారతదేశంతో వ్యాపార సంబధాలు తీవ్రతరం చేసిన తరువాత ప్రారంభం అయ్యింది. ఇక 18వ శతాబ్ధపు మధ్య కాలం నుండి అనేక దేశాల చరిత్రకారులు, సామాజిక సిద్ధాంతకర్తలు,తాత్వాకులు భారత దేశము గురించి తమ

జ్ఞానాన్ని పంచుకోవడంవల్ల "ఇండాలజీ" అనేది ఒక విస్తృతమైన ప్రత్యేకమైన అకడిమిక్ సబ్జక్టుగా ఎదగడం మొదలైంది. 15-01-1784లో విల్లియమ్ జోన్స్ అనే భాషా శాస్త్రవేత్త "ది ఏసియాటిక్ సొసైటీ" అనే సంస్థను కలకత్తాలో స్థాపించాడు. ప్రాచ్యదేశాల, ఆసియా దేశాల, ముఖ్యంగా భారతదేశ ప్రజల భాషలు, సాహిత్యం అధ్యయనం చేయడం దీని ఉద్దేశ్యం. 1832లో ఈ సంస్థ పేరును "ది రాయల్ ఏసియాటిక్ సొసైటీ ఆఫ్ బెంగాల్"గా మార్చారు. దీనితో పాటు "జర్నల్ ఆఫ్ ది రాయల్ ఏసియాటిక్ సొసైటీ" అనే పత్రికను కూడా ప్రారంభించారు.

రామకృష్ణ గోపాల్ భండార్కర్ (1837-1925) అనే సుప్రసిద్ధ స్కాలర్, భారతదేశ ప్రాచీన చరిత్ర, సాహిత్యం, సమాజ శాస్త్రం, తత్వశాస్త్రాలలో అగ్రగణ్యుడు ఆయన పేరు మీద "భండార్కర్ ఓరియంటల్ రిసర్చ్ ఇన్స్టిట్యూట్" అనే సంస్థను 06-07-1917న పూనే (మహారాష్ట్ర)లో ప్రారంభించడం కూడా ఇండాలజీ అనే సబ్జక్టు ఎదుగుదలకి ప్రేరణ అయ్యింది. ఈ భండార్కర్‌గారిని కూడా "ఇండాలజీ" (లేదా "ఓరియంటలిజం)కు ఒక ఆద్యుడిగా భావిస్తారు.

యూరోపులో 17-18 శతాబ్దాలలో తమ దేశాలలోని ప్రాచీన సాహిత్యాన్ని, సమాజాన్ని చదవడానికి, అర్థం చేసుకోడానికి, విశ్లేషించడానికి, వివరించడానికి వాడిన ఆనాటి ఆధునిక పద్ధతుల్ని యూరోపియన్లు ఇండియాకు సంబంధించిన విషయాలను అర్థం చేసుకోడానికి, వివరించడానికి ఉపయోగించడం గమనించవలసిన విషయం. విల్లియం జోన్స్, హెన్రీ థామస్ కోల్‌బ్రోక్ గెరాసిమ్ లేబెడేవ్, ఆగస్ట్ విల్‌హెల్మ్ షెల్‌గల్ తదితర యూరోపియన్ స్కాలర్స్ కృషితో ఇది ఒక ప్రత్యేక సబ్జెక్ట్‌గా ఎదిగింది.

బ్రిటిష్‌వారితో భారతదేశానికి వ్యాపార రీత్యా పరిచయం పెరగడం, ఆపైన భారతదేశం బ్రిటిష్ కాలనీగా మారడం, 1857 ప్రథమ స్వాతంత్ర పోరాటం తరువాత 1858 నుండి ప్రత్యక్షంగా బ్రిటిష్ ఆధిపత్యంలోకి వెళ్ళడం... ఇవన్నీ కూడా "ఇండాలజీ" అనే సబ్జెక్టును ప్రభావితం చేశాయి. మెల్లగా ఇది "ఏసియన్ స్టడీస్" అనే పేరు మరింత విస్తృతం అవుతూ వచ్చింది. ఏసియాటిక్ సొసైటీ తరువాత ''సొసైటీ ఏసియాటిక్'' అని 1822లో ఫ్రెంచ్ విద్యావంతులు, అమెరికన్ ఓరియంటల్ సొసైటీ [1842]) అనే పేరుతో అమెరికన్లు, జర్మన్ ఓరియంటల్ సొసైటీ [1845]) అనే పేరుతో జర్మనులు, ఇలా అనేక సంస్థలు ఈ రంగంలో ప్రవేశించాయి. ఆపైన ''జవనీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ అండ్ బుద్ధిస్ట్ స్టడీస్" 1949లో ఏర్పడింది.

1850-70ల మధ్య సెయింట్ పీటర్స్ బర్గ్ సంస్కృత నిఘంటువును ఒకదాన్ని తీసుకొచ్చారు. 1880ల నుండి అనేక పురాతన సంస్కృత గ్రంథాలని ఇంగ్లీషు, ఫ్రెంచ్, జర్మనీ భాషల్లోకి విస్తృతంగా అనువదించడం మొదలయ్యింది. 1887లో ఓట్టో వాన్ బోట్లింగ్స్ "పాణిని" వ్యాకరణాన్ని ఇంగ్లీషులోకి అనువాదం చేశారు. 1850-75ల మధ్య మ్యాక్స్ ముల్లర్ - "ఋగ్వేదం" ఇంగ్లీషు అనువాదం ముద్రింపబడింది. 1849లోనే ఆల్‌బ్రిష్ట్ వెబర్ అనే వ్యక్తి "ఇండాలజీ స్టడీస్" అనే జర్నల్‌ని ముద్రించడం మొదలుపెట్టాడు. 1897లో సర్జీ ఓల్డెన్ బర్గ్ అనే అతను "బిబ్లియోథికా బుద్దికా" అనే పేరుతో అనేక సంస్కృత రచనల అనువాదాలు ముద్రించడం మొదలు పెట్టాడు.

ఇలా ఇరవ్వయ్యవ శతాబ్దపు తొలి రోజులకు "ఇండాలజీ" అనే సబ్జక్టు యూరోప్, అమెరికా, రష్యా... ఇలా అనేక దేశాలలో చాలా ఆసక్తిని కలిగించింది. అయితే ఈ "ఇండాలజీ" అనేది ధనాత్మకంగానేకాక కొన్ని నెగటివ్ (ఋణాత్మక) ప్రతి స్పందనలనూ కలిగించింది. అనేక విదేశీయులు భారత ఉపఖండం గురించి తెలుసుకొని, వివరించే ప్రయత్నంలో వారి వలసవాద ధోరణులు కూడా బలంగా పనిచేసినాయి. ఇంగ్లీషు విద్య ద్వారా ఆధునికం అవుతోన్న అనేకమంది భారతదేశపు మేధావులకు ఇంగ్లీషు ఇండాలజిస్ట్‌ల అభిప్రాయాలు దాదాపు శిలాశాసనంగా, శిరోధార్యంగా అయిపోయాయి. "హింద్ స్వరాజ్" (1909) అనే పుస్తకంలో గాంధీ ఒకచోట అంటాడు: "ఈ ఇంగ్లీషు వాళ్ళకి చరిత్ర వ్రాసే అలవాటు. వాళ్ళు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల ప్రజల జీవన విధానం, సాంప్రదాయాల గురించి అధ్యయనం చేసినట్టుగా నటిస్తారు. భగవంతుడు

మనకి పరిమిత బుద్ధి శక్తిని ఇచ్చాడు. అయితే ఈ ఇంగ్లీషువారు భగవంతుడి జ్ఞాన శక్తిని మొత్తాన్ని విజయవంతంగా ఆక్రమించుకున్నట్టుగా, సంపాదించినట్టుగా ప్రవర్తిస్తారు. విచిత్రమైన ప్రయోగాలు చేస్తారు. తమ పరిశోధనలని అత్యంత గొప్ప ఆవిష్కరణలుగా అద్భుతమైన పదాలతో వ్రాసేసుకుంటారు. మనల్ని అది నమ్మేలాగా హిప్నటైజ్ చేసేస్తారు. మనం మన అజ్ఞానంతో వాళ్ళ కాళ్ళ మీద పడిపోతము." (గాంధీ, హింద్ స్వరాజ్, సెంటెనరీ ఎడిషన్, రాజ్‌పాల్ పబ్లికేషన్స్, పే. 42). ఇంగ్లీషు లేదా పాశ్చాత్య మేధావులు భారతదేశం గురించి వ్రాసిన రచనల ప్రభావం భారతదేశ మేధావుల మీద ఎంత ప్రభావం ఉందో గాంధీ మాటలు చెబుతున్నాయి.

అలాగే తమ దేశం గురించి స్వతంత్రంగా ఆలోచించే ప్రయత్నం చేయక, కొంతమంది ఆదునికులు ఈ విదేశీ ఇండాలజిస్ట్‌ల అసంపూర్తి జ్ఞానాన్ని తిరుగులేని సంపూర్ణ అవగాహనగా తీసుకున్న సందర్భాలూ ఉన్నాయి. ఉదాహరణకి రాహుల్ సాంకృత్యాయన్ అనే గొప్ప విశ్వ ప్రయాణికుడు, సంస్కృత పండితుడు, మార్క్సిస్టు – భారతదేశపు న్యాయ, వైశేషికాల గురించి వ్రాస్తూ ఒకచోట – ఇవి మన పూర్వీకులు గ్రీకు నుండి కాపీ కొట్టేశారు అనేశాడట. అయితే అదృష్టవశాత్తు రష్యన్ ఇండాలజిస్ట్‌లు దీనిపై సమగ్రంగా పరిశోధించి, సాంకృత్యాయన్ చెప్పింది తప్పని, అవి భారతదేశంలో గ్రీకుల న్యాయ శాస్త్రాలకంటే ముందే ఆకారం తీసుకున్నాయని, కూర్పబడ్డాయని తేల్చారట. దీనికి సంబంధించిన ప్రస్తావన నండూరి రామ్మోహన రావుగారు వ్రాసిన "విశ్వ దర్శనం" రెండవ భాగం "భారతీయ తత్వచింతన"లో షడ్దర్శనాల చర్చలో కూడా ప్రస్తావనకు వచ్చింది.

నిజంగా రష్యన్ ఇండాలజిస్టులు కష్టపడి సాంకృత్యాయని తప్పుని నవరించకపోతే, మన ప్రాచీనులపై మన అవగాహన ఎలా ఉండేది?

డా. అవధానం రఘుకుమార్
హైదరాబాద్. ఫోన్: 944 101 5709.

సర్రాజు కథలు

సత్సంగాలు అరుదుగానే జరుగుతుంటాయి. జంగాలు రాసుకుంటే బూడిద రాలుతుందంటారు. కానీ ఈ సంగాలు కలిస్తే నక్షత్ర ధూళి రాలుతుంది. ఎందుకో చెప్తాను.

సింగిల్‌టన్ శ్రమస్వేదాన్ని ఒంపుతూ ఈ కథల పుస్తకాన్ని అందించారు. పేరు ప్రసన్నమే కాని మనిషిని నిర్లక్ష్యం చేయకూడనంత గంభీరం. దానికితోడు దాడీ ఒకటి. సరే, ముక్కు ముసుగు తప్పనిసరి వికారం. ఇంత సంక్లిష్ట సమయంలో ఆహ్లాదం వెల్లివిరిసిందంటే రాంప్రసాద్, రామ్మోహనుడు – నిండు చందమామలాంటి తెల్లని గుండు, బయట చినుకులు, మాటల చెణుకులు, లేబర్ ఆఫ్ లవ్ వెచ్చని గుటకలు! ఇన్ని చేరితే నక్షత్రాలు నవ్వుల ధూళినే ఒలకబోస్తాయి మరి! ఇక పేరులేని పుస్తకాన్ని ఎలా పరిచయం చేయాలి? నవ్వుల పువ్వులకు పేర్లు కావాల?! కథలు రాసినాయన, ఆయన ముందుమాటలు రాయించుకున్నాయనలు, అందరూ చిలిపిగా గిలికినా – మొహమాటానికి కాదు – మాటలు అన్నీ హాస్యాన్ని ఒకలబోసేవే! ఈ కరోనా కష్టకాలంలో హాయిగా నవ్వుకోవడానికి గిలిగింతలు పెట్టే కథలు అందామా! చదివితే మీ వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. హ్యూమర్ ఈజ్ ది మెడిసిన్. సర్రాజు కథలు సర్రున జారిపోతాయి సుమా! అన్నట్లు ముఖేష్ మూలుగులు, సైగల్ సెగలు – వీరి బేస్ వాయిస్‌తో వినాలి – అది అరుదుగా దొరికే అదృష్టం! ఈలోపు గానాలో వినవచ్చు.

– కె

– కాట్రగడ్డ శేషగిరిరావు

మూడవ భాగం

సెంట్రల్ స్కూల్ స్థాపన

సి.ఎల్.ఆర్.ఐ. ఎదురుగా ఉన్న ఐఐటీలో ఒక సెంట్రల్ స్కూలు, అదే క్యాంపస్‌లో ఒక క్రిస్టియన్ మిషన్ ఆధ్వర్యంలో వనవాణి హైయర్ సెకండరీ స్కూలు నిర్వహించబడుతున్నాయి. ఆ స్కూళ్ళలో ప్రవేశాలకు ఒత్తిడి ఎక్కువ. సి.ఎల్.ఆర్.ఐ. సిబ్బంది పిల్లలకు ఆ స్కూళ్ళలో ప్రవేశం దొరకడం కష్టంగా ఉండేది.

మా సి.ఎల్.ఆర్.ఐ. స్టాఫ్ వెల్ఫేర్ చైర్మన్ అధ్వర్యంలో నేను, అడ్మినిస్ట్రేషన్, ఎకౌంట్స్ విభాగాల నుండి ఒకో ప్రతినిధి ఒక డెలిగేషన్‌గా నాయుడమ్మ గారిని కలుసుకుని సి.ఎల్.ఆర్.ఐ.లో కేంద్రీయ విద్యాలయం స్థాపన చేయాలని కోరుతూ ఒక వినతి పత్రం సమర్పించాము. దాన్ని చదివి, అది నేనే తయారు చేసి ఉంటానని ఊహించి, నాయుడమ్మ గారు నా వైపు తిన్నగా చూస్తూ "ఈ సంస్థలో అవివాహితుల సంఖ్య, పెండ్లి అయిన వారికి ఎంతమంది పిల్లలున్నారో నాకు అవగాహన ఉంది. స్కూలు స్థాపించడానికి అవసరమైనంత మంది విద్యార్థుల లభ్యత ఇప్పుడు మనకి లేదు కదా!''అన్నారు. ఆయన అభిప్రాయానికి సమాధానంగా నేను "స్కూలు మన క్యాంపస్‌లో స్థాపిస్తే మనకు ఎదురుగా ఉన్న లేబర్ ఇన్‌స్టిట్యూట్, మనకు సమీపంలో ఉన్న సి.ఎస్.ఐ.ఆర్. కాంప్లెక్స్ ఉద్యోగస్థుల పిల్లలే కాకుండా ఈ ప్రాంతంలో నివాసమున్న ఇతర కేంద్ర సంస్థల ఉద్యోగుల పిల్లలకు ఉపయోగపడుతుంది. స్కూలు ఇక్కడ రావాలే గానీ విద్యార్థులు లేరనే సమస్య ఎన్నటికీ తలెత్తదు. ఇటువంటి సంస్థను స్థాపిస్తే ముందు తరాల అవసరాలకు కూడా ఉపయోగపడుతుంది" అని నేను చెప్పాను. అప్పుడు మేము ఇచ్చిన వినతిపత్రాన్ని తన టేబుల్ మీద ఉంచి, ఏ మాటా చెప్పకుండా నాయుడమ్మ గారు నిర్లిప్తంగా ఉండిపోయారు.

మేము ఆయన స్పందనతో నిరాశ చెందాము.

నాయుడమ్మ గారు మా ఆలోచనకు వత్తాసు పలకనందువల్ల స్కూలు వచ్చే పరిస్థితి లేదని మేము నిరుత్సాహంతో వెనక్కు వెళ్ళాము.

మేము స్కూలు గురించి మరచిపోయాం. ఒక నెల తర్వాత నోటీస్ బోర్డులో సెంట్రల్ స్కూల్ మేనేజ్‌మెంటు నుండి వచ్చిన వార్తను అతికించారు. అందులో సెంట్రల్ స్కూల్ స్థాపనకు కేంద్ర సంస్థ అంగీకరించింది అని వ్రాసి ఉంది. మా ఆశ్చర్యానికి అంతులేదు. ఆ వార్త క్షణాలమీద మా క్యాంపస్ అంతా వ్యాపించి మమ్మల్ని ఆనందంలో ముంచెత్తింది.

యలవర్తి నాయుడమ్మ

ఢిల్లీలో నాయుడమ్మ గారి పరపతికి, పలుకుబడికి ఇది ఒక నిదర్శనం. ఆయన కార్య సాధనా దక్షతకు తార్కాణం. కానీ ఈ పని సాధించడానికి ఎన్ని అవస్థలు పడ్డారో, ఎంతమందితో మాట్లాడారో ఆయన ఎవ్వరికీ చెప్పలేదు. ఈ కార్యం నిశ్శబ్దంగా సాధించారు. అది తన ఘనతగా చెప్పుకోలేదు. ఆ పని చేయడం తన ధర్మం అన్నట్లు ప్రవర్తించారు. అదీ నాయుడమ్మ గారి గొప్పతనం.

నాయుడమ్మ గారు ఎగ్జిక్యూటివ్ కమిటీకి ప్రతికూలంగా తీసుకున్న రెండు నిర్ణయాలు

నాయుడమ్మ గారు ఢిల్లీలో సి.ఎస్.ఐ.ఆర్.లో డైరెక్టర్ జనరల్‌గా చేరి మద్రాసు వచ్చిన సందర్భంలో ఆయనకు సన్మాన సభ ఏర్పాటుచేశారు. ఆ సభలో "సి.ఎల్.ఆర్.ఐ. ఎగ్జిక్యూటివ్ కమిటీకి వ్యతిరేకంగా నేను రెండు నిర్ణయాలు తీసుకున్నాను" అని చెప్పి కాసేపు మౌనం పాటించారు.

హాల్లో ప్రేక్షకులందరూ ఆ నిర్ణయాలు ఏవో అని ఉత్కంఠతో శ్వాస బిగపట్టి కూర్చున్నారు. ఆ నిశ్శబ్ద క్షణాలలో

ప్రేక్షకులకు ఊహాగానాలకు పనిపెట్టారు. కానీ ఆయన ఏ నిర్ణయాల గురించి అలా అన్నారో ఎవరికీ అంతుపట్టలేదు. తర్వాత తన ఉపన్యాసాన్ని కొనసాగిస్తూ ఆ రెండు నిర్ణయాలలో మొదటిది 1961లో ఎకనామిక్స్ రిసెర్చ్ డివిజన్ స్థాపన, రెండవది 1963లో తోలుబొమ్మల అభివృద్ధి శాఖ. నాకు సంతోషం కలిగించే విషయమేమిటంటే ఈ రెండు శాఖలు కూడా నా నమ్మకాన్ని వమ్ము చేయకుండా అత్యద్భుతమైన ప్రగతిని సాధించాయి" అని అన్నారు. ఆయన ఈవిధంగా మాట్లాడటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 1958 ఫిబ్రవరిలో నాయుడమ్మ గారు సి.ఎల్.ఆర్.ఐ. డైరెక్టరుగా బాధ్యత స్వీకరించినప్పుడు ఆయన వయసు 36 సంవత్సరాలు మాత్రమే. ఆ పిన్న వయసులోనే ఆయన ఎన్నో చారిత్రాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. దేశ విదేశాల్లో నాయుడమ్మ సి.ఎల్.ఆర్.ఐ. కీర్తి పతాకాన్ని ఎగురవేశారు. ఆ సమయంలో సి.ఎల్.ఆర్.ఐ. ఎగ్జిక్యూటివ్ కమిటీ అభిప్రాయాన్ని తోసిపుచ్చి పై రెండు డివిజన్లను స్థాపించిన సాహసి నాయుడమ్మ గారు. ఈ విభాగాలు ప్రవేశపెట్టినప్పుడు సంస్థలోని సైంటిస్టులకు వీటిపై చిన్నచూపు ఉండేది. సైంటిస్టులతో సమానంగా ఈ కొత్త శాఖల వారికి సమాన హోదా ఇవ్వటమేమిటని ముక్కుమీద వేలేసుకున్న వారెందరో ఉన్నారు. సి.ఎస్.ఐ.ఆర్. ప్రయోగశాలలో ఒక్క సి.ఎల్.ఆర్.ఐ.లో మాత్రమే ఎకానమిస్టులకు ఉద్యోగాలు లభించాయి. మిగతా సి.ఎస్.ఐ.ఆర్. సంస్థలలో వారికి ప్రవేశం లేదు. అలాగే పురాణకాలం నుండి తోలు బొమ్మల తయారీ, వాటితో ప్రదర్శనలు ఇస్తూ సంచార జీవులు ఉపాధి పొందేవారు. అటువంటి వృత్తికి సి.ఎల్.ఆర్.ఐ.లో స్థానమా అనే చర్చ, విమర్శలు ప్రైవేట్ సంభాషణలలో చోటు చేసుకునేవి. కానీ మొదలుపెట్టిన పది సంవత్సరాల్లో ఎకనామిక్స్ డివిజన్ గణనీయమైన ఫలితాలను సాధించింది. సంస్థకు ఆదాయం ఆర్జించింది. ఉన్నతమైన రిసర్చికి ఆనవాలుగా నిలిచింది. అదేవిధంగా తోలు బొమ్మల శాఖ తోలు బొమ్మల తయారీలో టెక్నాలజిని జోడించి ఆకర్షణీయతను, నాణ్యతను పెంచి దేశంలోనూ, ఇతర దేశాలలోనూ ప్రదర్శనలిచ్చి సంస్థకూ, దేశానికీ పేరు ప్రతిష్ఠలు గడించింది. అసమానమైన దూరదృష్టితో ఈ రెండు విభాగాలను స్థాపించి అవి సాధించిన ప్రగతికి ఆనాడు సభలో నాయుడమ్మ గారు సంతృప్తి, సంతోషం వ్యక్తం చేశారు.

సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్

నాయుడమ్మ గారు గవర్నమెంట్ సర్వీస్ నుండి వైదొలిగిన తర్వాత సి.ఎల్.ఆర్.ఐ.లో జరిగిన సమావేశాలలో త్వరలో తాను సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ (CDA)ను స్థాపిస్తున్నానని, అందులో పని చేయడానికి ఒక ఎకానమిస్టు అవసరం ఉందని తెలిపారు. అనుభవంతో పాటు ఎవరైనా పేరున్న వ్యక్తిని ఆ పోస్టుకు ఆయన అప్పటికే ఆలోచన చేసే ఉంటారని నేను అనుకున్నాను. అయినా నా సంశయం తీర్చుకోవడానికి ఆయనను కలిసి "మీ దృష్టిలో నాకున్న అర్హత, సామర్థ్యం CDAకు సరిపోతుందని మీరు అభిప్రాయపడితే సి.ఎల్.ఆర్.ఐ. సర్వీస్ వదిలి మీ సంస్థలో చేరేందుకు ఇష్టపడతాను" అని నా అభీష్టాన్ని ఆయనకు తెలియచేశాను. దానికి స్పందనగా ఆయన "నీవు సి.ఎల్.ఆర్.ఐ. సర్వీసులో కొనసాగుతూనే CDAకు సేవలు అందించే ఏర్పాటు నేను చేస్తాను'' అన్నారు. ఆయన స్పందనకు నేను పులకించిపోయాను. సి.ఎల్.ఆర్.ఐ. ప్రభుత్వ సంస్థ. CDA అందులో భాగం కాదు. సహజంగా ప్రభుత్వరంగ సంస్థలలో ఆయన తలపెట్టిన సంస్థకు సమర్థన, ఆమోదం లభించడం కష్టం. కానీ అందులో నాకు స్థానమెలా సాధ్యమని నేను ఒక్కక్షణం కూడా శంకించలేదు. ఆయన శక్తి సామర్థ్యాలపై, ప్రభుత్వంలో ఆయనకున్న పరపతిపై నాకు అచంచలమైన విశ్వాసముంది. అందువల్ల ఆ విధమైన ఆదేశం నా చేతికి అందడమే ఆలస్యమని నేను భావించాను.

CDA నిర్వహణకు కావలసిన బడ్జెట్‌ను, నిపుణులను, సిబ్బందిని సి.ఎల్.ఆర్.ఐ. ద్వారా పొందే వెసులుబాటును తొందరలోనే సి.ఎస్.ఐ.ఆర్. సమకూర్చింది. అదనంగా ఇంకా అవసరమైతే సిబ్బందిని బయటినుండి కూడా తీసుకోవచ్చని సి.ఎస్.ఐ.ఆర్. తెలిపింది. సి.ఎస్.ఐ.ఆర్. నుండి ఆ విధమైన ఆదేశాలు అందగానే నాయుడమ్మ గారు అంతకుముందు నాతో చెప్పిన విధంగానే ముందుగా నన్ను

CDA కో–ఆర్డినేటర్‌గా నియమించారు. ఆ నిర్ణయాన్ని సి.ఎల్.ఆర్.ఐ. డైరెక్టరుకు, సి.ఎస్.ఐ.ఆర్. డైరెక్టర్ జనరల్‌కు తెలియజేశారు.

CDA ఆశయాలు: వ్యవసాయంలో, పరిశ్రమలో సాంప్రదాయికంగా పాటిస్తున్న పద్ధతులను, వాటి ఉత్పత్తులు వినియోగదారులకు చేరేవరకు పాటిస్తున్న విధానాలను అధ్యయనం చేసి, వాటిలో లోపాలు ఉంటే ప్రత్యామ్నాయాలను సూచించాలి. *ఈ ప్రత్యామ్నాయాల ద్వారా సాధించాల్సిన ఆశయాలు:* పెట్టుబడిపై అత్యధికంగా ఉత్పత్తి, నాణ్యత పెరగాలి. ఉత్పత్తి నుండి వినియోగదారులను చేరేంతవరకు అందులో భాగస్వాములైన వారికి న్యాయమైన రాబడి (distributive justice) అందేట్లు చేయాలి.

CDA మొదటి ప్రాజెక్టు

పాదరక్షల ఉత్పత్తి వాటి మార్కెట్ విధానాలపై అధ్యయనం CDA చేపట్టిన మొదటి ప్రాజెక్టు. CDA ఆశయాలకు అనుగుణంగా గ్రామస్థాయిలో చర్మకారుడు అనుసరిస్తున్న ఉత్పత్తి విధానాలను, అమ్మకాల విధానాలను సంస్థ అధ్యయనం చేసింది. చర్మకారుడు తనకు సాంప్రదాయికంగా అబ్బిన పనితనాన్ని ఉపయోగించి, ఉత్పత్తి చేసి ఆ ఉత్పత్తులను తన గ్రామంలో, తన చుట్టుపక్కల గ్రామాలలో విక్రయిస్తాడు. కానీ కాలంతో పాటు మారుతున్న అభిరుచులకు అనుగుణంగా చర్మకారుడి ఉత్పత్తులు లేవు. వినియోగదారులు కోరే వివిధరకాల డిజైన్లలో అతను ఉత్పత్తి చేయలేడు. తాను తయారుచేసిన ఉత్పత్తులు మార్కెట్లలో లభ్యమవుతున్న ఫ్యాక్టరీ పాదరక్షలతో పోటీకి నిలువలేవు. చర్మకారుడు అవలంబిస్తున్న విధానాలలో ఇవి ముఖ్యమైన సమస్యలు, లోపాలు. పై ప్రతికూల పరిస్థితులను అధిగమించడానికి చర్మకారులు ఫ్యాక్టరీలతో అనుసంధానం కావాలి. కానీ ఎక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేసే వాటిని సొంతంగా తయారుచేసేందుకు ఫ్యాక్టరీలు ప్రాధాన్యతనిస్తున్నాయి. తక్కువ ఖర్చుతో తయారయ్యే వాటిని కాంట్రాక్టు పద్ధతిలో చర్మకారుల నుండి కొనుగోలు చేసి వాటిని ఫ్యాక్టరీ సొంత బ్రాండుపై అమ్మకాలు చేస్తున్నారు. ఈ విధానం వల్ల చర్మకారుల నుండి నాణ్యత గల సామాను లభ్యం కాకపోవడమే కాకుండా ఆశించిన విధంగా సప్లై కొనసాగడం లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా CDA సూచించిన విధానం ఏమిటంటే గ్రామస్థాయిలో చర్మకారులను ఒక గ్రూపు (cluster)గా ఏర్పరచి, వారికి ఆధునిక పరికరాలు ఫ్యాక్టరీలు అందించాలి. ఫ్యాక్టరీలు వారికి cut components రెగ్యులర్‌గా అందించి piece rateపై వారి శ్రమకు తగ్గ మూల్యం చెల్లించాలి. తయారైన సరుకును కంపెనీ బ్రాండుపై అమ్మకం చేస్తారు. ఉత్పత్తులకు మార్కెటింగ్ సమస్య ఉండదు. ఈ పద్ధతి వల్ల వృత్తిదారులకు సంవత్సరం పొడుగూతా పని దొరుకుతుంది. ఈ నమూనా విజయవంతం కావాలంటే ఫ్యాక్టరీలు నికర లాభంలో వృత్తిదారులకు వాటా ఇవ్వాలి. బోనస్‌గా వారికి కంపెనీ షేర్లు ఇవ్వాలి. ఈ పద్ధతిలో ఎదురయ్యే సమస్యలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలి. ఈ మోడల్ ప్రయోగాత్మకంగా ముందుగా పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలి. అప్పుడు ఈ నమూనాలోని సాధ్యాసాధ్యాలు సరిగా బేరీజు వేసుకోవడానికి వీలు కలుగుతుంది.

CDA రెండవ ప్రాజెక్టు

ఇండియాలో మాంసం ఉత్పత్తి, దాని మార్కెట్ విధానాలు CDA చేపట్టిన రెండవ ప్రాజెక్టు. నాయుడమ్మ గారు కెనడా కేంద్రంగా ఉన్న IDRC (ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ రిసర్చ్ సెంటర్) గవర్నింగ్ బాడీలో సభ్యులు. IDRC గవర్నింగ్ బాడీ సమావేశంలో ఇండియాలో మాంసం ఉత్పత్తి, దాని పంపకంపై అధ్యయనాన్ని పరిశోధనాంశంగా నాయుడమ్మ గారు ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనపై చర్చ జరిగిన తర్వాత, దాన్ని IDRC గవర్నింగ్ బాడీ అంగీకరించి అవసరమైన ధన సహాయాన్ని అందచేస్తామని తెలియజేసింది. ఆ సమావేశం తర్వాత నాయుడమ్మ గారు మద్రాస్ రాగానే నన్ను, నా సహచరులను సమావేశపరచి, ప్రాజెక్టు గురించి ఆయన ఆలోచనలను మాతో పంచుకున్నారు. దాన్ని CDA-CLRI జాయింట్ ప్రాజెక్టుగా నిర్వహిద్దామని చాలా ఉత్సాహంగా, సంతోషంతో చెప్పారు. మేము కూడా మంచి ప్రాజెక్టు లభిస్తోందని తలచి, ఆయన ఆనందంలో పాలుపంచుకున్నాము. పై సమావేశం జరిగిన

రెండు నెలలకు నాయుడమ్మ గారు అకాల మృత్యు వాతపడ్డారు. ఎక్కడో ఆకాశంలో ఆయన ప్రయాణం చేస్తున్న కనిష్క విమానం బాంబు దాడికి గురై, అగ్నిగోళమై, శకలాలు సముద్రంలో పడ్డాయి. విమానంలో ఉన్నవారంతా చనిపోయారు. నాయుడమ్మ గారి అవశేషాలు కూడా దొరకలేదు. ఆయన అలా అంతర్ధానం కావడం మాకు మింగుడుపడలేదు. ఆ దుఃఖంలో మేము CDA ప్రాజెక్టు గురించి పట్టించుకోలేదు. నిజానికి ఆయనతో పాటే అది కూడా మాయమైనట్లే అనుకున్నాము.

కానీ అనూహ్యంగా కొన్ని నెలల తర్వాత ప్రాజెక్టు మంజూరు చేస్తున్నామని, ప్రాజెక్టు వివరాలు, ప్రాజెక్టు అమలుచేయడానికి అవసరమైన బడ్జెట్ తెలియజేస్తూ సమగ్రమైన ప్రతిపాదన పంపించమని IDRC నుండి లేఖ వచ్చింది. దానికి మేము స్పందించి, ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తామని చెప్పి, IDRC అడిగిన వివరణలను జతపరచి ప్రతిపాదనను సమర్పించాము. ఆ తర్వాత IDRC మా ప్రతిపాదనను ఆమోదించి, అధ్యయన నిర్వహణకు అవసరమైన గ్రాంటును మంజూరుచేసింది. మొదటి దశలో మేము చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ కబేళాలలో పాటిస్తున్న ఉత్పత్తి విధానాలు, జీవాల కొనుగోలుతో ప్రారంభమై మాంసం ఉత్పత్తి జరిగి, వినియోగదారులకు చేర్చే వరకు పాటిస్తున్న విధానాలు లోపభూయిష్టంగా ఉన్నాయని మేము గుర్తించాము. ఇందులో ముఖ్యమైన లోపం ఏమిటంటే ఒక జీవం నుండి తయారైన మాంసానికి వినియోగదారులు చెల్లించే మొత్తంలో ఆ జంతువును ఆరు నెలల నుండి 12 నెలలు ఎండా వానలలో సాకినందుకు 60 శాతం మాత్రమే రైతుకు చేరుతుంది. ఆ జంతువును కబేళాకు చేర్చి, మాంసం ఉత్పత్తి చేసి, పంపిణీ చేయటానికి 36 గంటల నుండి 48 గంటలు పడుతుంది. ఈ ప్రక్రియలో భాగస్వాములను 40% అందుతుంది. ఇది న్యాయమైన పంపిణీ విధానం (distributive justice) కాదు. రవాణా సమయంలో రెండు లేక మూడు జీవాలు చనిపోవడం జరుగుతుంది. అంతేకాక దూర ప్రాంతాల నుండి జంతువుల రవాణాలో muscle shrinkage వల్ల జీవాల బరువు తగ్గుతుంది. జీవం బరువులో 62 శాతం మాత్రమే మాంసం బరువు. మాంసం ఒక్కటే బస్తీలకు చేర్చితే కబేళాల నుండి విడుదలవుతున్న వ్యర్థాలు, మాలిన్యాల ఫలితంగా ఉత్పన్నమయ్యే కాలుష్యాన్ని నివారించవచ్చు. కబేళాలు మున్సిపాలిటీలకు ఆదాయం సమకూర్చే సంస్థలుగా ఉపయోగపడుతున్నాయి. పట్టణాలు విస్తరిస్తున్నాగాని ఏనాడో నిర్మించిన కబేళాలు ఆధునీకరణకు, విస్తరణకు నోచుకోలేదు. అపరిశుభ్రమైన వాతావరణంలో మాంసం ఉత్పత్తి జరుగుతోంది.

మొదటి దశ అధ్యయనంలో ఇటువంటి సమాచారం లభ్యమైంది. ఈ దుస్థితిని అధిగమించడానికి ప్రత్యామ్నాయ వ్యవస్థ స్థాపన గురించి రెండవ దశలో అధ్యయనం చేశాము. జీవాల ఉత్పత్తి కేంద్రాల సమీపంలో ఒక్కొక్క దాన్లో 50 జీవాలను వధించి మాంసం ఉత్పత్తి చేసే సామర్థ్యం కల లఘు మాంసం ఉత్పత్తి కేంద్రాలను స్థాపించడానికి అవసరమైన వసతులు ఏర్పరిస్తే ఉపయుక్తంగా ఉంటుందని మా అధ్యయనంలో వెల్లడైంది. లఘు ఉత్పత్తి కేంద్రలకు అనుసంధానంగా రైతుల నుండి జీవాలను డైరెక్టుగా కొనాలి. ప్రతి జీవం నుండి ఎంత విలువైన ఉత్పత్తి లభిస్తుందో అంచనా కట్టి దాని విలువను రైతుకు డబ్బుగా చెల్లించాలి. ఉత్పత్తి అయిన మాంసాన్ని సమీప గ్రామాలలో సైకిళ్ళపై తీసుకువెళ్ళి విక్రయించవచ్చు, బస్తీలకు చేర్చవచ్చు. మాలిన్యాలను ఎరువుగా మార్చవచ్చు. ఈ విధానం వల్ల జీవాలను బస్తీలకు తరలించాల్సిన అవసరం లేదు. మాంసం మాత్రమే చుట్టుపక్కల గ్రామాలకు, బస్తీలకు బట్వాడా అవుతుంది. రెండవ దశలో ప్రయోగాత్మకంగా గూడూరు వద్ద ఒక మాంసం ఉత్పత్తి కేంద్రం స్థాపించి దాని ప్రయోజనాలను నిరూపించటం జరిగింది. ఈ చిన్న యూనిట్ వల్ల రైతులకు లాభాలు పెరిగాయి. ఆ ఫలితాలు ప్లానింగ్ కమిషన్ దృష్టిని ఆకర్షించాయి. కేంద్ర 11వ పంచవర్ష ప్రణాళికలో ఈ నమూనాను అనుసరించి రాష్ట్రాలలో ఉత్పత్తి కేంద్రాలను స్థాపించుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం సిఫార్సు చేసింది. మొదటి దశ అధ్యయనం పూర్తి అయిన తర్వాత నేను ఉద్యోగ విరమణ చేశాను. ఆ ప్రాజెక్టులో నా పాత్ర అంతటితో ముగిసింది. ఇది నాయుడమ్మగారు కల్పన చేసిన

ఒక ఆచరణాత్మక ప్రయోగం. ఆయన ఇంకొన్నేళ్ళు జీవించి ఉంటే ఇలాంటి ప్రజోపయోగ పనులు మరెన్నో కల్పన చేసి, గ్రామీణాభివృద్ధికి ఇతోధికంగా దోహదం చేసేవారు. ఆయన అకాల మరణం దేశానికి తీరని నష్టం.

సి.ఎల్.ఆర్.ఐ. డైరెక్టర్ పోస్టుకు ఎంపిక

నాయుడమ్మ గారు సి.ఎస్.ఐ.ఆర్. డైరెక్టర్ జనరల్‌గా ఉన్న సమయంలో సి.ఎల్.ఆర్.ఐ. డైరెక్టర్ పోస్టు ఖాళీ అయింది. ఆ పోస్టుకు ముగ్గురు ప్రముఖులను షార్ట్‌లిస్ట్ చేసి పానెల్‌లో ఉంచారు. పానెల్‌లో డాక్టర్ శాంతప్పది మొదటి పేరు. కాని ఆనవాతీ ప్రకారం పానెల్‌లో ఉన్న మొదటి వ్యక్తిని ఎంపిక చేయకుండా, ఒక కొత్త వరవడి ప్రవేశపెట్టి, పానెల్‌లో షార్ట్‌లిస్ట్ అయిన ముగ్గురికీ వాళ్ళు తోలు పరిశ్రమను ఏ విధంగా అభివృద్ధి చేస్తారో తెలుపమని ఒక ప్రశ్నావత్రాన్ని అందచేయడం జరిగింది. ఆ కారణంగా ఎంపిక ప్రక్రియ కొత్త మలుపు సంతరించుకుంది. ఇప్పుడు ఎంపిక ప్రక్రియలో ప్రశ్నావత్రం కీలకమయింది. డాక్టర్ శాంతప్ప ఢిల్లీకి వెళ్ళినప్పుడు నాయుడమ్మ గారిని కలిసారు. అప్పుడు ప్రశ్నావత్రం విషయం ప్రస్తావనకు వచ్చింది. డాక్టర్ శాంతప్ప గారు సైంటిస్టే గానీ తోలు పరిశ్రమతో ఎటువంటి పరిచయం లేదు. ప్రశ్నావత్రంపై డాక్టర్ శాంతప్ప గారి ఉదాసీనతను పసిగట్టిన నాయుడమ్మగారు ప్రశ్నావత్రానికి సమాధానం ఇచ్చే విషయంలో నా (శేషగిరిరావు) సహాయం తీసుకోవాల్సిందిగా సలహా ఇచ్చారట. శాంతప్ప మద్రాసుకు తిరిగి రాగానే ఆయనకు నాకు పరిచయమున్న డా. కృష్ణారెడ్డి ద్వారా ప్రశ్నావత్రం నాకు చేరవేసి, దాన్ని పూర్తి చేసి ఇవ్వమని కోరారు. ఆ ప్రశ్నావళి ఎందుకో, అది ఎందుకు రూపొందించారో, దాని అవసరం ఏమిటో నాకు అప్పుడు తెలియలేదు. నా శక్తిమేరా దాన్ని పూర్తి చేసి శాంతప్పకు పంపించాను. డాక్టర్ శాంతప్ప డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. ఆయన ఎంపికలో ప్రశ్నావత్రం ఏ పాత్ర వహించిందో నాకు తెలియదు. కానీ ఆయన డైరెక్టర్‌గా ఛార్జి తీసుకోబోయే ముందు ఇద్దరు సి.ఎల్.ఆర్.ఐ. సైంటిస్టులు ఆయన వద్దకు వెళ్ళి డైరెక్టర్‌గా ఎంపికైనందుకు శుభాకాంక్షలు తెలిపి "మీరు ఎకానమిస్టు శేషగిరిరావు విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆయన నాయుడమ్మ గారికి నమ్మకస్తుడు. సంస్థలో జరిగే విషయాలు నాయుడమ్మ గారికి చేరవేస్తాడు" అని హెచ్చరించారు. కాలక్రమంలో డాక్టర్ శాంతప్పకు నాపై సైంటిస్టుల సలహా పనిచేసింది. ఆయనను అనుమానమనే భూతం పట్టి పీడించింది. కొన్నాళ్ళ తర్వాత డాక్టర్ శాంతప్ప గారు నన్ను పిలిచి "మన సంస్థలో కొంతమంది (ఒక వర్గం) నాతో సహకరించడం లేదు. ఈ విషయం నాయుడమ్మ గారికి తెలియజేయండి" అని అడిగారు. ఆయన సూచనను నేను వెంటనే తిరస్కరించాను. "ఈ విషయం మీకు, డైరెక్టర్ జనరల్‌కు సంబంధించింది. నాకు సంబంధం లేదు. పైపెచ్చు ఇటువంటి పనులు నా ప్రవర్తనకు, సంస్కారానికి విరుద్ధం" అని సూటిగా చెప్పాను. నా సమాధానం విని డాక్టర్ శాంతప్ప నవ్వి తన అనుమానాన్ని నివృత్తి చేసుకున్నానని నాతో అన్నారు. ఈ విషయంలో నాపై ఆయన చెవులు కొరికినవాళ్ళ పేర్లు కూడా తెలిపారు. నాపై ఇటువంటి దుష్ప్రచారం నేను సైంటిస్టు-బి పదవికి ఐదు అడ్వాన్సు ఇంక్రిమెంట్లతో ఎంపిక జరిగినప్పటి నుంచి సాగుతోంది. పరోక్షంగా నేను నాయుడమ్మ గారి బ్లూ ఐడ్ బాయ్‌నని చెప్పుకునేవారు. అడ్వాన్సు ఇంక్రిమెంట్లు నాపై ఈర్ష్యకు కారణభూతమయ్యాయి.

తోళ్ల పరిశ్రమ ఫ్యూచరాలజి

నాయుడమ్మ గారు సీ.ఎస్.ఐ.ఆర్. డైరెక్టర్ జనరల్‌గా పదీవీ విరమణ చేసి మద్రాసు వచ్చిన తర్వాత కామర్సు సెక్రెటరీ డాక్టర్ అబిద్ హుసేన్‌కు ఒక ఉత్తరం రాశారు. అందులో తోళ్ల పరిశ్రమ ఫ్యూచరాలజి అవశ్యకత గురించి వివరించి, ఆ అధ్యయనానికి పరిశ్రమలోని ప్రముఖులు, శాస్త్రవేత్తలు, ఫ్యూచరాలజిలో ప్రవేశమున్న నిపుణులు, తోళ్ళ పరిశ్రమతో సంబంధమున్న వివిధ శాఖల అధిపతులు వ్యవస్థాపక ప్రాతిపదికపై సమావేశమై ఆచరణయోగ్యమైన నిర్ణయాలు తీసుకోవడానికి కృషి చేయాలి అని వ్రాశారు. అటువంటి విశేష వ్యక్తుల సముదాయం సమావేశం కావడానికి, చర్చలు నిర్వహించడానికి సి.ఎల్.ఆర్.ఐ. అనువైన సంస్థ అని చెప్పారు. ఈ సంస్థను సమర్థవంతంగా నిర్వహించడానికి సి.ఎల్.ఆర్.ఐ.లో ఎకానమిస్టుగా

పనిచేస్తున్న శేషగిరిరావును ఎంపిక చేస్తే బాగుంటుంది అని వ్రాశారు. ఆ ఉత్తరం కాపీ నాకు పంపించారు.

ఆ ఉత్తరం చూసి ఇందులో నా ప్రస్తావన ఎందుకోనని నేను ఆశ్చర్యపోయాను. "ఇటువంటి అధ్యయనం ఢిల్లీలో నిర్వహించడం సముచితంగా ఉంటుంది. తోళ్ళ పరిశ్రమతో సంబంధమున్న శాఖాధిపతులు, ఇటువంటి సదస్సులు ఇంతకుముందు నిర్వహించిన అనుభవజ్ఞులు అందుబాటులో ఉండి, చర్చలలో పాల్గొనడానికి ఢిల్లీ వేదిక అయితే అందరికీ అనువుగా ఉంటుంది. సంస్థ తరఫున సదస్సులు నిర్వహించే బాధ్యతను కేంద్ర పరిశ్రమల శాఖ, లేదా కామర్స్ శాఖ తీసుకోవచ్చు" అని నేను నాయుడమ్మ గారికి సూచించాను. దానికి సమాధానంగా "కేంద్ర ప్రభుత్వంలో ఉన్న సెక్రటరీలకు పరిపాలనా సంబంధమైన విషయాలపై దృష్టి కేంద్రీకరించి వాటిపై తగిన నిర్ణయాలు తీసుకోవడానికి వీలుంటుంది. మనం అనుకుంటున్న అధ్యయనాలు నిర్వహించడానికి మనమే చక్కగా నిర్వహించగలం. ఇక్కడ మనకు ఒత్తిడి లేదు. పరిశోధనాత్మక దృష్టితో సదస్సులు నిర్వహించడానికి మనది అనుకూలమైన వాతావరణం. పరిశ్రమపై నీకున్న పరిజ్ఞానం, అనుభవం, ఈ సదస్సుల నిర్వహణకు సరిపోతాయి" అని నాయుడమ్మ గారు చెప్పారు. ఆయనకు నా సామర్థ్యంపై అంత నమ్మకమున్న తర్వాత నేనేం మాట్లాడగలను? "సరే, మీ ఇష్టం" అన్నాను. కానీ అనుకున్న వెంటనే సదస్సులు నిర్వహించడం వీలు కాలేదు. కొన్ని నెలల తర్వాత నాయుడమ్మ గారి గైడెన్సులో SWOT Analysis (S= Strength - బలం, W= Weakness - బలహీనతలు, O= Opportunities - అవకాశాలు, T= Threats – నిరోధాలు) టెక్నిక్‌ని ఉపయోగించి పరిశ్రమ స్థితిగతులను, దాని ఉత్పత్తులను, ఎగుమతులను ఏ విధంగా వృద్ధి చేయవచ్చో పరిశీలన, పరిశోధనలు చేసి, మా అధ్యయనంలో నిగ్గు తేలిన విషయాలను ప్రభుత్వానికి తెలియజేయడం జరిగింది.

నాపై ఆకాశరామన్న ఉత్తరాలు

డాక్టర్ శాంతప్ప గారు సి.ఎల్.ఆర్.ఐ. డైరెక్టర్‌గా చేరిన కొత్తలో మాలాంటి సంస్థను నిర్వహించిన పూర్వానుభవం లేనందున, కొన్ని సందర్భాలలో తనకు తెలియని విషయాల గురించి ఆయన నన్ను సంప్రదించేవారు. నా అభిప్రాయంపై ఆయనకు నమ్మకముండేది. నేను కూడా స్వభావసిద్ధంగానే నిర్భీతితో, నిష్కర్షగా అభిప్రాయాలు వెలిబుచ్చేవాడినైనా కూడా ఆయన నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకూడదని మరింత జాగ్రత్తగా ఒకటికి పదిసార్లు ఆలోచన చేసి ఆయన ఎదుర్కొంటున్న సమస్యలకు సానుకూల పరిష్కారాలు సూచించేవాడిని. ఈ కారణంగా ఆయన తరచుగా పలు విషయాలపై నా అభిప్రాయం కోరేవారు. అది చాలామందికి కంటగింపుగా ఉండేది. నా ఉద్యోగ నిర్వహణ విషయంలో ఎవరు కూడా వేలెత్తి చూపే అవకాశం ఎప్పుడూ లేదు. కానీ ఒకరిపై బురద చల్లాలంటే ఈర్ష్యతో రగిలిపోతున్న వ్యక్తికి ప్రత్యేకంగా ఒక కారణమంటూ ఉండాల్సిన అవసరం లేదు. ముందు మొహానికి మసి పూస్తే సరి అనేదే ఆ అసూయాపరుడు ఆలోచన చేస్తాడు. నా విషయంలో అదే జరిగింది. శాంతప్పగారు నా అభిప్రాయాలకు విలువనిస్తారనే ఈర్ష్యతో నాపై ఏవో పనికిమాలిన అభియోగాలు మోపుతూ, ఆరోపణలు చేస్తూ శాంతప్ప గారికి, కొన్ని నాయుడమ్మ గారికి ఆకాశరామన్న ఉత్తరాలు వెళ్ళేవి. శాంతప్ప గారు మా సంస్థకు డైరెక్టరుగా రావడం కొంతమంది ఆశావహుల అలజడికి కారణభూతమయింది. వారు సంతకంలేని ఉత్తరాలు పుంఖానుపుంఖంగా రాసేవారు. అవి చూసి శాంతప్ప గారు గాభరా పడేవారు. నాకవి కొత్తకాదు కాబట్టి నేను నిమ్మళంగా ఉండేవాడిని. నేను ఒకసారి నాయుడమ్మ గారిని లంచ్‌కి ఆహ్వానిస్తే ఆయన మా ఇంటికి వచ్చారు. అప్పుడు మాటల సందర్భంలో "నీవు శాంతప్పకు బ్యాక్ సీట్ డ్రైవరని, మీ డిపార్టుమెంటులో తెలుగువాళ్ళని, అందునా ముఖ్యంగా కమ్మవాళ్ళను, కొత్తగా ఉద్యోగాల్లో చేర్చుకుంటున్నావని నాకు జాబులు వస్తున్నాయి" అన్నారు. ఆ అరోపణలు అర్థరహితం, ఆధారరహితం. అది నాకు తెలుసు. కానీ అటువంటి ఆరోపణలకు హితుల దగ్గర వివరణ ఇవ్వాలంటే మనస్సు కలుక్కుమంటుంది. నాయుడమ్మ గారి సంస్కారానికి తార్కాణంగా ఆయన నా వివరణ అడగలేదు.

నాకు చెప్పడానికి అవకాశం కూడా ఇవ్వలేదు. నా ఆత్మగౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని తాను చెప్పిన దానికి నేనెలాంటి సమాధానం చెప్పకముందే నాయుడమ్మ గారు "వీటిని నేను లక్ష్యపెట్టను. ఇటువంటి వాటి గురించి నీవు ఆవేదన చెందాల్సిన అవసరం లేదు. నీవు న్యాయబద్ధంగా నిర్ణయాలు తీసుకున్నంత కాలం నీకు ఎటువంటి హాని కలిగే ప్రసక్తి లేదు" అని చెప్పి నాకు సాంత్వనం కలిగించారు, నా గుండె నిండా ధైర్యాన్ని నింపారు.

నాయుడమ్మ గారి ఆలోచనలలో నేను

నా పుట్టిన రోజు జూన్ 12. అదే రోజు 1981లో నాయుడమ్మ గారు ఢిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. చేరిన క్షణం నుంచి ఆయనకు తీరికలేదు. రోజంతా హడావుడే. అంత పని ఒత్తిడి ఉన్నాగాని ఆయన నా పుట్టిన రోజును మరువలేదు. జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ నాయుడమ్మ గారు నాకు లేఖ రాశారు. లేఖకు తెలుగు అనువాదం:

ప్రియమైన రావు,

ఈరోజు మీ పుట్టినరోజని నాకు గుర్తు. మీకు నా జన్మదిన శుభాకాంక్షలు. మీరు CDA ఏర్పడటానికి ఎంతో చిత్తశుద్ధితో పనిచేశారు. భవిష్యత్తులో కూడా మీ సాయం నాకు లభిస్తుందని ఆశిస్తున్నాను. ఈరోజు నాకు కూడా ఒక ముఖ్యమైన రోజే. నా జీవితంలో ఇంకొక అధ్యాయం మొదలైంది. అవును! ఈ ఉదయమే నేను జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా చేరాను. 55 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న వారు నాకు స్వాగతం పలికారు. వైస్ ఛాన్సలర్‌గా నా మొదటి కర్తవ్యం వాళ్ళతో మాట్లాడటం. సాయంకాలం ఆరు గంటల వరకు దీక్ష విరమించే ప్రసక్తి లేదన్నారు. 7 గంటలకు దీక్ష విరమిస్తూ నన్ను బత్తాయి రసం ఇవ్వమన్నారు.

ఇలా కొత్త జీవితం మొదలైంది. – *నాయుడమ్మ*

* * *

నాయుడమ్మ గారి రిటైర్మెంటు

41 సంవత్సరాలు ప్రభుత్వంలో ఉద్యోగం చేసిన తర్వాత 1984 సెప్టెంబర్ నెలలో నాయుడమ్మ గారు ప్రభుత్వ సర్వీసు నుండి పదవీ విరమణ చేశారు. అక్టోబర్ 4న ఆయన వియన్నా నుండి నాకు ఉత్తరం వ్రాసారు. అందులో ఆయనకు నాపై ఉన్న అభిమానాన్ని, నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఉత్తరం తెలుగు అనువాదం:

ప్రియమైన రావు,

విజయదశమి శుభాకాంక్షలు!

ఇన్నాళ్ళకు నేను స్వతంత్రుణ్ణి అయ్యాను. కనీసం ప్రభుత్వం నుండి బయటపడ్డాను.

జీవితంలో ఎప్పుడూ నాకు మా నాన్న జ్ఞాపకం వస్తారు. ఆయన ఒక సాధారణ పల్లెటూరి రైతు. కానీ ఆయన అనుభవం అపారం. నిచ్చెన ఎక్కేటప్పుడు నిచ్చెన వేసిన మనిషిని గుర్తు పెట్టుకోవాలి అని అనేవారు. ఎందుకంటే నిచ్చెన దిగి వచ్చేటప్పుడు అతని సహాయం అవసరం కావచ్చు అని నాకు చిన్నప్పుడే నూరిపోశాడు.

ఒకరి విజయానికి వెనుక ఎందరో ఉంటారు. వాళ్ళు స్వచ్ఛందంగా, చిత్తశుద్ధితో, దీక్షగా పని చేస్తారు. వాళ్ళకు ఎలా కృతజ్ఞతలు తెలపాలి? మీరు నా పట్ల అసాధారణమైన దయ చూపారు. అందుకుగాను నేను మీకు నా ధన్యవాదాలు ఎలా చెప్పాలో తెలియడం లేదు. మీకు, మీ సహచరులకు నేను ఎంతో ఋణపడి ఉన్నాను. నేను జీవితంలో అదృష్టవంతుడిని అనే చెప్పాలి. మీలాంటి వారే నా జీవితాన్ని ఫలవంతం చేశారు చేశారు. మీకు మళ్ళీ నా కృతజ్ఞతలు. – *నాయుడమ్మ*

* * *

ఈ ఉత్తరం నాయుడమ్మ గారి నిజాయితీకి, సౌశీల్యానికి అద్దం పడుతుంది. నేనంటే నాయుడమ్మ గారికి ఇంత వాత్సల్యమని ఆయన గవర్నమెంట్ సర్వీసులో ఉన్నంత కాలం నేను గ్రహించలేదు. ఆయన ఆదరణకు నేను పాత్రుణ్ణయ్యానన్న అనుభూతి నా జీవితంలో అత్యంత సంతృప్తిని కలిగించిన విషయమని చెప్పడానికి నేను సందేహించను. ఆయన విశ్వాసాన్ని చూరగొన్న నేను ధన్యజీవిని అని సగర్వంగా చెబుతాను.

(ఇంకా ఉంది)

(కాట్రగడ్డ శేషగిరిరావుగారి చేరాతను సంస్కరించింది - కాటా చంద్రహాస్ - హైదరాబాద్. ఫోన్: 80 084 9678)

ప్రపంచం గర్వించదగ్గ తెలుగు గణాంక శాస్త్రవేత్త

డా. సి.ఆర్. రావు

– నాగసూరి వేణుగోపాల్

కల్యంపూడి రాధాకృష్ణారావు అని అంటే చాలామందికి తెలియకపోవచ్చు. కానీ సి.ఆర్.రావు అనగానే ప్రపంచం మొత్తం తెలిసిన గణాంక శాస్త్రవేత్త అని బోధపడుతుంది. పి.సి. మహల్నా బీస్ తర్వాత అంతటి గొప్ప గణాంక శాస్త్రవేత్త సి.ఆర్. రావు అనే ఖ్యాతి ఉంది. అంతటి గొప్ప శాస్త్రవేత్త తెలుగువాడు అయినందుకు మనమందరం గర్వపడాలి.



కల్యంపూడి రాధాకృష్ణారావు

డాక్టర్ సి.ఆర్. రావు చేసిన కృషి విశేషమైందని గత సంవత్సరం వందేళ్లు పూర్తి చేసుకున్న అదృష్టవంతులు, వారు మరిన్ని పుట్టినరోజులు జరుపుకొని మరింత పరిశోధన చేయాలి. వారు ఆవిష్కరించిన 'Cramer - Rao Inequality, 'Rao - Black wellization' Rao's score Test'వంటి అంశాలు ఏ గణాంక శాస్త్రం అచ్చు పుస్తకం చూసినా కనబడటం మనకు గర్వకారణం. గణాంక శాస్త్రానికి సంబంధించిన సమగ్రమైన 'సంఖ్య' అనే మ్యూజియంను రూపొందించారు. ఈ మ్యూజియం ప్రపంచంలోనే అరుదైనది, ప్రప్రథమమైనది! దీన్ని ఒక తెలుగు శాస్త్రవేత్త, తెలుగునాట హైదరాబాదులో నెలకొల్పడం మనకు తలమానికం! కల్యంపూడి రాధాకృష్ణరావు జన్మించే సమయంలో తండ్రి పోలీసు ఇన్స్పెక్టర్గా (ఇప్పటి) కర్ణాటక రాష్ట్రపు బళ్ళారి జిల్లా హువర్ణ అడహలి అనే అనే గ్రామంలో పనిచేస్తున్నారు. 1920 సెప్టెంబరు 10న రావుగారు జన్మించారు. ఎనిమిదో సంతానం కనుక రాధాకృష్ణ అని పేరు పెట్టారట. రాధాకృష్ణరావు చదువు గూడూరులో మొదలైంది. తర్వాత నూజివీడు, నందిగామ, విశాఖపట్నాలలో సాగింది. తండ్రి ఉద్యోగ బదిలీయే ఇందుకు కారణం. మహాశాస్త్రవేత్త సి.వి. రామన్ విశాఖపట్నంలోని మిసెస్ ఏవియన్ కళాశాలలో పనిచేశారు. ఆయన తన తండ్రి స్మృత్యర్థం ఇంటర్ విద్యార్థి కోసం ఉపకార వేతనం ఏర్పరచారు. అటువంటి ఉపకార వేతనం సి.ఆర్. రావుకు లభించింది. తండ్రి నుంచి అధ్యయన గుణం, తల్లినుంచి కష్టపడే తత్వం సి.ఆర్. రావుకు లభించాయి. చదువు, ఆటలు, నిద్ర, భోజనం – అన్నీ వేళప్రకారం జరగాలి. ఇది తల్లి నుంచి వచ్చిన క్రమశిక్షణ. తల్లి ప్రభావం రావుగారిమీద విశేషంగా ఉండింది. చదువుకున్న కోడలు కావాలని, అన్వేషించి ఎం.ఎ.బి.టి. చదివిన భార్గవీరావును ఎంపిక చేసింది ఆయన తల్లి లక్ష్మీకాంతమ్మగారే! సి.ఆర్. రావుగారి పరిశోధన సవ్యంగా జరగడానికి ఎంతో సహకరించిన ఆదర్శ సతీమణి భార్గవీరావు! లేకపోతే ఆవిడ పరిశోధన కోసం 1500 రూపాయల జీతాన్ని వదలి 300 జీతంలోనే ఎలా సరిపెట్టుకోగలరు? అలాగే 2010లో ఒక కోటి రూపాయల మూలధనంతో ప్రారంభమయిన 'సంఖ్య' మ్యూజియం నిర్మాణంలో పాతిక లక్షలు భార్గవీరావుగారివే.

పి.సి. మహల్నాబీస్ భౌతికశాస్త్రం అధ్యయనం చేసి గణాంక శాస్త్రంలో అడుగిడితే, సి.ఆర్. రావు గణితం అధ్యయనం చేసి గణాంక శాస్త్రంలో ప్రవేశించారు. అయితే గణాంక శాస్త్రంలో ప్రవేశించడంలో ఇద్దరికీ పోలిక ఉంది. ఇద్దరూ ఉద్దేశించి అందులో కాలు పెట్టలేదు. రెండో ప్రపంచ యుద్ధ (1940) కాలమది. ఐసిఎస్ చదవాలని ఆశిస్తే ఏడాదిన్నర వయసు చాలకొచ్చింది. ఏదైనా ఉద్యోగం చేయాలని (ఎం.ఎ. మాథ్స్తో) విశాఖపట్నం నుంచి కలకత్తా బయలుదేరాడు రాధాకృష్ణుడు. కలకత్తా ఆర్మీ సర్వే యూనిట్లో గణిత శాస్త్రవేత్త ఉద్యోగం కోసం ప్రయత్నించగా అక్కడా వయసు చాలదన్నారు. ఒక మిత్రుడి సలహా మీద కలకత్తాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్ స్టిట్యూట్లో ఏడాది కోర్సులో చేరారు. అప్పటికి అటువంటి కోర్సు ప్రపంచంలో ఎక్కడా లేదు. ఇది పి.సి. మహల్నా బీస్ అప్పుడే ప్రారంభించిన కోర్సు. రాధాకృష్ణారావు అలా ఆ కోర్సు తొలి బ్యాచ్లో చేరారు. అలా కాకతాళీయంగా ప్రవేశించిన రాధాకృష్ణరావు గణాంక శాస్త్రంలో అమోఘమైన కృషి చేశారు. 'ఫేసెస్ ఆఫ్ సైన్స్' పేరుతో అమెరికాలో ఒక పుస్తకం ప్రచురించారు. గత శతాబ్దంలో గొప్ప కృషి చేసిన 70 మంది శాస్త్రవేత్తల

ఫోటోలు, వివరాలు అందులో ఉన్నాయి. ఈ 70 మందిలో సి.ఆర్. రావు ఒకరు కావడం చాలా గొప్ప విషయం.

1988లో టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక టాప్ టెన్ ఇండియన్ శాస్త్రవేత్తలని ఒక జాబితా ప్రచురించగా అందులో జగదీశ్ చంద్రబోస్, శ్రీనివాస రామానుజం, సి.వి. రామన్, సత్యేంద్రనాథ్ బోస్, సలీం అలీ, సుబ్రమణ్యం చంద్రశేఖర్, హర గోవింద ఖొరానా, జి.ఎన్. బాలసుబ్రమణియన్ వంటి శాస్త్రవేత్తల సరసన సి.ఆర్. రావు పేరు ఉండటం విశేషం. అయితే జరిగిన కృషి అంతా ఆయన పరిశ్రమ, ప్రతిభ, పట్టుదల మీద ఆధారపడి ఉంది. అంతకుమించి ప్రణాళిక కూడా కీలక పాత్ర వహించింది. గణిత శాస్త్రంలో ఉన్న అభిరుచినిబట్టి ఇంజనీరింగ్‌లో చేరాలని రాధాకృష్ణ ఆశించారు. అయితే రీసెర్చిలో కుమారుడు రాణిస్తాడని గమనించిన తండ్రి గణితంవైపు దృష్టి పెట్టమన్నారు. అలా బి.ఎ. (ఆనర్స్), ఎం.ఎ. (మ్యాథ్స్)ను పూర్తి చేశారు సి.ఆర్. రావు. ఎం.ఎ.లో సి.ఆర్. రావుకు ఆంధ్ర యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్‌తో పాటు, బంగారు పతకం లభించింది. అతనికి అప్పుడు వచ్చినన్ని మార్కులు ఇంతవరకు మరెవరికీ రాలేదని డా. సి.ఆర్. రావు నేటికీ ఆనందంగా చెబుతారు. పరిశోధనవైపు దృష్టిపెట్టుకున్న తండ్రి సూచన, స్టాటిస్టిక్స్ కోర్సు చేయమన్న మిత్రుడి భావన, పి.సి. మహల్నాబీస్ గురుత్వం లభించడం, సి.ఆర్. రావు ప్రతిభకు, పట్టుదలకు తోడు కావడం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్ స్టిట్యూట్‌లో కోర్సు చేసిన తర్వాత అక్కడే ఉద్యోగంలో చేరారు. ఈ సంస్థలో అభివృద్ధి చేసిన మెథడాలజీకి సంబంధించిన కేంబ్రిడ్జ్ నుంచి ఆహ్వానం లభించింది. అక్కడే పిహెచ్.డి.తో పాటు డాక్టర్ ఆఫ్ సైన్స్ పట్టాను ప్రదానం చేసింది. అక్కడే ఆర్.ఏ. ఫిషర్ దగ్గర పరిశోధన చేశారు. పిట్స్ బర్గ్‌లో 1979లో అధ్యాపకులుగా చేరి సేవలందించారు. 1988లో పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీకి ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా వెళ్ళారు. డా. సి.ఆర్. రావు గణాంక శాస్త్రంలో గణనీయమైన, మౌలికమైన కృషి చేశారు. పరిశ్రమలలో తయారయ్యే ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించి పెంచడానికి ఆయన 'ఆర్థోగ్నల్ అరేస్' (Orthogonal Arrays) ఆవిష్కరించారు. భారతదేశం ఆగ్నేయాసియా దేశాలలో పరిశోధన మెరుగు కోసం కృషి చేశారు. 14 పుస్తకాలు, 350 పరిశోధనా పత్రాలు, 32 గౌరవ డాక్టరేట్లుగల సి.ఆర్. రావు గణాంక శాస్త్రం దేశ రక్షణ నుంచి సామాన్యుల దిననరి వ్యవహారందాకా తోడ్పడుతుందని అంటారు. స్విట్జర్‌లాండ్‌లో దొంగనోట్లు కనుక్కోవడానికి, అమెరికాలో వైద్యశాలల్లో జరిగే పొరపాట్లు గుర్తించడానికి గణాంకశాస్త్రం వాడతారని ఆయన మనకు చెబుతారు. అంతేకాదు షేక్స్ స్పియర్ రచనలలో ఏది అనలో, ఏది నకిలీదో తెలుసుకోవడానికి గణాంకశాస్త్రం దోహదపడుతుందని ఆయన అంటారు. డాక్టర్ సి.ఆర్. రావుకి మాతృదేశమన్నా, మాతృభాషన్నా చాలా అభిమానం. చైనా యుద్ధకాలంలో శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు కింద పదివేల రూపాయలను ప్రధాని నెహ్రూ ఆయనకు అందజేశారు. రక్షణ నిధికి ఆ మొత్తాన్ని అదే వేదిక మీద ప్రధాని నెహ్రూకే ఆయన తిరిగి ఇచ్చేశారు. డా సి.ఆర్. రావు తన తల్లిదండ్రుల పేరు మీద ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. స్టాటిస్టిక్స్ విద్యార్థికి బంగారు పతకం ఇస్తున్నారు. రావుగారికి తెలుగు అంటే చాలా ఇష్టం. హైస్కూలులో తెలుగులో ఎక్కువ మార్కులు వచ్చినందుకు వేటూరి ప్రభాకరశాస్త్రి రచించిన 'చాటుపద్య మణిమంజరి' బహుమతిగా లభించింది. అందులో ప్రతి అక్షరం ఆయనకు గుర్తు. తన పరిశోధనల నిమిత్తం ఎన్ని దేశాలు తిరిగినా, సొంత రాష్ట్రంలోకి రాగానే ఆయా తెలుగులోనే మాట్లాడతారు. తెలుగు అంటే అంత ఇష్టం!

ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో పరిశోధకులు భారతదేశంలో ఉండేవారు. ఇపుడు ఆ సంఖ్య బాగా తగ్గిపోయింది. కారణం సరైన పరిశోధన లేకపోవడమేనని రావుగారి భావన. యువతలో, విద్యార్థుల్లో పరిశోధనపట్ల ఆసక్తి ప్రేరేపించాలని డాక్టర్ సి.ఆర్. రావు ఇపుడు 'సంఖ్య' సంస్థను నెలకొల్పారు. రాధాకృష్ణరావుకి గణాంక శాస్త్రం మాత్రమే కాదు, బ్యాడ్మింటన్, ఫోటోగ్రఫీ అంటే కూడా చాలా ఇష్టం! ప్రపంచం గర్వించదగ్గ గొప్ప తెలుగు వ్యక్తి, శాస్త్రవేత్త డాక్టర్ సి.ఆర్. రావు!

డా. నాగసూరి వేణుగోపాల్ - ఫోన్: 944 073 2392.

జంట గ్రామాలు

(క్రైఫేయత్)

– గార రంగనాథం

శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలంలోని మందరాడ, కాకరాపల్లి జంట గ్రామాలు. బయట ప్రాంతాలవారికి విభజన రేఖ తెలియని ఊళ్ళవి. అక్కడ కళాసాంస్కృతిక రంగాలు, సామాజిక బంధాలు, బంధుత్వాలు అన్నీ విడదీయరానివిగానే ఉంటాయి. పూర్వం మందరాడ దేవాంగుల వీధిలోనే ఎలిమెంటరీ స్కూలు ఉండేది. దాని వెనక వాయవ్యహద్దున సుమారు మూడడుగుల ఎత్తుతో లావుపాటి నలుచదరపు రాయి ఉండేది. రెండు గ్రామాల సరిహద్దు రాయి అది. ఉత్తరకు కాకరాపల్లి, దక్షిణాన మందరాడ. ఈ గ్రామాలకు పడమటి అంచు నుండి రాజాం పొందూరు రోడ్డు నిర్మిస్తే, తూర్పున అర్ధచంద్రాకారంగా నారాయణపురం కాలువ పొలాలను సస్యశ్యామలం చేస్తుంది. ఉత్తరాన కాకరాపల్లి బి.సి. కాలనీ నిర్మించగా, దక్షిణాన మందరాడ పెద్దచెఱువు పంట పొలాలు కనువిందు చేస్తుంటాయి. ఒక పెద్ద గ్రామంలోలాగానే వ్యవసాయంలో, చేనేతవంటి వృత్తులలో ఇరు గ్రామాల ప్రజలూ పరస్పరం సహకరించుకొంటారు. ఉదయ సాయంత్రాలు, ఖాళీ సమయాల్లో రోడ్డుమీదే కలుసుకుంటారు. కష్టసుఖాలు కలబోసుకుంటారు. కాకరాపల్లి మొఖాసా గ్రామమైతే, మందరాడ బొబ్బిలి సంస్థానంలోని ఒక స్వయంపోషక గ్రామం.

సంతకవిటి మండలానికి తూర్పు హద్దు నాగావళి నది. ఈ మండలంలోని సిరివరం, తాళాడ, వాసుదేవపట్నంలలో శాసనాలు దొరకాయి. వీటితోపాటు మంతెనలో శిలావిగ్రహాలు ఉన్నాయి. అంటే వెయ్యేళ్ళ క్రిందట ఇవి ప్రధానమైన గ్రామాలు. ఈ గ్రామాల మధ్యనే దళితులు ఆవుల మందలు కాసుకుంటూ ఉండవచ్చు. మందలు ఆడ అనే అర్థంలో ఆ ఊరికి మందరాడ అని, అక్కడి దళితులకు మందరాడవారని పేరు స్థిరపడిపోయింది. ఇప్పటికీ ఈ గ్రామ దళితులలో ఆ ఇంటి పేరిటవారే ఎక్కువ. అశోకుని కాలంలోను ఆ తరువాత కూడ కళింగంలో దళితులు, గిరిజనులు తదితర బహుజనులే అధికంగా ఉండేవారు. కళింగంలో అడుగు పెడితే అగ్రవర్ణాలవారు రెండు రకాల ప్రాయశ్చిత్తం చేసుకొనేవారు. స్వతంత్రం వచ్చిన తరువాత కూడా దళితులను ముట్టుకుంటే ఇంటికి చేరగానే స్నానం చేసేవారు. ప్రతాపరుద్ర గజపతి గిరిజనులను కొండలమీదికి తరిమేశాడని చరిత్రలో ఉంది.

కాపులు ఈ ప్రాంతానికి తరువాతి కాలంలో చేరుకొని బీడుభూముల్ని అభివృద్ధి చేసి రైతులుగా స్థిరపడి ఉంటారు. ఈ రెండు గ్రామాలతోపాటు ఈ ప్రాంతంలో కాపులే అధికం. వారిలో వావిలపల్లివారు వంగర మండలం నూకలాడ నుండి వచ్చారు. ఈ రెండు గ్రామాలలో ఆ ఇంటిపేరువారే ఎక్కువ.

రెండు గ్రామాలలో సంఖ్యాపరంగా కాపుల తరువాతి స్థానం దేవాంగులది. మందరాడలో రెండు, కాకరాపల్లిలో ఒకటి మొత్తం మూడు దేవాంగుల వీధులున్నాయి. మందరాడలో ఒక దేవాంగుల వీధిని కస్పా వీధి అంటారు. కస్పా అంటేనే ప్రధానమైన, బజారువీధి అని. బజారు కనుకనే ఈ వీధి ప్రారంభంలో కోమట్లు ఉన్నారు. దేవాంగులు కలకత్తాలో బ్రిటిషువారి దగ్గర మందుగుండు కట్టడం, పేల్చడం నేర్చుకున్నారు. ఆయా రాజుల

కోరికమేరకు ఆయా ప్రాంతాలకు వెళ్ళి మందుగుండు తయారీ, పేల్చడం చేసేవారు. బొబ్బిలి రాజుల పిలుపుమేరకు వారు ఈ ప్రాంతానికి వచ్చారు. సేనకు వారే ముఖ్యులు కనుక సేనాపతులయ్యారు. అందుచేతనే వీరిని ఇప్పటికీ శనాపతులని పిలుస్తారు. ప్రస్తుతం దేవాంగుల వృత్తి చేనేత. స్వాతంత్ర్యోద్యమ కాలంలో వీరు నేసిన బట్టలే ధరించడం, అనంతర కాలంలో చేనేత సహకార సంఘాలు బాగా పనిచేయడం కారణాలుగా వీరి చేతిలో డబ్బులు గలగలలాడేవి. సంక్రాంతి ముందర కొన్ని నెలలపాటు మగ్గాలు రాత్రింబవళ్ళు టకటక శబ్దించేవి. వీరు శైవులు. విబూధి, లింగ ధారణ, శవాల్ని ఖననం చేయడంవంటి శైవాచారాలు పాటిస్తారు. రెండు గ్రామాలలోని దేవాంగులు ఉమ్మడిగా శివాలయం కట్టించి ఉంటారని నమ్ముతారు. ముందుగా మందరాడ తరువాత కాకరాపల్లి ఏర్పడి ఉండవచ్చు.

తొలుత కాకరాపల్లి మొఖాసా గురించి. మొఖాసా అంటే ముస్లిం నవాబులు తమ విశ్వాసాన్ని చూరగొన్న వ్యక్తులకు సర్వహక్కులతో ఇచ్చిన గ్రామం. పన్నులు వసూలుచేసి అనుభవించి, అన్ని అధికారాలూ కలిగి మొఖాసాదారు ఉండేవాడు. అగ్రహారానికి బ్రాహ్మణ యజమానిలా మొఖాసాదారే గ్రామానికి రాజ్యాధికారి.

1655లో శ్రీకాకుళానికి ఫౌజుదారుగా ఉన్న షేర్ మహమ్మద్ ఖాన్ బొబ్బిలి, విజయనగరం సంస్థానాల ఏర్పాటుకు ఆయా వంశాలవారికి అనుమతి ఇచ్చాడు. ఆ సమయంలోనే తన అనుయాయులకు కొన్ని గ్రామాలను మొఖాసాలుగా ఇచ్చినట్టు చరిత్ర ఉంది. అలాంటిదే కాకరాపల్లి.

బొబ్బిలి రాజులు రాకముందు కాపులు మాత్రమే ఉన్న గ్రామం కాకరాపల్లి. మొఖాసా హక్కులు వచ్చిన తరువాత కాపులకు పడమర దిక్కున మొఖాసా దారులు ఇల్లు కట్టుకున్నారు. ఉత్తరాన కళ్ళం, ఇంకా ముందుకు వెళితే తోట ఏర్పాటు చేసుకున్నారు. కళ్ళానికి తూర్పున మాదిగ వీధి. వారిని సాయిబులు తమ ఆహార అవసరాల కోసం తెప్పించి ఉంటారు. ఆ తరువాత బ్రిటిషువారి పాలనలో దేవాంగులను రప్పించి, వారికి తమ ఇంటికి పడమరన ఒక వీధి ఏర్పాటు చేశారు. 50 ఏళ్ళ క్రిందటికే పశ్చిమాన రోడ్డువరకూ కాకరాపల్లి వ్యాపించింది.

ఇక సాయిబుల ఇల్లు. ఈ ప్రాంతంలో ఎక్కడా లేనంత పెద్ద లోగిలితో, ఎత్తైన ప్రహరీతో ఉంటుంది. దానికి మూడు వైపులా గోర్జి, దక్షిణ దిక్కున చిన్న సందు మార్గం హద్దులు. ఉత్తరాన సింహద్వారం దాటి లోనికి వెళితే ఓ పెద్ద గాదె ఉండేది. దాని వెనుక దక్షిణాన నివాసగృహం, తూర్పున కొన్ని గదులు నిర్మించారు. దక్షిణానిది పూరిల్లు కాగా తూర్పుది పెంకుటిల్లు. వాటి ముందర విశాలమైన అరుగులు, ప్రధాన గ్రామం ఉంటుంది. లోపల పడమర దిక్కున పెద్ద పశువుల సాల. అందులోనే ఆ కాలంలోనే ఓ మరుగుదొడ్డి. పడమటి గోర్జి నుండి వెళ్ళేవారికి దాని వెనుక క్రింది భాగం కనిపించేది. ఈ వైపునుండి మనుషులు శుభ్రం చేస్తారు కదా అనుకొనేవాళ్ళం. దక్షిణ వాసలో పడమటి ప్రక్కనున్న ఇంటిని వారు నివాసానికి ఉంచుకొని, మిగిలిన ఇళ్ళను అద్దెకి ఇచ్చేవారు. తూర్పు ఆగ్నేయంగా ఉన్న ఇంటిని వారణాసి ఆదెయ్య అనే కోమటికి ఇచ్చారు. ఇప్పటికీ ఆ కుటుంబం ఆ ఇంటిలోనే ఉంది. ప్రస్తుతం వారే మొత్తం ఇంటిని కొనుక్కున్నారు. ఆగ్నేయ, ఈశాన్య మూలల్లోని ఇళ్ళలో ఉపాధ్యాయులు అద్దెకుండేవారు. గత శతాబ్దం ఆరవ దశకంలో ధర్మాచారి అనే ఉపాధ్యాయుడు ఆగ్నేయ గృహంలో ఒక్కరే ఉండేవారు. తొమ్మిదవ తరగతి చదువుతున్న రోజుల్లో వంకల అప్పలనాయుడు, ఈ వ్యాస రచయిత రాత్రిపూట అతని దగ్గరకు వెళ్ళి, ఆ గాదె ముందర దీపం బుడ్డీలు పెట్టుకొని చదువుకొని, చాపలు పరుచుకొని పడుకొనేవారు. దక్షిణ తూర్పు ఇళ్ళకు మధ్యగుండా ఆగ్నేయంలో తూర్పున మరోద్వారం ఉంది.

స్వాతంత్ర్యానికి ముందరే సాయిబులు తమ మొఖాసా భూముల్ని సంతకవిటి పొట్నూరువారికి, లైదాం గొర్లెవారికి తాకట్టు పెట్టి విజయనగరంలో ఆస్తుల్ని అభివృద్ధి చేసుకున్నట్టు తెలుస్తోంది. సాయిబులు 15 ఎకరాల పల్లం భూమి తమవద్ద ఉంచుకొని, వ్యవసాయం చేయించుకుంటూ ఆ ఊరి వారితోపాటు ఓ రైతు కుటుంబంలా గతశతాబ్ది ఆరవ దశకంవరకూ బ్రతికారు. ఏడవ దశకంలో విజయనగరం నుండి అప్పుడప్పుడూ వస్తూ

కొన్నాళ్ళుండి, పొలాలతోపాటు తోట, కళ్ళం, ఇల్లు అమ్ముకొని పూర్తిగా అక్కడికే చేరిపోయారు. ఎప్పుడూ ఈ గ్రామంలో తమ మతవ్యాప్తికి ప్రయత్నించలేదు. ఇప్పటికీ సాయిబులు మా మిత్రులని చెప్పుకొనేవాళ్ళు కాకరాపల్లిలో కొందరున్నారు. సయ్యద్, సాబ్జన్, హుస్సేన్, ప్యారీ ఆ వంశీయుల చివరి తరం. వారి తండ్రి సయ్యద్ మదీనా సాహెబ్. వారి పూర్వులు మీరా సాహెబ్, ముత్యా సాహెబ్, కాలాసాహెబ్ అని పెద్దలు చెబుతుంటారు.

ఆ మొఖాసా గ్రామంలో 402 ఎకరాల పల్లం, 15 ఎకరాల మెట్టు ఉండేది. 128 మంది రైతులు దున్నేవారు. కళ్ళాలలోనే తనఖాదారులు ధాన్యం కొలుచుకొని పట్టుకు పోయేవారు. పంట అంతా పన్నులకే సరిపోయేది. వంద గరిసెల ధాన్యం పట్టుకుపోయేవారు. రైతులు శాపగ్రస్తులుగా ఉండేవారని ఇప్పటికీ ఆ గ్రామంలోని వృద్ధులు చెబుతుంటారు. మొఖాసాదారులు వ్యవసాయానికి తగినన్ని చెఱువులు, నూతులు, తోటలు అభివృద్ధి చేయకపోవడం, తన ఖాదారులకు వనరుల అభివృద్ధి బాధ్యత లేకపోడంతో వ్యవసాయం కష్టమయ్యేది. ఆ కారణంగా రైతులతోపాటు ప్రజలు కూడా మందరాడ మీద ఎక్కువగా ఆధారపడి ఉండేవారు. శివాలయం, త్రినాథుల ఆలయం మందరాడలోనే ఉన్నాయి. మందరాడకు చెందిన పులఖండంవారే శతాబ్దాలుగా కాకరాపల్లికి పురోహితులు.

వందేళ్ళ క్రిందట బొబ్బిలి నుండి ఓ ఆంగ్లేయుడు మాదిగవీధి ముందర సి.బి.ఎమ్. చర్చి ప్రారంభించాడు. కాకరాపల్లి, సాలీపేట, జావాం, సోమరాజు పేట గ్రామాల భక్తులు అక్కడికి చేరేవారు. మరో పదేళ్ళకు అదే పురిపాకలో సి.బి.ఎమ్. ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాల ఏర్పాటు అయ్యింది. ఆరు రోజులపాటు ఉపాధ్యాయుడు పాఠాలు చెప్పేవాడు. ఆదివారం అందులోనే పాష్టరుగా వాక్యాలు చదివేవాడు. 1960 ప్రాంతంలో రోడ్డుప్రక్కన విశాలమైన స్థలంకొని పక్కా చర్చిని, పాష్టరు నివాసాన్ని నిర్మించారు. స్థానికులు మాదిగ బడిగా పిలిచే ఈ పాఠశాల ఇటీవల విద్యార్థుల సంఖ్య తగ్గిన కారణంగా ఎత్తేశారు. ఈ వీధికి చెందిన కరిమెరకల డేవిడ్ అనే వ్యక్తి డప్పుమీద సప్త తాళాలు పలికించేవాడని ప్రతీతి. చర్చి ప్రక్కనే లావేటి అప్పారావు ఆయిల్‌తో నడిచే ధాన్యం మిల్లును ఆ రోజుల్లోనే ఏర్పాటు చేశాడు. నాలుగైదు గ్రామాల మహిళలకు ధాన్యం దంపు బాధను తప్పించాడు. ఇంకా ఈ గ్రామంలో మందరాడలో లేని గొడగల, శిష్టకరణం, జంగమ, తెలుకలి, సెగిడి కులాలు ఉన్నాయి. దేవాంగులలో ఆ రోజుల్లో దాసరి సత్యనారాయణను ప్రముఖుడిగా చెప్పుకొనేవారు. ఇదే వీధిలో రామలింగేశ్వర చేనేత సహకార సంఘం ఉండేది. తరువాత గ్రామానికొకటిగా విడిపోయింది. ఇవి రెండు గ్రామాలలోను సాంస్కృతిక కార్యక్రమాలకు సహకరించేవి.

కాకరాపల్లికి బండారువారు నాయకులు. వారిలో బండారు రామినాయుడు 1937లో ప్రజల సహకారంతో ఊరి మధ్యన రామాలయం కట్టించారు. 1948లో దానిని పునర్నిర్మాణం చేయించి అభివృద్ధి చేశారు. సిరిపురం నుండి మురపాకవారిని అర్చకత్వం కోసం తెప్పించి వారికి రెండు ఇళ్ళు కట్టించి ఇచ్చారు. నవమి ఉత్సవాలు బాగా జరిపేవారు. నేటికీ గ్రామ రాజకీయాల్లో వారు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ కోవెల అభివృద్ధిలో సాయిబులు కూడా బండారువారికి సహకారం అందించారు.

ఇంతలో 1948లో జమీందారీల రద్దు చట్టం దేశంలో పెను మార్పులు తీసుకొని వచ్చింది. దున్నేవాడిదే భూమి అని కాంగ్రెసు ప్రభుత్వం చట్టం తెచ్చింది. భూములు తాకట్టులో ఉన్నందున మొఖాసాదారులు తటస్థులైపోయారు. తమకు తనఖా హక్కులున్నాయి కనుక భూములు తమవేనని సంతకవిటి నుండి పొట్నూరు చిన్నప్పల నరసింహులు, సూర్యనారాయణ, అప్పన్న, లైదాంకు చెందిన గొర్లె రామచంద్రినాయుడు, లక్ష్మున్నాయుడు, తరతరాలుగా మేమే పండించి ఇస్తున్నాం కనుక హక్కులు మావేనని వావిలపల్లి పాపినాయుడు పేరున రైతులు కోర్టుకెక్కారు. మునసబు గెడ్డాపు రామినాయుడు, కరణం బలివాడ సూర్యం రైతులకు సహకరించారు. బండారు రామినాయుడు, గెడ్డాపు ఎర్రంనాయుడు నాయకత్వం వహించారు. రైతులు కేసు గెలుచుకోగా ప్రభుత్వం సర్వే చేయించి ఎవరు దున్నిన భూమిని వారికి పట్టాలుగా ఇచ్చింది. ఈ రైతులకు 1963లో వచ్చిన నారాయణపురం

కాలువ మరొక వరం. అన్ని పొలాలకు ఒక పంటకు ఖచ్చితంగా నీటిని అందిస్తున్నది.

వావిలపల్లి వంశానికి చెందిన వ్యక్తి సాయుబుల దివాణంలో రెవెన్యూ వ్యవహారాలు చూసేవాడు. తమ యజమానులు సంతోషిస్తారనో ఏమో సాయిబులవలె గెడ్డాం పెంచుకొని ఉండేవాడు. అందరూ గెడ్డాపోడు, గెడ్డపోడు అని పిలవడం ప్రారంభించారు. అది మొదలుగా అతడి వంశం గెడ్డాపు (గెడ్డపు) వంశంగా స్థిరపడిపోయింది. మొఖాసాదారుల నాటి నుండి మున్సబు, కరణాల వ్యవస్థ అంతరించినంతవరకూ కాకరాపల్లికి గెడ్డాపువారే మున్సబులు.

ఈ ఊరికి చెందిన గెడ్డాపు సత్యం గొప్ప సాహితీవేత్తగా కీర్తిగాంచారు. మందరాడ, సంతకవిటి పాఠశాలలలో ఎనిమిదవ తరగతివరకు చదువుకొని, హయ్యర్ గ్రేడ్ ట్రైనింగ్ పూర్తి చేసుకొని ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాల చిన్నయ్యపేటలో ఉపాధ్యాయుడుగా పనిచేశారు. ఉద్యోగిస్తూనే స్వయం కృషితో తెలుగుతో ఎం.ఎ.; చదివారు. అంచెలంచెలుగా డిగ్రీ కళాశాల ఉపన్యాసకునిగా ఎదిగి శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాలలో ఉద్యోగ విరమణ చేశారు. వీరి సాహిత్య గురువు సిరిపురానికి చెందిన ఉరిటి సూర్యనారాయణ. జైత్రయాత్ర, మృత్యుంజయుడు, ప్రసన్నధర్మం అనే మూడింటిని పద్యరచనకు పరాకాష్ట అయిన ప్రబంధాలుగా గెడ్డాపు సత్యం రాశారు. శివకేశవం, కవితా వైజయంతి గ్రంథాలను రచించారు. త్రివేణి, **మిసిమి** పత్రికలలో ఆయన వ్యాసాలు అచ్చయ్యేవి. కోటప్ప కొండపైగల శివునికి త్రికోటేశ్వర సుప్రభాతం రాయగా దేవస్థానంవారు దానిని గాయకుడు మనోచేత పాడించి భక్తులకు అందుబాటులో ఉంచారు. ఆమదాలవలసలో విశ్వసాహితి అనే సాహిత్య సంస్థను స్థాపించి అధ్యక్షుడిగా ఎంతోమంది రచయితలను తయారు చేశారు. నేటికీ ఇదే ఊరికి చెందిన మాజీ సర్పంచ్, 85 ఏళ్ళరైతు వావిలపల్లి అప్పలరాము అమరాంధ్రాలు అనర్గళంగా చదవగలరు.

మొఖాసాలో రైతుల జీవితాలు దుర్భరంగా ఉండేవని చెప్పుకున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో కాటన్ దొర ధవళేశ్వరం బ్యారేజి పూర్తి చేశారని, కాలువల్లోని నీరు పొలాలకు వెళ్ళేందుకు వీలుగా భూముల్ని చదును చేసి మడులుగా కట్టడానికి వేలాది వ్యవసాయ కార్మికులు అవసరం ఉందని తెలిసి వీరిలో ఒక కుటుంబం రైలు పట్టాల వెంబడి నడిచి వెళ్ళింది. వారు పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరు మండలం రాచూరు చేరి వ్యవసాయ కార్మికులుగా స్థిరపడి అంచెలంచెలుగా ఉన్నత స్థానాలను అందుకున్నారు. గెడ్డాపు అప్పలస్వామి జూనియర్ లెక్చరర్‌గాను, వారి సోదరుడు రాములు సివిల్ ఇంజనీర్‌గాను పని చేశారు. వారిలో పెద్ద సోదరుని కుమారుడు గెడ్డాపు సూర్యనారాయణ ఫిజిక్స్ లెక్చరరుగా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీకాకుళంలోనే వందలాదిమంది విద్యార్థులను తయారు చేశారు.

ఇక మందరాడ. ఈ గ్రామ చరిత్రను స్వతంత్రానికి ముందర తరువాత అని విడదీయవచ్చు. వావిలపల్లి జగన్నాథనాయుడు 1946లో మరణించారు. ప్రాణమున్నంతవరకు మందరాడకు ఆయనే యజమాని. పెద్ద భూస్వామి. ప్రజల్ని ఏకతాటిపై నడిపించగలిగేవాడు. ఈయన కవి పండితులను పోషించేవాడు. వివిధ ప్రాంతాల పండితులకు, కళాకారులకు వార్షికాలు ఇచ్చేవాడు. జగన్నాథనాయుడు రాత్రిపూట తన ఇంటి ఎత్తు అరుగుల మీద పురాణం చెప్పించేవాడు.

ఆ రోజుల్లో ఈయన యాజమాన్యానికి చెందిన ఒక సంఘటన చెప్పుకుంటారు. కాకరాపల్లి గొడగలివారి ఇళ్ళను ఆనుకొని రెల్లి కుటుంబాలు కొన్ని జీవిస్తుండేవి. వారు దొంగతనాలు చేసేవారు. జగన్నాథనాయుడే దొంగతనాలు చేయిస్తున్నాడని, దొంగ సొత్తులో అతనికి వాటా అందుతోందని ఓ దుష్ప్రచారం ప్రారంభమైంది. నాయుడు ఆ అపప్రథను తట్టుకోలేక వారిలో మగవారిని ప్రతి రోజూ పురాణం పూర్తి అయినంతవరకూ వినమని ఆదేశించారు. వారు పురాణానికి వచ్చి ప్రతిరోజూ హాజరు వేయించుకొనేవారు. అప్పటికీ ఒకరిద్దరు దొంగతనంగా జారి వెళిపోయేవారు. ఇలా ఉండగా ఒక వేసవిలో వారు వెనుదిరిగి పోతూ, వీధిలో మంచం మీద పడుకున్న ఒక స్త్రీ ముక్కునగల బంగారు కమ్మిని వారిలో ఒకడు తెంపేశాడు. ఆమె కేకలువేసి వెంటపడింది. ఊరివారందరూ లేచి వారిని వారి ఇళ్ళవరకూ తరిమారు.

"ఇప్పుడే ఈ ఊరు వదలి ఎటైనా పొండి" అని హుకుం జారీ చేశారు. దాంతో చేసేది లేక రెల్లివారు తమ సామానులు పట్టుకొని, భార్యాపిల్లలతో సమీపంలోని నీలచెఱువు గట్టుమీదికి చేరిపోయారు. జగన్నాథనాయుడు ఉత్తర్వులమేరకు వారి గుడినెలను గ్రామస్థులు కాల్చేశారు. తెల్లారిన తరువాత వారు సమీపంలోని తాళాడ గ్రామం చేరిపోయారు. ఇప్పటికీ తాళాడలో వారి వారసులు నివసిస్తున్నారు. జగన్నాధనాయుడి అధికారం అంతలా ఉండేది.

1932లో అతనికి వుట్టిన కుమారుడు వేణుగోపాలనాయుడు అతని తరువాత గ్రామానికి యజమాని అయ్యాడు. పంచాయతీ పాలనలో గ్రామస్థాయి నుండి సంతకవిటి నాన్ బ్లాక్ రిప్రజంటేటివ్‌గా 1960లో ఎన్నుకోబడ్డాడు. సుమారు 40 మందిలో హెచ్చుమంది కాపు సర్పంచ్‌లు కావడంతో నల్లాన కృష్ణంనాయుడు మీద వేణుగోపాలనాయుడును గెలిపించారు. శ్రీకాకుళం జిల్లా బోర్డ్ ఛైర్మన్‌గా బెండి కూర్మన్న ఉన్నప్పుడు విద్యా శాఖ స్టాండింగ్ కమిటీకి వేణుగోపాలనాయుడు ఛైర్మన్ అయ్యాడు. ఆ అధికారంతోనే ఈ ప్రాంతానికే మొదటిదిగా 1960లో మందరాడకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సాధించారు. మందరాడతోపాటు కాకరాపల్లి తదితర గ్రామాల ప్రజల భూమిని ధనాన్ని సమకూర్చారు. ఈ యజ్ఞానికి అతని సోదరుడు చిరంజీవులు నాయుడు నాయకత్వం వహించాడు. తరువాత 1962లో సంతకవిటిలోను, 1964లో రాజాంలోను బ్లాక్ ప్రశిడెంట్‌గా పోటీ చేసినా రామచంద్రపురానికి చెందిన పండువారిపై గెలవలేకపోయాడు. నేటికీ గ్రామ నాయకత్వం వేణుగోపాలనాయుడు కుటుంబం చేతిలోనే ఉంది.

1962 మే నెలలో, సంతకవిటిలో జరిగిన ఎన్నికల సందర్భంగా ఓ దుస్సంఘటన చోటుచేసుకుంది. వేణుగోపాలనాయుడువైపు విపరీతమైన అభిమానంకల ప్రజలు ఎన్నికల్లో దౌర్జన్యం చేస్తారని భావించి, ప్రతిపక్షంవారు సి.ఆర్.సి బలగాలను కోరారు. సి.ఆర్.పి సంతకవిటిని అష్ట దిగ్బంధం చేసింది. గ్రామం చుట్టూ జనం చేరిపోయారు. లోనికి వదలమని గొడవ చేశారు. వదలకపోతే రాళ్ళు విసిరారు. కొంతమంది పోలీసులకు దెబ్బలు తగిలాయి. పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. గోడెక్కి గ్రామం లోపలికి తొంగిచూస్తున్న అక్కరాపల్లికి చెందిన ఒక వ్యక్తికి తూటా తగిలి నేలపైపడి మరణించాడు. తమ వ్యక్తి మరణించాడు కనుక ప్రజలు పోలీసులపై కోర్టుకెక్కాలి. జనం రాళ్లతో కొట్టి పోలీసులపై దాడి చేశారని పోలీసులే తిరిగి కేసు పెట్టారు. ప్రతిపక్ష ప్రేరణతో పరిస్థితిని రాజకీయ కోణంలోకి మార్చిన పోలీసులు అలగా జనాన్ని వదలి పరిసర గ్రామాలలో పలుకుబడి కలిగినవారు, ధనవంతులు, సర్పంచులు, గ్రామ ముస్సబులు, ఉపాధ్యాయులుగా గౌరవంగా బ్రతికినవారిని 40మందిని కోర్టుకీడ్చారు. ఇంతమందీ మూడు నాలుగేళ్ళు కోర్టులలో తిరిగిన తరువాత ఆధారాలు లేవని కేసుకొట్టేశారు. వీరిలో కొందరు కేసు పూర్తికాకుండానే చనిపోయారు. ఒకటి రెండు కుటుంబాలు తప్ప చాలా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. రాత్రిపూట ఆరుబయలు మంచాలమీద నిద్రిస్తున్నవారిని లేపి ప్రశ్నించేవారు. అప్పటి చిన్నారుల చెవుల్లో ప్రతిధ్వనించిన పోలీసుల బూట్ల చప్పుడు ఇప్పటికీ గింగిర్లాడుతుంటుంది. వారి వీపులమీది తుపాకులు ఇప్పటికీ భయపెడుతూనే ఉంటాయి. పోలీసులు పట్టుకుపోతారని అమాయకులైన ముద్దాయిలు రాత్రిపూట తోటల్లోను, చెరకు మళ్ళలోను, బంధువుల ఇళ్ళలోను దాక్కొనేవారు. ఈ సంఘటన తలచుకొంటే ఈనాటికీ పోలీసు వ్యవస్థ ఎంతటి క్రూరమైనదో అనిపిస్తుంది.

ఈ ఊరిలో వందేళ్ళ క్రిందటే వివిధ వృత్తులవారితో పాటు రైతు బిడ్డలు కూడా అమరాంద్రాలు, కావ్యాలు, పురాణాలు చదివి వాటిపై చర్చలు కొనసాగించేవారు. గత శతాబ్దం పూర్వార్ధంలోనే జగన్నాథ నాయుడు భార్య అప్పమ్మ నాయురాలు, వావిలపల్లి సోములమ్మ, గార సీతయ్యమ్మ తదితర కాపు మహిళలు శ్లోకాలకు అర్థాలు చెప్పగలిగేవారు.

నిరక్షరాస్యులు, సాధారణ రైతులు, అయిన దంపతులకు గార అప్పలనాయుడు 1907లో పుట్టాడు. ఊరిలోని పులఖండం జగన్నాథం అనే గురువువద్ద అమరాంద్రాలు, కావ్యాలు చదివి ఐదవతరగతి పాసై లోవర్ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్ అయ్యాడు. దానికోసం సోమవారం

ఉదయం అడ్డుత్రోవలో సుమారు ఏభై కిలోమీటర్లు నడిచి పార్వతీపురం వెళ్ళి, శనివారం సాయంత్రం వచ్చేవాడు. తన గురువు ఇచ్చిన గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలకు మేనేజరుగా, ప్రధానోపాధ్యాయుడుగా పనిచేశాడు. ఆ రోజుల్లో నెలకు ఐదు రూపాయల జీతం. సంవత్సరానికి అరవైరూపాయలు బ్రిటిషు ప్రభుత్వం చెక్కురూపంలో ఇచ్చేది. ఉద్యోగం మానేసి వ్యవసాయానికి తండ్రి తోడు రమ్మన్నా వెళ్ళలేదు. ఉపాధ్యాయ వృత్తి వదలలేదు. సంతకవిటి పోష్టుమాష్టరుగా కూడా రెండు పనులూ ఏకకాలంలో పనిచేశాడు. అనంతరకాలంలో అతని కుమారుడు సూర్యనారాయణ (సూర్యం) మందరాడలో గ్రామీణ పోష్టాఫీసు కోసం తీవ్ర ప్రయత్నాలు చేశాడు.

అప్పలనాయుడి మరో కుమారుడి పేరు శ్రీరామమూర్తి. ఈయన మందరాడ, సిరిపురంలలో మాధ్యమిక విద్యవరకు చదువుకొని, బొబ్బిలి, అనకాపల్లి, విశాఖపట్నంలలో డిగ్రీవరకు చదివారు. తండ్రి వద్ద తెలుగు భాషాసాహిత్యాలు అలవడ్డాయి. సిరిపురంలో సంతవురిటికి చెందిన ఉరిటి నరసింహమూర్తి ఇంగ్లీషు రుచి చూపించారు. ఎస్.ఎస్.ఎల్.సి. చదివేసరికే ఆంగ్లంలో వ్యాసాలు రాయగలిగేవారు. రాజాజీ రామాయణం చదివి తెలుగులో చెప్పేవారు. డిగ్రీ చదివిన తరువాత దక్షయజ్ఞం అనే పౌరాణిక పద్యనాటకం రాయగా మందరాడలో ప్రదర్శించారు. పద్మశ్రీ యడ్ల గోపాలరావు దక్షుడి పాత్ర పోషించారు. ఉద్యోగాన్వేషణలో పడి విశాఖ చేరుకొని చిన్నా చితకా పత్రికలకు ఎడిటర్‌గా చేసి *ఈనాడు* ప్రారంభ సబ్ ఎడిటర్‌గా చేరారు. అనంతరం *ఆంధ్రభూమి*, *ఆంధ్రజ్యోతి*, *వార్త*, *ఆంధ్రప్రభ* పత్రికలకు సబ్‌ఎడిటర్‌గా, అసిస్టెంట్ ఎడిటర్‌గా వ్యవహరించారు. *ఆంధ్రపత్రిక*, *ఆంధ్రప్రభ*లకు సంపాదక బాధ్యతలు నిర్వహించారు. *సూర్య* దినపత్రికకు ఎడిటోరియల్ ఎడ్వైజర్‌గా చేసి, ప్రస్తుతం అదే స్థాయిలో మన తెలంగాణ దినపత్రికకు సేవలందిస్తున్నారు. కళాశాలలోనే వార్షిక సంచికలకు రచనలు చేసిన శ్రీరామమూర్తి 'నిజం' పేరుతో కవితలు రాయడం ప్రారంభించారు. అప్పట్లో విరసం ద్వారా *నిజం గీతాలు*, *ఎర్ర మందారాలు* కవితా సంపుటులు వెలువడ్డాయి. ఏభైఏళ్ళ విరామం తరువాత ఇటీవల నివురు, నాలుగో పాదం, అలలు అనే మూడు కవితా సంపుటాలు వెలువడ్డాయి.

గతంలో భాగల్పూర్ జైల్లో ఖైదీలకు కళ్ళు పీకించిన సంఘటనకు స్పందించి ఈయన రాసిన 'కళ్ళు' దీర్ఘ కవిత ఓ సంచలనం సృష్టించింది. ఇతని వచన రచనా శైలికి, ఆధునిక భావాలకు మెచ్చి తాపీ ధర్మారావు వేదిక విజయవాడవారు 2014లో తాపీ ధర్మారావు పురస్కారం ఇచ్చారు.

మందరాడలో ఆనాడు సాహిత్యంతో పాటు కళాసాంస్కృతిక రంగాలు ఉచ్ఛస్థితిలో వెలిగేవి. బ్రాహ్మణులు, భట్రాజులు, సాతాని వైష్ణవులు, కూరాకులవారు కులానికి నాలుగైదు కుటుంబాలు వంతున జీవించేవారు. ఫ్లూట్ వాద్యకారుడు బద్రి మంగలి, వస్తాదు ధనుకోట నెయ్యలి, సీది నుండి దోర చిన్నబాబు భాగవతార్ తదితర కళాకారులు ఇక్కడికి వచ్చేవారు. గ్రామ దర్శనానికి వచ్చిన సంగీత విద్వాంసులు త్రినాథస్వామి మఠంలో కచేరీలు చేసేవారు. ఈ ఊరి భట్రాజులకు చెందిన కక్కుల అప్పారావుకు మృదంగ విద్వాంసుడిగా మంచి పేరుండేది. ముప్పైఅయిదు తాళాలను మృదంగంపై వాయించగల దిట్ట. చాలాచోట్ల వాద్య ప్రదర్శనలిస్తూ జీవించేవాడు. ఎంతటి సంగీత విద్వాంసుడినైనా తన ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసేవారు. అందుచేతనే అతడిని ఈ గ్రామస్థులు 'కక్కుల కళ్ళెం' అని గర్వంగా చెప్పుకొనేవారు. ఎంతోమంది శిష్యులను తయారు చేశాడు. ఓ మారుమూల ఉండిపోవడంవలనే ఆయనకు రావలసినంత పేరు రాలేదని ఇప్పటికీ గ్రామస్థులు చెప్పుకుంటారు. డప్పుపై సప్త తాళాలు పలికించగల డేవిడ్ ఈయన శిష్యుడే! కల్లుగీత వృత్తిగాగల యాత కులం ఈ ఊరిలో ఉంది.

పులఖండం కృష్ణమూర్తి ఆయుర్వేదంలో దిట్ట. మందులు తయారు చేయించి, గూడు బండిపై ప్రయాణించి ఆయా గ్రామాల పెద్దలకు వైద్యం అందించేవారు. ఆయన పశ్చిమగోదావరి జిల్లా జువ్వలపాలెంలోని రాజులకు వైద్యం చేయడం ఈ వ్యాసకర్తకు తెలుసు. ఆ రోజుల్లో నాడీ నిదానంలో ప్రవీణులు చాలమంది ఉండేవారు.

ఈ గ్రామంలో పాము కరిస్తే మంత్రంవేసి, మందు ఇచ్చి బ్రతికించేవారు. తేలుమందు, బెణుకు మంత్రం వేసేవారు.

పీసపాటి, పి. సూరిబాబు, కె. నాగేశ్వరరావు, లోలుగు ఆచారి వంటి ఉద్దండులైన పౌరాణిక నటులు ఈ ఊరిలో ప్రదర్శనలిచ్చారు. బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి, సంపత్ లక్ష్మణరావు తదితర ఆనాటి గొప్ప నటులు పద్మశ్రీ యడ్ల గోపాలరావు ఇంటికి వచ్చి రోజులతరబడి ఉండేవారు. గంగిరెద్దులవారు, నక్కజంగాలు, మందలోళ్ళు, ఈటీవారు, మల్లికార్జునులు, నక్కలోళ్ళు మొదలైన సంచారజాతులవారు వచ్చి నెలల తరబడి గ్రామంలో ఉండి వెళ్ళేవారు. మామిడిపల్లికి చెందిన ఇద్దరు సాయిబు సోదరుల ఇంద్రజాలం అబ్బుర పరచేది.

గార రామన్న పులివేషంలో ఖ్యాతిగడించగా, గార రామమూర్తి, కోడి సీతారాంతో ఆ కళ అంతరించింది. డప్పుపై తాళానికి అనుగుణంగా రామన్న పులి వేషంతో అడుగులు వేసేవారు. గౌరీకళ్యాణ ఉత్సవాలు ఘనంగా జరిపేవారు. ఆ ఉత్సవాలలో గ్రామస్థులు వేసే పగటి వేషాలను చూడ్డానికి పరిసర గ్రామాల ప్రజలు తండోప తండాలుగా వచ్చేవారు. వావిలపల్లి రామినాయుడు వేసిన బేతాళవేషం వీధిలోకి వస్తే పిల్లల్ని ఇంటిలో దాచేసేవారు. చూస్తే జ్వరాలు పెట్టుకొనేవారు. ఒక బృందం నాగినీ డ్యాన్స్ చేసేది.

వట్టం వీరభద్రదాసు గొప్ప హరికథకుడు కాగా రఘుమండల అప్పలనాయుడు, నల్లపాటి సీతారాం చివరి తరం కథకులు. గ్రామంతోని కళాకారులు బుఱ్ఱకథ, తూర్పు భాగవతం, జాలారి భాగవతం, పౌరాణిక, సాంఘిక నాటకాలు ప్రదర్శించేవారు. లంక సూర్యనారాయణ భజన పాటల రచయితగా ప్రసిద్ధుడు. ఈ రెండు గ్రామాలలో ఆరేడు భజన బృందాలు నాటినుండి నేటికీ కొనసాగుతున్నాయి.

స్వాతంత్ర్యానంతరం ఈ విధమైన కళాసాంస్కృతిక నేపథ్యంలోనే పుట్టి పెరిగిన వ్యక్తి యడ్ల గోపాలరావు. పాఠశాలలోనే సాంఘిక నాటకాలలో నటిస్తూ, నటనను, రంగస్థల ప్రదర్శనను అలవరచుకున్నారు. తనవారితో పాటు గ్రామంలో భజన బృందాలలో చేరి లయ, తాళ జ్ఞానం, గాత్ర సంచారం నేర్చుకున్నారు. పగటి వేషాలలో పౌరాణిక పాత్రలను ప్రదర్శించి పద్యనాటకాలకు కావలసిన మెలకువలు ఒంటపట్టించుకున్నారు. తొలిసారిగా చెక్కభజన నాటకంలో నారదుడి పాత్ర ధరించారు. సత్యహరిశ్చంద్ర నాటకంలో హరిశ్చంద్రుడిగా ప్రధాన స్రవంతిలోకి దిగి, నక్షత్రకుడిగా విశ్వరూప ప్రదర్శన చేశారు. ఆనాటి నటీనటులు పీసపాటి, షణ్ముఖి, ఎ.వి. సుబ్బారావు, గూడూరు సావిత్రి, డి.వి. సుబ్బారావు తదితర నటీనటులతోపాటు నేటి ప్రసిద్ధ నటులవరకూ ఇంచుమించుగా అందరితోను కృష్ణుడు, హరిశ్చంద్రుడు, శ్రీరాముడు, బిల్వమంగళుడు, భవానీశంకరుడు మొదలగు పాత్రలు ధరించారు. గాన కళాప్రపూర్ణ, కలియుగ నక్షత్రక, పౌరాణిక నాటకబ్రహ్మవంటి బిరుదులు, సువర్ణఘంటా కంకణ తదితర బహుమానాలు ఎన్నో పొందారు. రాష్ట్రప్రభుత్వంవారి కందుకూరి విశిష్ట అవార్డు, నంది అవార్డులు దక్కించుకున్నారు. మందరాడలో ప్రముఖ సినీనటుడు తనికెళ్ళ భరణిచే సువర్ణపుష్పాభిషేక సత్కారం పొందారు. సత్య హరిశ్చంద్ర నాటకాన్ని సినిమాగా తీశారు. 2020వ సంవత్సరంలో ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ అవార్డు పొందడం ద్వారా మందరాడ కీర్తిని దశదిశలా వ్యాప్తి చేశారు.

మందరాడ నుండి సంగీత శాఖ కొనకొమ్మకు చేరిన వ్యక్తి జిణగం అన్నాజీరావు. గ్రామంలో పాఠశాల విద్య మాత్రమే నేర్చిన అన్నాజీరావు తన కుటుంబ సంగీత నేపథ్యంవలన విజయనగరం ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో చేరి వాయులీన వాద్య విద్యను నేర్చుకున్నారు. అదే కళాశాలకు వయొలిన్ ప్రొఫెసర్‌గాను, నెల్లూరిలోని కళాశాలకు ప్రిన్సిపాల్‌గాను పనిచేశారు. వయొలిన్‌తో దూరదర్శన్‌లోను, తిరుపతి దేవస్థానానికి చెందిన నాదనీరాజనం కార్యక్రమంలోను, ఆలిండియా రేడియోలో బి.హై గ్రేడ్ స్థాయిలో సోలోగాను, ఇతర ప్రముఖులకు సహాయకునిగాను కచేరీలు చేశారు. నూకల చిన సత్యనారాయణ, ద్వారం భావనారాయణ, ఎం.ఎస్. బాల సుబ్రహ్మణ్యం, అరుంధతీ శంకర్‌వంటి ఉద్దండులకు వాద్యసహకారం అందించారు. తన సంగీత బృందంలో సభ్యుడుగా పనిచేసినట్టు అతని గురువు ద్వారం

దుర్గాప్రసాద్ గారే ఈ రచయితతో చెప్పారు. ఈ ఊరిలో ఏడెనిమిది చెరువులు ఉన్నాయి. గారోలు చెఱువు గార వంశీయులు తవ్వించింది. వ్యక్తుల పేరన రామినాయుడు చెఱువు, సీతమ్మ చెఱువు. ఇంకా తుమ్మల చెఱువు, నీళ్ళచెఱువు, పెద్దచెఱువు ఉన్నాయి. పెద్దచెఱువును మందరాడ చింతలపేట అనే గ్రామాలను ఆనుకొని మైలు పొడవైన గట్టుతో వందలాది ఎకరాలకు నీరందిస్తుంది. బొబ్బిలి రాజులు తవ్వించారని చెప్పుకొంటారు. ఒకసారి నిండితే ఫలసాయం ఖచ్చితంగా అందించేది. నారాయణపురం, మడ్డువలస కాలువలు వచ్చిన తరువాత వీటికి సాగుభారం తగ్గింది. నీళ్ళచెఱువు నీరు తాగితే కడువులో బల్లలు కరిగిపోతాయని చుట్టుపక్కట గ్రామాలవారు నమ్మేవారు. రైతులకు మామిడి తోటలు ఉండేవి. వంశానికొకటిగా అభివృద్ధిపరిచారు.

ద్వితీయార్థంలో 50 ఏళ్ళపాటు ప్రతి శుక్రవారం నాయిడోరి తోటలో సంత జరిగేది. సుమారు పాతిక గ్రామాలవారు దానిని వినియోగించుకొనేవారు. సంత నూతి నీటికోసం రేయింబవళ్ళు రెండు గ్రామాలవారు కాచుకొని ఉండేవారు. పొట్నూరు సోదరులు వేసవి కాలం సంతలో మజ్జిగ, మంచినీరు అందించేవారు.

మందరాడ ఆర్థిక పరిస్థితినో లేక ప్రజల మంచితనాన్నో గ్రహించి, దూరప్రాంతాలవారు వచ్చి మోసగించిన సంఘటనలు కూడా ఉన్నాయి. అరవై ఏళ్ళ క్రిందట నెల్లూరు నుండి వేలంబట్టలవాళ్ళం అంటూ కొందరు ఊరిలోనికి వచ్చి స్థావరం ఏర్పాటు చేసికొన్నారు. బట్టల బేళ్ళు ఎక్కడ నుండో తెప్పించి వేలం వేసేవారు. కొందరికి చవగ్గాను, మరి కొందరికి ఉచితంగాను బట్టలు ఇచ్చి గ్రామస్థులను మచ్చిక చేసుకున్నారు. కొన్నాళ్ళయ్యాక 'ఆమదాలవలస స్టేషనుకు బట్టల బేలు వచ్చింది. డబ్బులు లేక విడిపించలేకపోతున్నాం. బంగారు వస్తువులు ఎరువిస్తే తాకట్టు పెట్టి విడిపిస్తాం. బట్టలు అమ్మిన తరువాత బంగారం విడిపించి ఇచ్చేస్తాం' అని నమ్మబలికి బంగారం, డబ్బు పట్టుకొని ఉడాయించారు. మరొకసారి పాతకంచు పాత్రలు పోతపోయించి కొత్తవి ఇస్తామని బండెడు సామాను పట్టుకుపోయారు. ఇటీవల ఈ ఊరివాడే అయిన టంకాల శ్రీరామ్ నూటికి పది, పదిహేను రూపాయల వడ్డీ ఇస్తానని నమ్మించి, కొందరికిచ్చి, దాదాపు రెండువందల కోట్ల రూపాయలు సేకరించి, మాయమయ్యాడు. పోలీసులకు చిక్కాడు.

కాకరాపల్లి రైతులు పొలాలకు యజమానులుకావడం, ఊళ్ళో ఎలిమెంటరీ స్కూల్‌తో పాటు బి.సి. కాలనీ రావడం చెప్పుకోదగ్గ అభివృద్ధి. నారాయణపురం, మడ్డువలస జలాశయం కాలువలు, మందరాడలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, తారు రోడ్డు రెండు గ్రామాలతో పాటు ఈ ప్రాంతానికే వరాలు. రెండు ఊర్లకు పోష్టాఫీసు అదనపు సదుపాయం.

మందరాడలో సాతాని, కూరాకులవాళ్ళు కనుమరుగయ్యారు. భట్రాజులు నామమాత్రంగా ఉన్నారు. పారిశ్రామికీకరణ చేనేత వృత్తికి గొడ్డలి పెట్టయింది. టి.వి. కళలను నాశనం చేసింది. ఆయుర్వేదం అంతరించింది. మందరాడ కాలనీ సమస్యలతో నిండి ఉంది.

గార రంగనాథం - ఫోన్: 988 575 8123.

నొసటి వ్రాత

(ఘంటరెగము - ఆదితాళము)

ఇగ నేలనే వట్టివలపు
ఇసుమంతైన తెలియదాయె
మగువా! ఇది నా నోము ఫలము
మరచే నంటే మరువదాయో ॥

అనుభవ మే క్రొత్తలాయె
అసలేమి లేకపోయె
మనసిజుని మాయలాయె
మమతలందే నిలిచిపోయె ॥

విడువ రానిచ్చేనా ఈ చాయ
వేడుక లీడేర దాయ
నుడువ నోరాడదాయ
నొసటి వ్రాత తప్పదాయ ॥

కలకాలము నాకు దక్కి
కలికిరో! మువ్వగోపాలు
డలుకజేసి ఆపె తానుకలయక
అతితమి నే జెందనాయ ॥

క్షేత్రయ్య పదాలు - శ్రీనివాస చక్రవర్తి

నాగరకత

ఆ సహ్యాద్రి పర్వత సానువుల్లో ఎప్పుడూ ఏదో జరుగుతూనే ఉంటుంది. కొన్ని రాత్రులు చీకట్ల కురులు విప్పుకుంటాయి. ఎన్నో రాత్రిళ్లు వెన్నెల్లు పిండార బోస్తుంటాయి. ఎండలు బండల్ని బద్దలు కొడుతుంటాయి. ఇక వసంతం వింత వింత పూలు పూస్తుంటుంది. ఆకురాలు కాలంలో అకాలవర్షాలు అతలా కుతలం చేస్తుంటాయి. కారు మేఘాలు కొండల మీద కూర్చుని ఘూర్ణిల్లుతుంటాయి. పెను గాలులు ఆ లోయల్లో సుడులు తిరిగి తుఫానులే చెలరేగుతుంటాయి.

ఆ సహ్యాద్రి పర్వత లోయల్లో ఎప్పుడూ ఏదో జరుగుతుంటుంది. ఒకరోజు ఎడతెరపని వాన, ఒకరాత్రి చీకటి రాజ్యంలో ఈలకోళ్ళ సంగీతం, మరొక మధ్యాహ్నం పెళపెళ కాగే ఎండల మంట. ఆ సహ్యాద్రి కొండల్లోనే ఒక కొనచివర చిన్న ఆశ్రమంలాంటి కుటీరం. మూడు ప్రక్కలా లోయ, ఒక్కదారే మా వూరికి చేరుతుంది.

మా వూళ్ళో అందరూ, తెలివిగలవాళ్ళు. ఒకరు ఆ ఆశ్రమంలో వున్న బాబుగారు భగ్నప్రేమికుడని, మరొకరు అన్నివదిలి వేసిన ఖరీదయిన సన్యాసి అని, మరొకరు ఏ కాంత కోసమో, ఏకాంతంలో ప్రశాంతంగా కవిలాగా బ్రతుకుతున్న పిచ్చివాడని, ఇలా పుకార్లున్నాయి.

కాని నా వరకు నేను ఏమీ నిర్ణయానికి రాలేదు. ఎందుకంటే ఇంత మార్మికంగా బ్రతుకీడ్చే వ్యక్తి, ఈ వూరు వారి పరిధిలోకి రాడని, ఏదోవిధంగా ఆయన్ని కలసి, విషయం ఏమిటో తెలుసుకోవాలనే తపన నాలో రోజురోజుకు పెరిగిపోతుంది. కాని ఆయన గురించి సత్యాన్ని తెలుసుకునే నా ప్రయత్నాలన్నీ వృధాగానే మిగిలిపోయాయి.

మొదటిసారి కలిసినప్పుడు, ఎంతో ఆశతో ఆ చిట్టడవిలో పలకరించాను, కేవలం తల పంకించి కదిలి పోయాడు.

మరొకసారి, ఏదో మఠం ప్రక్కన ద్రాక్ష తోటలో నిలబడి వున్నాడు, అదే అదునుగా "అయ్యా ఈ మఠం నిర్మాణం జరిగి ఏండ్లు వూండ్లు గడిచిందటగా, మీకేమయినా తెలుసా?" అని ఎంతో ఆశగా ఆయన సమాధానం కోసం ఎదురు చూశాను.

"ఇది ఎవరు, ఎప్పుడు నిర్మించారో నాకేమి తెలుసు? నాకంటే పెద్దవారయిన మీ తాతనో నానమ్మనో అడగరాదూ?" అంటూ కదిలిపోయాడు, ఇంతకంటే నిరాశ ఏముంటుంది? నా తప్పుకు చెంపలు వేసుకుంటూ, వెళ్ళిపోయాను. ఇలా రెండేళ్ళు గడిచిపోయాయి.

ఆకురాలే కాలంలో ఒకనాడు, ఆ కొండ కోనల్లో తిరుగుతూ, అకాల వర్షంలో, కారుమేఘాల చీకట్లలో, ఈదురు గాలుల్లో చిక్కుకు పోయాను. దారి తెన్నూ తెలియక నడిసంద్రంలో నావలాగా కొట్టుకు పోతూ, ఆ కొండమీద మినుకు మినుకు మంటున్న వెలుతురు వైపు పడుతూ లేస్తూ చేరాను. ఆ బాబు ఆశ్రమం చేరుతూనే, నాకు ఇదే మంచి అవకాశం, ఈ రహస్యాన్ని తెలుసుకోవటానికి అనుకుంటూ తలుపు తట్టాను. ఇన్నాళ్ళు మర్మయోగిలా ఉండిపోయిన మహానుభావుడు తలుపు తీశాడు.

"అయ్యా మీరు నా అకాలమైన రాకను క్షమించాలి, కాని బయట తుఫాను" అంటూ నసిగాను. అప్పుడు

ఆయన చేతుల్లో ఒక పక్షి. బహుశా నాలాగానే తుఫానులో చిక్కి అక్కడ వాలి వుంటుంది, రెక్కలు విరిగి వుంది.

"ఈ చుట్టుప్రక్క చాలా గుహలున్నాయి. ఏగుహలోనైనా తల దాచుకోవచ్చు.." అంటూ తలుపు మూయకుండానే, ఆ పక్షిని ఎంతో ప్రేమగా నిమురుతూ అటుగా తిరిగాడు.

ఇదే అవకాశంగా నేను లోపలికి చేరి, తలుపు మూశాను. ఈ వింత మనిషి, మనసు ఎంత దయతో నిండిందో అప్పుడు ఆ దృశ్యం చూస్తుంటే ఆశ్చర్యం కలిగింది. పక్షిని అంత దయగా చూస్తున్న వ్యక్తి, నాపట్ల ఇంత నిర్దయగా ఎట్లా మాట్లాడగలిగాడు? ఏమయినా మొండిగా ఉండి పోదలిచాను. ఆయన

"ఈ తుఫాను ఎంత పవిత్రంగా ఉందో, అది ఇక్కడి కుళ్లునంతా కడిగివేస్తుంది కదా, నీవెందుకు తప్పించుకోవాలనుకుంటున్నావు?" అన్నాడు. నాకు వెన్నులో వణుకు పుట్టింది. అయినా పట్నపు తెలివి తేటలు కదా.

"అయ్యా ఈ తుఫానుకు నాలాంటి పాపిని ఉద్ధరించే ఉద్దేశ్యం వున్నట్లు లేదు, కాని మళ్ళీ దొరికితే మాత్రం వదలదండీ. కొంచెం హాస్య ధోరణితో అన్నాను.

''అంటే, పిచ్చివాడా ఎంతగొప్ప అవకాశం పోగొట్టుకున్నావు, అయినా అంత అదృష్టం నీకు లేదేమో..."

"అవునయ్యా. నేను పిరికి వాడిని, అందుకే తుఫాను భీభత్సంలోంచి పారిపోయాను, ఆ అదృష్టాన్ని అందుకోలేక పోయాను".

ఇది బహుశా ఆయనకు నవ్వు తెప్పించి ఉండవచ్చు అటుగా తిరిగి నన్ను చలి కాసుకోమని కట్టెల పొయ్యి దగ్గర కూర్చోమని వళ్ళారబెట్టుకోమని చెప్పాడు, నా ఆనందానికి హద్దేలేదు. అక్కడ వున్న రాతిపైన కూర్చున్నాం, ఏదో నూనె తీసి ఆ పక్షి గాయానికి రాసి ''ఈదురు గాలులు ఈ పక్షిని చావు బ్రతుకుల్లో పడవేసినాయి" అన్నాడు. "అదే గాలి, వాన నన్ను మీ ముంగిట్లో నిలబెట్టినాయి" అంటూ మాట కలిపాను. నా వంక తీక్షణంగా చూస్తూ ''మనిషికి, పక్షిలాగే సహజజ్ఞానం ఉంటే బాగుండును. తుఫానులు, ఈదురు గాలులు, మనుషుల పిరికితనాన్ని, భయాన్ని మేల్కొలుపుతాయి, పిరికి పందలాగా, గుహల్లోకో, రాళ్ళక్రిందకో దూరి దాక్కుంటాడు, ధైర్యంగా తుఫానును ఎదుర్కోవాలని ఆశిస్తాను. అందులో వున్న అనుభవాన్ని పోగొట్టుకుంటున్నాడు. ఏవో దెబ్బలు తగులుతాయని వంకతో గూట్లో చేరుతున్నాడు."

ఆయనతో ఇంకా మాట్లాడించాలని, "అవునయ్యా, పక్షులకున్న ఆత్మగౌరవం మనషికేది? తనకు తాను ఏర్పాటు చేసుకున్న సూత్రాలు, అలవాట్ల నీడలో బ్రతుకుతుంటాడు, కాని పక్షులు, జంతువులు ఈ నిరంతర పరిభ్రమణంలో వున్న భూమితోపాటే ప్రచండభానుని వెలుగు దారిలో పయనిస్తూ ఉంటాయి" అన్నాను.

ఆయనలో ఉత్సాహాన్ని గమనించాను, తనమాటలను విని అర్థం చేసుకునే శిష్యుడు తారసపడినట్లు కళ్ళు మెరిసాయి. ఆయన "బాగా చెప్పావు, నిజంగా నీవు చెప్పింది నీవు నమ్మితే, తక్షణం ఈ కృత్రిమమైన, కళంకితమైన నాగరకతను వదిలివేయాలి. మిగతా జంతు జాలంతో, అద్భుతమైన ఈ విశ్వాంతరాళపు విధానంలో మేళవించాలి. నమ్మటం వేరు, నమ్మిన దాన్ని ఆచరించటం కష్ట సాధ్యం.

"ఎందరో సముద్రాల్లా ఘోషిస్తారు. కాని వాళ్ళు బ్రతికేది చీలమండల లోతు కుళ్లుతున్న నీళ్ళలోనే.

"చాలామంది శిఖారాల్లో తలలెత్తుకుని తిరుగుతారు, కాని ఎంత పిరికి పందలంటే కాస్త చీకటికే గుహల్లో చొరబడి దాక్కుంటారు" అని అంటూ తన చేతిలోని పక్షిని మెత్తని గుడ్డలో పెట్టి ఒక బుట్టలో ఉంచాడు. వెలుగుతున్న మంటలో నాలుగు కట్టెలు వేశాడు, అవి చిటపటమంటూ అంటుకుని, మంటలు నాల్కలు చాచాయి.

"నువ్వు తడిగా వున్నావు, అది ప్రమాదం, పై అంగీ తీసి, ఆరబెట్టుకో, ఆ బూట్లు కూడా తీసి, నీ పాదాలు వేడి చేసుకో..." ఆయన ఆతిధ్యం నాకు ఇంకా ధైర్యాన్ని ఇచ్చింది, ఆ చలిమంట వెచ్చదనం మరింత నమ్మకం కలిగించింది. ఆ ధైర్యంతోనే, ఆయన, జీమూత మేఘాలు పరిగెడుతున్న ఆకాశం వైపు చూస్తుండగా... కాస్త అమాయకంగానే...

"అయ్యా మీరు ఇక్కడకు వచ్చి ఎన్నాళ్ళయింది..?" అని నసిగాను.

ఆ మర్మయోగి, నా ఉనికిని ఉపేక్షిస్తూనే...

"ఇక్కడికా? ఈ భూమి పుట్టక ముందు, ఈ శూన్యం అంధకారంలో మునిగి ఉన్నప్పుడు, ఈ సముద్రాలపై మహాశక్తి కదలాడుతున్నపుడు..." అంటూ ఘోషించాడు. నిజం చెప్పొద్దు, నాకు భయం ఆవహించింది, నన్ను నేను సంబాళించుకోవటానికి కొంత సమయం పట్టింది.

ఈ మహానుభావునిది ఎంత మార్మికమైన ప్రవృత్తి? ఈ అయోమయపు అనత్యపు మనిషి, నైజాన్ని తెలుసుకోవటానికి, నిర్లక్ష్యాన్ని ఛేదించటానికి చాలా ఓర్పు కావాలి... అనుకుంటూ ఆలోచనలో మునిగిపోయాను.

లోయలన్నీ చీకటిలో మునిగిపోయాయి. వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. తుషారపు గాలి భయంకరంగా ఊళలు వేస్తోంది. బైబిల్‌లో చెప్పినట్లు మనిషి మాలిన్యాన్ని ప్రక్షాళనం చేయటానికి నోవా ఉపద్రవం రాదుకదా?

బయటి భీభత్సం ఈ మర్మయోగి హృదయంలో ఏదో ప్రశాంతిని నింపినట్లు, ఆయన ఒంటరి తనాన్ని ఆయనకు తోడుగా నిలిపినట్లనిపిస్తుంది, రెండు క్రొవ్వొత్తులు వెలిగించి, గాజుపాత్రలో మధువు ఒంపి నాముందు పెట్టాడు-. ఒక పళ్ళెంలో పళ్ళు-రొట్టె తేనె పెట్టి నా ముందుకు తెచ్చాడు-. నాకు దగ్గరగా కూర్చొని, ఇంతకంటే తన దగ్గర ఎక్కువ లేదని, అందుకు క్షమించవలసినదిగా కోరి ఈ పదార్థాలను తనతో పంచుకోమని అడిగాడు-.

నిశ్శబ్దంగానే ఆ కార్యక్రమం పూర్తి చేస్తుండగా బయట గాలి ఊళలు, వాన ఆక్రందనలు నాకు వినపడుతూనే వున్నాయి, ఆయనలోని రహస్యాల్ని, ఆయన గతంలోని లోతులను ఏ విధంగా తెలుసుకోవాలో అని నేను మధనపడుతూనే పూర్తి చేశాను.

రెండు పింగాణీ కప్పులలో మంచి వాసన వచ్చే కాఫీ పోసి, చలిమంట దగ్గరకు తెచ్చాడు.

ఒక సిగిరెట్టు ఆయన వెలిగించి, నాకు ఒకటి ఇచ్చాడు, ఇదంతా నాకు నమ్మశక్యంగా లేదు.

"నీవేమనుకుంటున్నావో నాకు తెలుసు. ఈ మధువు ఏంటి, కాఫీ ఏమిటి, సిగరెట్టు ఇవన్నీ వింతగా, ఇక్కడవున్న సౌకర్యం కూడా నీకు ఆశ్చర్యంగా ఉండవచ్చు. అందరిలాగానే నీవుకూడా, ఏమిటి అన్నిటికీ అందరికీ దూరంగా ఉన్న సన్యాసి, జీవితాన్నుంచి వైదొలిగిన వింతమనిషికి ఇన్ని సుఖాలు ఎందుకు అని అనుకోవచ్చు."

"అవునయ్యా, చింతనాపరులు ఆధ్యాత్మిక పరిధిలో పయనించే వారికి ఇవన్ని అవసరం లేదనే అనుకుంటారు."

ఆయన దీర్ఘంగా నిట్టూర్చి, "అవును అందరితో వుంటూనే నేను దైవాన్ని పూజించే వాడినే, ఎందుకంటే పూజా పునస్కారాలకి ఏకాంతం, ఒంటరితనం అవసరం లేదుకదా- నేను దైవాన్ని చూడాలనీ ప్రజలకు దూరంగా లేను, నా తల్లిదండ్రుల చెంత నాకు ఎప్పుడూ దేవుడు దగ్గర గానే వుండేవాడు.

కాని నేను ఈ ప్రజల్నించి దూరమైనది, వారికి నాకు నైజంలోని ఘర్షణతో, వారి వ్యాపకాలు నాకు సరిపడక నేను మనిషి నుంచి దూరమయ్యాను. నా మనసు, మనుగడ ఇతరుల ధోరణికి, జీవన సరళికి భిన్నంగా తిరగడమే, నేను ఆ సంఘర్షణ నుంచి బైట పడేందుకే.

ఈ నాగరకత నుండి దూరంగా వచ్చింది, కాలం చెల్లిన, కుళ్ళిపోయిన, బలీయమై భ్రష్టుపట్టిన ఈ నగర వృక్షపు నీడలో వుండలేక, ఈ విషవృక్షపు వేళ్లు, భూమి లోతుల్లో చొచ్చుకు పోయి వున్నాయి. ఊడలు అవని అంచుల దాకా వ్యాపించి వున్నాయి. పరిమాణం ఆకాశంలో మేఘాలవరకు పెరిగిపోయి ఉంది. కాని ఈ నాగరక మహావృక్షం, మనకు ఏమి ఒరగ పెట్టింది? అత్యాశ, ద్రోహం, దుఃఖము, వినాశం, కన్నీళ్ళు, కాక? ఎందరో మహానుభావులు దీన్ని శుద్ధి చేద్దామని ప్రయత్నం చేసి పరాజితులైనారు. నిరాశ నిస్పృహలతో హతాశులైనారు, ఈ కుళ్ళిపోయిన వృక్షం, విషం క్రక్కుతూనే వుంది--"

ఆయన కొద్దిగా చలిమంటవైపు ఒరిగి నా వైపు చూడకుండానే, "లేదు తమ్ముడూ, నేను ఒంటరి తనంలో వుంటున్నది, దైవప్రార్థన కోసం కాదు, ఎందుకంటే, దేవుణ్ణి మనస్సుతో ప్రార్థిస్తే ఎంత గందరగోళంలోనైనా, ఆయన వినకపోడు. ఏకాంతంగా ఉండడం మనల్ని మనం బాధించుకోవటమే, మన శరీరమే దేవాలయం. అందులోనే ఆత్మాన్వేషణకు కాంతి దీపాలున్నాయి.

"కాని నేను దైవకార్యం కోసమే ఈ మనుష్యులకు

దూరంగా వుండలేదు, ఈ నాగరక సమాజానికి దూరంగా వుండాలనే, వారి అలవాట్లకు, కట్టుబాట్లకూ, భేషజాలకు బాధలకూ దూరంగా ఉండాలనే, అంతేకాదు.

కొంతమంది, తమ విలువలేని ముఖాలను ఎక్కువ వెలకట్టి అమ్ముకోవడమో, ముసుగులు కొనుగోలు చేయటమో చూడలేక, మానసికంగా వారి లేకితనాన్ని, శారీరకంగా వారి డంబాన్ని చూడలేక–

గర్వంగా ముఖంలో నవ్వు పూసుకుని వయ్యారంగా నడిచే స్త్రీలను, వారి మనసులో కల్మషాన్ని చూడలేక, తమను తాముగా ఎంతో జ్ఞానులుగా పరిగణించుకొని సమాజంలో తలెత్తుకు తిరుగుతూ, కలల్లో విహరించే కుటిలత్వాన్ని చూడలేక, అంతేకాదు, మేము ఎంతో సాధించాము, మేము మీకంటే గొప్పవాళ్ళము, ప్రపంచంలో మేము సత్యాన్ని చూసిన ఉన్నతులమనే వాచాలురను వినలేక, దూరంగా పారిపోతున్నా. ఇంకా – ఒదిగి ఉండేవాడిని పిరికి వాడని, దయగలవాడిని చేతకాని వాడని పరిగణించి, డాంబికాలు పలికే వాడు దర్పం కలవాడని అనుకుంటున్న వాళ్ళనుంచి దూరంగా వుండాలని, అంతేకాదు, వాళ్ల ఆజ్ఞలేకుండా సూర్య చంద్రులు ఉదయించరని, అస్తమించరనే వీళ్ల డాంబికాలు విని విని విసిగిపోయాను. ఇంకా, అధికారంలో వుంటూ, వారి లోగిళ్ళలో సర్వసుఖాలు గుమ్మరించుకుంటూ, సామన్యుల నోళ్ళ మట్టికొట్టే అధికారులకు దూరంగా పోతున్నా. మంత్ర తంత్రాలతో ప్రజలను మభ్యపెట్టే మతాధిపతులకు, ఆత్మవంచన చేసుకునే పీఠాధిపతులకు, దూరంగానూ, ఏనాడూ, డబ్బుకు తప్ప దయచూపని ఈ మనుష్యజాతికి ఎడంగానూ, వారి నిర్దయకు నిరసనగా, ప్రజలు ఏదైతే నాగరకత అని అంటున్నారో ఏ విధానాన్ని మానవజాతి ఔన్నత్యం కోసమని నిర్మించి చట్టాలు, శాసనాలుగా పిలుస్తూంటే అదే నాగరకత ప్రజలకు శాపమై, దుఃఖకారణమైందని నిరసిస్తూ నేను దూరంగా ఉండిపోతున్నా.

ఈ ఆశ్రమ వాతావరణంలో నాకు ఎంతో విలువైన ఆధ్యాత్మికమైన జీవితం లభిస్తోంది. సూర్యోదయంలో ఎన్నో వింతకాంతులు చూస్తున్నా. ఈ పూలు వికసించటం, వాటి సువాసనలు గాలిలో తేలిరావడం, ఈ సెలయేళ్ల సంగీతం, నదులు శ్రావ్యంగా సాగరంలో సంగమం చెందడం, వసంతం నిద్ర మేల్కోటం, వేసవి రంగుల్లో వెలిగిపోవడం, శిశిరపు పండుటాకులు నిశ్శబ్దంగా రాలిపోవడం, తెల్లని మంచు చిక్కటి చీకటి చూడటం–ఈ ప్రకృతి అందాలన్నీ చూడగలుగుతున్నా. ఏకాంతంలో ఈ అనుభూతే నేను దైవానికి దగ్గర వస్తున్నాననే నమ్మకాన్ని గలిగిస్తోంది."

ఏదో కొంత మనసులో బరువు తగ్గినట్లు నిట్టూర్చి నా వంక చూశాడు. ఆయన కళ్ళు వింతగా వెలుగుతున్నాయి. ఆయన ముఖంలో ఏదో క్రొత్త వెలుగు కనబడుతుంది.

ఒకరకమైన తృప్తి, దృఢచిత్తం గోచరిస్తున్నాయి. మరికొంత సేపటికి... "అయ్యా మీరు చెప్పిన చాలా విషయాలతో నేను ఏకీభవిస్తున్నాను, ఈ సంఘానికి పట్టిన చీడ తప్పనిసరిగా వదిలించ వలసిందే, అందుకు మీలాంటి వారే పూనుకోవాలి, మరి మీరు దూరంగా ఉంటే ఎలా – రోగికి దూరంగా వైద్యుడు వెళ్లిపోతే...?"

నావంక సాలోచనగా చూసి "తమ్ముడూ, ఈ సమాజం పుట్టినప్పటి నుంచి వైద్యులు, ప్రజల్ని ఉద్ధరిద్దామనే ప్రయత్నించారు. కొంతమంది మందులు, మరి కొంతమంది లేపనాలు, ఇంకొంతమంది కత్తులు వాడుతూ వచ్చారు, కాని ఏమి జరిగింది? ఈ కుళ్ళు విస్తరించిపోతోంది, ఈ రోగి ఆ కంపులోనే పడివున్నాడు, ఏదో ప్రార్థన చేస్తున్నట్లు నటిస్తూ, చేతులు చాచి వైద్యుని పీకను నులిమి చంపుతున్నాడు. అరె ఎంత గొప్ప వైద్యుడు అని పైకి పొగుడుతున్నాడు.

లేదు తమ్ముడూ, ఈ మానవజాతిని ఏ ఒక్కడూ ఉద్ధరించలేడు, ఎంత వివేకవంతుడైనా వారి అజ్ఞానానికి బలికావల్సిందే. మంచుతో నిండిన నేల పై ఏమి పెరిగి చస్తుంది కనక?"

"అయ్యా ఈ ప్రజలకు మంచుకాలం గడిచిపోతుంది. తర్వాత వసంతం రాదంటారా? పూలు పూసి, పంటలు పండవంటారా?"

"అయ్యో, దేవుడు మనిషి జీవితాన్ని ప్రకృతి ఋతువుల్లా మలిచి వుంటే, నీవు చెప్పింది జరగవచ్చు, కాని ఏ జాతి, సమితి అయినా తమ జనన గుణాలతో

సహజ రీతిలో బ్రతుకుతున్నారా? మనిషి పగటి వెచ్చటి ఎండలో, రాత్రి సుఖమైన చీకటి, వెన్నెలలో జీవిస్తున్నాడా? రాత్రి నిశ్శబ్దాన్ని విని ఆనందిస్తున్నాడా? ఇక ఈ భూమి అంతా మనుష్య జాతి రక్త మాంసాలతో నిండిపోయిన తర్వాత ఎలా సాధ్యం, ఇంత విధ్వంసం తర్వాత ఋతువులకు విలువేమిటి"

ఆయన చేతిని చీకటి ఆకాశంలోకి చూపుతూ, "ఇక్కడ నా సాధన వృధాగా పోదు. నా గుండెల్లో రూపు దిద్దుకుంటున్న స్వప్నం, ఈ లోయల్ని, పర్వతాలనూ ఆవహిస్తుంది... ఇప్పుడు నా మాటలు, నా లోగొంతులోని వేదన, ఇక్కడ నా ఉనికి, జ్ఞాన తృష్ణకోసమే, నా జీవనం ఆనంద లోకాలను, అలౌకిక జ్ఞానంతో అందుకోవాలనే, ఇందుకోసమే. బయట నాగరకతను జనసమూహాన్ని వదలివేసి ఈ ఏకాంతాన్ని ఆశ్రయించాను. ఇది చివరి వరకూ సాగే ప్రయాణమే..."

ఆయన మాటల్లోని నిజాన్ని, ఈ సమాజపు నాగరకత మరకలను, గాయాల్ని గురించి ఆలోచిస్తూ ధైర్యంచేసి ఇలా అన్నాను.

"మీ అభిప్రాయాలు చాలా ఆదర్శపాయమైనవి, ఎంతో గౌరవించ దగినవి, మీ ఏకాంతం అసూయ పడదగినదే, కాని అయ్యా ఈ ప్రజలకు ఈ దేశానికి ఇంతటి దుర్గతి అధోస్థితి గలిగినప్పుడు మేల్కొలిపే శక్తి, వ్యక్తి అవసరం కదా?"

"ఏమన్నావు? ఈ దేశమా? అయ్యో అన్ని దేశాలు అన్ని దిక్కులూ ఇలాగే తగులబడినాయి. పైకి మెరుగులు మారవచ్చు. తూర్పు దేశాల విషాదం, అదే కుళ్ళిన సమాజం పశ్చిమ దేశాలలోనూ ఉంది, కాకపోతే తీరుతెన్నులు. వేషభాషలూ మారవచ్చు అంతే తమ్ముడూ.

"లేనిపోని గొప్పలు చెప్పుకుని లేదా ఉన్నవి లేనివి డప్పు కొట్టుకొనే తీరు, రంగులు మారుతుంటుంది. కాని మోసం, వంచన ఎక్కడైనా ఒక్కటే. ఎంత మర్యాదగల మాటల్లో చెప్పినా, వంచన వంచనే. గోళ్ళకు రంగు పూసుకున్నా, సిల్కుబట్టలు వేసుకున్నా మోసాన్ని దాయలేం. పేరాశను కప్పిపెట్టలేం ఇవన్నీ విలువగల వాటిగా మాయ చేయలేం.

"మనిషిని, తమ కట్టుబాట్లతో, అలవాట్లతో, బోధనలతో కట్టిపడవేసే ఈ నాగరకత, ఎన్ని హంగుల్లో ఉన్నా, ఎన్ని రంగులు పూసుకున్నా చివరికి, మనిషి బానిసత్వాన్ని పోగొట్టలేదు. ఇదే స్వాతంత్ర్యం, ఇదే స్వేచ్ఛ అని ఎంత ఘోషించినా మనుషుల బానిసత్వం, భావదాస్యం పోదుకదా! అంతులేని బానిసత్వపు ప్రలోభాలు, కట్టుబాట్లతో చరిత్రలో, నాగరకత ఎన్నిమారు వేషాలు వేసినా, ఎన్ని గొంతుకలు మార్చినా, మనిషిని స్వతంత్రుణ్ణి చేయగలదా?

"తన వికృతాకారంతో నవ్వుతూనే 'నేను స్వేచ్ఛను, నేనే స్వాతంత్ర్యాన్ని' అని వేయి గొంతుకలతో అరుస్తు ఉంటుంది.

"ఈ విషయంలో తూర్పు పడమరల భేదం ఏమిలేదు. ఏదో ఒక సమాన ప్రమాణంలో మానవ జాతిని, మానవ సంఘాన్ని, అజ్ఞానాన్ని దుఃఖాన్ని, సంపదను నిలిపి దేనికి ఏదీ తీసిపోకుండా పోటీపడుతున్నాయి.

"ఆకలి గొన్నప్పుడు – పులికి, సింహానికీ పెద్ద తేడా ఏముంటుంది?

కొందరిని బలవంతుల్ని చేయడానికి, సంపన్నులను చేయటానికి మరికొంతమందిని, పేదలుగా బలహీనులుగా మారుస్తున్నాయి. అంతే తమ్ముడూ" అని ఆగాడు.

నేను "అవునయ్యా నాగరకత అంటేనే దర్పం, అహంభావ ప్రదర్శన..."

"అవునవును, నాగరకత అంటేనే డాంబికం, గర్వ ప్రదర్శన, అహంకార పూరితం, దురభిమానం, అవివేకం, నిరర్థక మానవేచ్ఛ, విధ్వంసం....

"మనిషి తయారు చేసిన పరికరాలన్నీ, శారీరక సుఖానికే పరిమితం, అలసిపోయినప్పుడు గిలిగింతలు పెట్టే పెట్టెలే ఎక్కువ.

అంతేకాదు, మనిషి తయారు చేసుకున్న బొమ్మల పెట్టెలన్నీ అతని మంచిని – మేధను నిద్రపుచ్చటానికే ఉపయోగపడుతున్నాయి. ఇంకా, అతనిలో ప్రచ్ఛన్నంగా వున్న విధ్వంస గుణాన్ని, హింసా ప్రవృత్తిని రేకెత్తించటానికే దోహదం చేస్తున్నాయి.

"అతను సముద్రాలు జయించినా, దూరాల్ని దాటినా ఏవో క్రొత్త తీరాలను, దేశాలను చూసేందుకే కాని, ఆత్మ

శోధనకు కాదు. మానసికానందానికి అసలేకాదు. ఎందుకంటే, ఈ యంత్రాలన్ని ప్రకృతికి శత్రువులే కాక వినాశకారులు కూడా. ఇంకా చెప్పాలంటే, మనం ఏదయితే విజ్ఞానం, పరిజ్ఞానం, పరిశోధన అంటున్నామో, అవన్ని మనిషికి బంగారు సంకెళ్ళు. ఆ పసిడి మిసమిసలో, ఆ సంకెళ్ళ గుసగుసలో పాపం అతడు బందీ అయి అదే ప్రపంచం అనుకుంటున్నాడు, అదే స్వర్గం అనీ భ్రమిస్తున్నాడు.

"తరతరాలుగా, అనంతకాలం నుంచీ ఈ బోనులో ఉండిపోయాడు. తన చుట్టూ తానే లోపల నుంచి కట్టుకున్న ఈ కారాగారంలో, అదే నివాసమని, అందులోనే అతనికి భద్రతవుందనే భ్రమలో వుండిపోతున్నాడు.

"రంగులు పూసుకుని హంగులు వేసుకున్న ఈ నాగరక సమాజం ఎన్ని తరాలయినా తన నైజాన్ని మార్చుకోలేదు. అన్నీ వేళప్రకారమే జరగుతుంటాయి. ప్రణాళికాబద్ధంగానే, అందరూ సుఖంగా వున్నట్టు కనబడుతుంది. నీ మంచితనం ప్రక్కవాడి దుర్మార్గంతో చేతకానితనం, పిరికితనంలా కనబడుతుంది. ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నట్లే వుంటుంది. ధరలు పెరిగి పోతుంటాయి. ఎన్ని పన్నులు వేసినా అధికారులకు, ప్రణాళిక లోటుగానే కనబడుతుంది.. న్యాయస్థానాల్లో పద్ధతి ప్రకారమే అన్యాయం జరిగి పోతుంటుంది. యుద్ధాలు చేస్తుంటారు. కారణాలు ఎప్పుడూ బలంగానే చూపిస్తారు. ఎవరూ బాధ్యత వహించరు. మనుషులే మనుష్యుల్ని చంపుతుంటారు. ఆ మనుష్యులే వైద్యం చేస్తుంటారు. ఆ మనుష్యులే విలపిస్తుంటారు. ఆ మనుష్యులే తాగి తూలుతుంటారు. వ్యభిచారం సాగుతూనే ఉంటుంది. ప్రకృతి సర్వనాశనం అయిపోతూనే ఉంది. అడవులు కూలిపోతూనే వున్నాయి. మంచుకొండలు కరిగిపోతూనే వున్నాయి. వినాశం విధ్వంసం అంతా పద్ధతి ప్రకారమే జరిగి పోతుంటుంది. అతడు చేస్తున్న ప్రణాళికలన్ని వృథానే, అతడు పడుతున్న శ్రమ కూడా వంచనే...

"ఇంత దర్పం ప్రదర్శనతో అతనికి కానరానిది, మనసులో వున్న ప్రేమ, హృదయంలో వెలిగే జ్యోతి..."

"అయ్యా ఏమన్నారు? ఏమిటది" అని వణికే గొంతుతో అడిగాను. చాలాసేపు నిశ్శబ్దంగా వుండి, రెండు చేతులు గుండెల మీద వేసుకుని, ఊపిరిపీల్చి వదిలాడు, ఆయన ముఖం ఒక్కసారిగా వెలిగి పోయింది, ఎంతో నిర్మలంగా, స్పటికంలా కనిపించింది.

"అదే మేల్కొలుపు, నీ అంతరాత్మను నిద్రలేపడం, హృదయపు లోలోతుల నుండి వెలికివచ్చే ప్రేమామృతాన్ని, అందులో వున్న అద్భుతమైన శక్తిని గుర్తించడం, అప్పుడే నీకు కనువిప్పు. అప్పుడే జీవితపు విలువ తెలిసేది. ఈ ప్రకృతి సంగీతం, సప్తవర్ణాలు, నీలాకాశపు సౌందర్యం, అద్భుతమైన కాంతిపుంజం అన్నీ నీకు గోచరిస్తాయి. ఒక సౌందర్యానందపు మహావృక్షంలా మనిషి భూమ్యాకాశాల మధ్య నిలబడినపుడే అతనికి సార్థకత, అతనిలో వెలిగే ఆ జ్ఞానజ్యోతి అతణ్ణి పునీతుణ్ణి చేస్తుంది, అతనిని చుట్టు ముట్టి వున్న కుళ్ళు నుంచి, పరివేష్టించి వున్న అజ్ఞానం నుంచి అతణ్ణి రక్షిస్తుంది, అదే అతని జీవితానికి పరమార్థం. ఆ అదృశ్యహస్తమే నా కళ్ళముందున్న చీకటి తెరలను తొలగించింది. ఎన్నోసార్లు ఆశ్చర్యపోయాను తమ్ముడూ, నన్ను నేను ప్రశ్నించుకున్నాను కూడా,

"ఏమిటా ఈ విశ్వరహస్యం? నేనెవరిని? ఇక్కడెందుకున్నాను, ఈ జనం నుంచి ఎందుకు వేరైపోయాను, ఎందుకు వాళ్లతో కలవలేక పోతున్నాను. విలక్షణంగా ఎందుకున్నాను? వాళ్ళంతా నాకెలా తెలుసు? ఎక్కడ కలిశారు, వీళ్ళ మధ్యలో ఎందుకుంటున్నాను? వీళ్లంతా ఈ భూమికి అపరిచితులేనా? వీరంతా నవ్వుతూ తుళ్లుతూ ఉన్నారే, వీళ్ళంతా ఏడుస్తూ కన్నీరు కారుస్తున్నారే, మరి నేనెందుకు వేరేవిధంగా ఆలోచిస్తున్నాను, ఇక్కడ నుంచి వీరంతా ఎక్కడకు వెళ్తారు? మరి నేనెక్కడి పోతాను? వీటన్నిటికీ సమాధానాలు ఎక్కడున్నవి?

"అదీ, అదే జరిగింది నాలుగేళ్ళ క్రిందట", అంటూ చేతులు ముందుకు చాచి "అవును అప్పుడే ఇక్కడికి వచ్చాను, సమాధానం కోసమే...ఇక్కడే మేల్కొన్నాను, నిశ్శబ్ద సౌందర్యాన్ని అనుభూతి పొందాను."

తలుపు దగ్గరకు వెళ్లి, చీకట్లోకి చూశాడు, తుఫాను భీభత్సాన్ని ఆస్వాదిస్తున్నట్లు, "అవును అదే ఆత్మ సాక్షాత్కారం. అది తెలిసినవాడే గుర్తించగలడు. కాని

ఇతరులకు చెప్పాలంటే కష్టసాధ్యం, మాటల్లో ఇమడనిది. ఒక్కసారి ఆ అనుభూతి పొందినవాడే తన అస్తిత్వాన్ని అర్థం తెలుసుకోగలడు" అని అన్నాడు.

రాత్రి గడచిపోతోంది, ఆ మర్మయోగి, అలా అటూ ఇటూ తిరుగుతూనే వున్నాడు. ఆయన ప్రశాంత ఏకాంత జీవితంలోని సౌందర్యాన్ని అర్థం చేసుకున్నాననే అనుకున్నాను. ఎంతో రాత్రి గడిచింది, నా దగ్గరగా వచ్చి నన్ను దీక్షగా చూశాడు.

తనను అర్థం చేసుకున్న వాడి ముఖాన్ని గుర్తు పెట్టుకోవాలనేమో? ఆయన రహస్యాల్ని విన్న వాడి ఉనికిని గుర్తించాలనీ కావచ్చు, అప్పటికే నా మనసు బరువెక్కిపోయింది, నా కళ్ళలో నీరు నిండింది.

ఒక్కసారిగా "తమ్ముడూ, నేను వెళ్తున్నాను, చీకట్లలోకి ప్రవేశిస్తున్నాను. ఆకురాలు కాలంలో, మంచుకురిసే వేళల్లో నాకీప్రయాణం చాలా ఇష్టమైనది, ఆహ్లాదకరమైనది. ఇప్పుడు ఈ తుఫానులోకి ప్రవేశిస్తున్నాను.

"ఇదీ నీ యిల్లే అనుకో–" అంటూ, పైన అంగీ వేసుకుని "తలుపు గట్టిగా వేసుకో, ప్రొద్దున్నే ఎవరైనా లోపలికి రావచ్చు. ఇతరుల కొంపల్లో దూరాలని, రహస్యాల్ని తెలుసుకోవాలనే బలహీనత ఇక్కడ అందరికీ ఉన్నదే కదా...

రేపంతా అడవిలోనే వుండి పోవాలను కుంటున్నా" అంటూ చేతి కర్ర తీసుకుని తలుపు దగ్గరకు వెళ్ళి, "ఈ తుఫాను నిన్ను భయపెట్టింది కదా, మళ్ళీ అటువంటి సందర్భం వస్తే ఇక్కడికి రావటానికి సందేహించకు, తమ్ముడూ వస్తా...." అని తలుపు తీసి, ఆ తుఫాను గాలిలోకి, ఆ వాన భీభత్సంలోకి, ఆ చీకటి రాత్రిలోకి తలెత్తుకుని నిర్భయంగా ప్రవేశించాడు.

ఆయన ఆ వానతెరలో కలిసిపోయేవరకూ చూస్తూ ఉండిపోయాను... తెల్లవారింది. తుఫాను తగ్గి, వర్షం ఆగిపోయింది. ఆకాశం కడిగినట్లు నీలంగా మెరిసిపోతున్నది. సూర్యుని వెచ్చని కిరణాలు వర్షంలో తడిసిన చెట్లమీద పడుతున్నాయి. గలగలపారే సెలయేళ్లు మిలమిల మెరిసి పోతున్నాయి. నా కీ నీరెండ తళతళలో కొత్త వెలుగు కనబడుతోంది. రాత్రి తుఫాను

సహ్యాద్రి హిల్స్

విధ్వంసంలో ఇప్పుడు మార్మిక సత్యం గోచరిస్తోంది. నాలో ఇన్నాళ్ళు ఉన్న ఊగిసలాట తెల్లమబ్బుల్లా విడిపోయింది. ఉత్సాహంగా కొండ దిగటం మొదలుపెట్టాను. అంతలో వెన్నులో వణుకు ప్రారంభమైంది. ఏదో ఎక్కడో మేల్కొన్నట్లు ఒక్కసారిగా నా హృదయం నిదురలేచి ఈ ఉదయ కాంతిలా ఆవరించింది. పరిసరాలతో తెలియని మమేకం తెలియవచ్చింది. ఆనందంతో పరుగు పెడుతున్నాను.

రాత్రి ఆయన చెప్పిన ఆత్మ సాక్షాత్కారం, మేల్కొలుపు నాలో స్పష్టంగా గుర్తించగలిగాను, మనసు కొంత హాయిగా అనిపించింది.

మనిషికి తనను తాను తెలుసుకోవటం, మనసు మేల్కోవటం ఎంతో ముఖ్యం, అతని అస్తిత్వానికి అదే పరమార్థం. ఇప్పటి నాగరకత వక్రవేషాలు, అవినీతి మయమైన జీవన విధానం వదలి, ధర్మమార్గంలో బ్రతుకుని పండించుకోవటంలో మానసికానందాన్ని పొందాలి.

కాని పదార్థాన్ని ఎలా నిర్లక్ష్యం చేయగలం? అదీ ఎన్నో రూపాలతో మన చుట్టూ వుండగా? ఇప్పటి కృతక నాగరకత, త్వరలోనే అంతం కావచ్చు, దాని అవసరం కూడా అదేనేమో? కాని, అనంతమైన భ్రమణ సూత్రం, మనకు స్వాతంత్ర్యాన్ని ప్రసాదించదా? మనల్ని విముక్తుల్ని చేయదా?

తర్వాత మళ్ళీ ఆ మర్మయోగి నాకు కనిపించనే లేదు.

మిమ్మల్ని మధ్యలో వదిలివెళ్తున్నందుకు క్షమిస్తారు కదూ...

పండిత రమా బాయి సరస్వతి

– లక్ష్మీఅయ్యర్

19వ శతాబ్దిలో భారత స్త్రీల యొక్క పరిస్థితి అత్యంత శోచనీయం. రాజారామ్మోహన్ రాయ్, ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్, దయానంద సరస్వతి, సుబ్రహ్మణ్య భారతిలాంటివారు స్త్రీ స్వేచ్ఛకై పోరాడే రోజులవి. ఒకవైపు పరదాలపేరిట, సతీసహగమనం, బాల్య వివాహాలు ఉత్తర భారతంలో, వ్యాప్తి చెందితే ముసలివాళ్ళు చిన్న అమ్మాయిలను డబ్బు చూపి కొని పెండ్లాడే స్థితి కట్టుబాట్లు, సంప్రదాయాల పేరిట ప్రజల మధ్య మహిళలను కించపరిచే సామాజిక కట్టుబాట్లు దక్షిణ భారతాన నిండి ఉండేవి. స్త్రీకి చదువు లేకుండా వంటింటి కుందేలుగా ఆమెను తయారుచేసి ఆమె మానసిక వికాసానికి అడ్డుగోడలు ఏర్పడ్డాయి – ఎక్కడ చదువుకుంటే తర్కం చేసి తనను ఎదిరిస్తుంది అన్న భావనతో పురుషాహంకారంతో కూడిన భారత సమాజంలో పురుషులు ఆమె ప్రయత్నాలను విఫలం చేశారు. కందుకూరి, అరవింద్ ఘోష్ విద్యా సాగర్‌లాంటివారు స్త్రీ అభివృద్ధికై కృషి చేశారు. తన గీతాలలో సుబ్రహ్మణ్య భారతి "పుస్తకాన్ని మహిళలు తాకకూడదన్న మగ పిశాచాలు మగ్గిపోవాలి" అని రాశారు. అలాంటి 18వ శతాబ్దిలో మరాఠీ ప్రాంతపు విదుషీమణి సమాజంచే తిరస్కరింపబడి దాన్ని ఎదిరించి దాని బహిష్కారానికి బలై ఎన్నో రాష్ట్రాలకు వెళ్లి తానే ఓ ఉద్యమంగా మారి నిలబడింది. ఆమె ఎవరో కాదు ప్రముఖ సంస్కృత విదూషీమణి, సంఘ సంస్కర్తగా, సామాజిక కార్యకర్తగా నిలచిన పండిత రమాబాయి. రమాబాయి సరస్వతి (1858 ఏప్రిల్ 23–1922 ఏప్రిల్ 5) అవతరించిన రోజులలో భారతదేశం పితృస్వామ్య వ్యవస్థకు ప్రతీకగా ఉన్న కాలం. ఆ పితృస్వామ్య వ్యవస్థకు సవాలుగా నిలిచిన నారీమణి రమాబాయి. ఈనాడు కూడా కేరళ తూర్పు భారత కొన్ని ప్రదేశాలు తప్ప మిగతా రాష్ట్రాల్లో పితృస్వామ్య వ్యవస్థ జోరుగా సాగుతోంది కేరళలో మాత్రమే. మాతృస్వామ్య వ్యవస్థ ఇప్పుడు కూడా ఉంది. ఆస్తుల పంపకమైనా తలకొరివి పెట్టి అస్థులను నదులలో కలిపే వ్యవస్థ కూతురితో ముడివడి ఉంది.

18వ శతాబ్దపు సమాజంలోని కట్టుబాట్లను సాహసంతో ఎదిరించి మానసిక ధైర్యంతో ముందుకు సాగిన వీర నారీమణి పండిత రమాబాయి. 23 ఏప్రిల్ 1858న మైసూర్ రాజ వంశానికి చెందిన మరాఠీ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన రమాబాయి యొక్క చిన్నప్పటి పేరు రమా డోంగ్రే. ఆ కాలంలో రాజులు పండితులు మాత్రమే సంస్కృతం చదవాలి బ్రాహ్మణులు కాని వారు స్త్రీలు ప్రాకృతం మాత్రమే చదవాలని శాసించే కట్టుబాట్లతో కూడిన సమాజము ఆడపిల్లలకు సంస్కృతం నేర్పించకూడదని చెప్పే బ్రాహ్మణవాద సమాజాన్ని ఎదిరించి ఆమె తండ్రి అనంత శాస్త్రి డోంగ్రే సంస్కృత పండితుడు. ఇంట్లో ఆమెకు సంస్కృతాన్ని నేర్పించాడు. శాస్త్రి తన పిల్లలకు రమాబాయికి వాళ్ల తమ్ముడికి

సంస్కృతాన్ని క్షుణ్ణంగా నేర్పించారు. అందుకని ఆమె తండ్రిని ఆ గ్రామంవాళ్లు బహిష్కరించారు. కానీ సంఘసంస్కర్త అయిన తండ్రి తన పట్టుదల వీడలేదు. తన పిల్లలిద్దరికీ సంస్కృత భాషను క్షుణ్ణంగా నేర్పించారు. రమాబాయి తన 12వ ఏట వేదాలను ఉపనిషత్తులను సంస్కృత శ్లోకాలు అభ్యసించింది. పన్నెండేళ్లలో కొన్ని వందలాది సంస్కృత శ్లోకాలు చెప్పేది. బాల్యంలో తల్లిని కోల్పోయిన రమాబాయి తండ్రి యొక్క సాన్నిధ్యంలో సుందరభ విష్యత్తుకు పునాదులు వేసుకుంటున్నపుడు 1877లో భయంకర కరువు కాటకాలతో కొన్ని వందల కుటుంబాలు నాశనం అయ్యాయి. ఆమె కుటుంబంలో మిగిలింది ఇద్దరు సహోదరులలో శ్రీనివాస్ అనబడే ఒక సహోదరుడు మాత్రమే. తండ్రి లేకున్నా తండ్రి ద్వారా నేర్చుకున్న సంస్కృతాన్ని ఆమె వీడలేదు. నేర్చుకున్న సంస్కృతంవల్ల ఇంకా ముందుకు పోవాలనే తపనను ఆమె

వీడలేదు. భాషల మీద ఆమెకున్న ప్రేమవల్ల మరాఠీ, కన్నడం, హిందీ, బంగ్లా భాషలు వాటంతట అవే వచ్చేసాయి. 1876-78 నాటి గొప్ప కరువు సమయంలో 16 సంవత్సరాల వయస్సులో అనాథలుగా మారిన డోంగ్రే, ఆమె సోదరుడు శ్రీనివాస్ సంస్కృత గ్రంథాలను పఠిస్తూ భారతదేశం అంతటా తిరిగారు. అధ్యాపకురాలిగా రమాబాయి కీర్తి కలకత్తాకు చేరుకుంది. అక్కడ పండితులు ఆమెను మాట్లాడటానికి ఆహ్వానించారు. 20ఏళ్ళ రమాబాయి సంస్కృతి సంస్కృతపు పూర్ణపండితురాలుగా పేరొందింది. తన అన్నయ్యతోబాటు 1878 నుండి కలకత్తాలో వెళ్లి ఉండసాగింది. రమాబాయి యొక్క సంస్కృత పాండిత్యాన్ని చూసి కలకత్తాలోని బ్రాహ్మణ సముదాయం ముక్కున వేలేసుకున్నారు. చాలామంది ఆమెను సంస్కృతంలో ఉపన్యాసం ఇవ్వడానికి పిలిచేవారు. ఆమె ఇచ్చిన ఉపన్యాసాలను తీవ్రభావాలు చూసిన బెంగాలి సమాజం ఆమె జ్ఞానాన్ని దూరానికి విస్తరింపజేశారు. దానివల్లే 1878లో కలకత్తా విశ్వవిద్యాలయంవారు ఆమెను సరస్వతీ పండిత అనే బిరుదుతో సత్కరించారు. ఆ బిరుదుల తర్వాత రమాబాయి పండిత రమాబాయి అయిపోయింది. కలకత్తాలో ఆమె బెంగాల్లోని బాల్య వివాహము పరిస్థితి మీద వాటిని ఎదిరించే కార్యాలు చేపట్టడం ప్రారంభించింది. 1880లో. ఆస్తిక సంస్కర్త కేశబ్చంద్రసేన్ ఆమెకు హిందూ సాహిత్యంలోని అత్యంత పవిత్రమైన వేదాల కాపీని ఇచ్చి, వాటిని చదవమని ప్రోత్సహించాడు. 1880లో ఆకస్మాత్తుగా సోదరుడు మరణించడంతో ఆమె ఒంటరిగా అయింది. ఒంటరితనాన్ని నెట్టుకురాలేక రమాబాయి బెంగాలీ న్యాయవాది బిపిన్ బహారీ మేధ్వీని వివాహం చేసుకుంది. వరుడు బెంగాలీ కాయస్థ అయినందున వారి వివాహం కులాంత, ప్రాంతీయాంతరమైనది. అందువల్ల ఆ వివాహం అనుచితమైనదిగా భావించబడింది. 1880 నవంబరు 13న ధర్మశాస్త్ర వేడుకలో వీరి వివాహం జరిగింది. ఈ దంపతులకు ఒక కుమార్తె ఉంది, అప్పుడూ ఆమెను సమాజం వెంటాడుతూనే ఉంది. కానీ దీనిని పట్టించుకోకుండా సమాజం నుండి దూరంగా ఆమె అస్సాం వెళ్ళిపోయింది. కూతురు పేరు మనోరమ. కలరా వల్ల భర్త కూడా మరణించాడు. మేధ్వీ మరణం తరువాత (1882), రమాబాయి పూణేకు వెళ్లి అక్కడ ఆర్య మహిళా సమాజ్ (ఆర్య ఉమెన్స్ సొసైటీ)ను స్థాపించింది. ఇలా సమాజంలో దెబ్బలు మీద దెబ్బలు తిన్న ఆమె ఆ సమయంలో మహారాష్ట్రలో కూడా స్త్రీలు సామాజిక కట్టుబాట్లకు నలిగి బలహీనమవుతూ వచ్చారు. ఆమె అక్కడికి వెళ్లి మహిళా సమాజ స్థాపన చేసి మహిళా విద్యను ప్రోత్సహించ ప్రయత్నించింది. పూణేలో ఆమెతో పాటు ఎంతోమంది సంఘసేవకులు కూడా మహిళా విద్యను ప్రోత్సహించారు. ఈ సమాజం యొక్క ఉద్దేశ్యం మహిళలకు విద్యనందించడం, బాల్యవివాహాల అణచివేత నుండి విముక్తి పొందడం. 1882లో విద్యావ్యవస్థను పరిశీలించడానికి భారత ప్రభుత్వం ఒక కమిషన్‌ను నియమించినప్పుడు రమాబాయి దాని ముందు ఆధారాలు ఇచ్చింది. లార్డ్రిపోన్ ఎడ్యుకేషన్ కమిషన్‌లో ఆమె ప్రసంగిస్తూ "ఈ దేశంలోని వందమంది విద్యావంతులైన పురుషులలో తొంభైతొమ్మిది మంది పురుషులు, ఒకరు స్త్రీ. స్త్రీలకు విద్యనభ్యసింపజేయకుండా మహిళల సరైన స్థితిని వ్యతిరేకిస్తున్నారు. వారు స్వల్పంగానైనా తప్పును గమనిస్తే, వారు ఆవగింజలను ఒక పర్వతంలా కట్టుబాట్ల పేర్లతో పెద్దది చేసి, స్త్రీ పాత్రను నాశనం చేయడానికి ప్రయత్నిస్తున్నారని బహిరంగంగా ధైర్యంగా ప్రకటించింది. ఉపాధ్యాయులే ఉపాధ్యాయినులకు శిక్షణ ఇవ్వాలని, మహిళా పాఠశాల ఇనస్పెక్టర్లను నియమించాలని ఆమె సూచించింది. ఈనాటి స్త్రీ ఉపాధ్యాయినులకు, మహిళా విద్యకు శ్రీకారం చుట్టిన ఉత్తమురాలు. అంతేకాకుండా భారతదేశంలో మహిళల పరిస్థితులు మహిళలకు మహిళలు మాత్రమే వైద్యపరంగా చికిత్స చేయగలరని, భారతీయ మహిళలను మెడికల్ కాలేజీల్లో చేర్పించాలని ఆమె అంది. స్కూల్ కాలేజీలు విశ్వ విద్యాలయాలలో స్త్రీలు రాణించాలని చెప్పిన రమాబాయి సాక్ష్యం గొప్ప సంచలనాన్ని సృష్టించి ఆ వార్త దావానలంలా విక్టోరియా రాణికి చేరుకుంది. లార్డ్ ఫెరిన్ చేత మహిళా వైద్య ఉద్యమాన్ని ప్రారంభించిన తరువాత పండిత రమాబాయి కోరిక ఫలించింది.

వైద్యశిక్షణ ప్రారంభించడానికి రమాబాయి 1883లో బ్రిటన్ వెళ్ళింది; ఎక్కువవుతున్న చెవిటితనం కారణంగా ఆమె వైద్య కార్యక్రమాల నుండి ఆమెను తిరస్కరించారు. ఆమె అక్కడ బస చేసిన సమయంలో క్రైస్తవ మతంలోకి మారిపోయింది. బ్రిటన్ నుండి ఆమె తన బంధువు, మొదటి మహిళా భారతీయ వైద్యురాలు ఆనందీబాయి జోషి

గ్రాడ్యుయేషన్‌కు హాజరు కావడానికి 1886లో అమెరికా వెళ్ళి అక్కడ రెండేళ్లపాటు ఉంది. ఈ సమయంలో ఆమె మెల్లమెల్లగా మహిళ ఆర్య మహిళా సమాజ శాఖలు మహారాష్ట్రమంతా ఈవిడవల్ల విస్తృతంగా వికసించాయి. 1882లో భారతదేశాన హంటర్ విద్య కమిషన్‌కై నియామకులైన బ్రిటిష్‌వాళ్లకు చేయూతనిచ్చి స్త్రీ విద్యకై పిలుపునిచ్చింది.

రమాబాయి 12000 శ్లోకాలన్నీ బాల్యంలో చక్కగా వల్లించే సంస్కృత బ్రాహ్మణ పండితురాలు ఎందుకు విరక్తి చెంది ఇంగ్లాండ్ వెళ్లి క్రైస్తవ మతాన్ని స్వీకరించి సంఘసంస్కర్తగా మిగిలిపోయిందని? దానికి బలమైన కారణాలు ఈ భారతదేశ కట్టుబాట్లు చాందస భావాలతో కూడిన పురుషాహంకారం ప్రధాన సమాజమే ఉండి ఉండవచ్చు అనడంలో కించిత్మాత్రం సందేహంలేదు. ఒక స్త్రీ కట్టుబాట్ల పేరిట అణచబడి తనవాళ్ళను పోగొట్టుకొని ఇతర స్త్రీల వికాసానికై విద్యకై పోరాడితే ఆమెను వెంటాడి తరిమికొట్టిన ఘనత ఆనాటి భారత సమాజ భావనలే. ఆమె తన మతంవారి ప్రవర్తనపట్ల విసుగుచెంది వేరొక మతాన్ని స్వీకరించి ఉండవచ్చు. 1883లో ఇంగ్లాండ్ వేలిన రమాబాయి క్రైస్తవ మారట సిద్ధాంతాలను అభ్యసించింది. 29 సెప్టెంబర్ 1883లో కూతురును తనతోబాటు బాప్తిస్మం చేయించి క్రైస్తవ మతాన్ని స్వీకరించింది. తర్వాత ఎన్నో విద్యావిధానాలపై పనిచేసింది. 1886లో అమెరికా వెళ్లి కొన్ని సంవత్సరాలు ఉండి ఉపన్యాసాలను ఇచ్చింది. అపుడే చికాగోలో స్వామి వివేకానంద హిందూ ధర్మాన్ని పొగడుతూ హిందూ మతాన్ని గొప్పగా అభివర్ణించినపుడు అక్కడగల రమాబాయి అనుచరులైన కొంతమంది మహిళలు అంత మంచి మతంలో మహిళలకు ఎందుకు దయనీయ స్థితులు కలుగుతున్నాయి అని నిలదీసి అడిగారు. 1893లో స్వామీజీ ఉపన్యాసాలను రమాబాయి తీవ్రంగా నిరసించింది." నేను నా పశ్చిమ సోదరీమణులకు నిక్కచ్చిగా చెబుతున్నాను పై మెరుగులకు భ్రమపడకండి. మహాతత్వపు, వ్యాఖ్యానాలిచ్చే అందమైన చదువుకున్న పురుషుల బౌద్ధిక విమర్శలు భవ్య ప్రాచీన ప్రతీకల క్రిందగల చీకటి గదులలో ఏంతోమంది మహిళలు దళిత బడుగు జాతులవారి కన్నీటి వ్యథలు కలవు. దానికి సమాధానంగా స్వామీజీ ఆమెను స్కాండల్ అని కూడా సంబోధించారు. కానీ రమాబాయికి ప్రపంచ దేశాలన్నీ గొడుగు పట్టాయి. ఇంగ్లీష్‌లో దిట్ట ఆయిన రమాబాయిని వివేకానందునితో సహా ఎందరో తీవ్రంగా విమర్శించారు. కాని జ్యోతి బాయి, సావిత్రి బాయి దంపతులు రమాబాయికు ఆండగా నిలబడ్డారు. రాజారామ్ మోహన్ రాయ్ క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరించారు. వీటి వెనుకగల కారణాలను పరిశోధన ద్వారానే కనుగొనాలి.

రమాబాయి ఒక అసాధారణ మహిళ, ఒక ఉపాధ్యాయురాలు ఒక పండితురాలు మహిళావాది మరియు సంఘసంస్కర్తగా మహిళా విప్లవ శంఖాన్ని పూరించి స్త్రీ విద్యకై పోరాడిన విప్లవకారిణిగా చరిత్ర పుటలలో నిలిచిపోయింది. పితృస్వామ్య వ్యవస్థను విమర్శించి పండిత రమాబాయి 1870లోని సమాజములో ఒక విస్ఫోటంలా విద్రోహకారిణిగా ఆ వ్యవస్థను ధిక్కరిస్తూ చాలా ఘోరంగా ఎదిరించి పోరాడింది. సంస్కృతం చదివి ప్రశంసించిన బ్రాహ్మణ సంఘాలు సరస్వతి అని మొదట్లో బిరుదునిచ్చి తర్వాత బ్రాహ్మణ సమాజానికి ఎదురుతిరగడంతో ఆమెను తూలనాడాయి. రమాబాయి మహిళా వికాసానికై ఆత్మ విశ్వాసంతో పూనేలో ఆర్య మహిళా సమాజాన్ని స్థాపించింది. మహిళా విద్య వికసానికై దేశం నలుమూలలా పర్యటించింది. మహారాష్ట్రమంతా ఆర్య మహిళా శాఖలు వ్యాపించాయి భారతీయ మహిళా సంఘ సంస్కర్త మహిళా విద్యకు పునాదులు వేసిన ప్రథమ మహిళ. భారతదేశంలో మహిళల విద్య, విముక్తికి మార్గదర్శకురాలు. 1889 నాటి కాంగ్రెస్ సమావేశానికి హాజరైన 10 మంది మహిళా ప్రతినిధులలో ఆమె ఒకరు. ఇంగ్లాండ్ వెళ్లి 1890ల చివరలో తన స్వస్థలమైన పూణే నగరానికి నలభైమైళ్ల తూర్పున ఉన్న కేడ్గా గ్రామంలో స్త్రీలకై ముక్తి మిషన్‌ను స్థాపించింది. ఈ మిషన్‌కు తరువాత పండిత రమాబాయి ముక్తి మిషన్ అని పేరుపెట్టి ఈనాడు ఆ సంస్థ ఎన్నో దేశాలలో శాఖలను వ్యాపింపచేసి బాలికల విద్యా వికాసానికి తోడ్పడుతుంది.

సరస్వతి పుత్రిక - రమాబాయి: బహుభాషా ప్రవీణురాలైన రమాబాయి ఎన్నో పాఠ్యపుస్తకాలను కూడా ఇంగ్లీషు, మరాఠీలలో అనువదించింది. యునైటెడ్ స్టేట్స్, కెనడా అంతటా ఉపన్యాసాలు ఇచ్చింది. ఆమె ఏడు భాషలను నేర్చుకున్న మహిళ. ఆమె హీబ్రూ, గ్రీకు భాషల నుండి బైబిలును తన మాతృభాష అయిన మరాఠీలోకి అనువదించింది. 1883లో ఇంగ్లాండ్‌లోని కాలేజీలో

సంస్కృత ఆచార్యులుగా పనిచేసింది. హిందూ మతంలో మతం పేరిట అణచబడ్డ, సతీసహగమనానికి బలైన స్త్రీలను, బాలికలను విధవల దయనీయ స్థితులను చూసి ఆమె క్రైస్తవ మతాన్ని స్వేచ్ఛతో స్వీకరించింది.. 1889లో ముంబైలో 20 బాలికలతో శారదా సదనాన్ని నెలకొల్పింది.

1907లో ప్రచురింపబడ్డ ఎ టెస్టిమోని అన్న ఆమె పుస్తకంలో "మహిళలను భేదభావంతో చూసే దృష్టి హిందూ తాత్విక గ్రంథాల అంతరాళ్లలో జీర్ణించుకొని ఉన్నాయి. ఎన్నో పురాణ మత గ్రంథాలలో మహిళలు హింసకు లోనై ఉన్నారు" అని రాసింది. ఆమె తాను రాసిన అతి ముఖ్యమైన పుస్తకం "ది హై – క్యాస్ట్ హిందూ ఉమెన్"ను ప్రచురించింది. ఆమె ఆంగ్లంలో రాసిన మొదటి పుస్తకం కూడా ఇదే. రమాబాయి ఈ పుస్తకాన్ని తన స్నేహితురాలైన డాక్టర్ ఆనందీబాయి జోషికి అంకితమిచ్చింది. ఈ పుస్తకంలో బాలవధువు, బాలవితంతువులతో సహాసతీ, విధవలపై జరుగుతున్న అమానుష కృత్యాలు.. హిందూ మహిళల జీవితంలోని చీకటి కోణాలను బహిర్గతంగా విమర్శించి లోకానికి చూపించింది, బ్రిటిష్ ఇండియా హిందువులలో మహిళల అణచివేతను బహిర్గతం చేయడానికి ప్రయత్నించింది. 1896లో తీవ్రమైన కరువు సమయంలో రమబాయి ఎద్దుల బండ్ల సమూహంతో మహారాష్ట్ర గ్రామాలలో పర్యటించి, వెలివేసిన వేలాదిమంది పిల్లలు, బాలవితంతువులు, అనాథలు, ఇతర నిరాశ్రయులైన మహిళలను రక్షించి ముక్తి, శారదాసదన్ల ఆశ్రయానికి తీసుకు వచ్చింది.

పండిత రమాబాయి జీవితంలో సగానికంటే ఎక్కువ భాగం సామాజిక సేవలో ఎక్కువగా పాలుపంచుకున్నందున, ఆమెకు కుటుంబ జీవితం చాలా తక్కువగా ఉంది. ఆమె బాల్యం కష్టాలతో నిండి ఉంది, ఆమె తల్లిదండ్రులను ప్రారంభంలోనే కోల్పోయింది. వివాహం అయిన రెండు సంవత్సరాలలో భర్త మరణించాడు. ఆమె తన ఏకైక కుమార్తె మనోరమ బాయికి చదువించవలసివచ్చింది. ఆమె కుమార్తెను చదివించింది: మనోరమ బొంబాయి విశ్వవిద్యాలయంలో బి.ఎ. పూర్తి చేసింది; ఉన్నత చదువుల కోసం యు.ఎస్.ఎ.కు వెళ్ళింది; భారతదేశానికి తిరిగివచ్చి, ముంబైలోని శారదా సదన్ ప్రిన్సిపాల్‌గా పనిచేసింది. ఆమె సహాయంతో పండిత రమాబాయి 1912లో దక్షిణ భారతదేశంలోని వెనుకబడిన జిల్లా అయిన గుల్బర్గా (ప్రస్తుతం కర్ణాటకలో) వద్ద క్రిస్టియన్ హైస్కూల్‌ను స్థాపించింది. ఆ పాఠశాలకు ఆమె కుమార్తె పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసింది. 1920లో రమాబాయి శరీరం బలహీనపడడం ప్రారంభించింది. ఆమె తన కుమార్తెను ముక్తి మిషన్ మంత్రిత్వశాఖ బాధ్యతలు చేపట్టే వ్యక్తిగా పేర్కొంది. అయితే మనోరమ 1921లో మరణించింది. ఆమె మరణం రమాబాయికి ఒక పెద్ద దెబ్బ తొమ్మిది నెలల తరువాత సెప్టిక్ బ్రాంకైటిస్‌తో బాధపడుతున్న రమాబాయి తన 64వ పుట్టినరోజుకు కొన్ని వారాల ముందు 1922 ఏప్రిల్ 5న మరణించింది.

1900 నాటికి ముక్తి మిషన్‌లో 1,500 మంది నివాసితులు, వందకుపైగా పశువులు ఉన్నాయి. ముక్తి సదన్ వద్ద చర్చిని స్థాపించడంలో కూడా ఆమె కృషి చేసింది. పండిత రమాబాయి ముక్తి మిషన్ నేటికీ చురుకుగా ఉంది. వితంతువులు, అనాథలు, అంధులతో సహా అనేక పేద సమూహాలకు గృహ, విద్య, వృత్తి శిక్షణ మొదలైనవి అందిస్తోంది.

- *సంస్కృతంలో ఆమె నైపుణ్యాలను గుర్తించి బెంగాల్‌లో (బ్రిటన్ వెళ్లేముందు) "పండిట్", "సరస్వతి" బిరుదులిచ్చారు. 1919లో సమాజసేవ కోసం కైసరి-ఇ-హింద్ పతకాన్ని బ్రిటిష్ వలసరాజ్యాల ప్రభుత్వం ప్రదానం చేసింది.* ● *ఏప్రిల్ 5న లిటర్జికలే కలందర్ ఆఫ్ ది ఎపిస్కోపల్చర్చ్ (యుఎస్ఎ)లో ఫీ స్టే గా గౌరవించారు.* ● *26 అక్టోబర్ 1989న, భారతీయ మహిళల పురోగతికి ఆమె చేసిన కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆమె పేరుపై తపాలా బిళ్ళను విడుదల చేసి గౌరవించింది.* ● *ఆమె గౌరవార్థం ముంబైలోని ఒక రహదారికి పేరు పెట్టారు. గామ్‌దేవి ప్రాంతానికి సమీపంలో ఉన్న హ్యూస్రోడ్‌ను నానా చౌక్‌కు అనుసంధానించే రహదారిని పండిత రామాబాయి మార్గ్ అని పిలుస్తారు.* ● *భారతదేశంలో ఉపాధ్యాయ వృత్తిలో, వైద్యవృత్తిలో మహిళలు తెచ్చిన, భారతదేశంలో మహిళా విద్యకై తీవ్రంగా కృషి చేసిన ప్రప్రథమ మహిళ పండిత రమాబాయి.*

ఆచార్య యన్. లక్ష్మీ అయ్యర్
అజ్మీర్, రాజస్థాన్. ఫోన్: 968 027 6038.

సాహిత్యంలో ఈ శతాబ్దం నోబెల్ తారలు

– ముక్తవరం పార్థసారథి

విదియాధర్ సూరజ్ ప్రసాద్ నాయిపాల్

ఈ శతాబ్దంలో తొలి నోబెల్ పురస్కారం భారతీయ సంతతి రచయిత వి.ఎస్. నాయిపాల్‌ను వరించింది.

విదియాధర్ సూరజ్ ప్రసాద్ నాయిపాల్ 1932లో ట్రినిడాడ్ (కెరీబియన్ దీవులు)లో జన్మించాడు. ఆయన తాతగారి కాలంలోనే వారి కుటుంబం అక్కడికి వలసపోయింది. తండ్రి జర్నలిస్ట్. కొడుకు రచయిత కావాలని కోరుకున్నాడు. పదిహేనవ ఏట స్కాలర్‌షిప్ సహాయంతో ఆక్స్‌ఫర్డ్ యునిఫర్డ్ యూనివర్శిటీలో చదువు కొనసాగించాడు నాయిపాల్. మరో నాలుగేళ్లకు బిబిసి కెరీబియన్ సర్వీస్‌లో రైటర్‌గా పనిచేశాడు. 1954లో తొలికథ *బొగార్డ్* అచ్చయింది. 1957లో ఈయన రాసిన తొలి నవల మిస్టిక్ మసూర్ జాన్ లెవెలిన్ రైస్ మెమోరియల్ ప్రైజ్ గెల్చుకుంది. 1959లో వెలువడిన తొలి కథా సంకలనం *మిగ్వెల్ స్ట్రీట్*. 1961లో అచ్చయిన నవల *ఎ హౌజ్ ఫర్ మిస్టర్ బిస్వాస్* కు సాహిత్యంలో ముఖ్యంగా కామన్‌వెల్త్ సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానముంది. విదేశీ పాలకుల నుండి విముక్తమైన ట్రినిడ్రాడ్ ప్రజలు ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటాన్ని చిత్రిస్తుంది. 46 సం.ల మోహన్ బిస్వాస్‌కు సొంత కాళ్ల మీద నిలబడాలనీ, సొంత ఇల్లు కొనుక్కోవాలనీ కోరిక. పెళ్లి చేసుకుంటే జీవితం బాగుపడుతుందనుకొని తులసి కుటుంబంలో ఒకరితో సంబంధం కలుపుకుంటాడు. కాని స్వేచ్ఛ రాకపోగా తను వాళ్లమీద మరింత ఆధారపడుతున్నానని తెలుస్తుంది. *సుఖంగా బతకటం స్వేచ్ఛ కాదు*. ఈయన మరో నవల *మిస్టర్ నైట్ & ది స్టోన్స్ కంపానియన్ (1963)*కి హథాక్న్ ప్రైజ్ వచ్చింది. నాయిపాల్ యాత్రా సాహిత్యాన్ని కూడా విస్తృతంగా సృష్టించాడు. 1964 నాటి *ఎన్ ఏరియా ఆఫ్ డార్క్‌నెస్* తో ఇండియా గురించి ఈయన రచనలు ప్రారంభమయాయని చెప్పవచ్చు. అప్పట్లో ఇది అతి వివాదాస్పదమైన పుస్తకం. *ఇండియా ఎ వూండెడ్ సివిలైజేషన్, ఇండియా : ఎ మిలియన్ మ్యూటినీస్, మిడిల్ పాసేజ్* కూడా చర్చనీయంగా మారిన యాత్రాకథనాలే.

హాస్యం, వ్యంగ్యం ఇతని రచనల ప్రధాన లక్షణం. తృతీయ ప్రపంచపు సమస్యల్ని అభివృద్ధి చెందిన దేశాలకు పరిచయం చేసిన రచయితలలో నాయిపాల్ ముఖ్యుడు.

బ్రిటిష్ ప్రభుత్వం ఇతణ్ణి నైట్‌హుడ్‌తో సత్కరించింది. అంటే ఆయన 'సర్ విలియం.' నోబెల్ తర్వాత ప్రచురితమైన నాయిపాల్ నవల *హాఫ్ ఎ లైఫ్* లో నక్సలైట్ ఉద్యమం ప్రస్తావన ఉంది. జీవిత కాలంలో ముప్పైకి పైగా పుస్తకాలు ప్రచురించాడు. ఈయన *ఇన్ ఎ ఫ్రీస్టేట్* కు బుకర్ ప్రైజ్ లభించింది.

నాయిపాల్ 2001 నోబెల్ బహుమతి గ్రహీత.

నాయిపాల్ నోబెల్ ఉపన్యాసం నుండి కొన్ని భాగాలు:

జీవితాన్ని ఎవరు ఎంతగానైనా విశ్లేషించవచ్చు. అంతా తెలిసిందని మనం నమ్మనూవచ్చు. కాని రచనా ప్రపంచంలోని మిస్టరీని తెలుసుకోవాలనుకోవటం వృథా ప్రయత్నమే. రచయిత బాహిర జీవితం, అతని సంబంధాలు, అలవాట్లు వగైరాలనుబట్టి అతని రచనల్ని అంచనా వేయలేం.

"రచయిత రాసుకున్న ఆత్మకథ కూడా ఈ మిస్టరీని విప్పలేదు. రచయిత ఏ అంతర్లోకాలలో, తనకోసం తను రాసుకున్న వాక్యాలు, తరువాత నలుగురూ చదివినప్పుడు వాటికి కొత్త అర్థం వస్తుంది" అంటాడు ప్రూస్ట్. ఎంత అనుభవమున్నా, ఎంత రాసినా, ప్రతిసారీ ఇంట్యూషన్ మీద ఆధారపడాల్సిందే. నా గురించి నేన నా పుస్తకాలలో రాసుకున్నాను. అందువల్ల ఇప్పుడు ప్రత్యేకంగా నా గురించి చెప్పుకోవటానికేమీ లేదు. నా పుస్తకాలన్నీ కలిస్తే నేను.

నేను ఇంట్యూటివ్ రచయితను. అలాగే నా రచనా జీవితం ప్రారంభమైంది. అలాగే కొనసాగింది. అంతిమ

దశలో ఇప్పటికీ అలాగే ఉంది 'ఇలా రాయాలి' అనుకొని రాయను. ఏదైనా రాయాలనుకున్నప్పుడు దాని గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాను. గ్రంథాలయాల్లో దాని గురించిన చారిత్రక నేపథ్యం సేకరిస్తాను. ఇండియా గురించి రాయాలనుకొన్నప్పుడు నా పూర్వీకుల దేశం గురించి నాకేమీ తెలియదు. గాంధీ, నెహ్రూలు రాసింది చదివాను. కిప్లిష్ 'రాజ్' గురించి రాశాను. కొందరు మహిళలు కూడా రాశారు. కాని వాళ్లంతా నగరాల్లో పుట్టి పెరిగినవాళ్లు. గ్రామీణ ప్రాంతాల గురించి వాళ్లకేమీ తెలియదు. ఇండియా తర్వాత ఆఫ్రికా, దక్షిణాఫ్రికా, ముస్లిం ప్రపంచం గురించి రాశాను. లక్ష్యం: నాకోసం నేనో ప్రపంచ చిత్రం తయారు చేసుకోవాలి. అది నా చిన్నప్పటి కల. కొందరు హితైషు 'జర్మనీ', చైనాల గురించి ఎందుకు రాయవన్నారు. కాని వాటి గురించి ఇప్పటికే సమగ్ర సమాచారం లభ్యమవుతున్నది. అవి 'ఏరియాస్ ఆఫ్ డార్క్‌నెస్' కావు. ఇలా నేను రాసిన పుస్తకాలన్నీ వలస పాలనకు గురైన రాజుల గురించే. వాళ్లు అవమానాలకు గురయ్యారు. బలహీనులెప్పుడూ తమ గురించి అబద్ధాలు, ఫాంటసీలు సృష్టించుకుంటారు. తాము బలహీనులమని గుర్తించటానికి ఇష్టపడరు ఈ మిమిక్ మెన్ (ఒక పుస్తకం పేరు). ఫిక్షన్, యాత్రాకథనం రెండూ నా ప్రపంచ దృష్టిని మార్చాయి. సాహిత్యపరంగాగాని, రాజకీయపరంగాగాని నేనొక 'సిస్టం'ను నమ్మను. ఆర్కే నారాయణన్‌కు కూడా రాజకీయ అభిప్రాయాలు లేవు. మా నాన్న కథలు రాశారు. ఆయనకూ రాజకీయ అభిప్రాయాలు లేవు. బహుశా రాజకీయ కథ కాలానికి దూరంగా ఉన్న ప్రజలకు బలమైన రాజకీయ అభిప్రాయాలుండవు. ముప్పైఏళ్ల క్రితం అర్జంటీనాకు వెళ్లినప్పుడు ఒకతను నాతో "మంచి చిత్రహింసకూ, బెల్ట్ చిత్రహింసకూ తేడా ఉంది" అని చెప్పాడు గొప్పగా. శత్రువులను చిత్రహింస పెడితే అది మంచిది. శత్రువు మనల్ని హింసిస్తే అది చెడ్డది. నియంతృత్వం ఉన్నచోట అభిప్రాయాలు పనికట్టుకు పకాలుగా కూలిపోతాయి. అక్కడి పోరాటాలలో లక్ష్యం ఉండదు. వాళ్లకు శత్రువులు మాత్రమే కనిపిస్తారు.

ఇక ముగిస్తాను. ఎన్ని పుస్తకాలు రాసిన ప్రతీ ప్రారంభం ఒక 'మింకిల్'లాగే ఉంటుంది. నమ్మకం లేకపోతే కృషి ఎక్కడైనా ఆగిపోతుంది. ఏమి చేసినా అదృష్టం, కృషి కలసినప్పుడే అనుకొన్నవి సాధిస్తాము.

ముక్తవరం పార్థసారథి, హైదరాబాద్. ఫోన్: 917 761 8708.

భ్రమ

(కేదారగౌళ రాగము - త్రిపుట తాళము)

అమ్మ! నెజెల్ల చాలు నీ వెక్కడి యాడదానవే?
సమ్మతితో మువ్వగోపాలుని పొందు సతతమని
యుంటివి ॥

ఎంత వలపైనను మొగవాని కసమిచ్చి
మాటలాడుదుర
ఇంతలోనె వాడు రాకుంటే చింతజిక్కుదుర
సంతస మెన్నడు లేదాయెనో వాని
నడ్డ సేతురా? బుద్ధి
మంతురాల వని వద్దంటే మున్ను నా
మాట వినవైతివి ॥

కలికిప్రాణేశ్వర! రమ్మని బయలుగా
గౌగిలించేవు
పలుకరించి యదే మన్న నాతోడ
భ్రమసి మాటాడేవు
పలుమాఱు వానిపేర జెలికత్తెల
బిలిచేవు ఎందు
వలచేవారు లేరో ఈ సీమలో నీవలె
వలచే వారు లేరు ॥

ఇది యేమో యున్నము వానిపొత్తు నేకాని
హితవుగాదనేవు
మదిరాక్షి! మువ్వగోపాలునొద్దనె కాని
నిదుర రా దనేవు
బెదరేవు వానిపై మనసు నిలుపలేక
మొదలె కూడినావు
ఎదలోని వెత దీరదు నీమోహ
మింతకు దెచ్చెఁగా ॥

క్షేత్రయ్య పదాలు -
శ్రీనివాస చక్రవర్తి

ఎలుకల బోను - నేను

– కిల్లాడ సత్యనారాయణ

మాది కాని మా యింట్లో ఎలుకల కథ.

మావి కాని మా హక్కుల కోసం నాకూ ఎలుకలకు మధ్య పోరు. నోరు లేని ఎలుకలు చెప్పిన నీతి. నోరున్న నేను నేర్చుకున్న రీతి. ఎలుకల కథకు ముందు మా యింటి కథ చెప్పాలి. వినండి.

వనం మధ్యలో ఐరావతంలా మా యిల్లు. వలసరాజుల కట్టడం. అయిదెకరాల్ని హరితనందనంగా మార్చిన ఈ వనం మాకే కాదు ఎన్నో రకాల పక్షులకు, జీవులకు ఒడిని యిచ్చింది. ముగ్గురు పనివాళ్ళు తీరిక లేకుండా చేసినా కొంత పని మిగిలిపోతుంది మా యింట్లో. మా ప్రాంగణంలో ఉదయాస్తమయాల్లో నెమళ్ళ నాట్యం చూస్తూ నా కళ్ళు రోజూ పండగ చేసుకుంటున్నాయి. పిచ్చుకలు, కొంగలు, చిలుకలువంటి పక్షుల గళంతో నా మనసు నాకు తెలియకుండానే ధ్యానముద్రలోకి పోతుంది. వాటికి గూళ్ళు కట్టాం. గింజలు వేస్తుంటాం. అప్పుడప్పుడూ నాకు అనిపిస్తుంటుంది – పక్షుల ప్రపంచంలోకి మా యిల్లు చొరబడిందా? మా యిల్లు తనకు తోడుగా పక్షుల కుటుంబాల్ని తెచ్చుకుందా? అని. పాములు, ముంగిసలు, ఉడుతలువంటివి ఇంటి బయట, బల్లులు, ఎలుకలు యింట్లో కాపురం ఉంటున్నాయి. ఏమైతేనేం, అన్నీ, అందరం సహజీవనం చేస్తున్నాం. ఎలుకలు తమ హక్కును ప్రకటించాయి. యింట్లో ఉప్పులు, పప్పులపై దండయాత్ర చేసాయి. నాదంటే నాదన్నాయి. నా కష్టార్జితాన్ని వదులుకోలేను. నా యాజమాన్యం చూపించాను. 'నీది, నాదీ ఏంటి? అన్నీ అందరివీ. ఎవరికి ఆకలేస్తే వాళ్ళు తినాలి' అని ఎలుకలు. మా చెప్పులు కొరికాయి. ఇంట్లో వీలైనచోట కన్నం చేసాయి. నా యాజమాన్య అహానికి దెబ్బ తగిలింది. ఎలుకల బోను దానికి తోడు నిలిచింది. ప్రతి గదిలో బోను. బోనులో రొట్టె ముక్కలు ఎలుకల్ని రారమ్మని పిలిచాయి. ఎలుకల్లో కొన్ని తల్లులు, కొన్ని తండ్రులు. కొన్ని గురువులు, కొన్ని పెద్దలు. పెద్దల పొట్ట పెద్దది. వాటి నాలుకకు ఆశ ఎక్కువ. ఒకదాని వెంట మరొకటి రొట్టె కోసం బోనుకు చిక్కాయి. నా తెలివికి చంకలు గుద్దాను. పిల్ల ఎలుకలు మాత్రం యింకా ఇల్లంతా అలజడి చేస్తున్నాయి. పిల్లలకు ఆశ తక్కువన్నాను. ఇంటర్ చదువుతున్న మా అమ్మాయి 'ఏవైనా ఉద్దీపనకు చిక్కాల్సిందే, ఒక్క మనిషి తప్ప' అంది. బ్రెడ్‌కు జామ్ పూసి మీటలో పెట్టింది. మెలమెల్లగా పిల్ల ఎలుకలూ బోనుకు చిక్కాయి. సరిగ్గా అదే సమయంలో ఒక మిత్రుని ఫోను వచ్చింది. 'మీకు లక్నో రేంజ్ ఐ.జి.గా బదిలీ అవబోతుంది' అన్నారు. ఆ వార్తను యింట్లో పంచుకున్నాను. అందరూ సంతోషించారు రాజధానికి వెళ్తున్నందుకు. రెండు రోజులు వేయి కళ్ళతో ఎదురు చూశాం. నెల రోజులు గడిచినా తీపి కబురులేదు. తీపి ఎవరికైనా ఉద్దిపనే కదా! నాలా చదువుకున్నవాడు కూడా దీనికి మినహాయింపు కాదే అనుకున్నాను. ఎలుకలకు రొట్టె అవసరం. ఎలుకలకు రొట్టె మనుగడ కోసం పోరాటం. మనిషికి తిండి, బట్ట, గూడు అవసరాలు. మనిషికి కీర్తి, కాంత, కనకం పెద్ద ఉద్దీపన. అవునా? తనకే కాదు, తదుపరి తరాలకు కూడా కూడబెట్టగల శక్తి మనిషిది. అవసరాలు నిత్యసౌందర్యాలు. అవి నమయాన్ని నిత్యకర్మలతో అలంకరిస్తాయి. దినానికి దినానికి మధ్య అవి దండలో దారంలా నిలుస్తాయి. కాలాన్ని ఉత్సాహంతో నింపుతాయి. అవసరాలు ఆగవు. ఒకసారి తీరిపోయాయని తప్పుకోవు. మళ్ళీమళ్ళీ ఎదురుపడతాయి. జీవిత చక్రాన్ని నడిపించే ఇంధనాలు అవి.

అజ్ఞానంలో ఉన్న పేదలు అవసరాల చుట్టూ తిరుగుతారు. అజ్ఞానంలో ఉన్న ధనికులు విలాసాల్లో మునుగుతారు. జీవించడానికి ఇద్దరికీ సమయాభావం. అధికులు అవసరాల్లోనే కొట్టుమిట్టాడుతున్నారు. గాలి, నీరు నేల, అగ్ని... ఇవే కదా మనిషికి మౌళిక అవసరాలు. తిండి, బట్ట, ఇల్లు... యివే కదా మనిషికి ప్రాథమికంగా కావలసింది. మౌలికాలను ప్రకృతి ప్రసాదిస్తుంది. కానీ మనుషులు బాటిల్ నీరు కావాలంటున్నారు. అందులోనూ ఖరీదైన బాటిళ్లు. అందరికీ చెందాల్సిన నేల కొందరి స్వార్థానికి బలవుతుంది. బట్టలకు ఆశను జోడిస్తే బ్రాండ్ అయింది. బ్రాండెడ్ దుస్తులు బోలెడు కావాలి. ఇంటికి అత్యాశ తోడైతే భవంతులు అయ్యాయి. ఒకటి కాదు రెండు కాదు. వీలైన చోటల్లా. మాస్లో 'పిరమిడ్'లో మౌలికావనరాలు, శారీరకవనరాలతోనే జీవితం ఊపిరాడకుండా ఉంది. ఇక మూడో దశ ఆత్మసాక్షాత్కారానికి చేరుతున్నది ఎందరు? ప్రతి దశలో అవసరాలు, ఆశలు, అత్యాశలు... ఆ దశలోనే గింగుర్లు కొడుతున్నారు. ఒకదానికి బదులు మరొకటి మార్చుకుంటూ, చేర్చుకుంటూ శారీరక, భౌతిక అవసరాల్లోనే కోట్లమంది జీవితం గడిపేస్తున్నారు. మాస్లో చెప్పిన అవసరాలను మనం సహజంగా చూడాలి. ప్రకృతితో సమన్వయం చేయాలి. పరమాత్మతో మమేకంలో భాగంగా ఎదగాలి. ఆకలి మన కడుపులో ఉంటే ఆశ. ఆకలి కడుపులోకి మనం వెళ్తే దురాశ.

ఎలుకలకు ఇంట్లో తినడానికి చాలా ఉన్నాయి. అయినా చెప్పులు కొరికాయి. ఇంట్లో కన్నం చేశాయి. మంచి ఉద్యోగం ఉన్నా, పోస్టింగ్ కోసం పరుగుతీసినట్లు. ఏదో కావాలన్న ఆశ. ఆశ ఒక ఉద్దీపన. ఉద్దీపన మనపై ఉత్ప్రేరకంలా పనిచేస్తుంది. మనల్ని క్రియాశీలం చేస్తుంది. ఆశ మనవెంట నడిచినంతకాలం మనం మనతో ఉన్నట్లే. ఆశ మనల్ని నడిపించడం మొదలయ్యాక, మనం మందలో చేరినట్లే. గమనించండి. తల్లిదండ్రులు, భార్యా పిల్లలు, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, స్నేహితులు, బంధువులు... అంటూ సంబంధాల్ని కలుపుతూ మనల్ని గడప దాటిస్తుంది ఆశ. వివిధ రంగుల్లో, విభిన్న గొంతులతో పిలుస్తుంటుంది.

జాగ్రత్త. తొందరపడి మనకు మనం దూరం జరగొద్దు. మన యింట్లోనే ఉండి అందరికీ అతిథ్యమిద్దాం. వాళ్లకు ప్రేమను పంచుదాం. ఆశను కాదు. ఆశ మనలోని నివురుకమ్మిన నిప్పా? చింగారి కోసం చూస్తున్న ఆజ్యమా? బాహ్య వస్తు, విషయాలు ప్రేరేపిస్తేనే ఆశ పుడుతుందా? ఆంతరంగ స్వప్నసౌధం ఆశ కాదా? ఆశ లేని జీవితం గాలితీసిన బూరలా ఉంటుంది. అది దివ్వెకు తైలంవంటిది. దాన్ని చంపితే, మొక్క నుండి వ్రేళ్ళను తెంచినట్లే. ఆశను అంతం చేయడం కాదు, అర్థం చేసుకోవడం అవసరం. ఆశ తీరితే ఆనందం, ఓడితే దుఃఖం. ఓడిన ఆశలు పోగయితే దురాశ పుడుతుంది. దురాశ అందని ద్రాక్ష. అది దుఃఖసాగరం. ఓడిన ఆశల్ని తుడిచేస్తే, కొత్త ఆశ చిగురిస్తుంది. ఆశ అనే నాణానికి ఒకవైపు సుఖం, మరోవైపు దుఃఖం ఉన్నాయి. ఆశకు పుట్టిన పిల్లలు గెలుపు, ఓటములు. అనుకున్నది అవకపోతేనన్న భయం మనల్ని వెంటాడుతుంది. జరగనప్పుడు నిరాశ, అందుకు కారణమైన వాటిమీద కోపం కలుగుతాయి. ఫలితంగా సంబంధాలలో చేదు చేరుతుంది.

సంబంధాలలో పాయసంలో తీపిలా ప్రేమ కలిసిపోవాలి. రెండు కుటుంబాలు కావొచ్చు, రెండు మతాలు కావొచ్చు, రెండు దేశాలు కావొచ్చు... మనం ఆశించినట్టు ఎదుటివారిని ఉండమనడం తప్పు. వాళ్ళ ఇంట్లోకి చొరబడి నిలదీయడం ముప్పు. సంబంధాలలో మనకంటె చిన్నవారిని నియంత్రిస్తాం. పెద్దవారిని అనుకరిస్తాం. ఈ రెండింటిలో అపేక్ష ఉంది. అపేక్ష ఉన్నచోట సంబంధం ఉత్తమాట. అపేక్ష ఎంత దహిస్తుందో నాకు తెలుసు. నాతో పనిచేసిన వంటవాడికి శలవిమ్మని నా బాచ్‌మేట్‌ను అడిగాను. పని చిన్నది, పైగా అతని చేతిలో పని. అందుకు విరుద్ధంగా చేశాడు. రెండురోజులు బాధపడ్డాను. తర్వాత కోపంగా మెసేజ్ పెట్టాను. 'నాకన్నా ఒక వంటవాడు ఎక్కువా?' అని సమాధానం యిచ్చాడు. మా స్నేహంలో చేదు చేరింది. నా తప్పు తెలుసుకున్నాను. అపేక్షించడం వదులుకున్నాను. అపేక్ష, మాక్ బెట్ ఆకాంక్ష, ఒథెల్లో అసూయ, గిరీశం వ్యామోహం.... అమెరికా ఆఫ్ఘన్ యుద్ధం కావొచ్చు, చైనా హాంకాంగ్ అణచివేత అవొచ్చు,

చివరకు బ్రిటిష్ రాణి మరణానికి తయారీ కావొచ్చు... ఇవన్నీ ఎలుకల బోనులే. వీటన్నింట్లో దారి తప్పిన ఆశే కనిపిస్తుంది. ఆశకు గ్రహణం భయం. గ్రహణం తొలగితేనే ప్రకాశం. భయాన్ని వీడిన ఆశ నిత్యజీవితంలో వెలుగునిస్తుంది. నా కోరిక తీర్చమని ఆశ అల్లరి చేస్తుంది. పెళ్లీడుకొచ్చినవాళ్ళు పెళ్లి చేసుకోవాలి. పెళ్లయిన వాళ్లకు పిల్లలు పుట్టాలి. బాగా చదివిన వాళ్ళు ఉద్యోగం చేయాలి. సంపాదిస్తున్నవాళ్ళు మిద్దెలు, మేడలు కట్టాలి. ఇది ఆశల చట్రం. రంగుల రాట్నం. ఆశనిరాశల వైకుంఠపాళి.

"రోజువారీ జీవితంలో మనం సంకుచిత స్వార్థ వలయాల్లో తిరుగుతున్నాం. ఆ పరిమిత పరిధిలో చిన్న చిన్న సంఘటనలు, మన అనుభూతులు మనకు ప్రధానమవుతున్నాయి. వాటిని సాధించే క్రమంలో అందరితో, అన్నింటితో ఐక్యతను విస్మరిస్తున్నాం" అంటారు విశ్వకవి రవీంద్రుడు. ఆశల్ని అదుపుచేయమని మతం చెబుతుంది. ఆశల్ని తీర్చమని పూజలు చేస్తాం. ఈ రెండింటి మధ్య వారధి జీవితం. ఆశను ఆర్పాలా? తీర్చాలా? ఆర్పితే ఆగిపోయేది ఆశ కాదు, జీవితం. ఆశ లేకుంటే మనుగడేది? ప్రగతి ఏది? సమాజం నడవాలన్నా, నాగరికత వికసించాలన్నా ఉద్దీపన ఉండాలి. అడవుల నుండి ఆకాశందాకా ఆశ కొంగు పట్టుకొనే మనిషి ప్రస్థానం చేసింది. ఆశలేని జీవితం గాలితీసిన బంతితో సమానం. అది దివ్వెకు తైలంవంటిది. దాన్ని చంపితే, మొక్క నుండి వ్రేళ్ళను తెంచినట్లే. ఆశను అంతం చేయడం కాదు, అర్థం చేసుకోవడం అవసరం. ఆశకు ఆజ్యం పోటీ. దాన్ని మండిస్తే, దురాశై పైకిలేస్తుంది. అందుకే దాన్ని మార్కెట్లో పెట్టకు. వికృతాలకు బలివ్వకు. ఆశ తీరితే ఆనందం. ఓడితే దుఃఖం. ఆశ అనే నాణానికి సుఖదుఃఖాలు రెండు ముఖాలు. ఓడిన ఆశల్ని చెరిపేస్తేనే కొత్త ఆశలు చిగురిస్తాయి. ఆశను భయం, దురాశను దుఃఖం నీడలా వెన్నంటి ఉంటాయి.

మనిషికి ముప్పు ఏది? రొట్టె కాదు, బోను. ఆర్థికవేత్త మిల్టన్ ఫ్రీడ్ మెన్ "అత్యాశను అంతం చేయడం కాదు మన సమస్య. దానివల్ల హాని జరక్కుండా చూడడం" అంటారు. అత్యాశ అవసరమా? అనర్థమా? గొంతు నిండని తృష్ణ అనర్థం కాదా? నిద్రాహారాలు మాని, కూడబెట్టడంలో శాంతి ఎక్కడ? పదవైనా, పరపతైనా, పైసలైనా ఆనందానికి హేతువైతేనే అందం. ఇది కావాలి, అది కావాలంటూ నింగినీ, నేలనీ ఏకం చేస్తాం. గమనిస్తే, మనకు కావలసింది మన దగ్గరే ఉంది. అనవసరంగా ఆయాసపడ్డామని ఆఖర్లో తెలుసుకుంటాం. స్వార్థం స్వావలంబనను చెరచే చీడపురుగు. అది ఆశకు దొడ్డిదారి చూపించే దొంగ. స్వార్థం దుఃఖం తెస్తుంది. నిరపేక్ష కర్మ సుఖం ఇస్తుంది.

మన చదువులు, సంస్కారాలూ మనకు ఏం నేర్పుతున్నాయి? ఆడంబరం, అనుకరించడం. దురాశలు, నిరాశలు. అత్యాశతో అనర్థాలు తెద్దామా? నిరాశ, నిస్పృహ, ఈర్ష్య, ద్వేషం, ఆతృత, ఆరాటం... పన్ను ఎగవేతలు, కుట్రలు, కుతంత్రాలు వెరసి జైలు. అత్యాశ అర్థవ్యవస్థను పరుగెట్టిస్తుందన్నది అబద్ధం. అత్యాశతో ప్రకృతి సంపదను దోచుకుంటున్నారు. ఆర్థిక సమతుల్యాన్నే కాదు, పర్యావరణ సమతుల్యాన్నీ పొట్టన బెట్టుకుంటున్నారు.

మాస్లో కూడా ఇదే చెబుతారు ''అవసరాలు ఆరోహణలో ప్రవహిస్తాయి. అయితే అత్యాశ మనిషిని పిరమిడ్ మొదటి మెట్లలోనే కట్టిపడేస్తుంది. ఆఖరి స్థాయికి చేరుకోకుండా అడ్డుకుంటుంది."

అత్యాశను ఏ మతమూ అంగీకరించదు. విషయాల్ని ప్రేమించేవారు విధాతను ప్రేమించలేరు అంటున్నాయి అన్ని మతాలు. భౌతిక సంపదలపై ఆధిపత్య పోరాటంలో మన పనులు అనైతికం అవుతున్నాయి. వర్డ్స్ వర్త్ మాటల్లో "ఈ ప్రపంచం మనతోనే ఉంది. ముందో, వెనుకో ఆర్జించడంలో, ఖర్చుచేయడంలోనే మన శక్తిని వృధా చేస్తున్నాం. మనదైన ప్రకృతిని చాలా తక్కువగా చూస్తున్నాం."

అవసరాలు తీరాలి. ఆశలు నెరవేరాలి. అత్యాశలు అంతమవాలి. ఆశ ఘర్షణను సృష్టిస్తుంది. అత్యాశ హింసకు కారణమవుతుంది. నాకూ ఎలుకలకు మధ్య జరుగుతున్న యుద్ధంలా. మనకు మనం ఎదగడం ఆశ. మనది కానిది కోరడం దురాశ. మొదటిదాన్ని వదలకుండా, రెండవదానికి దొరక్కుండా బ్రతకడంలోనే ఆనందం ఉంది. ఆశను

సాగదీస్తే దురాశవుతుందా? సాగదీసి చూద్దాం. మిన్నుకి నిచ్చెన వేయడం దురాశ. కానీ మిన్ను మీద కాలుపెట్టాక అది ఆశగా మారింది. చందమామ రావే అనడం దురాశ. చందమామ చెంతకు వెళ్లడం ఆశ. ఆశకు భాష ఉండదు. భావం ద్వారా బయటపడుతుంది. ఆశకు శరీరం లేదు. మనసుంది. అది ప్రయాణిస్తుంది. అదే దురాశ? మనసు లేని విహంగం. ఆశలకు అమ్ముడుపోతే అత్యాశ. అత్యాశలో కూరుకుపోతే దుర్దశ. దురాశకు దురద ఎక్కువ. తను సుఖపడదు. మనల్ని సుఖంగా ఉండనివ్వదు. వాటికి తొందరెక్కువ. పరిగెడుతాయి. మనల్ని పరుగెత్తిస్తాయి. దయాదాక్షిణ్యాలు తెలీని రాక్షసులు అవి.

మనం మనుషుల్ని తూస్తాం. వాళ్లలో ఉన్నదాన్ని కాదు, వాళ్లవద్ద ఉన్నదాన్ని. ఆ తూకంలో తూగాలనుకుంటాం. అందుకే ఈ పరుగు. అందుకే ఈ పోటీ. అందులో స్వీయానందంకన్నా, శునకానందమే ఎక్కువ.

ఉద్దీపనను అంతం చేయగలమా? ఉద్దీపనను ముక్కగా వొాస్తున్నామా? మొత్తంలో భాగంగా చూస్తున్నామా?

ఆశను జీవితం మొత్తంలో భాగంగా భావించినప్పుడు అది ప్రేరకంగా పనిచేస్తుంది.

పేదరికాన్ని ప్రాక్టీస్ చేయమంటారు. 'ఇక చాలు' అనమంటారు. అడుక్కోవడం ఆపేయమంటారు. కొందరు సన్యసిస్తారు. గుండు చేయిస్తారు. పేరు మార్చుకుంటారు. అన్నింటినీ, అందర్నీ విడచి ఆశ్రమంలో చేరుతారు. కానీ, ఆశ్రమం కోసం చందాలు అడుగుతారు.

ఎందుకు యిలా జరుగుతుంది? పేదరికాన్ని వెదుక్కుంటూ వెళ్ళి, పేదగా ఉండలేకపోతున్నాం.

మన మఠం, మతం, మన కులం, సంఘం, మన సిద్ధాంతం, వేదాంతం... ఇవన్నీ ఉద్దీపనలే.

పతంగమైనా, జీవితమైనా ఎగరాలి. అప్పుడే అందం, ఆనందం. ఎగరాలంటే ఆశల రెక్కలు తొడుక్కోవాలి.

వయసు పెరుగుతుందంటే, బాల్యం తరుగుతుందని. ఏదీ కోల్పోకుండా దేన్నీ పొందలేం. గుర్తుంచుకొండి. దేనికోసం దేన్ని కోల్పోతున్నామో తెలుసుకోవడమే జీవితం.

సెల్ ఫోన్ తీసుకున్నాం. జ్ఞాపకశక్తిని తగ్గించుకున్నాం. వాహనాలు కొనుక్కున్నాం. ప్రమాదాలు పెంచుకున్నాం. అభివృద్ధికి అర్రులు చాస్తున్నాం. పర్యావరణాన్ని పణంగా పెడుతున్నాం. తస్మాత్ జాగ్రత్త.

నా కోసమే నేను బ్రతకడం బాధ. మా కోసం నేను బ్రతకడం సంతోషం. మా కోసంలో కుటుంబం ఉండొచ్చు. సమాజం ఉండొచ్చు. దేశం ఉండొచ్చు. మన కోసం బ్రతకడం ఆనందం. మనకోసంలో మానవాళి ఉంది.

ఆలోచన విస్తీర్ణం పెరిగిన కొద్దీ బాధ తగ్గుతుంది.

మా డివిజనల్ కమిషనర్‌గారు నన్ను కుటుంబంతో ఇంటికి పిలిచారు. విందు మధ్యలో నాకు ఒక ఫోను వచ్చింది. 'మీకు రేపు కాన్పూర్ రేంజ్ ఐజిగా బదిలీ అవుతుంది. సి.ఎం. గారు ఆమోదించారు. నిజం' అని ఫోను.

నాలో ఎలుకలు పరుగెత్తాయి. నాలో కుదురు తప్పింది. వాళ్ళు ఏం మాట్లాడుతున్నారో నాకు వినబడడం లేదు.

యింటికి వచ్చాక మా ఆవిడకు చెప్పాను. 'ఎక్కడకు బదిలీ అయితే అక్కడకు వెళ్తానని, బదిలీ కోసం ఎవర్నీ అడగనని మీరు ఒట్టేసుకున్నారు. మళ్ళీ మీరు వీళ్ళ మాటల్లో గింగుర్లు కొడుతున్నారెందుకు? అతని ఫోను బ్లాక్ చెయ్యండి' అని ఖండితంగా చెప్పింది నా భార్య.

అప్పుడు నాకు తెలిసింది నాలో ఎలుకలు తిరుగుతున్నాయని. అవి బోనుకు దొరుకుతున్నాయని.

అలాంటి ఫోను నంబర్లను బ్లాక్ చేసాను. అయినా నా మనసు తీపికబురు కోసం ఎదురు చూడ్డం మానలేదు.

ఆలోచించాను. చిన్న సవరణ చేశాను. 'నాకు బదులు నాలో' అని చేర్చాను. మార్పు నాలో రావాలి. నాకొచ్చే ఫోనుల్లో కాదు.

ఆ తర్వాత రెండు బదిలీల సూచీలు వచ్చాయి. నా మనసు అటు చూడనైనా చూడలేదు.

నేనూ ఎలుకనే. నాలా చాలామంది కూడా ఎలుకలే.

ఇది కథ కాదు. యదార్థ సంఘటన. ఎలుకకు, నాకూ ఇది జీవన సమస్య.

కిల్లాడ సత్యనారాయణ
ఉత్తరప్రదేశ్. ఫోన్: 833 398 7838.

ఇంగ్లాండులో హిందూ దేవాలయాలు

– తంగెడ విశ్వేశ్వర ప్రసాద్

ఐల్స్‌బరీ హిందూ దేవాలయం: పూరీ జగన్నాథ్ దేవాలయా నమూనాల్లో నిర్మించబడుతున్న విలక్షణ దేవాలయం. ఐల్స్‌బరీ హిందూ దేవాలయ ట్రస్టు యూకే ఛారిటీ సంస్థ హిందూ ధర్మాన్ని, సంస్కృతిని పాటించడం కుటుంబం సమాజం పట్ల వ్యక్తి కర్తవ్యాన్ని బోధించడం ముఖ్య ఆశయంగా పనిచేస్తుంది. 2018లో మొదటిసారిగా ఐల్స్‌బరీ, బకింగ్‌హామ్ షైర్, చుట్టుప్రక్కల హిందువులందర్నీ కూడగట్టి వినాయక చవితిని నిర్వహించి, సదాశయంగల కొద్దిమంది మిత్రులతో సమాజ సేవాకేంద్రం ఏర్పడింది. వివిధ కార్యక్రమాల ద్వారా హిందూ కమ్యూనిటీలో పరస్పర సంబంధాలను పెంపొందించడం, చిన్నపిల్లల్లో బాల్యం నుండే హిందూ సాంప్రదాయ విలువల్ని బలోపేతం చేస్తూ, సామాజిక బాధ్యతపై అవగాహన కలిగించడమనే ఉత్తమ ఆశయంతో సంస్థ ప్రారంభించబడింది. దేవాలయంలోని ముఖ్యమైన మూర్తికి ఏ పేరూ ఉండకపోవడం ప్రత్యేకత. ఎవరి ఇష్టానుసారం వారు దేవునిగానీ, దేవతనుగానీ ఊహించుకోవచ్చు. హిందువులెవరైనా సామూహిక పూజలు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. గుడిలోకి ప్రవేశిస్తూనే గంట మోగించడం, సమస్త దేవతలను ఒకే మూర్తిలో పూజించడం ఈ దేవాలయ విశిష్టత. హనుమాన్ చాలీసా పఠనం, సిద్ధివినాయక, సరస్వతీ మంత్రాల్ని జపించడం, ప్రతి పండుగ వెనుకనున్న కథను వివరించడం, సఫల ఏకాదశి, బ్రహ్మసంహిత పూజలు మొదలైనవి సమాజం చేపట్టే కార్యక్రమాలు. విశాలమైన స్థలాన్ని సేకరించి అందులో దేవాలయ నిర్మాణం చేపట్టే ప్రణాళికలో, 2022లో మొదలుపెట్టి రెండు సంవత్సరాలలో పూర్తి చేయాలన్నది ట్రస్టు సంకల్పం. 12 పౌండ్ల వార్షిక సభత్వంలో సభ్యులను చేర్చుకోవడం, విరాళాల ద్వారా నిధులను సమకూర్చుకోవడం ట్రస్టు చేపడుతున్న కార్యక్రమాలు. అందరం కలిస్తే సాధిస్తాం అన్న నినాదంతో పనిచేస్తుంది.

బర్మింగ్ హాం లక్ష్మీనారాయణ దేవాలయం: శ్రీ హిందూ కమ్యూనిటీ సెంటర్ లక్ష్మీనారాయణ మందిరాన్ని అభివృద్ధి చేసింది. శిథిలావస్థలో ఉన్న చర్చిని బాగుచేసుకోవడానికి పదిసంవత్సరాలు కృషిచేసి 1989లో హనుమాన్ విగ్రహ ప్రతిష్టించి బర్మింగ్ హామ్ హిందువులకు వివిధ సేవలందిస్తుంది. మందిరం కమ్యూనిటీ సెంటర్‌లో అంతర్భాగం. హిందూ పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ధార్మిక సంస్థ. గుజరాత్, హిందీ భాషా తరగతులు కరాటే, యోగాలో శిక్షణ కల్పిస్తుంది. మేలైన ఆధ్యాత్మిక జీవనం ఆశ్రయంగా పనిచేస్తుంది. గీతాభవన్ ఇక్కడి మరో దేవాలయం. ఇందులో దుర్గాపూజలు, రోజూ రెండుసార్లు హారతి ఆదివారాల్లో బాలాజీ పూజలు జరుగుతాయి. హిందూ సాంస్కృతిక కేంద్రంగా 1969లో ప్రారంభించబడిన ఈ ప్రాంతపు మొట్టమొదటి దేవాలయం. మందిర 50వ వార్షికోత్సవంలో ప్రిన్స్ రిచర్డ్ పాల్గొనడం విశేషం. 2015లో సర్వమత శాంతి సమావేశం నిర్వహించింది. శాంతియుత సహజీవనానికి మతాల మధ్య అవగాహన, ఇతర మతాలను గౌరవించడం అవసరం అని తీర్మానించింది. ముఖ్యమైన హిందూ

పండుగలు జరుపుకోవడం, వివాహ వేదిక ద్వారా పెండ్లి సంబంధాలు కుదర్చడం, సందర్భానికి తగిన సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టటం, ఇండియాలో కరోనా బాధితుల సహాయం కోసం నిధులు సేకరించడం మొదలైన కార్యక్రమాలతో సమాజసేవలో ముందువరుసలో ఉంది.

కేంబ్రిడ్జి – ఇండియన్ కమ్యూనిటీ & కల్చరల్ అసోసియేషన్: భిన్నత్వంలో ఏకత్వం అసోసియేషన్ ఆశయం. దుర్గామాత, కాళీమాత, సరస్వతీదేవిలు మందిరంలో కొలువై పూజలందుకునే ముఖ్యదేవతలు. మన పండుగలను, హోలీని ఘనంగా జరుపుతుంది. ప్రజల మధ్య సౌహార్ధం, సామరస్యం, సంయోజనం సాధించడానికీ, భారతీయ కళాప్రాభవాన్ని, వైవిధ్యాన్నీ ప్రదర్శించడానికి కృషిచేస్తుంది. ఇరవై సంవత్సరాల క్రితం కేంబ్రిడ్జి కౌన్సిల్‌లో నుండి లీజుకు తీసుకున్న భవనంలో ఇంతకాలం మందిరం నడిచింది. లీజు గడువు పూర్తి కాగానే మందిరాన్ని ఖాళీ చేయవలసిరాగా ఐదువేలమంది హిందువులు పూజలు చేసుకునే సౌకర్యాన్ని కోల్పోయారు. కేంబ్రిడ్జికి 40 మైళ్ల దూరంలో ఉన్న భారత్ భవన్ తప్ప సమీపంలో ఇంకొక హిందూ దేవాలయం లేదు. అందువల్ల త్వరలోనే నగర కేంద్ర ప్రాంతంలోనే స్థలం సేకరించి గుడి కట్టాలని గట్టి పట్టుదలతో అసోసియేషన్ ఐదువేల పౌండ్లను సేకరించగలిగింది. త్వరలో స్వంత భవనంలో శాశ్వత మందిరం నిర్మించుకుని 'వసుధైక కుటుంబం' ధర్మసూత్రాలన్నీ అమలు చేస్తూ స్థానిక హిందువులకు సేవలందించడానికి సిద్ధంగా ఉంది.

కోవెంట్రీ – సిద్ధివినాయక దేవస్థానం: తిరుక్కోవిల్ ట్రస్టు నిర్వహణలో 2011 నుండి సేవలందిస్తున్న దేవాలయ సముదాయం ఇది. ముఖ్యమందిరంలో వినాయకుడు, చిన్నచిన్న మందిరాలలో మురుగన్, శివ, దుర్గ, భైరవ, నవగ్రహ విగ్రహాలు పూజలందుకుంటాయి. ఇక్కడ పరమశివుణ్ణి నీలకంఠన్‌గా, సుబ్రహ్మణ్యస్వామిని మురుగన్‌గా పిలుచుకుంటారు. శ్రీ ముత్తు మారియమ్మన్ మందిరంగూడా దేవాలయంలోని ఒక భాగమే. మూడు తలలలో మరొక వినాయకుని విగ్రహం ఉండటం విశేషం. వినాయక రథోత్సవ సందర్భంగా పదిరోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఊరేగింపులో స్థానికులు కూడా పెద్దసంఖ్యలో పాల్గొంటారు. నాదస్వర బృంద సంగీతంలో, ముఖ్యమైన నగర వీధుల్లో ఊరేగింపు జరుగుతుంది. ట్రస్టు ఆధ్వర్యంలో 'హిందూ ఆర్ట్ కాలేజీ' నడుస్తుంది. కళ భాషాతరగతులు జరుగుతాయి.

లీస్టర్ హిందూ దేవాలయం: 1969లో ప్రారంభించబడి యువతరానికి హిందూ సంస్కృతీ సాంప్రదాయాలను పరిచయం చేయడం ముఖ్య ఆశయంగా పనిచేస్తున్న దేవాలయం. మొదట్లో రాధాకృష్ణ విగ్రహాలతో ప్రారంభమైన దేవాలయంలో ఇప్పుడు శివరాత్రి, శ్రీరామనవమి, హనుమజ్జయంతి, కృష్ణజన్మాష్టమి మొదలగు ముఖ్యమైన పండుగలు నిర్వహించబడుతున్నాయి. భక్తిదర్శన్ పేరుతో వార్షిక సంచికను, 2011 నుండి క్రమం తప్పకుండా ప్రచురిస్తుంది శ్రీ శక్తిమందిరం. ఇక్కడి మరొక దేవాలయం లీస్టర్ ప్రాంత గొప్ప సంపదగా భావించబడుతుంది. శ్రీరామ, హనుమ, శనీశ్వర జయంతులను, సత్యనారాయణ వ్రతాన్ని, గోమాత పూజల్ని, వినాయక చవితి, నిమజ్జన కార్యక్రమాల్ని నిర్వహిస్తుంది. పై రెండు దేవాలయాలే కాకుండా స్వామినారాయణ మందిరం, ఇస్కాన్ మందిరం, సనాతన మందిరం, ఇతర హిందూమత ప్రచార సంస్థలలో, ఎక్కువ హిందూ మందిరాలున్న నగరంగా లండన్ తర్వాత రెండో స్థానంలో ఉంది.

సాయిబాబా మందిరం: గిల్డ్‌హాల్, కాబన్ స్ట్రీట్‌లో 2014లో నెలకొల్పబడి సేవలందిస్తున్న దేవాలయం. 1909లో నిర్మించబడిన పాత భవనం ఇది. ఎర్ర ఇటుకల నిర్మాణం. ఒకప్పుడు వర్కుషాపు, అంగవికాలుర సేవా కేంద్రంగా పనిచేసిన భవనం మందిరంగా మార్చబడింది. దీనిలో నిత్యపూజలు, మూడుపూటలా హారతులు ఉంటాయి. సాయి చరిత్ర, హనుమాన్‌చాలీసా పఠనాల తర్వాత ద్వారకామాయి హారతి, పల్లకీసేవ, అనంతరం సాయంత్రం 9 గం.లకు భక్తులకు భోజన సౌకర్యం ఉంటుంది. షిర్డీసాయిబాబా ఆలయంలో జరిగినట్లే ఇక్కడా పూజలు జరుగుతాయి. నిత్యసాయివ్రత పూజలో భక్తులు ఉచితంగా పాల్గొంటారు.

పైన చెప్పినవాటికితోడు బర్క్‌షైర్, లూటన్, ఎసెక్స్, ససెక్స్ మొదలైనచోట్ల ఆర్యసమాజం, హిందూసమాజాల నిర్వహణలో దేవాలయాలు, గీతాభవన్‌లు ఉత్సవాలను నిర్వహిస్తూ, సమాజసేవలో నిమగ్నమై ఉన్నాయి.

లండన్ వెలుపల, ఇంగ్లండ్‌లో సందర్శకులు, భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శించుకునే మరో మూడు ముఖ్యమైన మందిరాలు, దేవాలయాలను గురించిన వివరాలు తెలుసుకుందాం.

వాట్‌ఫర్డ్ – ఇస్కాన్ భక్తి వేదాంత మందిరం:

ఇస్కాన్ అంతర్జాతీయ కృష్ణచైతన్య ఉద్యమం, హరేకృష్ణ ఉద్యమంగా కూడా పిలువబడుతుంది. ఇస్కాన్ వ్యవస్థాపకుడు శ్రీ భక్తి వేదాంత ప్రభువాద. 15వ శతాబ్దం నుండి పశ్చిమ బెంగాల్‌లో వ్యాప్తిలో ఉన్న గౌడీయ వైష్ణవ మత సాంప్రదాయ వ్యవస్థను అనుసరిస్తుంది. హిందూ భక్తి తత్వాన్ని, పూజావిధానాన్ని పశ్చిమ దేశాలకు పరియం చేసి భక్తిచైతన్యాన్ని కలిగించడం కోసం వెలసిన ఉద్యమం. పాశ్చాత్య దేశాలమీద చెరగని ముద్రవేసింది. 1965లో అమెరికాలో మొదలై అనతికాలంలోనే అన్నిదేశాలకు వ్యాపించింది. మొదటి ఇస్కాన్ మందిరం న్యూయార్క్ నగరంలో 1956లో స్థాపించబడి, ప్రస్తుతం విశ్వవ్యాప్తంగా వందల సంఖ్యలో పెరిగిపోయింది. ఇతర దేశాల్లో బాగా వ్యాప్తి చెందిన తర్వాతనే హరేకృష్ణ ఉద్యమం మన దేశంలోకి ప్రవేశించడం చిత్రమైన విషయం.

లండన్ నగరానికి ఉత్తరంగా ఇరవైమైళ్ళ దూరంలో వాట్‌ఫర్డ్‌లో ఉన్న ఇస్కాన్ భక్తి వేదాంత మూనర్ హరేకృష్ణ మందిరం, రాధాకృష్ణ మందిరంగా కూడా ప్రఖ్యాతిగాంచింది. 75 ఎకరాల సువిశాల ఎస్టేట్‌లోని మానర్ హౌస్‌లో ఉన్న మందిరం ఇది. యూకేలోని ఇస్కాన్ నమాఖ్యకు అత్యంత విలువైన ఆస్తిగా పరిగణించబడుతుంది. ఎక్కువమంది కృష్ణ భక్తులను ఆకర్షించే అందమైన ఆధ్యాత్మిక కేంద్రం కృష్ణభక్తులేగాక చిన్నపిల్లలు, సందర్శకులు చాలా ఇష్టపడే ప్రదేశం. గిఫ్ట్ షాపులు, కాంటీన్లు విశాలమైన నడవలతో మందిర పరిసరాలు శుభ్రంగా, సుందరంగా, ఆహ్లాదకరంగా ఉంటాయి. ఈ విషయంలో మనస్ఫూర్తిగా పనిచేసే వాలంటీర్ల పాత్ర కొనియాడతగింది. వారాంతపు శలవల్లో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆధ్యాత్మిక ప్రేరణకు యోగాకు, ధ్యానానికి, నాట్యసంగీతాలకు భక్తిసంకీర్తనలకు నిలయం. సెమినార్లు, నాట్యప్రదర్శనలు, నాటికలు, వర్క్‌షాపులు, వేదాంత చర్చలు మొదలైన కార్యక్రమాలు నిరంతరం జరిగే ఆధ్యాత్మిక ప్రపంచం. ఉద్యానవనాలు పచ్చని ప్రకృతిలో ఆహ్లాదం కలిగిస్తూ రాజసం ఉట్టిపడే భవన ప్రాంగణం. మందిరంలోకి ప్రవేశం ఉచితం, హిందూ సాంప్రదాయంలో వివాహాలు జరగడం ఇక్కడి విశేషం. సంగీత కార్యక్రమాలకు, భక్తి సంకీర్తనలకు, దర్శన పర్యవేక్షణకు, భక్తివేదాంత పాఠశాల, కళాశాలల నిర్వహణకు యువజన కార్యక్రమాల పర్యవేక్షణకు, గోకుల్ సంరక్షణకు, వివాహాలు జరిపించడానికి వేర్వేరు విభాగాలు ఉన్నాయి. అన్నింటి సమన్వయంలో ఇది గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా, పవిత్రమైన నందర్శనా ప్రదేశంగా రూపుదిద్దుకుంది. వేదాంత విద్య, హిందూ సంస్కృతి, సంస్కారం, జీవనశైలిని పెంపొందిస్తూ సమాజాన్ని మెరుగైన దిశలో నడిపించడం కోసం మందిరం చేస్తున్న కృషి ప్రశంసనీయం.

నగర జీవిత కాలుష్యం, ఒత్తిడిల నుండి విముక్తి కలిగించే ప్రశాంతమైన ప్రదేశం 'గ్రీన్ లాంజ్'గా పేరుగాంచిన మందిరం, భక్తులపాలిటి మరో బృందావనం. కృష్ణ, బలరామ, గీతా, శ్రీరామ, ప్రభుపాద జయంతులు, శ్రీరామనవమి, శరత్పూర్ణిమ మొదలైన ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. హోలీ, దీపావళి, రథయాత్ర మొదలైనవి ఇక్కడ జరిగే మరికొన్ని వేడుకలు. ఇందులోని వ్యవసాయ క్షేత్రంలో ఆవులు, ఎద్దుల సంరక్షణతోపాటు కూరగాయలు పండించబడతాయి. గోశాలలో డెయిరీ, పాలకేంద్రం నడుస్తున్నాయి. సహజమైన ఎరువులలో పండించిన కూరగాయలు, చేతితో పితికిన పాలు, స్వచ్ఛమైన పాల ఉత్పత్తులు అమ్మకానికి ఉంటాయి.

మిలియన్ పౌండ్ల విలువ చేసే ఇంత పెద్ద ఎస్టేటు ఇస్కాన్ మందిరంగా మారడం వెనుకనున్న కథ అత్యంత కుతూహలం కలిగిస్తుంది. 1960వ దశాబ్దిలో ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియుల్ని ఉర్రూతలూగించిన

'బీటిల్స్' బృందంలో జార్జి హారిసన్ ఒకడు. ఇతడు గాయకుడు, గేయ రచయిత, సంగీతవేత్త, గొప్ప గిటార్ వాద్యకారుడు. విశేషమైన కీర్తిప్రతిష్టలు, అపారమైన ధనసంపత్తిని ఆర్జించాడు. అఖండ విజయంలో బీటెల్స్ బృందానికి క్షణం తీరిక లేని ప్రయాణాలు, సంగీత కార్యక్రమాలతో ఒత్తిడి పెరిగిపోతుంది. అనుక్షణం వెంటబడే అభిమానులు, మీడియా నుండి తప్పించుకొని, ప్రశాంతత వెతుక్కుంటూ బీటిల్స్ ఋషికేశ్ చేరుకుంటారు. అక్కడ భారతీయ ఆధ్యాత్మికతలోని గొప్పతనానికి ఆకర్షితులౌతారు. యోగా, ధ్యానం పట్ల మక్కువ పెంచుకుంటారు. హారిసన్ పూర్తి శాకాహారిగా మారిపోతాడు. అదేసమయంలో ఇస్కాన్ సభ్యులతో కలిగిన పరిచయంవల్ల హరేకృష్ణ ఉద్యమం పట్ల ఆకర్షితుడౌతాడు. స్వీయ సంగీత రచనలో సృష్టించిన గీతాలు భారతీయ సంగీతాన్ని మేళవించి అఖండ విజయాన్ని సాధిస్తాడు. హారిసన్ సృష్టించిన హరేకృష్ణ మంత్రం, మహామంత్ర ప్రభావం అనే సి.డి.లు అత్యధికంగా అమ్ముడుపోయి కొత్త రికార్డును సృష్టిస్తాయి. సితార్ మాస్ట్రో పండిట్ రవిశంకర్‌తో కలసి, సంగీత కార్యక్రమాల్లో పాల్గొని బంగ్లాదేశ్‌కు ఆర్థిక సాయం చేస్తాడు. గొప్ప వితరణశీలిగా, మానవతావాదిగా పేరుతెచ్చుకుంటాడు.

ఇస్కాన్ వ్యవస్థాపకుడు భక్తివేదాంత ప్రభుపాద లండన్‌లో తొలిసారి స్థాపించిన ఇస్కాన్ మందిరాన్ని సందర్శించడానికి 1969లో లండన్ వస్తాడు. అప్పటికే హారిసన్ హరేకృష్ణ ఉద్యమంలో ప్రముఖపాత్ర పోషిస్తూ ఇస్కాన్ అనుచరుడిగా సేవలందిస్తూ ఉంటాడు. అప్పుడే హారిసన్ ప్రభుపాదకు పరిచయమౌతాడు. అప్పటి నుండి హారిసన్ జీవితం ఇస్కాన్ సేవలకు అంకితమౌతుంది. సెంట్రల్ లండన్ సోహోలోని మందిరం సభ్యుల, భక్తుల సంఖ్య పూజాకార్యక్రమాలు పెరిగిపోవడంతో బాగా ఇరుకైపోతుంది. పైగా సోహో బాగా రద్దీగా ఉండే ప్రాంతం. మరో క్రొత్త ప్రదేశం కొరకు వెతుకుతున్న సమయంలో హారిసన్ తన ఎస్టేట్‌ను ఇస్కాన్‌కు విరాళంగా ఇస్తాడు. ప్రభుపాద హారిసన్‌ను దేవదూతగా పరిగణిస్తాడు. చనిపోయే ముందు తన వేలి ఉంగరాన్ని హారిసన్‌కు అందించవలసిందిగా అనుచరులను ఆదేశిస్తాడు. హారిసన్ తన కుమారునికి 'ధని' అని పేరు పెట్టుకుంటాడు. ప్రేమించే భర్తగా, వాత్సల్యం కురిపించే తండ్రిగా జీవితం గడుపుతాడు. కృష్ణభక్తిని అణువణువునా నింపుకుంటాడు. హారిసన్ పాటల్లో హిందూ సంస్కృతి అంతర్లీనంగా ప్రవహిస్తూ ఉంటుంది. భక్తిపారవశ్యంలో సృజించిన 'మై స్వీట్ లార్డ్' పాటలో హరేకృష్ణ మంత్రం వినిపిస్తుంది. కృష్ణుని మీద ఖరీదైన పెయింటింగు పుస్తకం వెలువరించడానికి అవసరమైన నిధులు సమకూరుస్తాడు. ఇస్కాన్‌పై అభిమానంతో సంపదను దానం చేసి ఇంగ్లాండ్‌లోని హిందూ కమ్యూనిటీకి అత్యంత ప్రీతిపాత్రుడవుతాడు. లాస్‌ఏంజెలిన్‌లో 2001 నవంబర్‌లో తుదిశ్వాస తీసుకుంటాడు.

ప్రస్తుతం ఈ మందిరం కొత్త భవనాల నిర్మాణం బృహత్తర కార్యక్రమంలో నిమగ్నమై ఉంది. త్వరలో నిర్మాణం పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉంది.

ట్రివిడేల్ శ్రీ వేంకటేశ్వర దేవాలయం (డడ్లీ)

ఐరోపా అంతటికీ ఇదే పెద్ద వేంకటేశ్వర దేవాలయం. వెస్టు మిడ్‌లాండ్స్, ట్రెవిడేల్‌లో డడ్లీ పట్టణ శివార్లలో ఉంటుంది. బర్మింగ్ హామ్ సిటీకి సమీపంలోనూ, లండన్‌కు 110 మైళ్ల దూరంలో ఉండే ఈ దేవాలయం శంకుస్థాపన 2006లో జరిగింది. తిరుమల తిరుపతి దేవాలయాన్ని దర్శించుకున్న అనుభూతిని కలిగిస్తుంది.

దేవాలయంలో నిలువెత్తు వేంకటేశ్వర స్వామి విగ్రహంతోపాటు పద్మావతీ హనుమాన్ ఇతర హిందూ దేవతలు కొలువై ఉంటారు. వైష్ణవ దేవాలయం అయినప్పటికీ ప్రాంగణంలో శివాలయం, శక్తి, కార్తికేయ, వినాయక, అయ్యప్ప, షిర్డీసాయి, నవగ్రహ విగ్రహాలు కూడా పూజలందుకుంటాయి. పెద్ద కమ్యూనిటీ హాలు, గెస్టుహౌసు, గాంధీ శాంతి మందిరం ఆలయ ప్రాంగణంలోని ఇతర భవనాలు. తిరుపతిలో జరిగినట్లుగా ఇక్కడా పెండ్లిండ్లు, నామకరణాలు, అన్నప్రాశనలు జరుగుతాయి. పదిహేనువందల నుండి రెండువేల వరకు, వారాంతాల్లో ఇంకా ఎక్కువమందికి నిత్యాన్నదానం జరుగుతుంది. స్కూలు ట్రిప్పులు, వివిధ సాంస్కృతిక

కార్యక్రమాలను బాగా ప్రోత్సహిస్తుంది. ఇందులో వేదవిజ్ఞాన కేంద్రం వేదపాఠశాలను నడుపుతుంది. ఇంగ్లండులోని భారతీయులంతా, తరచుగా ఆంగ్లేయులు కూడా దేవాలయాన్ని దర్శించుకుంటారు. దేవాలయ సంస్థ ఉదార సేవాసంస్థగా పేరుగాంచింది. దర్శనం ఉచితమే కాని పూజాకార్యక్రమాలకు, లడ్డూప్రసాదాలకు రేట్లు నిర్ణయించబడి ఉంటాయి.

దేవాలయ ప్రత్యేకత, విశేషాలు: ప్రశాంత వాతావరణం, విశాలమైన ప్రాంగణంలో ఉన్న అందమైన దేవాలయ సముదాయం ఎన్ని కార్లనైనా పార్కు చేసుకునే సౌకర్యం అదీ ఉచితంగా ఉండడం విశేషం. ఇంగ్లండులో ఎక్కడ పార్కు చేయాలన్నా స్థలం దొరక్కపోవడం ఒక సమస్య అయితే పార్కింగు ఫీజు మరొక సమస్య. శాకాహార భోజనంతో అన్నదానం. ప్రశాంతి నిలయం, గీతా భవన్‌ల నిర్వహణ ప్రశంసనీయం. రాజసం ఒలికే సింహద్వారం, గోపురం, ధ్వజస్థంభం, రథయాత్ర, టెంట్లలో అన్నదానం, పిల్లలకు ఆటస్థలం ఇందులోని ఆకర్షణలు. డడ్లీ పట్టణంలోని జూ, కాజిల్, అడ్వెంచర్ పార్కు ఇక్కడ చూడదగిన ఇతర ప్రదేశాలు. రోజూ జరిగే పూజా కార్యక్రమాలలో వాలంటీర్ల పాత్ర శ్లాఘనీయం. ఇంగ్లండులోని భారతీయులకు తిరుపతిని దర్శించుకున్న అనుభూతిని కలిగినస్తూ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతుంది. 2007లో నిర్మితమైన అనంతపద్మనాభ స్వామి కొలను, శివాలయ నిర్మాణంలో హిమాలయాల పాదాలచెంత, గంగాతీరంలోని రాతిని ఉపయోగించడం విశేషం.

కార్మార్టమ్ షైర్, స్కందవేల్: ఇంగ్లండు పశ్చిమ దిశలో, దక్షిణాన వేల్సులో లండన్‌కు 224 మైళ్ల దూరంలో ఉంటుంది. వేల్సు ప్రాంతం అంతా కొండలు, లోయలు, సముద్రతీరపు అందమైన నగరాలలో అలరారుతూ సందర్శకులను ఆకర్షించే ప్రదేశం. భారతీయులకు మిక్కిలి ప్రీతిపాత్రమైనది స్కందవేల్ ఆశ్రమం. అంత దూరం ప్రయాణం చేయడం ఒక ఇబ్బంది అయితే అక్కడ ఉండటానికి వసతి సౌకర్యం లభించడం మరో సమస్య. ఆశ్రమంలో తప్ప ఉండడానికీ, తినడానికీ వేరే దారి ఉండదు. ఇప్పుడిప్పుడే స్కందవేల్ సమీపాన ప్రైవేట్ లాడ్జీలు వెలుస్తున్నాయి.

1973లో కార్మార్టమ్ షైర్‌లో స్కందవేల్ ఆశ్రమం స్థాపించబడింది. నగర జీవనానికి దూరంగా, అందమైన ప్రకృతి ఒడిలో, ప్రశాంత వాతావరణంలో, లోయలో ప్రవహించే కొండవాగు ప్రక్కన ఇరవై ఎకరాల వ్యవసాయ క్షేత్రం (ఫాంహౌస్)లో ఉన్న ఆశ్రమం. దీని స్థాపకుడు గురుశ్రీ సుబ్రహ్మణం, ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి అన్నట్లుగా శ్రీలంకలో జన్మించి (తండ్రి ఉన్నత పదవిలో ఉన్న వైద్యాధికారి, తల్లి పరమ ధార్మిక చింతనగల గృహిణి) రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన పిదప లండన్ చేరి కొద్దిపాటి శిష్యగణాన్ని కూడగట్టుకొని, చిన్న మందిరం స్థాపించి, ఏకేశ్వర తత్త్వాన్ని బోధిస్తూ చివరకు వేల్సు చేరుకోవడం ఆశ్చర్యం కలిగించే విషయం.

ఆధునిక, నాగరక ప్రపంచానికి దూరంగా ప్రశాంత వాతావరణంలో ఆశ్రమ స్థాపనకు అనువైన ప్రదేశం కొరకు ఇంగ్లండు అంతా వెతుకుతున్న సమయంలో వేల్సులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పాతబడిన ఫాంహౌస్ ప్రకటనలు చూస్తాడు. చేతిలో దాన్ని కొనగలిగిన డబ్బు లేకున్నప్పటికీ అడగకుండా కావలసిన నిధులు గుప్త విరాళాల రూపంలో సమకూడిన వైనం విస్మయం కలిగిస్తుంది. 1976 నుండి ఆశ్రమం ధర్మ, కర్మ, భక్తి యోగా ప్రాతిపదికగా, సత్యం, ధర్మం, శాంతి అహింసా సూత్రాలను పాటిస్తూ మతాలు వేరైనా దైవం ఒక్కడే అనే సిద్ధాంతం మీద నడుస్తుంది. జాతి మత ప్రాంతీయ భేదం లేకుండా ప్రతి ఒక్కరూ ఆశ్రమంలో ప్రవేశించవచ్చు. సాధువులు, సన్యాసినులతో నడిచే ఆశ్రమంలో వసతి సౌకర్యం మూడు పూటలా భోజన, ఫలాహారాలు, రవాణా సౌకర్యం, దర్శనాలు, సేవలు అన్నీ ఉచితమే. ఆశ్రమంలో ఏ పనిలోనైనా సందర్శకులు, భక్తులు పాల్గొని సేవలందించవచ్చు. ఆధ్యాత్మిక కేంద్రంగా నమోదైన ఆశ్రమం 1980లో ధార్మిక సంస్థగా గుర్తింపు పొందింది. వినాయక మందిరం, మురుగన్ దేవాలయం, రంగనాథ దేవాలయం, కొండమీద కాళీమాత మందిరం ఇందులోని ముఖ్యమైన దేవాలయాలు. తెల్లవారక ముందే జరిగే నిత్య పూజలు, భజన కార్యక్రమాలలో భక్తులు

తప్పనిసరిగా పాల్గొంటారు. కొండమీది కాళీమాత మందిరానికి తెల్లవారు జామున చలిలో వృద్ధులు వికలాంగులు తప్ప అందరూ నడిచే వెళ్తారు. నడవలేనివారికి బస్ సౌకర్యం ఉంటుంది.

కాళీమందిరంలో పూజాకార్యక్రమాలు ముగించుకుని కిందికి దిగి వస్తూ అప్పుడే మొదలయ్యే వేకువ వెలుగులో కనిపించే ప్రకృతి దృశ్యం కడు రమణీయంగా ఉంటుంది. ఆవులు, పోనీలు, గొర్రెలు, ఆశ్రమ ఏనుగును చూస్తూ కొండ దిగుతాము. మధ్యలో లోయనానుకుని ఉన్న ఉద్యానవనంలో ఉన్న గురునుబ్రహ్మణ్య సమాధిని చూస్తాము. కిందికి దిగివచ్చేసరికి పొగలు కక్కుతూ ఉదయపు భోజనం సిద్ధంగా ఉంటుంది. రుచికరమైన శాకాహార భోజనం, వేడివేడి కాఫీ, టీలు సేవించి తృప్తిగా, సంతోషంగా తిరుగు ప్రయాణం చేస్తాము. పూర్తిగా విరాళాల మీద నడిచే ఆశ్రమ స్వయంసమృద్ధిని సాధించడమేకాక ఇతర ధార్మిక సంస్థలకు సాయం అందిస్తుంది. ప్రతి ఏటా లక్షమంది భక్తులు, నందర్శకులు ఆశ్రమాన్ని దర్శించుకుంటారు. వీరిలో మానసిక ప్రశాంతత కొరకు ఆశ్రమానికి వెళ్లేవారే ఎక్కువ. శని, ఆదివారాలు, శలవు రోజుల్లో సందర్శకుల సంఖ్య అధికంగా ఉంటుంది. ఒకటి రెండు రోజులకన్నా ఎవరూ అక్కడ ఉండరు. ఎక్కువ రోజులు ఉండదలచుకున్నవారు ఆశ్రమ సేవలో తప్పక పాల్గొనవలసి ఉంటుంది. ఆశ్రమ ధర్మశాలలో (హోస్పస్) రోగులకు ఉచిత చికిత్స, వయోవృద్ధులకు ఆశ్రయం దొరుకుతుంది. ఆశ్రమంలో బుద్ధజయంతి, క్రిస్మస్ పండుగలు కూడా నిర్వహించబడతాయి.

2016లో స్విట్జర్లండు మంచుపర్వతాలలో మరో స్కంద ఆశ్రమం స్థాపించబడింది.

(స్కందవేల్ సమీపంలో తప్పక చూడవలసిన ప్రదేశాలు: గ్విల్ రైల్వే, పాతకాలపు ఆవిరి యంత్రంతో నడిచే రైలు. ఉత్తర దక్షిణాలలో ఉన్న రెండు స్టేషన్ల మధ్య 8 మైళ్ల పొడవున గ్విల్ నదివెంట ఉన్న స్టాండర్డు గేజ్ రైలు. ప్రకృతి మధ్య అందాలొలికే కొండగట్టు నేపథ్యంలో చేసే రైలు ప్రయాణం గొప్ప అనుభవంగా మిగిలిపోతుంది. రెండోది లాంగ్ స్టాఫెన్ కాజిల్. 12వ శతాబ్దపు నార్మన్ కోట, నిర్మాణ కౌశలానికి, ఆడంబరానికి మచ్చుతునక. రెండువైపులా సముద్రం, ఒకవైపు నది సముద్రంలో కలిసే చోటు కొండమీద నిర్మించబడిన కోట ప్రకృతి సౌందర్యానికి ఆలవాలం.)

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్
(వెంబ్లీ - లండన్, మే 29, 2021)
ఫోన్: 798 139 8250. tangeda.prasad@gmail.com

అహింసా పరమోధర్మః

ఒక భిక్షువు గురిచూసి రాయి విసరడంలో ఒకప్పుడు చాలా నేర్పరిగా ఉండేవాడు. అతడి గురి తప్పిపోవడమంటూ జరిగేది కాదు. చాలా వేగంగా రివ్వున పోయే లక్ష్యాన్నైనా అతడు కొట్టగలిగిన ప్రజ్ఞ చూపేవాడు.

ఒకరోజున అతడు నదిలో స్నానం చేసి ఇతర భిక్షువులతో తీరాన ఇసుకలో కూర్చొని ఉన్నాడు. అప్పుడు తాము కూర్చున్నచోటికి పైగా ఎగురుతూ పోతూ ఉన్న రెండు జలపక్షులను వాళ్లు చూశారు. అప్పుడు గురిచూసి రాయి విసరటంలో చాలా నేర్పరి అయిన భిక్షువు చాపల్యంతో తన గొప్ప విద్యను ప్రదర్శించుకోవడానికి తన మిత్రులతో చూడండి, చూడండి ఆ ఎగురుతున్న పక్షులను కూడా నేను ఎంత బాగా కొట్టగలనో అంటూ ఒక పెద్ద గులకరాయిని గురిపెట్టి ఆ పక్షులపై విసిరాడు. అందులో ఒక పక్షి ఒక కంటికి ఆ రాయి బలంగా తగిలింది. అది విలవిలలాడుతూ ఆక్రందిస్తూ నేలకూలి ప్రాణం విడిచింది. ఆ తరుణ భిక్షువు పాదాల చెంతనే అది పడి కొట్టుకొని చనిపోయింది.

తక్కిన భిక్షువులు ఇది హర్షించలేదు. వెళ్లి బుద్ధభగవానుడికి చెప్పారు. ఆయన ఆ భిక్షువును తన దగ్గరకు పిలిపించుకొని "నాయనా! నువ్వు ఆ పక్షిని ఎందుకు చంపావు? భిక్షువైయుండి నీవు నీ సాధనలో కరుణ, జాలి, దయ పెంపొందించుకోవాలి కాని హింసామార్గాన్ని అనుసరించకూడదు కదా! నీ బంధవిముక్తిని నీవు సాధించాలంటే ఇలా చేయకూడదు కదా! నీ లక్ష్యసిద్ధి మనస్సును నియంత్రించడంలో చూపించాలి" అని అతడికి ఉద్బోధించాడు. మనోవాక్కాయ కర్మల ద్వారా ప్రాణిహింస విసర్జించాలి. భిక్షువు లక్ష్యం అది కావాలి అని బుద్ధభగవానుడా భిక్షువుకు ఉపదేశించాడు.

ధమ్మపదం గాథలు - అనువాదం : అక్కిరాజు రమాపతిరావు



– పతివాడ సూర్యనారాయణ

ఆంధ్రుల సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక రంగాల్లో విప్లవం, మార్పు, మలుపులకు నాందీవాక్యం పలికిన రాజమహేంద్రవరంలోనే ఆధునిక తెలుగు నాటక వికాసానికి కూడా అంకురార్పణ జరిగింది.

నిజానికి రాజమహేంద్రవర ప్రాంతంలో నాటక ప్రదర్శనలు ఆదికవి నన్నయ్యకు ముందునుండే ఉన్నట్లు మనకు ప్రబల నిదర్శనాలున్నాయి. నన్నయ భారతంలో *నాటక ప్రయోగంబునుబోలె ఘనరస పాత్రశోభితంబైనదాని* అన్నారు. ఇంకా ఆ ఆదికవే తనను భారత రచనకు ప్రోద్బలం చేసిన రాజరాజ నరేంద్రుడు తనతో ఇలా అన్నట్లు వ్రాశారు.

విమలమతిం బురాణములు వింటి ననేకము లర్థధర్మశా
స్త్రముల తెఱం గెఱింగితి నుదాత్త రసాన్విత కావ్యనాటక
క్రమములు పెక్కు సూచితి...

దీనినిబట్టి రాజరాజుతో పాటు నన్నయ మంచి నాటకాలను ఏదో రూపంలో చూచినట్లు తెలుస్తూ ఉంది.

చాళుక్యుల కాలంలో అంకమాలికలు అనే ఒకవిధమైన గేయ నాటికలు ప్రచారంలో ఉన్నాయి. కుమార శ్రీకంఠుడనే నటుడు *ఆర్యక్రీడ* అనే 7 అంకముల నాటకము ప్రదర్శించినట్లు శాసనాల వల్ల తెలుస్తోంది. తరువాత రెడ్డిరాజుల కాలంలో కూడా వామనభట్ట బాణుల సంస్కృత నాటకాలు వసంతోత్సవాల్లోను, దేవుని కళ్యాణోత్సవాల్లోను ప్రదర్శించేవారని తెలుస్తోంది.

ఇక ఆధునిక నాటకరంగానికొస్తే తెలుగులో సకల సాహితీ ప్రక్రియలకు, సంస్కరణోద్యమాలకు ఆద్యులు, వైతాళికులకు వైతాళికుడైన కందుకూరి వీరేశలింగం పంతులుగారే తెలుగు నాటక ప్రథమ ప్రదర్శనానికి ప్రయోక్త. 1880లో వీరేశలింగంగారి *వ్యవహార ధర్మబోధిని* (ప్లీడర్ల నాటకం) విజయనగరం మహారాజావారి బాలికా పాఠశాలలో వీరేశలింగంగారి మిత్రులు, శిష్యులు ప్రదర్శించారు. దీనికి కవి, ప్రయోక్త కందుకూరివారే. ఇది సంపూర్ణ నాటక లక్షణాలున్న నాటకం కాదు. అదే సంవత్సరంలో అంటే 1880లోనే ధార్వాడ నాటక సమాజం వారు అన్ని హంగులతోను ప్రదర్శనలిచ్చారు. వారు విడిచి వెళ్లిన పాకల్లోనే ధార్వాడ వారి ప్రభావంతో *రత్నావళి, చమత్కార రత్నావళి* రెంటినీ పంతులుగారే వారి శిష్యులు, స్థానిక కాలేజీ విద్యార్థులతో ప్రదర్శించారు. ఈ విధంగా వీరేశలింగం ఔత్సాహిక నాటక రంగానికి కూడా ప్రారంభకులు కావడం మరో విశేషం. ఈ ప్రమాణంతోనే 1980లో ఆంధ్ర నాటక శతజయంతి జరుపుకున్నాం. నేడు వారి జన్మదినాన్ని తెలుగు నాటక దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

తొలి స్వతంత్ర్య తెలుగు నాటక రచన 1860లోనే *మంజరీ మధుకరీయం* తో ప్రారంభమయింది. రచయిత కోరాడ రామచంద్రశాస్త్రి వృత్తిరీత్యా బందరు నోబెల్ కళాశాల అధ్యాపకులైనా తూర్పుగోదావరి జిల్లా కోనసీమవారే. కానీ వారి నాటకం 1908 వరకు ప్రచురణకు నోచుకోని కారణంగా రాజమండ్రివాసులైన కొక్కొండ వెంకటరత్నం పంతులు గారి *నరకాసుర విజయ వ్యాయోగము* 1872లో తొలి ముద్రణ పొందిన నాటకమయింది. దీనికి ఏకాంకిక లక్షణాలున్న కారణంగా, కొక్కొండవారిని ఏకాంకికకు వరవడి పెట్టినవారిగా

పేర్కొనాలి. కొక్కొండవారు కవి, నాటకకర్త, పత్రికా సంపాదకులు కూడాను. వారు వృత్తిరీత్యా రాజమండ్రి వాస్తవ్యులై, జీవితాంతం రాజమండ్రిలోనే నివసించారు. వీరి నాటకమే ప్రథమ ముద్రిత నాటకం.

నిజానికి 14వ శతాబ్దంలో మడికి ఆనన్తయ్య విష్ణు మాయా నాటకం వ్రాసి రాజమహేంద్రవర వేణుగోపాలస్వామికి అంకితమిచ్చినట్లు చరిత్ర చెబుతోంది.

శ్రీ వావిలాల వాసుదేవశాస్త్రి మరో నాటక ప్రక్రియలో ఆద్యులు, వారి *నందక రాజ్యం* (1880) ప్రథమ సాంఘిక నాటకం కావడం, మీదుమిక్కిలి తొలి పద్య నాటకం కావడం రాజమండ్రి గర్వించతగ్గది. వావిలాలవారు షేక్స్పియర్ *జూలియస్ సీజర్* తెలుగులో అనువదించి, ఇంగ్లీషు నాటకాన్ని జాతీయ భాషలో తర్జుమా చేసిన తెలుగు వారిలో ప్రథములుగాను దేశ భాషల్లో ద్వితీయుడుగాను ఖ్యాతిగాంచారు. వావిలాలవారు కూడా వృత్తిరీత్యా రాజమండ్రివాసులై, ప్రఖ్యాత నాటకకర్తలైన చిలకమర్తి లక్ష్మీనరసింహం, వడ్డాది సుబ్బారాయుడు, పానుగంటి లక్ష్మీనరసింహారావులకు గురువులవడం గొప్ప విశేషం. వావిలాలవారి మరణానంతరం వారి గ్రంథాలు స్థానిక గౌతమీ గ్రంథాలయానికే బహూకరించారు.

రాజమండ్రి నాటక చరిత్రలో మరో మైలురాయి వేణీ *సంహార* జైత్రయాత్ర. నాటకకర్త వసురాయ కవిగా ప్రసిద్ధి చెందిన *భక్త చింతామణి* కృతికర్త వడ్డాది సుబ్బారాయుడు. *వేణు సంహారం* అర్ధ శతాబ్దం పాటు జైత్రయాత్ర చేసింది. దీనిని ప్రదర్శించని తెలుగు నాటక సమాజమే లేదంటే అతిశయోక్తి కాదు. వసురాయకవి హిందూ నాటకోజ్జీవక సమాజం స్థాపించి ప్రథమ సమాజ స్థాపకులై, తొలి నాటక కర్తల్లో పాత్ర పోషణ కూడా చేసినవారిగా కీర్తి వహించారు. ఆయన నటుడైన దర్శకుడు. తెలుగు నాటకాల్లో పద్యపఠనాన్ని రాగయుక్తంగా చదవడం ప్రవేశపెట్టింది ఆయనే. అందుకే చిలకమర్తి వారు *ప్రాణంబులు లేచి వచ్చు పద్యము విన్నన్* అన్నారు.

తొలి నాటకకర్తల్లో చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి కొక విశిష్ట స్థానముంది. వీరి *గయోపాఖ్యానం* నాటకం నేటికీ విజయభేరీని మోగిస్తూ ఉంది. 1942 నాటికే లక్ష ప్రతులు అమ్ముడుపోయి చరిత్ర సృష్టించి, శతజయంతి జరుపుకున్న నాటకమిది. చిలకమర్తి *ప్రసన్నయాదవము, కీచక వధ* మొదలైన నాటకాలెన్నో వ్రాసి ప్రసిద్ధులయ్యారు. మరో నాటకకర్త సాక్షి వ్యాస సంపుటాలకర్త పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు. వారిది రాజమండ్రి సమీప గ్రామం సీతానగరమే. వారి పాదుకా పట్టాభిషేకం, *రాధాకృష్ణ, విప్రనారాయణ, కంఠాభరణం* ఉన్నత నాటక శిల్పానికి ప్రతీకలు. వారు పిఠాపురం సంస్థానంలో నాటక వికాసానికి ఎంతో దోహదం చేశారు. వారు ముప్పయి నాటకాలు పైనే వ్రాశారు.

తిరుపతి వెంకట కవులుగా ప్రసిద్ధులైన మహాకవుల్లో చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు జగత్ప్రసిద్ధులు. వారు రాజమండ్రి సమీప గ్రామం కడియంవారే. వారి *పాండవోద్యోగ విజయాలు* బహుళ ప్రచారం పొంది, నేటికీ *కురుక్షేత్రం* అనే వాడుక పేరుతో విజయ పరంపరలు పొంది కాంట్రాక్టు నాటకాలకు కొంగు బంగారమైంది. శ్రీ తిరుపతి వెంకటకవుల *పాండవోద్యోగ విజయాల* పద్యాలు, చిలకమర్తివారి *గయోపాఖ్యాన* పద్యాలు తెలుగువారినోట శాశ్వతంగా నిలిచిపోయాయి.

చరిత్రాత్మక, ఇతివృత్తాలతోను, జాతీయ, రాష్ట్రోద్యమాల స్ఫూర్తితోను, అనేక ఉత్తమ నాటకాలు దేశం నలుమూలలా వెలువడ్డాయి. ఆ రచనల్లో ఆద్యులలో ముందున్నవారిలో శతాధిక గ్రంథకర్త, *భారత, భాగవత రామాయణా* లను ఒక చేత్తో తెనిగించిన శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారొకరు కావడం గర్వించతగ్గ విషయం. వారి *బొబ్బిలి యుద్ధం* చరిత్ర సృష్టించిన చారిత్రక నాటకం. కొన్ని వేల ప్రదర్శనాలకు నోచుకున్న నాటకమిది. శ్రీపాదవారు *స్వరాజ్యోదయము, గాంధీ విజయ ధ్వజము* వంటి నాటకాలు వ్రాసి, వారి దేశభక్తిని ప్రకటించుకున్నారు. ఆ విధంగానే నండూరి బంగారయ్యగారి *ఆంధ్రతేజం* రాజమండ్రికి అద్దరినున్న కొవ్వూరు వాస్తవ్యులు వేదాంత కవి *తెలుగుతల్లి* – ద్రోణంరాజు వారి *ఆంధ్ర పతాక* రాష్ట్రోద్యమానికి ఊపిరయ్యాయి.

విప్లవ నాటకం కూడా రాజమండ్రిలోనే వెలువడటం తెలుగు నాటక చరిత్రలో విప్లవం. ఆంధ్ర నేతాజీగా,

నిష్కళంక దేశభక్తునిగా పద్నాలుగు సంవత్సరాలు జైలు జీవితం గడిపిన మద్దూరి అన్నపూర్ణయ్యగారి చిచ్చుర పిడుగు నాటకం 1929లో వారు సంపాదకులుగానున్న కాంగ్రెస్ పత్రికలో ప్రచురించి కఠిన కారాగారవాసం అనుభవించారు. ఈ నాటకం 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి సంబంధించిన మంగళదాస పాండ్య వీరగాథ, 1929లో గుంటూరు యూత్ లీగ్ తరఫున అమంచర్ల గోపాలరావు, కోనపల్లి సుబ్రహ్మణ్యం, మదభూషి వెంకటాచారి ఆనాటి మునిసిపల్ ఛైర్మన్, బారిష్టర్ నడింపల్లి నరసింహారావుగారి అండదండలతో పోలీసులకు దొరక్కుండా ప్రదర్శించారట. ఆనాటి ప్రేక్షకుల్లో ప్రముఖ దేశభక్తులెందరో ఉన్నారు. శ్రీయుతులు దేశభక్త కొండా వెంకటప్పయ్య, నేతి చలపతి, నేతి లక్ష్మీనారాయణ, శీలం సుబ్బారావు, కవుతా చలపతి మొదలైనవారి సమక్షంలో వీరోచితంగా ఈ నాటకం ప్రదర్శించబడింది. పోలీసులు సాక్ష్యం దొరక్క ఒక్కర్ని కూడా అరెస్టు చేయలేకపోయారట. అదే ఆనాటి స్వాతంత్ర్యోద్యమం నాటి కట్టుబాటు. ఆ నాటకం అసలు వారి సహచరులు రామచంద్రుని వెంకటప్ప రచించగా అన్నపూర్ణయ్య తనపై వేసుకొని జైలుశిక్ష అనుభవించారు.

తొలి నాటకకర్తల్లో రాజమండ్రి వాస్తవ్యులు ద్రోణంరాజు సీతారామారావు తెలుగు నాటకానికి చేసిన సేవ గణనీయమైనది. వీరు గున్నేశ్వరరావు నాటక సమాజానికి, బందరు నాటక సమాజాలకు సుమారు ముప్పయి నాటకాలవరకు వ్రాశారట.

ఈ సందర్భంలో తొలి నాటకకర్తలపై ఆచార్య పింగళి లక్ష్మీకాంతం నిశిత పరిశీలన రాజమహేంద్ర కవుల మహోన్నతిని తెలియజేస్తుంది. *శైలీ సౌలభ్యము* నకు తిరుపతి వేంకటశ్వేర కవులను, సందర్భ సన్నివేశ నైపుణ్యమునకు ధర్మవరంవారిని, సంవాద కౌశలమునకు పానుగంటివారిని, సజీవ పాత్ర సృష్టికి వేదంవారిని, వ్రయోగ సారళ్యమునకు చిలకమర్తివారిని పేర్కొనవలసియుండునని పింగళివారు పేర్కొన్న అయిదుగురిలో ముగ్గురు రాజమహేంద్రవర ప్రాంతీయులే కావడం విశేషం.

ఆనాటి వచన నాటకర్తలో శ్రీపాద కామేశ్వరావు (ప్రముఖ సంగీత విద్వాంసులు డా. పినాకపాణి, ఆచార్య గోపాలకృష్ణమూర్తిల జనకులు)గారు సంస్మరణీయులు. వారు రాజమండ్రి నాటక రంగానికి ఎంతో సేవచేసి విశిష్ట స్థానాన్ని పొందారు. వారి నాటకాలన్నీ వచన నాటకాలే. బెంగాలీ, హిందీ, మహారాష్ట్ర, ఒరియా, తమిళం, ఇంగ్లీషు, ఫ్రెంచి, పంజాబీ భాషల నుంచి ఎన్నో నాటకాలు తర్జుమా చేశారు. నాటక రచనలో రాజమహేంద్రవరవాసులు మరెందరో ఉన్నారు. శ్రీయుతులు కవికొండల వెంకటరావు, అల్లిక చంద్రశేఖర కవి, నిడమర్తి జల దుర్గాప్రసాదరాయుడు, జనమంచి వెంకట్రామయ్య, అంకరాజు రామారావు, జయంతి గంగన్న, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, కవికొండల వెంకటరావు, కోపల్లి వెంకట రమణారావు, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, వల్లూరి బాపిరాజు, జొన్నలగడ్డ సత్యనారాయణ, దినవహి సత్యన్నారాయణ, బదిరెట్టి కోటేశ్వరరావు, మల్లంపల్లి శరభయ్య, సత్యదుర్గేశ్వర కవులు, నందివాడ వెంకటరత్న కవి చిలుకూరి రామభద్రశాస్త్రి, బులుసు సీతారామశాస్త్రి, నేదునూరి గంగాధరం, ఆకొండి వ్యాసమూర్తి శాస్త్రి, మల్లాది సూర్యనారాయణ, సంస్కృత నాటకాలు, ఇంగ్లీషు నాటకాలు కూడా ఆ రోజుల్లో వెలువడ్డాయి. చిలుకూరి రామభద్రశాస్త్రి సంస్కృతంలోను, టంగుటూరి శ్రీరాములు (ప్రకాశంగారి సోదరులు) ఇంగ్లీషులోను నాటక రచన చేశారు.

ముందు తరానికి చెందిన ముడుంబై రామానుజాచారిగారు *శిరియాలరాజు చరిత్ర*, *పాండవాశ్వమేధము*, *శ్రీరామానుజ చరిత్ర* రచించారు. వీరి రామానుజ చరిత్ర కు మద్రాసు సుగుణవిలాస సభవారు 1920లో నిర్వహించిన చారిత్రక నాటక పోటీలలో ప్రథమ బహుమతిగా బంగారు పతకాన్నిచ్చారు. వీరి నాటకాలు హిందూ నాటక సమాజంవారు ప్రదర్శించేవారు. తెలుగు నాటకం రాజమహేంద్రవరంలోనే పుట్టి, బంగారు తూగుటుయ్యాలలో పెరిగి, పలు రాష్ట్రాలకు వెలుగునిచ్చి, దేశవిదేశాల్లో తన యశశ్చంద్రికలు దేదీప్యమానంగా వెదజల్లిందనడంలో సందేహం లేదు.

ప్రహసనం:

1920 నాటికి 200 ప్రహసనాలున్నాయట. ప్రహసన మొక నూతన ప్రక్రియ. ఈ నూతన ప్రక్రియ ప్రారంభకులు కూడా కందుకూరివారే. అంతకుముందు ప్రహసనం ఆంధ్ర వాఙ్మయంలో కనిపించదు. ప్రహసనం నవ్వులతో కూడుకొన్నది కాబట్టే ప్ర+హసనమన్నాడు. ఆధునిక సాంఘిక నాటకానికి, నాటికకు వీరేశలింగంగారు ప్రహసన రచనతో వేదికను సిద్ధంచేసి, వాటికి వెలుగుబాటు చేశారు. ప్రహసనం పుట్టుకకు, అభివృద్ధికి, మహోన్నత స్థితికి, రూపాంతరం పొందటానికి రాజమండ్రి కవులే ముఖ్యపాత్ర వహించారు. సంఘసంస్కరణ, సాంఘిక విప్లవం తీసుకురావాలని, ఛాందస భావాల్ని, మూఢవిశ్వాసాలను చీల్చి చెండాడి, కల్మషాన్ని కడిగివేయాలనే దీక్షతో ముందుకు వచ్చిన కారణజన్ముడు కందుకూరి. ప్రహసనమొక వజ్రాయుధమయిందాయనకు. వారి బాటలోనే చిలకమర్తి లక్ష్మీనరసింహం కూడా నడిచారు. సంఘ దురాచారాలు, మునిసిపాలిటీల దురవస్థ, జనాభా లెక్కలు, మూఢవిశ్వాసాలు, రాజకీయాలు ఒకటేమిటి? సమకాలీన సమాజంలోని దురాచారాలను, మోసాలను, అన్యాయాలను ఎత్తిచూపుతూ, గేలిచేస్తూ, చురకలువేస్తూ, ప్రహసనాల్ని రూపుదిద్దారు. ఆ విధంగానే పానుగంటివారి ప్రహసనాలు కూడా ప్రసిద్ధాలు. కంఠాభరణమే ఉత్తమ ప్రహసనమని పరిశోధకులు కొనియాడారు. చెళ్లపిళ్లవారు, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, కామేశ్వరరావులు కూడా ప్రహసన రచనలు చేశారు.

ప్రహసన రచనల్లో సిద్ధహస్తులు, హాస్యబ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావుగారు. వారి చేతిలో ఈ ప్రక్రియ పరాకాష్టనందుకొంది. వారి మాటల్లోను, రాతల్లోను హాస్యపుజల్లులు, వారి రచనల్లో వ్యంగ్యం, చమత్కారమే రాకుండా పర్వతాలు, పానకాలు, మాలోకం, శానయ్య, శరగోపం, దన్, మన్‌లాంటి నవ్వు పుట్టించే పాత్రలు కూడా సృష్టించారు. ఆ పాత్రలకు తెలుగు సాహిత్యంలో శాశ్వత స్థానం సృష్టించారు. ఇవి కాలేజీ, హైస్కూలు విద్యార్థులకు సులభ ప్రదర్శనాలుగా ఉండేవి. నిన్న మొన్నటివరకు అన్ని విద్యాసంస్థలలోను అవే ప్రదర్శనలు. భమిడిపాటివారు ప్రహసనం నాటికగా రూపాంతరం చెందడంలో ఎంతో తోడ్పడ్డారు. ఈ విషయంలో వారి కుమారుడు రాధాకృష్ణ పాత్ర ఎంతైనా ఉంది. ప్రహసనానికి స్వతంత్ర స్థాయిని కల్పించిన కీర్తి భమిడిపాటి కామేశ్వరరావుగారికే చెందుతుంది. భమిడిపాటివారు మోలియర్, మేటర్ లింకులను కూడా అనుసరించారు.

కందుకూరి, చిలకమర్తిల ప్రహసనాలపై జయంతి రామయ్య పంతులుగారి ఈ వ్యాఖ్య గమనార్హం.

శ్రీ వీరేశలింగంగారి హాస్యము చిక్కనిది
శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారి హాస్యము పలుచనిది
శ్రీ చిలకమర్తివారి హాస్యము గిలిగింతపెట్టి నవ్వించును
వీరేశలింగంగారి హాస్యము గిల్లి బాధించును

కందుకూరివారు చేపట్టటంవలననే అధిక సాంఘిక దురాచారాలు రూపుమాశాయి. మరికొన్ని కొత్త రూపాల్లో కులతత్వం, మతతత్వంవంటి మహమ్మారులు, వరకట్న దురాచారంతో కూడిన స్త్రీ ఆత్మహత్యలు, హత్యలు మితిమీరిపోతున్న ఈ కాలంలో వీరేశలింగంవంటి యుగపురుషుడుద్భవించాలేమో!

నాటిక – ఏకాంకిక:

నాటిక, ఏకాంకిక, ఈ రెండూ పర్యాయపదాలుగా వాడారు సమీక్షకులైన ఆచార్య శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, కొత్తపల్లి వీరభద్రరావు, కూర్మా వేణుగోపాలస్వామిగార్లు, *సమాజంలో విస్తృతంగా చెప్పనవసరంలేని సమస్యల్ని సూటిగా, ధాటిగా, క్లుప్తంగా చెప్పటానికి ఒక బలమైన సాధనంగా తెలుగు నాటిక రూపొందింది.* తెలుగులో ఏకాంకిక రచనకు ప్రహసరూపంలో కందుకూరే శ్రీకారం చుట్టారు. తెలుగులో అన్ని సాహిత్య ప్రక్రియల్లో వచ్చిన పరిణామమే నాటక రచనలోనూ ప్రతిబింబించింది. తెలుగులో రెండువేలవరకు సాంఘిక నాటకాలున్నట్లు పరిశోధకులు చెబుతున్నారు. తెలుగు నాటికా సాహిత్యంలో నూతన అధ్యాయాన్ని, వినూత్న విధానాన్ని సృష్టించిన *తప్పెవరిది?* నాటిక 1929లో బెంగుళూరులోను, 1930లో మద్రాసు మ్యూజియం థియేటర్‌లోను, మహానటుడు, నాటక ప్రదర్శనలోను, నటనలోను విప్లవం, మార్పు తెచ్చిన బళ్లారి రాఘవ ప్రదర్శించారు.

అశోకం నాటక రచన, ప్రదర్శన కూడా నూతన అధ్యాయాన్ని సృష్టించింది. దీని రచయిత, వైతాళికుల నంకలనకర్త సామినేని ముద్దుకృష్ణ కూడా రాజమండ్రివాసులే కావడం గర్వించతగిందే. ముద్దుకృష్ణ అనార్కలి రేడియోలో ప్రసారితమైన మొట్టమొదటి నాటిక కావడం కూడా విశేషమే.

నాటికా వికాసానికి, ఔత్సాహిక ఉద్యమానికి ఎంతో తోడ్పడి, మరింత బలాన్ని చేకూర్చిన రచయితల్లో రాజమండ్రివారెందరో! వారిలో ముఖ్యంగా విద్వాన్ సహదేవ సూర్యప్రకాశరావు, తల్లావజ్ఝుల కృత్తివాస తీర్థులు, పడాల రామారావు, పోణంగి శ్రీరామ అప్పారావు, మహీధర రామమోహనరావు, జగన్‌మోహన్‌రావులు, వాడ్రేవు కామరాజు, రావులపర్తి సూర్యనారాయణ, పింగళి వెంకటరామయ్యలను పేర్కొనాలి.

1929లో ఆంధ్ర నాటక కళాపరిషత్ ఏర్పడింది. అది 1941 నుండి నాటక సమాజాల్ని పోటీలకు ఆహ్వానించింది. అదే ఆంధ్రదేశపు నలుమూలలా ఎన్నో కొత్త సంస్థల ఆవిర్భావానికి దోహదం చేసింది. మళ్లీ ఔత్సాహిక నటుల్లో ఉత్సాహం పెల్లుబికింది. ఆంధ్ర నాటక కళాపరిషత్‌కు అనుబంధ సంస్థలెన్నో పోటీపడ్డాయి. ఆ ఉత్సాహంతో మరెన్నో పరిషత్తులు కూడా పోటీల నిర్వహణకు పూనుకున్నాయి. ఈ పునరుజ్జీవ ఉద్యమంలో కూడా రాజమండ్రి రచయితలు వెనుతీయలేదు. ముఖ్యంగా భమిడిపాటి రాధాకృష్ణ, ఎన్.ఆర్. నంది, సి.యస్. రావుల పాత్ర గణనీయమైనది. రాధాకృష్ణ తన కీర్తిశేషులు నాటకంతో ఉన్నత శిఖరాలందుకున్నారు. కొత్త కోణాల్లో కవుల, కళాకారుల దుర్భర జీవితాలు చూపారు. నాటకానికి, నటులకు ఎన్నో పురస్కారాలు పొంది, తండ్రిని మించిన తనయుడనిపించుకున్నారు. ఆ రోజుల్లో ఆయన నాటికలకు ఎదురులేదు, పోటీలేదు. అలాగే ఎంతోకాలం రాజ్యమేలాయి. కీర్తిశేషులు నాటకం రావుగోపాలరావులాంటి ఉత్తమ నటుణ్ణి సృష్టించింది. ఆధునిక నాటకరంగాన్ని ప్రభావితం చేసిన రచయితల్లో రాధాకృష్ణ ముఖ్యులు.

నూతన ప్రయోగాలతో సంచలనాన్ని సృష్టించి ఆధునిక నాటకరంగాన్ని మరో మొహంజదారో తో మరో మలుపుతిప్పిన యన్.ఆర్. నంది పేరు ఆంధ్ర నాటక చరిత్రలో చిరస్థాయిగా ఉంటుంది. 1971లో అరణి నాటకానికి సాహిత్య ఎకాడెమీ పురస్కారం పొంది 1983లో నాటక ఎకాడెమీ వారితో కళాప్రవీణ గౌరవం పొందిన నంది తెలుగువారందరూ గర్వించదగ్గ రచయిత.

మరో నాటికా రచయిత సి.యస్. రావు వారి ఊరుమ్మడి బతుకులు అప్పటివరకు ఉన్న ప్రమాణాన్ని ఛేదించుకొని విజయ పరంపరలు పొందిన నాటిక. ప్రాంతీయమైన యాసతో కూడిన నాటకాలకు ఈ నాటకం విజయం పట్టాభిషేకం, సాహిత్య ఎకాడమీ బహుమతి కూడా పొందింది. ఉత్తమ నాటక రచయితగా తెలుగు విశ్వవిద్యాలయం, పైడి లక్ష్మయ్య స్మారక ధర్మనిధి పురస్కారం, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, తెలుగు విశ్వవిద్యాలయం, ఫిలిం, థియేటర్, టి.వి. డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా అందించిన కందుకూరి వీరేశలింగం రంగస్థల ఉత్తమ రచయిత ప్రారంభ పురస్కారం (2006) పొందడం గొప్ప విశేషం. నేటికీ ఏదో ఒక కొత్తదనం కోసం ఆరాటపడే అభ్యుదయ రచయిత ఈయన. పై ఈ ముగ్గురు మూడు విధాల ఆధునిక సాంఘిక నాటకాన్ని ప్రభావితం చేశారు. వీరి కృషి అసమానమైనది.

ఇంకెందరో రాజమండ్రి రచయితలు ఆధునిక నాటక రంగానికి వారి రచనలతో ఇతోధికమైన సేవచేసి బలం చేకూర్చారు. వారిలో శ్రీయుతులు జి.యన్. పతి, కప్పగంతుల మల్లికార్జునరావు, కావ్యశ్రీ (ధవలేశ్వరం), వాడ్రేవు గవర్రాజు, ఆదుర్తి వెంకట నరసింహమూర్తి, మహతి (పుట్రేవు సుందర్రావు), కె. వీర్రాజు (మధురశ్రీ), మేడూరి వీరవెంకన్న, స్మైల్, ఐ.వి.యస్. అచ్యుతపల్లి, వీరాచారి, పతివాడ, కొండపల్లి, భాస్కరరావు, సాదనాల వెంకటస్వామినాయుడు, పంపన, కంచుమర్తి శ్రీరాములు, పడాల రామకృష్ణారెడ్డి, డా. జి. రాజారావు, యం.వి. నారాయణాచార్యులు ముఖ్యులు. వీరుకాక శ్రీ సన్నిధానం నరసింహశర్మ ఏకపాత్రాభినయాలు, నాటక పద్యాలు రచించారు. బొమ్మకంటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి నాటకాలు, ఏకపాత్రాభినయాలు రచించారు. బొత్సకవి ఇరవై అయిదు నాటకాల వరకు స్థానిక సంస్థలకు, ఇతర

నాటక సంస్థలకు వ్రాశారు. జెట్టి సూర్యనారాయణ కూడా నాటక పద్యాలు రచించారు. కమల్‌కుమార్ అనే యువకుడు పుంఖానుపుంఖాలుగా నాటక కంపెనీలకు నాటకాలు వ్రాశారు.

స్థానిక తెలుగు విశ్వవిద్యాలయం అప్పటి పీఠాధిపతి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం వక్తగా, కవిగా, పండితులుగా, ప్రసిద్ధులు. వారి వృత్తరూపకాలు, నాటికలు ఉత్తమ కవితలకు ప్రతిరూపాలు. వారి *స్వర్ణకమల* చారిత్రక నాటకం, వారి నృత్యరూపకాలు భూటాన్ ప్రభుత్వ ఆహ్వానంతో అక్కడ ప్రదర్శింపబడ్డాయి.

బాలనాటికల్లో ప్రసిద్ధులైన రచయితలు కొందరు రాజమండ్రివారూ ఉన్నారు. శ్రీమతి కోడూరి లీలావతి, శ్రీమతి అద్దేపల్లి వివేకానందదేవి, శ్రీయుతులు జనమంచి రామకృష్ణ, చెరుకుమిల్లి భాస్కరరావులు ముఖ్యులు. శ్రీమతి కోడూరి లీలావతి *బాలవినోదం* కు తెలుగు భాషా సమితి అవార్డు, *బాలచంద్రిక* లకు సాహిత్య అకాడమీ అవార్డు లభించాయి. స్థానిక తెలుగు విశ్వవిద్యాలయ ఆచార్యులు ఆర్.వి.యస్. సుందరంగారు *బాలధ్రువుడు* నాటిక రచించారు.

నాటక విమర్శకులు, సమీక్షకులు, వ్యాఖ్యాతలకు కూడా కొదవలేదు. తెలుగు నాటక ప్రథమ విమర్శకులు శ్రీపాద కామేశ్వరరావుగారే *నాటక మీమాంస* అనే గ్రంథం కూడా వ్రాశారు. పానుగంటివారు సరే వారి సాక్షి లో నాటక ప్రదర్శనాలపై ఎన్నో విమర్శలు చేశారు. భమిడిపాటివారైతే నాటక పద్యపఠనంపై పెద్ద ఉద్యమమే లేవదీసి *ఆంధ్ర నాటక పద్య పఠనం* అనే గ్రంథమే వ్రాశారు. రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలోను, ట్రైనింగ్ కాలేజీలోను తెలుగుశాఖ అధిపతులుగా పనిచేసిన భూపతి లక్ష్మీనారాయణ (బి.హెచ్.ఎల్.) కిన్నెర లో నాటక లక్షణాల గురించి ఎన్నో వ్యాసాలు వ్రాశారు. శ్రీయుతులు శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, కె.వి. గోపాలస్వామి నాటిక సంపుటులకు సంపాదక పీఠికలు వ్రాశారు (నేటి ఉత్తమ నాటికలు, ప్రసిద్ధ నాటికలు), కొత్తపల్లి వీరభద్రరావు తెలుగు భాషపై ఇంగ్లీషు ప్రభావం అనే పరిశోధనా గ్రంథంలో నాటికలపై ఇంగ్లీషు ప్రభావాన్ని సమీక్షించారు.

ప్రముఖ నటులు డా. రాజారావు నాటక ప్రయోగ మనే గ్రంథాన్ని ప్రముఖ రూపశిల్పి కుమార్జీ ఆహార్యం మీద వారి ఉపన్యాస సంకలనాన్ని ప్రచురించారు. సహదేవ సూర్యప్రకాశరావుగారి *రూపకళ* నాటక రంగానికి ఎంతో ఉపయుక్తమైన గ్రంథం, కప్పగంతుల మల్లికార్జునరావుగారి *వ్యాసమాలిక, నాటక సమీక్ష* నేటి రంగస్థలానికి, పోటీ నాటకాలకు సమీక్షా గ్రంథాలు, మధునాపంతులవారి *ఆంధ్ర రచయితలు* తల్లావజ్ఝుల కృత్తివాస తీర్థుల *గీర్వాణ రూపకము* నాటక చరిత్రకు, సమీక్షకు ఉపయుక్త గ్రంథాలు.

ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారు *భట్టబాణుని వేణీ సంహారమ్* మురారి *అనర్ఘ రాఘవం* నాటకాలకి వ్యాఖ్యానాలు వ్రాశారు.

చివరకాదు ప్రథమంగానే చెప్పవలసిన మా గురువులు పోణంగి శ్రీరామ అప్పారావుగారి *నాట్యశాస్త్రం, ఆంధ్ర నాటక వికాసము* నాట్య నాటక రీతులపై, చరిత్రపై సమగ్ర పరిశోధనా గ్రంథాలు. పి.యస్.ఆర్. అప్పారావుగారు గోదావరికి అద్దరివారైనా రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో అనేక సంవత్సరాలు ఉపన్యాసకులుగా ఉండి, మా నాటకాలకు ప్రయోక్తగా ఎంతో కృషి చేశారు. నాటకరంగంపై ఆసక్తికి మా కళాశాల రంగస్థలమే వారికి స్ఫూర్తి. ఆ విషయం వారి *ఆంధ్ర నాటక వికాసము* గ్రంథంలో కృతజ్ఞతలలోనే చెప్పారు.

''రాజమహేంద్రవర ప్రభుత్వ కళాశాలలో పనిచేయుచున్నప్పుడు, ఆ కళాశాల లలితకళా సమితికి ఉపాధ్యక్షుడనై, పెక్కు నాటికా – నాటకములను ప్రదర్శింపజేసినాను. ఆ విధముగా రంగస్థల ప్రయోగ విజ్ఞానము అపూర్వానుభవము గడించెడి సదవకాశమును లభింపజేసిన పోణంగి వారు తెలుగు నాటక పరిణామ చరిత్రను అయిదు దశలుగా విభజించారు.

(ఇంకా ఉంది)

పతివాడ సూర్యనారాయణ
హైదరాబాద్. ఫోన్: 984 921 1500.

ధర్మపురి - కృష్ణగిరిలో జైన మత వైభవం!

- ఎం.ఎస్. రామస్వామిరెడ్డి

ఈ ప్రాంతంలోని అనేక కన్నడ శాసనాల ఆధారంగా జైన దేవాలయాలు జైన మత వ్యాప్తిని గూర్చి వివరంగా తెలుస్తున్నది. క్రీ.పూ. 893 నందు శ్రీమంగలంకు చెందిన వర్తకులగు నిదియణ్ణ మరియు సత్యణ్ణ అనే ఇరవురు ధర్మపురి నగరంలో జైన దేవాలయం కట్టి ఈ దేవాలయంలో పూజాకైంకర్యాలు సక్రమంగా శాశ్వతంగా జరుగటానికి మూల హళ్ళియను గ్రామాన్ని దానంగా ఇచ్చినట్లు శాసనాల ద్వారా తెలుస్తుంది. ఈ మూలహళ్ళియనే గ్రామం ధర్మపురి నగరానికి పశ్చిమ దిశలో 9 కి.మీ. దూరంలో 'మూలక్కాటే' అని పిలువబడుతుంది. ఇదేవిధంగా హోసూరు బాగలూరు మధ్యగల ఇప్పటి జేమంగలం, నందిమంగలం, బాగలూరు మాలూరు మధ్యనగల జయమంగలం అన్నీ జైన స్థావరములవటంచేత చరిత్రకారులు ముమ్ముందు తమ పరిశోధనల ద్వారా మరింత వివరంగా తెలియజేసే అవకాశం ఉంది.

ధర్మపురి నుంచి సుమారు 15 కి.మీ. దూరంలో ఉన్న గ్రామమే మోటూరు. ఈ ప్రాంతంలో జైన స్థావరాలేర్పడి జైన మత వ్యాప్తి జరిగిందనటానికి నిదర్శనంగా ప్రక్కనే ఉన్న కోయిలూర్‌నందు కుంతియమ్మ దేవాలయమున్నది. ఈ దేవాలయ సరిహద్దునే జైనమునులు ఉపయోగించిన రాతి మంచాలున్నాయి. స్థానిక ప్రజలు ఈ మంచాలను పంచపాండవ మంచాలని పిలిచినా జైనాలిక్కడ స్థిరనివాసమున్నట్లు తెలుస్తుంది.

ధర్మపురి నగరం నుండి దక్షిణ నైఋతి దిశలో ఒకప్పటి రాజధాని నగరం అధియమాన్‌కోట ఈ ప్రాంతం నెళంబ రాజుల కాలంలో మహేంద్ర మంగలం అని పిలువబడింది. ఈ ప్రాంతంలో నొళంబరాజులు గంగరాజులు పరిపాలన చేసినట్లు చరిత్రలో చెప్పబడింది. గంగరాజులు చోళరాజుల అధివత్యాన్ని అంగీకరించిన కాలంలో కూడా ఈ పాలంకాన్ని గంగనాడుయని పిలువబడినది. ఇక్కడ జైన పాఠశాల నిర్మాణం జరిగింది. అంతేకాక అధియమాన్ కోటయందు జైనోత్తమ సోమణ్ణయనునతడు జైన దేవాలయమొక్కటి కట్టినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఈ దేవాలయ పూజాకైంకర్యాలకై భూదానాం చేసినాడు. ఈ జైనోత్తమ సోమణ్ణయే శ్రవణ బెళగొళయందలి ప్రధాన తీర్థంకరుడగు మాధవచార్య భట్టారకుని శిష్యుడు. కాలక్రమేణ ఈ దేవాలయం పడిపోగా గర్భ గుడియందలి తీర్థంకరుని విగ్రహం కొన్ని దశాబ్దాలపాటు అలాగే నిల్చిఉండుటను గమనించిన పాలంక ప్రజలు పశ్చిమ ద్వారంతో ఒక దేవాలయమును నిర్మించి తీర్థంకర విగ్రహ ప్రతిష్టగావంచినారు. ఈ విగ్రహాలు చాలా విశిష్టత కలిగియున్నది. నిటారుగా నిలువబడి 5 తలల నాగేంద్ర పడగ తలమీద అమర్చబడి చూడముచ్చటగొల్పు ఈ మూర్తి చుట్టూ ప్రభ పోలికతో చెక్కబడియున్నది. 24 మంది తీర్థంకరులలో ఒక్కడైన పార్శ్వనాథుని విగ్రహ ప్రతిష్ట పూజలందుకొను విధము ఇప్పటికి కూడా పర మత సహనముగల హైందవుల సంస్కృతికి తార్కాణం. ఈ శిల్పశైలి 9-10 శతాబ్దాల కాలంనాటిదని చరిత్రకారుల విశ్వాసం. ఇప్పటికి కూడా అనేక చోట్లయందు ఈ ప్రాంతంలో జైనమునుల శిల్పాలు లభ్యమగుటచేత అనేక శాసనాలు ఇప్పటికే దొరికి ప్రభుత్వ మ్యూజియంలందు భద్రపరచబడియుండుటచేత గతకాలంలో జైనమతమెంత వెలుగును ప్రసరింపచేసినదో మనకు విశదమగుచున్నది. పరిశ్రమించి పరిశోధిస్తే అధియమాన్‌కోట, ధర్మపురి మరియు కడిగత్తూరు మధ్యన అనేక జైన మత చిహ్నాలు దొరికి జైన మతవ్యాప్తినిగూర్చి భావితరాలవారికి సమకూర్చు అవకాశం లేకపోలేదు. క్రీ.పూ. 9-10 శతాబ్దాల కాలంలో నెళంబ మహేంద్ర రాజు జైన మతోద్ధారణకై పలు పాఠశాలలు నిర్మించి ప్రజోపయోగ కార్యములు చేసి జనరంజకంగా పరిపాలించినట్లు చరిత్రకారులు శ్రీ ఏకాంబరనాథన్ మరియు శాంకలింగంగారు నిర్ధారించారు. జైన పాఠశాలలు కనుమరుగైనా జైనతీర్థంకర విగ్రహాల లభ్యమవటంచేత ఈ ప్రాంతం జైనమతవ్యాప్తియందున్న పాలంకమని నిస్సందేహంగా చెప్పవచ్చును.

ధర్మపురి నగరంలోని కోటలో పురాతన దేవాలయం తగడూరు అనబడే ఇప్పటి ధర్మపురి ప్రాంతాన్ని క్రీ.శ. 9వ శతాబ్దంలో మహేంద్రరాజు నెళంబన్ అనబడే మహేంద్ర నెళంబడు పాలించినట్లు చెప్పిన కొన్ని శాసన భాగాలు ఈ దేవాలయ స్థూపం వద్ద కన్పించుచున్నవి. ఈ శాసనాల ద్వారా ధర్మపురియందు జైన పాఠశాలలు, జైనమఠాలు స్థాపించిన విషయం విశదమగుచున్నది. ధర్మపురి నగరంలోని ప్రభుత్వ మ్యూజియంలో ఒక్క మీటరు పొడవు, ఒక్క మీటరు వెడల్పుగల శిలాఫలకంపై ఇద్దరు జైనమునులను పోలిన శిల్పము చెక్కబడిన ఒక్క స్మారకమును చూడదగును.

ఈ శిలయందు చెక్కబడినది ధర్మపురి (పాత తనడూరు)యందు వ్యాపార కుటుంబంలో పుట్టి జైన మత వ్యాప్తిగావించిన నిదియణ్ణ, సంధ్యణ్ణయని చరిత్రకారుల అభిప్రాయం. నేను మొదట ఉపహరించి ఈ విధంగా వీరే జైన దేవాలయ నిర్వహణకై మూలహళ్ళి, ఇప్పటి మూలక్కాడుయను గ్రామమును దానంగా ఇచ్చినట్లు, ఈ గ్రామ దానమును నిదియణ్ణ సంధ్యణ్ణియనువారలు తమ గురువుగారగు కనక సేనాదిసిద్ధాంతభట్టు విజయసేనాది సిద్ధాంతభట్టుకివ్వగా వారు వారి గురువుగారగు సేనావి పాదపద్మములకు సమర్పించి జైన దేవాలయ నిర్మాణమునకు పూనుకొన్నట్లు చరిత్ర వివరిస్తున్నది. ఈ శిలాఫలకంపై చెక్కబడిన ఇరువురి చిహ్నములు క్రీ.శ. 9 శతాబ్దము నుండి క్రీ.శ. 13వ శతాబ్ద మధ్యకాలంలో ధర్మపురిని పాలించిన అధియమాన్ రాజు వారసుడగు విడుగాదళగియే పెరుమాళ్ కాలంలో చెక్కబడుటయేకాక ఇతడు కూడా జైన మతవ్యాప్తికి విశేషంగా కృషి చేశాడు. ఇతడే తిరుమలయందు సైతం జైన శిల్పాల, జీర్ణోద్ధరణగావించినాడు. ఇదేవిధంగా ధర్మపురి జిల్లా హొగేనక్కల్ ప్రాంతంలో దొరికిన ఒక్క పీఠము శ్రీచక్రమును పోలియున్నా చరిత్రకారులు ఇది జైనమత విశిష్టతను కలిగియుండుటచేత హోగేనక్కల్ ప్రాంతంనందు కూడా జైనమతము విస్తరించి యుండినట్లు అభిప్రాయం వ్యక్తపరిచియున్నారు.

ఇన్ని ఆనవాలు జైనమతవ్యాప్తికి నిదర్శనంగా పేర్కొన్నను హోసూరు నగరాన్ననుకొని యందు శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలంలో స్తంభాలమీద చెక్కబడిన జైన మునులు విగ్రహాలు హోసూరు శ్రీ చంద్ర చూడేశ్వరస్వామివారి దేవాలయమునకు వెళ్లు మెట్లు మార్గంలోని సమతల భూమిలో బండరాతి క్రింద గల 'గుహ'ను చరిత్రకారులు పదేపదే ఇది జైనమునులు నివసించి జైన మతోపదేశంగావించిన పవిత్ర స్థలమని ఆరాధనాభావంతో స్మరించుకొంటారు. హోసూరులో అనేక ఆధారాలను **మిసిమి** జులై 2020 సంచికలో వివరించాను. అయినా హోసూరు ప్రాంతంలో జైన మత వ్యాప్తిని గూర్చి ఉదహరించడం అనుగ్రహమే.

ఎం.ఎస్. రామస్వామిరెడ్డి - చిన్నగుట్టప్ప, హోసూరు. ఫోన్: 944 287 2009.

జూదరి లాభనష్టాలు

ఒకప్పుడు బుద్ధభగవానుణ్ణి దర్శించటానికి వచ్చిన ఒక బ్రాహ్మణుడు ఆయనతో ఒక ప్రస్తావన తెచ్చాడు. "మహానుభావా! మీకన్నీ మానవుడికి మేలు చేసే సంగతులే తెలుసుకాని, అతడి వ్యసనాలను, దుర్గుణాలనుగూర్చి ఏమీ తెలియదనుకుంటాను" అన్నాడు ప్రగల్భంగా. బుద్ధభగవానుడు "తనకు ఆ సంగతులు కూడా తెలియకపోలేదు, కీడు చేసేవి, అపకారం చేసేవి అయిన ఆ వ్యసనాలు మాత్రం ఎందుకు తెలియదు నాకు. వినవయ్యా చెబుతాను అవి ఏవో అంటూ..

1. సూర్యోదయం అయి తెల్లగా తెల్లవారిన దాకా నిద్రపోవడం, 2. ఏ పనీ లేకుండా కాలం వెళ్లబుచ్చడం (నిర్వ్యాపారం), 3. క్రౌరం, 4. మాదకపదార్థాలకు అలవాటుపడి మద్యపానం, బుద్ధిమాంద్యాలకు దాసుడు కావటం, 5. అనుమానాస్పదమైన వేళల్లో వీధుల్లో తిరగడం, 6. వ్యభిచారం అని, ఈ ఆరింటినీ పేర్కొనడమేకాక బుద్ధభగవానుడు ఆ బ్రాహ్మణుణ్ణి "మీరు జీవిక కోసం ఏ వృత్తినవలంబిస్తున్నారు?" అని అడిగాడు. అప్పుడా బ్రాహ్మణుడు నిస్సంకోచంగా "జూదమాడటం" అని చెప్పాడు. "పాచికలాటలో ప్రవీణుణ్ణి" అని కూడా చెప్పాడు. "అయితే మీకు దానివల్ల ఆర్జన బాగా ఉంటుందా" అని భగవానుడు ప్రశ్నించాడు. "గెలుస్తుంటారా ఎప్పుడూనూ?" అని కూడా అడిగాడు. "ఒక్కొక్కసారి గెలుస్తాను, ఒక్కొక్కసారి ఓడిపోతుంటాను" అని చెప్పాడు ఆ బ్రాహ్మణుడు. జూదమాడి ఆర్జించడంకన్నా దుశ్చింతలను ఓడించటం శ్రేయస్కరం. జూదమాటలో గెలుపుకన్నా ఇంద్రియ వ్యామోహంతో వచ్చే అవగుణాలను జయించడం చాలా గొప్ప విషయం అని భగవానుడతడికి ప్రబోధించాడు.

ధమ్మపదం గాథలు - అనువాదం : అక్కిరాజు రమాపతిరావు

తెలుగు నవల: అప్పుడు – ఇప్పుడు

– వి. రాజా రామ్మోహనరావు

తెలుగు కథ అంతర్జాతీయ స్థాయిలో ఉందని చాలామంది అంటారు. దాన్ని చాలామంది ఒప్పుకుంటారు. కానీ తెలుగు నవల విషయంలో ఎవరూ అలా అనరు.

నా దృష్టిలో తెలుగు నవలా అంతర్జాతీయ స్థాయికి తగ్గకుండానే ఉంది. మల్లాది రామకృష్ణ శాస్త్రిగారి నవల 'కృష్ణాతీరం', జి.వి. కృష్ణారావుగారి 'కీలుబొమ్మలు', వి.డి. ప్రసాదరావుగారి 'నాకబలి' 'మినువాక' లత 'మోహనవంశీ' రావూరి భరద్వాజ 'పాకుడురాళ్లు' కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్లై – 'బోయకొట్టములు పండ్రెండు...' ఇలా ఎన్నో విభిన్నమైన నవలల్ని చెప్పుకోవచ్చు. చలంగారి 'మైదానం', బుచ్చిబాబుగారి 'చివరకు మిగిలేది', ఉన్నవవారి 'మాలపల్లి', ఉప్పల లక్ష్మణరావుగారి 'అతడు – ఆమె', గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర', రాచకొండ విశ్వనాథశాస్త్రి 'అల్పజీవి' బృహత్తర నవలా నిర్మాణం, అనన్య సామాన్య ప్రతిభ ఉన్న 'వేయిపడగలు' ఇలా ఎంతో ప్రసిద్ధి, ప్రాచుర్యం పొంది దశాబ్దాల తరబడి తెలుగువారిని మెప్పిస్తున్న నవలలు ఎన్నెన్నో ఉన్నాయి. అంతేకాదు, ఇంకా పదిమంది దృష్టిలోనూ సరిగా గుర్తింపు పొందని నవలలూ ఉన్నాయి. అలాంటివాటిలో మధురాంతకం మహేంద్ర రాసిన 'స్వర్గసీమకు స్వాగతం' నవలని ముందుగా చెప్పుకోవాలి. కేవలం నూటపదకొండు పేజీల నవల ఇది. రాయలసీమ ప్రాంతంలోని కుప్పం నుంచి పెద్దపర్తిగుంట బస్సు ప్రయాణం ఈ నవల. కానీ కొన్ని గంటల ఆ ప్రయాణం ఆధారంగా మహేంద్ర మన దేశపు కొన్ని దశాబ్దాల చరిత్రని చెప్పగలిగారు. సాహిత్యానికి నోబుల్ ప్రైజ్ పొందిన ఆల్‌బర్ట్ కాము ప్లేగ్ నవల కూడా నిడివిలో చిన్నదే. ముందు ఆ పట్టణంలోని ఓ వీధిలో ఓ చచ్చిపోయిన ఎలక కనిపిస్తుంది. దాన్ని ఎవరూ పట్టించుకోరు. అది క్రమేపీ మొత్తం ఆ ప్రాంతాన్ని దాటి తీవ్రంగా విస్తరించిన ప్లేగ్ వ్యాధిగా తయారవుతుంది. ఈ రెండు నవలల్లోనూ రాజకీయ అధికారం, పాలనా వ్యవస్థల స్తబ్ధత, అలసత్వం, దిగజారుడుతనం కథ వెనుక కథలా మన కళ్ళముందు కదులుతుంది. స్వర్ణసీమకు స్వాగతం నవలలో గాఢమైన నిర్మాణ ంఉంది. జీవితపు మారుమూలల్లోని దైన్యాన్ని అత్యద్భుతంగా ఒడిసి పట్టుకున్న నేర్పు ఉంది. ఎటొచ్చీ ఈ నవలకి తగినంత ప్రాచుర్యం లభించలేదు. అంత ప్రసిద్ధ స్థాయికి చేరలేదు. ప్రపంచ స్థాయిలో పేరుపొందిన ప్లేగ్ నవలకేం తీసిపోదు ఈ నవల. ఈ ఒక్క నవలే కాదు, సరైన ప్రచారానికి నోచుకోని కొత్త ఇల్లు – తాళ్ళూరు నాగేశ్వరరావు, ఊబిలో దున్న, వినుకొండ నాగరాజు, ఇదే దారి – బలివాడ కాంతారావు, పితృవనం – కాటూరి విజయసారథి, నగ్న నగరం – పోలవరపు శ్రీహరిరావు, గద్వాల్ చీర – పన్యాల రంగనాథరావు, ఇలా మరెన్నో నవలతో తగిన గుర్తింపు, ప్రాచుర్యం రాలేదు.

తెలుగులో మొదటి నవల ఏది? రంగరాజ చరిత్రమా? రాజశేఖర చరిత్రమా? లేదా మరొకటా? ఎవరు దేన్ని ప్రామాణికంగా అంగీకరించారులాంటి నవల చరిత్రకు సంబంధించిన చర్చలు చాలా జరిగి, వాటన్నింటినీ ఉద్దండులైన నవలా విమర్శకులు అక్షరబద్ధం చేశారు. ఆ కృషి జరిగినంతగా తెలుగు నవలలో వచ్చిన విభిన్న వస్తు వివరాల గురించి, కథాంశాల గురించి అంత కృషి జరిగలేదేమో? అటువంటి కృషి జరిగితే మరెన్నో మరుగునపడిన మంచి తెలుగు నవలలు వెలుగులోకి వస్తాయి. ఆంగ్ల నవలకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం ఉంది. ఒక్కసారి పేరు వస్తే చాలు మిలియన్ల సంఖ్యలో కాపీలు అమ్ముడవుతాయి. తెలుగులో ఇప్పటికీ వెయ్యి కాపీలు అమ్ముకోగలగటం విశేషంగానే ఉంది. వ్యాపారరీత్యానే కాదు వస్తువిషయంగా కూడా తెలుగు నవలకి పాశ్చాత్య నవలలకీ ఎంతో వ్యత్యాసం ఉంది.

పాశ్చాత్య నవలలకి వస్తురీత్యా యుద్ధం ఓ పెద్ద ముడిసరుకు. యుద్ధసమయంలో విలువలన్నీ తల్లకిందులవుతాయి. సామాన్యంగా శాంతిసమయంలో ఉండే కట్టుబాట్లు, నీతినియమాలు యుద్ధకాలంలో వీగిపోతాయి. మనుషుల ప్రవర్తనలో, భావోద్వేగాలలో ఎన్నో మార్పులొస్తాయి. అంతకు ముందు ఊహకు కూడా అందని ఎన్నో చిత్రవిచిత్ర సంఘటనలు జరుగుతాయి. ఏమీ

చేయ్యలేని నిస్సహాయ స్థితిలో ఎందరో ఎన్నో భయంకర దారుణాలకి నిశ్శబ్ద సాక్షులవుతారు. ఈ హెచ్చుతగ్గుల్ని, తీవ్ర సంక్షోభాలని, ఈర్ష్యాద్వేషాల్ని ముడిసరుకుగా చేసుకుని ఎన్నో గొప్ప నవలలు వాళ్లు రాశారు.

మనకి యుద్ధతీవ్రత అంతగా తెలియదు. మనకు తగిలిన తాకిడి మిగిలిన చాలా దేశాలతో పోలిస్తే చాలా తక్కువే. అది మన అదృష్టం. అందుకే అంగీర వెంకట కృష్ణారావుగారి 'విరామం' తప్పితే మరో యుద్ధవాతావరణ నవల కోసం మనం తెలుగులో వెతుక్కోవాల్సిందే. ఇంతకీ చెప్పొచ్చినది ఏమిటంటే యుద్ధ తీవ్రత తాలూకు భావోద్వేగాలు తెలుగు నవలకి వస్తువు కాలేకపోయాయి. ప్రపంచంలోని చాలా దేశాలు యుద్ధ ఉద్విగ్నతలో ఉండగా మనం స్తబ్ద వాతావరణంలో ఉన్నాం. యుద్ధం పాశ్చాత్య నవలలకి గాంభీర్యత, వస్తుగౌరవం తీసుకొచ్చింది. శృంగారం, సాఫ్ట్ పోర్నో పాశ్చాత్య నవలలకి మరో పెద్ద ముడిసరుకు. వాళ్ల వ్యాపార నవలలకి అవే మూలాధారం. హెరాల్డ్ రాబిన్స్, ఇర్వింగ్ వాలసీ, జాకీ కాలిన్స్, ఆమె సోదరి, జొయాన్ కాలిన్స్‌లాంటివాళ్లు రాసిన ఈ రకం జూసీ నవలలు జనాన్ని వెర్రెత్తించాయి. లక్షల కాపీలు అమ్ముడయ్యాయి. కానీ తెలుగు నవల అలా కాదు. తెలుగు నవలకి ఏనాడు శృంగారం ముడిసరుకు కాలేదు. ఇన్ని దశాబ్దాలుగా తెలుగు నవల ఆరోగ్యంగానే ఎదుగుతూ వచ్చింది. 1878 నుంచీ 1920 వరకూ అంటే కందుకూరి వీరేశలింగం పంతులుగారి 'రాజశేఖర చరిత్ర' నుంచి ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'మాలపల్లి' నవల వరకూ సంస్కరణాభిలాష, సాంఘిక దురాచారణ నిర్మూలనం కేంద్రంగా తెలుగు నవల సాగింది. అక్కడ నుంచి దేశ స్వాతంత్ర్య సిద్ధి వరకూ గాంధీగారి జాతీయోద్యమం, దేశభక్తి, స్వతంత్ర్య పోరాటం, పరాయి పాలనా వ్యతిరేకత తెలుగు నవలకి ప్రాధన వస్తువులయ్యాయి. దేశ స్వాతంత్ర్యం వచ్చాక చోటుచేసుకున్న, ఆర్థిక, రాజకీయ, మానసిక మార్పుల మీద పలునవలలు వచ్చాయి. పల్లెజీవితాల్లోని మార్పుల్నీ తెలుగు నవల నిశితంగా పట్టుకుని అక్షరబద్ధం చేసింది. వీటికి సమాంతరంగా ఉద్యమ నవలలు, కొన్ని మధ్యతరగతి నవలలూ వచ్చాయి.

1960 దశకం అటు డిటెక్టివ్ నవలలకి, మరికొన్ని కాలక్షేపం జానపద రచనలకి పెద్ద వ్యాపార స్థాయిని తీసుకొచ్చింది. ప్రతి నెలా వివిధ ప్రచురణ సంస్థలు కొన్ని లక్షల వ్యాపారాన్ని చేస్తూ వచ్చాయి. ఈ రకం నవలలు చేసిన గొప్ప మేలు పాఠకుల సంఖ్యని వేల నుంచి లక్షల్లోకి పెంచాయి. ఈ పరిణామాన్ని గుర్తించి, తమ వ్యాపారానికి వాడుకోవాలని కొన్ని పత్రికలు ప్రయత్నించాయి. ఎంతో తెలివైన పథక రచన చేశాయి. వాటిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక పండుగల పేరు మీద నవలల పోటీని ప్రతి ఏటా నిర్వహించటం ఆరంభించింది. ఆ సమయంలో దిగువ మధ్యతరగతివారికి, మధ్యతరగతివారికి ఈ నవలలు గొప్ప ఆనక్తిని కలిగించాయి. స్త్రీలు రాసే నవలల సంఖ్య పెరిగింది. ఆంధ్రప్రభ నవలల పోటీలో స్త్రీల రచనలకే ఎక్కువగా బహుమతులు రావటం ఆరభమైంది. అంతవరకూ ఇంటి వెలుపల తిరుగుతూ వచ్చిన నవలా వస్తువు, కుటుంబం లోపలికి వచ్చి చేరింది. అంతే! ఇంటిల్లిపాదికి ఇదొక కొత్త రుచి. ఇంట్లో ఉండే, ఈ నవలల్లోని కలలతో ఎందరో ఎన్నో మానసిక విహారాలు చేసి కొత్తరకం తృప్తిని పొందారు. వారపత్రికల్లో సీరియళ్లుగా వచ్చే ఈ ధారావాహికల కోసం ప్రతి వారం తహతహలాడుతూ ఎదురు చూశారు. వీటి ఈ ప్రాచుర్యాన్ని కొన్ని ప్రచురణ సంస్థలు ముఖ్యంగా విజయవాడవారు బాగా అందిపుచ్చుకున్నారు. సీరియల్ పూర్తి కాగానే వెంటనే పుస్తకంగా విడుదలయ్యేది. ఆ సమయంలో గ్రంథాలయాలు కూడా ఈ పుస్తకాలకి లక్షల్లో నిధులు వెచ్చించాయి. దరిదాపు ఇరవైఏళ్లు ఈ ధోరణే కొనసాగింది. రచయిత్రులు విరివిగా రాసిన కాలం ఇది. పాఠకుల సంఖ్య, చదివే అలవాటూ ఎంతగానో పెరిగింది.

సర్క్యులేషన్ పెరుగుతూ బాగా నడుస్తున్న తెలుగు కుటుంబ వార, మాసపత్రికలకి వ్యాపార పోటీలో శృంగార పత్రికలు, తర్వాత వాటికి అనుబంధంగా పచ్చి బూతు నవలలు మద్రాసు, మరికొన్ని ప్రాంతాల నుంచి వెలువడ్డాయి. ఇవి ఆరోగ్యకరమైన నవలా గమనాన్ని దెబ్బతీశాయి. గ్రంథాలయాల నిధుల వినియోగంలో జరిగిన కొన్ని లోటుపాట్లువల్ల కూడా నిధుల కేటాయింపు

తగ్గిపోయింది. క్రమేపీ తెలుగు నవల జోరు తగ్గుతూ వచ్చింది. ప్రచురణకర్తలూ నవలల ప్రచురణ తగ్గించేశారు. పాఠకులకు నవల చదివే సమయం టి.వి., స్మార్ట్‌ఫోన్‌లు ఆక్రమించాయి. ఇంచుమించుగా ఇదే సమయంలో కొంతమంది వ్యక్తులు, సంస్థలు చేసిన కృషివల్ల తెలుగుకు థకి ప్రచారం, ప్రాచుర్యం బాగా పెరిగింది. కొన్ని అస్థిత్వ ఉద్యమాలు, శాఖావాద రచనాతీరులవల్ల కూడా కథకి ప్రముఖ స్థానం దక్కింది. పత్రికల సంఖ్య కూడా తగ్గుతూ వచ్చింది. ఉన్న పత్రికలు కూడా కాల్పనికేతర రచనలవేపు మొగ్గు చూపించాయి. తమతమ వ్యాపార అవసరాలకి అనుగుణంగానే నవలల ఎంపికని పత్రికలు చేపట్టటం ఆరంభమైంది. దీనితో జీవన వాస్తవికతని ఆధారం చేసుకుని వెలుగుతూ వచ్చిన తెలుగు నవలా రచన స్థబ్దత ఆవరించింది. గ్రంథాలయాలు కానక, ప్రచురణ సంస్థలు వెయ్యక అనుకూలమైన పత్రికలు లేక, అన్నిరకాలు తెలుగు నవల వెనకపడింది. అలా అని పూర్తిగా మంచి తెలుగు నవలల రచన ఆగిపోయిందని కాదు. అప్పుడప్పుడు కొత్తవాళ్లు, పాత రచయితలు కూడా చాలా మంచి నవలలు రాస్తున్నారు. ఏదో విదేశీ సాహిత్య సంస్థో, స్వదేశీవాళ్లో పోటీల ద్వారానో, విడిగానో వాటిని వెలుగులోకి తీసుకురావటం జరుగుతోంది. ఇలా కాకుండా తమకి నచ్చినట్టు, ఏ రకమైన మానసిక కట్టడీ లేకుండా స్వేచ్ఛగా నవల రాస్తే, చాలా సందర్భాలలో సొంతంగానే అచ్చువేసుకోవల్సి వస్తోంది. రచయిత ప్రధానంగా పుస్తక వ్యాపారి కాకపోవటంవల్ల, ఆ ప్రయత్నంలో కష్టనష్టాలే ఎక్కువ. ఇప్పుడు మంచి నవలకి సరైన వేదిక లేదు. పత్రికలు సంఖ్యాపరంగా బాగా తగ్గిపోయాయి. మంచి నవలలకి ప్రచురణ సంస్థలు లేవు. ఒకరకం మాంద్య దశ ఇది. తెలుగు నవలకి పూర్వ వైభవం వస్తుందా?

వచ్చే అవకాశం లేకపోలేదు ఇది ఆశ మాత్రమే.

సాంఘికంగానూ, సాంకేతికంగానూ చాలా మార్పులు వచ్చాయి. ఈనాడు మంచి నవలకి వస్తువే ఏక ఖండంగా, గతంలో అంత తేలిగ్గా దొరకదు. సాంఘిక జీవితం ఛిద్రమై శకలాలు శకలాలుగా మారింది. ముక్కలు ముక్కలుగా ఉన్న నేటి జీవన రీతిలోంచి మౌలికమైన వస్తువుని పట్టుకోవటం అంత తేలిక కాదు. గతంలో ఒక గ్రామాన్నో, కుటుంబాన్నో ఎన్నుకుని లోతుగా పరిశీలిస్తే మంచి నవల అయిపోయేది. ఇప్పుడు మంచి పాత్రలు, బలమైన సంఘటనలు వేరువేరుగా దొరుకుతాయి. వాటిని ఏకసూత్రంగా కూర్చే వస్తువు, కథ అంత తేలిగ్గా దొరకవు. దీనికి గట్టి కృషి కావాలి. చాలా లోతైన పరిశీలన కావాలి. గత తరాలకి, ఈ తరానికి జీవితంలో వచ్చిన విలువల మార్పుల్ని సంయమనంతో గ్రహించాలి. నైతికత, అనైతికత మధ్య రేఖ మరింత సన్నగా మారిపోయిన కాలం ఇది.

నవల చదవటానికి ఎలా సమయం లేదో అలాగే మంచి నవల రాయటానికి చాలామంది రచయితలకి సమయం లేదు. అలా అని నవలలు రాయటం లేదా అంటే రాస్తూనే ఉన్నారు. ఏ పోటీకోసమో లేదా ఏదో ప్రముఖ పత్రికలో అచ్చవటంకోసమో కండిషనైపోయి రెండు రోజుల్లో రెండువందల యాభై పేజీల నవలని రాసే రచయితలు నాకు తెలుసు. ప్రచురణే ప్రధాన ధ్యేయం.

నవలని వ్యాపార ధోరణికి భిన్నంగా రాస్తే ప్రచురించే వేదిక లేదని చాలామంది మంచి రచయితలు నిరుత్సాహపడుతున్నారు. మంచి నవలలు రావటంలేదని కొన్ని సాహితీ సంస్థలు బాధపడుతున్నాయి. వీరిద్దరి మధ్యా ఓ వారధి ఏర్పడాలి. మంచి నవలల కోసం కొన్ని విదేశీ, స్వదేశీ సంస్థలు ప్రతి ఏటా పోటీలు పెడుతున్నాయి. దీనితో పాటు, ఓ కాలనియమం... ఓ పోటీ గడువు లేకుండా మంచి నవల ఎప్పుడు ఎవరు రాసినా ప్రచురించే సంస్థలు కూడా కావాలి. మంచి నవల రాస్తే అలాంటి చోటుకి పంపించే అవకాశం ఉందంటే మంచి నవలలు రాయటానికి రచయితకి నైతిక ధైర్యం వస్తుంది. నవలా రచన పట్ల భక్తి, గౌరవం పెరగాలి. నవలా పఠన జీవితంలో ఓ భాగం, మనోవికాసానికి, ఉపశమనానికి, సంక్లిష్టతని తొలగించే శాంతికి ఉపకరణం అన్నంత స్థాయిలో నవలా సృష్టి జరగాలి. మంచి నవలకి తగిన పాఠకులు ఎప్పుడూ ఉంటారు, ఉన్నారు. వారికి మంచి నవలలు అందాలి. అటువంటి సంస్థాగత వ్యవస్థ, వేదిక ఏర్పడాలి. అలా జరిగిన్నాడు మంచి నవలలకి లోటు ఉండదు.

వి. రాజా రామమోహనరావు
హైదరాబాద్. ఫోన్: 939 473 8805,
040 - 27038805.

జలియన్ వాలా బాగ్
మారణకాండ

– వేలూరి కృష్ణమూర్తి

జలియన్ వాలా బాగ్ మారణకాండ ఉదంతం జరిగి వందేళ్ళు పూర్తి అయింది. ఆ ఘటనలో ఎంతోమంది తమ ప్రాణాలను కోల్పోయి అమరులయ్యారు. వారు దేశంకోసం చేసిన త్యాగాలు ఎప్పటికీ మరువలేనివి. ఈ దుర్ఘటన జరగడానికి నేపథ్యమేమిటి?

మొదటి ప్రపంచ మహా యుద్ధానంతరం బ్రిటీషువారు వారి యాజమాన్యంలో ఉన్న భారతదేశం, అలాగే చుట్టుముట్టు ఉన్న దేశాలలో జరుగుతున్న క్రాంతికారి ఆందోళనల కార్యాలతో గాబరా చెందారు. వీటిలో ముఖ్యంగా, బెంగాలు ప్రాంతపు క్రాంతికారుల అఘాతాలు, పంజాబులో జరుగుతున్న పోరాటం వారి నిద్రను పాడు చేస్తూండేది. పంజాబులో జరుగుతున్న 'గద్దర్ పోరాటం' బ్రిటీషువారి నెమ్మదిని పాడుచేసింది. 1915 'డిఫెన్స్ ఆఫ్ ఇండియా' చట్టం ద్వారా ఒకింత నియంత్రణ సాధించడంతో గద్దర్ పోరాటం కొంతవరకూ చల్లబడినా, ఆఫ్గనిస్తాన్‌లో కాబూలు కేంద్రం నుండి జరుపుతున్న రాజా మహేంద్ర ప్రతాప్ ప్రయత్నం, బెంగాలు, పంజాబులలో నిలువకుండా జరుగుతున్న స్వాతంత్ర పోరాటపు క్రాంతికారి చర్యలు బ్రిటీషువారి చింతలను ఎక్కువ చేయడంతో, 1918లో బ్రిటీషు ప్రభుత్వం సెడిషన్ కమీటీని రచించడానికి ముందుకు వచ్చింది. దేశ విదేశాలలో ముఖ్యంగా జర్మని, అమెరికా, కెనడా, రష్యా దేశాలలో నివసిస్తున్న భారతీయ యువకులు జరుపుతున్న స్వాతంత్ర పోరాటాల కార్యక్రమాలు, అలాగే బెంగాలు–పంజాబులలో నడుస్తున్న క్రాంతికారి చర్యలను అధ్యయనం చేసి ఆ ప్రయత్నాలను మట్టుపెట్టడానికి తీసుకోవాల్సిన క్రమాలను గురించి ఆలోచించడానికి ఈ సెడిషన్ కమిటీ సమర్పించిన 226 పుటల నివేదిక సహాయపడింది. దీని పరిణామంగా 1919లో రౌలత్ చట్టం రావడంతో బ్రిటీష్ ప్రభుత్వం ఎవరినైనా ఈ చట్టం క్రింద బంధించి, చెరసాలలో ఉంచి వారి యిళ్ళను శోధించడానికి అధికారాన్ని పొందింది. ఈ చట్టాన్ని విరోధించి గాంధిగారు యిచ్చిన పిలుపు దేశమంతటా భయంకరమైన పోరాట జ్వాలలను రేపింది. 1919, ఏప్రిల్ 6న బొంబాయిలో రౌలత్ చట్టం విరుద్ధంగా గొప్ప సమావేశం జరిగింది. ఈ విధంగా 1919 ఏప్రిల్ మొదటివారం సమయానికి రౌలత్ చట్టం విరుద్ధంగా పోరాటం దేశమంతటా ఉన్నతస్థాయి చేరుకోగా, లాహోర్ పట్టణంలో ఆ పోరాటం పరాకాష్టకు చేరింది.

సామాన్యంగా బ్రిటీషు సైనిక అధికారులు వేసవి మాసాలను చల్లని గిరిధామాలలో కడపడానికి వెళ్ళడం వాడుక. ఇంతకు మునుపు 1857లో వారలా వెళ్ళిన సమయంలో, భయంకరమైన మొదటి భారత స్వతంత్ర సంగ్రామం జరిగి బ్రిటీషు ప్రభుత్వాన్ని తబ్బిబ్బు చేసింది. 1919 ఏప్రిల్ మొదటివారం సమయానికి అలాంటి పరిస్థితి ఎదురయ్యే సూచన రావడంతో, ఇప్పుడూ అలానే జరుగడం ఖచ్చితమని వారు నమ్మారు. సెడిషన్ కమిటీ నివేదిక దేశంలో ఎలాంటి ప్రతిఘటన వాతావరణాన్ని సృష్టించిందంటే, యిప్పటివరకు తన కార్యక్రమాలను మందకొండిగా నడుపుతున్న కాంగ్రెసు కూడా కొంత పౌరుషాన్ని చూపడానికి ముందుకు వచ్చింది. దాని పరిణామంగా, ముందుగా నిశ్చయించిన ప్రకారం, మార్చ్ 30, 1919న ఢిల్లీలోని చాందినీ చౌక్‌లో గొప్ప ప్రతిఘటనా ప్రదర్శన ప్రారంభమై, సభ నేత్రుత్వం వహించిన స్వామి శ్రద్ధానంద బ్రిటీష్ పోలీసువారికి తమ ఛాతి చూపి 'గుండు కాల్చమని' సవాలు చేశారు. అదే సమయంలో, అమృతసర్‌లో కాంగ్రెస్ అధివేశనం జరుపడానికి అక్కడి సీనియర్ నాయకులైన సత్యపాల్, మరియు సైఫుద్దీన్ కిచ్లు సిద్దతలు చేస్తుండగా వారిద్దరిని బంధించి ఎవరికీ తెలియని చోటకు తీసుకుపోయారు. ఈ పరిస్థితిలో అమృతసర్‌లో జరుగబోయే ఆ సమావేశం స్వాగత సమితి అధ్యక్షత వహించడానికి ఎవరూ ముందుకు రాకపోగా స్వామి శ్రద్ధానందవారే ముందుకువచ్చి అధ్యక్ష స్థానాన్ని అలంకరించి ఆనాటి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. జలియన్ వాలా బాగ్ ఉదంతానికి మూడు

రోజులు ముందు, ఏప్రిల్ 10న రౌలట్ చట్టం విరుద్ధంగా జరిగిన ఈ ఆందోళనలో ఐదుమంది బ్రిటీషు ప్రజలు చంపబడ్డారు. మిస్ షేర్ ఉడ్ అన్న బ్రిటీష్ యువతిని ఆందోళనకారులు అవమానపరిచారని జనరల్ డయ్యర్ మండిపడ్డాడు. అక్కడి నాయకుల బంధనాన్ని తీవ్రంగా విరోధించిన జనులు ఉద్రేకం చెందటంతో పోరాటం ఉగ్ర రూపం దాల్చి, ప్రజలు కోపంతో అక్కడి పుర భవనం, ఇతర ప్రభుత్వ భవనాలు, బాంకులు, రైలు భవనాలను ఆక్రమించి వాటికి అగ్గి పెట్టారు.

1857లో జరిగినటువంటి భారత స్వతంత్ర సంగ్రామంలాంటి సందర్భం ఎదురవుతుందని ఊహించిన అమృతసర్ డెప్యూటి కమిషనర్ మైల్స్ ఇర్వింగ్, (Miles Irving) ఎలాంటి నొటీసు జారీ చేయకనే ఏప్రిల్ 11, 1919 నాటికి అమృతసర్ పట్టణంపై సైన్యాధికారాన్ని బ్రిటిష్ ఇండియా సైన్యం బ్రిగేడియర్ జనరల్ రెగినల్డ్ డయ్యర్‌కు ఒప్పగించాడు. ఈ విధంగా అమృతసర్ పట్టణంపై సైన్యాధికారం డయ్యర్ చేతిలోనికి వచ్చింది. ఏప్రిల్ 12న అమృతసర్ హిందూ కాలేజిలో సభ చేరింది. అక్కడ చేరిన జనం రౌలత్ చట్టం విరుద్ధంగా తమ నిరసనను వ్యక్తం చేయడానికి అమృతసర్ పట్టణంలో హరతాల్ చేయాలని చాలా ఉత్సుకత చూపి నాయకులపై ఒత్తిడి తెచ్చారు. ఆ సభలో సైఫుద్దీన్ కిచ్లు ఆప్త స్నేహితుడైన హంసరాజ్, ఏప్రిల్ 13, సాయంత్రం 4.30 గంటలకు జలియన్ వాలా బాగ్ మైదానంలో సార్వజనిక సభ జరుగుతుందని ఘోషించారు. అమృతసర్ పట్టణం, పైకి శాంతంగా కనపడ్డా లోలోనే మండసాగింది. కొన్నిచోట్ల విధ్వంసక చర్యలు కొనసాగాయి. ఏప్రిల్ 13, 1919 బైశాఖి, సిక్ఖు మతస్తులకు పర్వదినం. ఆనాటికి కొద్దిరోజులు ముందు హిందూ–ముస్లిం ప్రజలు ఐకమత్యంగా శ్రీరామనవమి ఉత్సవాలను వైభవోపేతంగా జరిపారు. ఈ హిందూ–ముస్లింల అచంచల భాంధవ్యం బ్రిటీషువారికి కొరకరాని కొయ్య అయింది. ఈ బంధాన్ని ఎలాగైనా విరవాలని బ్రిటీషువారి ప్రయత్నం. ఏప్రిల్ 13వ సమయానికి అప్పటి పంజాబు చాలా ప్రదేశాన్ని సైనిక యాజమాన్యంలోనికి తీసుకోవాలనికూడ ప్రభుత్వం నిర్ణయించింది.

ఏప్రిల్ 13, 1919. ఆరోజు బైశాఖి, సిక్ఖు మతస్తులకు పర్వదినం. అది వారి కొత్త సంవత్సరం ప్రారంభమయ్యే రోజైనందువల్ల వారికి పండుగరోజు! అదే రోజున సిక్ఖువారి 10వ గురువు గురు గోవింద్ సింగ్ ఖల్సా పంథమన్న ఒక యోధుల గణాన్ని ప్రారంభించింది. గురు తేగ బహదుర్ ఇస్లాం మతానికి మతాంతరం చెందడానికి అంగీకరించనందుకు మతాంధుడైన మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్ అతడిని చిత్రహింస చేసి చంపించగా సిక్ఖులకు క్షాత్రపు దారి పట్టడం అనివార్యమని నిర్ణయించి గురుగోవింద సింగ్ 'ఖల్సా యోధుల సేన'ను ఏర్పాటు చేసిన ఆ రోజు సిక్ఖులకు అత్యంత పవిత్రమైన దినమైంది!

బ్రిటిష్ ఇండియా సైన్యం బ్రి గేడియర్ జనరల్ రెగినల్డ్ డయ్యర్ అమృతసర్ పట్టణానికి సైన్యాధికారి కావడంతో అనాటి ఉదయమే అతడు నగరంలో అనేకమైన నిర్బంధాలను విధించి అన్ని సభలు, ఊరేగింపులను నిషేధించామని ఘోషించి తానే అమృతసర్ వీధులలో తిరిగాడు. కాని, అమృతసర్ ప్రజలు వాటిని చెవిని వేసుకోలేదు. ఈ మధ్య, నగరంలోని అన్నిచోట్లా సంచరిస్తున్న గుప్తచారులు ఆనాటి సాయంత్రం జరిగే సభగురించి మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి పూర్తి వివరాలను జనరల్ డయ్యర్‌కు తెలిపారు. విషయం తెలిసిన ఒక గంటలోగా అలా ఏర్పరచిన సభపై ఎలా పగ తీర్చుకోవాలని నిర్ణయం తీసుకొని తన సేనలకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలను ఇచ్చాడు. ఈ సందర్భంలో హిందూ–ముస్లింల ఐకమత్యాన్ని విరిచే ప్రయత్నంలో కావాలనే హిందూ సైనికులను మాత్రమే ఈ కార్యానికి నియోగించాడు. జలియన్ వాలా బాగ్ మైదానం అమృతసర్‌లోని సిక్ఖుల పవిత్ర స్వర్ణ దేవాలయానికి చాలా దగ్గరలో ఉన్న 6–7 ఎకరాల విశాలమైన మైదానం. దాని చుట్టూ పది అడుగుల ఎత్తైన గోడలుండేవి. ఆ మైదానానికి ఐదు చిన్న చిన్న ద్వారాలున్నా అవి తాళం వేసి ఉండేవి. ఉన్నది ఒకే ఒక్క పెద్ద సింహద్వారం. అది వైశాఖ పర్వదినమైనందున చుట్టుముట్టువున్న పల్లెల నుండి వేలకొద్దీ సిక్ఖులు స్వర్ణమందిరం దేవాలయానికి వచ్చారు. ఆ కారణంతో పట్టణంలో జన సమూహం ఎక్కువగా

ఉండినది. దేవాలయ దర్శనానంతరం ఈ జన ప్రవాహం విశాలమైన జలియన్ వాలా బాగ్ వైపు మళ్ళింది. ఇలా, సాయంత్రం నాలుగు గంటల సమయానికి బాగ్ మైదానం 20,000 పైగా జన సమూహంతో నిండిపోయింది.

ఈ పరిస్థితిలో పర్యవేక్షణకై జనరల్ డయ్యర్ ఒక విమానంలో ప్రయాణించి అక్కడ చేరిన జన సంఖ్యను అందాజు వేశాడు. హంటర్ సమితి నివేదిక ప్రకారం అక్కడ చేరినవారి సంఖ్య దగ్గర దగ్గర 20,000 దాటింది. ఇలా ప్రతి క్షణానికీ బాగ్ మైదానంలో గుమిగూడుతున్న జనులు క్రమక్రమంగా ఎక్కువవుతున్న సమాచారాన్నిగాని, ఇంతటి జనసమూహాన్ని అదుపులో ఉంచేందుకు మున్ముందు తీసుకొనే చర్యలను గురించి గాని బ్రిటిష్ అధికారులు– జనరల్ డయ్యర్‌గాని, అమృతసర్ డెప్యూటి కమీషనర్‌గా ఉన్న మైల్స్ ఇర్వింగ్ కాని, అక్కడ చేరిన జనులను ముందుగా హెచ్చరించడానికి ఎలాంటి ప్రయత్నం చేయలేదు. ఈ కారణంతో సభ నిర్వాహకులకుగాని, అక్కడ చేరిన సభికులకుగాని మున్ముందు జరిగే అనాహుతాలను గురించి ఎలాంటి సూచనా లభించలేదు. అందరూ ఆనాడు సాయంత్రం సభాకార్యక్రమం గురించి ఆలోచించసాగారు. పర్వదినమైన ఆనాటి సాయంత్రం 4.30 గంటలకు సరిగా సభ నిర్వాహకులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదే సమయానికి సరిగా 90 మషిన్–గన్లతో కూడిన రెండు మిలిటరీ వాహనాలు, నలభై బుఖ్రీలు (గూర్ఖాలు వాడే కత్తి) పట్టిన సైనికులు, తుపాకులను పట్టిన 25 మంది గూర్ఖా సైనికులతో బ్రిగడియర్ జనరల్ డయ్యర్ ఉన్నకున్నట్టే అక్కడికి వచ్చి రెండు మూడు నిమిషాలలో ఆ మైదానాన్ని ఖాళీ చేయాలని ఘోషించాడు. ఇరవైవేలకంటే ఎక్కువ జనంతో కిటకిటలాడుతున్న ఆ మైదానం నుండి బయటికి వెళ్ళడానికి నాలుగైదు చిన్నచిన్న ద్వారాలున్నా, అవి బీగాలతో బంధించబడటంతో, ఒకే ఒక్క చిన్న ద్వారం ద్వారా మాత్రమే బయటికి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక పెద్ద గేట్ ఉన్నప్పటికీ దాని వద్ద శస్త్రధారులైన సైనికులు సాలుగా నిలబడ్డారు. రెండు–మూడు నిముషాలు గడిచినంతనే డయ్యర్ కాల్పులు ప్రారంభించమని ఆజ్ఞలు జారీ చేశాడు. అలా ప్రారంభమైంది తుపాకి గుళ్ళ వర్షం. 1650 రౌండ్స్ గుండ్లు పేల్చారని తరువాత హంటర్ సమితి ప్రకారం తేలింది. ఈ ఘటనానంతరం, హంటర్ సమితి ప్రకారం జలియన్ వాలా బాగ్ ఉదంతంలో 379 మంది ప్రాణాలు కోల్పోయారు, 1500 మందికి గాయాలయ్యాయి. ప్రాణ భయంతో తప్పించుకొని బయటికి పోయే ప్రయత్నంలో జన సమూహంలో తొక్కుడులకు చిక్కుకొని మరణించినవారు మరెంతమందో! అలా మరణించిన వారిలో బాల–బాలికలు 42 మంది – అందులో ఒక 7 నెలల చిన్న బిడ్డ కూడా ప్రాణం కోల్పోయింది. ఆ మైదానంలో ఒక చేదబావి ఉండేది. తుపాకి గుళ్ళనుంచి తప్పించుకొని పారిపోతూ గాబరివల్ల భావిలో ఒకరి వెనుక మరొకరు చేదబావిలో పడి మరణించినవారు 120 మంది! అలా పడినవారిలో ముసలివారు, స్త్రీలు, మగవారు, పిల్లల శవాలు కూడా దొరికాయట!

జలియన్ వాలా బాగ్ మారణహోమ ఉదంతం ఆకస్మికంగా జరిగింది కాదు. పిరికిపందలు, దుష్టులు, అమానుషులైన బ్రిటీషు అధికారులు భారతీయుల విరుద్ధంగా ధృఢనిర్ణయం చేసి 1857లో జరిగిన సైనిక పోరాటంపై పగతీర్చుకొన్న విధానమిది. పంజాబు ప్రభుత్వం జనరల్ డయ్యర్ ద్వారా జరిపించిన ఈ హత్యాకాండను ఎలాంటి విచారణ చేయకనే, డయ్యర్ చేసిన చర్యకు అప్పటి వైస్రాయి చేంస్ఫర్డ్ ఆమోదం తెలిపారు. మనదేశంలో ఈ పాశవిక ఘటనకు నిరసనగా తీవ్రమైన ఆక్రోశపు జ్వాలలు లేచాయి. రవీంద్రనాథ ఠాగూర్ తనకు బ్రిటిష్ ప్రభుత్వం ఇచ్చిన 'సర్' బిరుదు లాంచనాన్ని, పత్రాన్ని వెనుదిరిగిస్తూ అప్పటి వైస్రాయి లార్డ్ చేంస్ఫర్డ్‌కు తన అసమ్మతిని తెలియజేస్తూ సుదీర్ఘమైన లేఖ వ్రాశారు. జలియన్ వాలా బాగ్ మారణకాండ ఉదంతం ఒక క్రొత్త పోరాటపు పర్వానికి నాంది పలికింది. చంద్రశేఖర అజాద్, రాంప్రసాద్ బిస్మిల్, అశ్ఫాఖ్ ఉల్లాఖాన్, భగత్ సింగ్ మొదలుగా వేలకొద్దీ స్వాతంత్ర యోధులు భారత స్వాతంత్ర పోరాటం అగ్రస్థానానికి వచ్చారు. అనంతర కాలంలో హంటర్ సమితి బ్రిగేడియర్ డయ్యర్ క్రమాన్ని అక్కడక్కడా ఖండించినా పంజాబులో సైన్యాధికారం జారీచేసిన క్రమం సరి అని సమర్థించింది. గాంధీజి 1917లో చంపారణ్

వద్ద ప్రారంభించిన 'సత్యాగ్ర హ కార్యక్రమం' పరిణామంగా, పంజాబులో పరిస్థితులు మితిమీరి, ఈ అనర్థానికి బహుశా కారణమైందని ఉల్లేఖించింది. చివరకు ఏమైందంటే డయ్యర్‌ను అధికార లాంఛనాల నుండి నివృత్తి చేసి ఇంగ్లండ్ పంపేశారు.

ఈ ఘటన మన స్వాతంత్ర ఆందోళనకు అపారమైన ఇంధనం సమకూర్చింది. దీనితో భారతీయ ప్రజలలో సుప్తంగా ఉన్న క్షాత్ర తేజం అధిక ప్రమాణంలో బయట వడసాగింది. ఇది అనంతర కాలంలో నహాయ నిరాకరణోద్యమానికి, దేశ స్వాత్రంత్ర ఆందోళనకు దారి తీసింది. 'హిందూస్థాన్ ప్రజాత్రంత్ర సంఘం', 'హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ ఆర్మీ'లలాంటి సంస్థల పుట్టుకకు కారణమైంది. ఏప్రిల్ 13, 1919 నాడు జరిగిన జలియన్ వాలా బాగ్ మారణ హత్యాకాండం జరిపించింది జనరల్ డయ్యర్ అయినా ఆ కర్మకాండకు వ్యూహం రచించింది లెఫ్టినెంట్ గవర్నర్ మైకేల్ ఓడ్వైర్ (Lt.Governor Michael O'Dwyer). ఈ చర్య తరువాత, గాంధీగారికున్నంత నహనం అందరికీ ఉండలేదు. 20 సంవత్సరాల అనంతరం 1940 మార్చ్ 13న, లండన్ నగరంలోని కాక్-స్టన్ హాలులో (మదన్ లాల్ దింగ్రా కర్జన్ వాయలిని సంహరించిన స్థళం) ఉధం సింగ్ అన్న క్రాంతి యోధుడు, మహమ్మద్ సింగ్ అజాద్ అన్న పేరు నమోదు చేయించి, గవర్నర్ మైకేల్ ఓ డ్వైర్‌ను తుపాకి గుండుతో కాల్చి చంపి జలియన్ వాలా బాగ్ నరమేధానికి పగ తీర్చుకొన్నాడు. 100 సంవత్సరాల క్రితం మన దేశ స్వాతంత్రం కోసం జరిగిన పోరాటంలో జలియన్ వాలా బాగ్ హత్యాకాండ ఒక ముఖ్యమైన మలుపు. 1857లో జరిగిన మొదటి స్వతంత్ర సంగ్రామం అనంతరం ఈ ఘటన అత్యంత ఎక్కువ ప్రణామంలో భారత స్వాతంత్రోద్యమాన్ని ఉత్తేజపరిచింది. జలియన్ వాలా బాగ్ నరమేధం జరిగి నూరేళ్ళు నిండిన సందర్భంలో దాని జ్ఞాపకార్థంగా, మన ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్యనాయుడు జలియన్ వాలా బాగ్ స్మారకంవద్ద పుష్పగుచ్ఛాన్ని ఉంచి అంజలి ఘటించి ఆ ఘటనలో మరణించినవారికి నివాళులర్పించారు. ఈ సందర్భంలో, దీని జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం Rs. 100/- ల స్మారక నాణెం, ప్రత్యేక తపాలా బిళ్ళను ఆవిష్కరించారు.

వేలూరి కృష్ణమూర్తి, మైసూరు. ఫోన్: 944 897 7877.

గట్టు తెగిన చెఱువు...

అనుభవజ్ఞులు మరి అభిమాన ధనులేను
సహృదయ సహకార సత్వగుణులు
వయసు వల్లెనంత వలదు ఛీ పొమ్మంటె
ఇంతకంటె వంచనేమియుండు

గూడు కట్టుకున్న గుండెలోపటి బాధ
చెప్పలేరు మనసు విప్పలేరు
వేదనలకెగాని వాదనలుండవు
ఎన్నో జీవితాలు ఇంతె సుమ్ము

హద్దుమీరకున్న ఆనందమేయంత
కట్టుబాటునున్న కలుగు మేలు
గట్టు తెగిన చెఱువు గమన మాపగలమ
విచ్చలవిడి విడితనము తెచ్చు ముప్పు

అదుపు నుంచవలయు ఆలోచనల పుంత
మనదు మాట వినదు మనసు సుంత
గుఱ్ఱమువలె దాన్ని గుంజిపట్టినయంత
చెప్పు చేతనుండి చేయునంత

మాటపొదుపు చేస్తె మనిషికెంతో మేలు
ధనము పొదుపు చేస్తె దక్కు సుఖము
జలము పొదుపు చేస్తె జగతికే మేలగు
పొదుపు చేస్తెయన్ని యదుపునుండు

మనసు పొరలు విప్పి మాధుర్యమొలికించు
మమత పొరలు భాష మనసు భాష
భక్తి రక్తి ముక్తి శక్తియుక్తుల భాష
ఇప్పపూవు రసపు యింపుభాష

డి. రాములు, ఏలూరు. ఫోన్: 944 037 6688.

'బహుళ' నవల: కఠోర సత్యాలు

– శిరంశెట్టి కాంతారావు

ఉత్తరాంధ్రకు సంబంధించి ఎనభైఏండ్ల కాల వ్యవధిలో సంభవించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పెనుమార్పులను సాకల్యంగా ఆకళింపు చేసుకోవడానికి తప్పకుండా చదవాలి.

నవలా వస్తువు అనేక సంఘటనలతో కూడుకున్న నాలుగు తరాల ఓ కుంటుంబ గాథ. అది పెదనారాయుడితో మొదలై రాధేయ మనవడితో ముగుస్తుంది. ఉత్తరాంధ్ర అంటే విశాలమైన సముద్ర తీరప్రాంతం, అనేక జీవనదులు, దట్టమైన అడవులు, విస్తృతమైన వ్యవసాయ భూములు, ఎనభైశాతం గిరిజన, గిరిజనేతర శ్రామికులతో కళకళలాడే ఆకుపచ్చ భూమి. వారంతా తమకుగల చిన్నచిన్న కమతాల్లో కాయాకష్టం చేసుకుంటూ లభించినదానితో సంతృప్తిచెంది కాలం వెళ్ళదీస్తున్నవాళ్ళు.

ఇరవైశాతం ఉండే భూకామందుల, షావుకార్ల చేతుల్లో ఎనభైశాతం భూములు, వ్యాపారాలు పోగుపడి ఉండడంతో ఆ రెండు వర్గాలవాళ్ళు, ఎనభైశాతం ఉండే పేదవారిమీద కర్రపెత్తనం చేయడమనేది నేటికీ ఉత్తరాంధ్రకు ఒక తీరని శాపం. అర్ధనగ్న శరీరాలతో, అర్ధాకలితో రెక్కల కష్టంతో బ్రతుకుతున్నవాళ్ళను అలా కూడా బ్రతకనివ్వకుండా జమీందార్లు, షావుకార్లు ధన మదంతోనూ, వంచనతోనూ వాళ్ళకున్న కొద్దిపాటి భూములను, వారి శ్రమఫలాన్నీ దోచుకోసాగారు. వారి అరాచకాలను సహించినంతకాలం సహించిన ఆసామాన్యులు చివరికి గత్యంతరం లేని పరిస్థితిలో వారిమీద తిరగబడడమే ఉత్తరాంధ్ర చరిత్ర. ఆ చరిత్రను తనదైన శైలిలో అక్షరీకరించిన రచయిత అట్టాడ అప్పల్నాయుడి రచనా సామర్థ్యానికి ఈ నవల శిఖరాయమానమైన ఉదహరణగా నిలిచిపోతుంది.

మొదటి తరంవాడైన పెదనారాయుడు ధర్మపక్షపాతి, పేదలంటే ప్రాణంపెట్టే మనిషి. ఆ తత్వమే అతణ్ణి జమీందార్‌కు శత్రువును చేసింది. ఫలితంగా హత్యకు గురవుతాడు. తమకోసం ప్రాణాలిచ్చిన పెదనారాయుణ్ణి జనం తమ ఇష్టదైవంగా నిలుపుకుని, అతని పేరిట ఏటా తిరుణాళ్ళ జరుపుకుంటుంటారు. తరువాతి తరంవాడైన చిననారాయుడు పెద్దవాళ్ళు అనుకున్నదానికి భిన్నంగా తన చిన్న మేనమామ రామస్వామినాయుడి కూతురు అన్నపూర్ణను కాదని, తనకు తప్పెటగుళ్ళ ఆట నేర్పిన సింహాద్రి అప్పన బిడ్డ బంగారమ్మను కులాంతర వివాహం చేసుకుని గ్రామం విడిచి భిలాయ్ వెళ్ళిపోతాడు. అక్కడో కొడుకును కని, బ్రతుకుతెరువు కోల్పోయి తిరిగి గ్రామం చేరుతాడు. గ్రామం చేరిన తరువాత అన్నపూర్ణను చేసుకోవాల్సిన చిననారాయుడు తన కారణంగా ఆవిడకు అన్యాయం చేశాడన్న ఆలోచనతో కొడుకును కూడా వదిలేసి ఎటో వెళ్ళిపోతుంది. ఇక దాంతో పెద్దలంతా తిరిగి అన్నపూర్ణకు చిననారాయుడికి పెండ్లి చేస్తారు. తన ముగ్గురు పిల్లల్తోపాటు బంగారమ్మ కొడుకు రాధేయను తన స్వంత పిల్లలకన్నా ప్రేమగా పెంచుతుంది అన్నపూర్ణ.

నవల గమనం మూడువంతులు రాధేయతోనే ముడిపడి ముందుకు సాగుతుంది. సన్నకారు రైతుకుటుంబాల్లోని అందరు పిల్లల మాదిరిగానే అతను కూడా చిన్ననాటి నుండి ఒకపక్క బడికివెళ్ళి చదువుకుంటూనే మరోపక్క వ్యవసాయ వనుల్లో కుటుంబానికి ఆనరా అవుతుంటాడు. చదువుకుంటూనే గ్రామంలో భూస్వాములకు, షావుకార్లకు వ్యతిరేకంగా జరుగుతున్న విప్లవోద్యమంలో కళాసైనికుడిగా పనిచేస్తుంటాడు. ఆ క్రమంలోనే అతనికి ఉద్యమ నాయకుడు బలరామ్ కూతురు సంధ్యతో పరిచయం ఏర్పడి ఆవిడను పెండ్లి చేసుకుంటాడు. ఇద్దరూ కలిసి బ్రతుకు తెరువు కోసం రకరకాల పన్లు చేస్తుంటారు. అనేక ఇబ్బందుల తరువాత తను ఓ స్థిరమైన ఉద్యోగంలో కుదురుకుంటాడు. ఒకరకంగా చెప్పాలంటే ఈ రాధేయ పాత్ర రచయిత అప్పల్నాయుడుగారి నిజ జీవిత పాత్రే అని చెప్పుకోవచ్చు. ఒక మనిషి పుట్టి జ్ఞానమొచ్చినప్పటి నుండి పెరిగిపెద్దై ఉద్యోగ విరమణదాకా ఎన్ని రకాల ఆటుపోట్లకు లోనవుతాడో, అవి మొత్తం టార్చిలైట్ వేసి చూపించినట్టు, చూపించడం రచయిత వ్యక్తిగత జీవితం తాలూకు చిత్రణ వల్లనే సాధ్యమవుతుంది. ఆ పనిని అట్టాడ పాఠకులకు ఎక్కడా విసుగు కలుగకుండా కత్తిమీద సాములా కథనాన్ని నడుపుకు రావడం అతని రచనా సామార్థ్యానికి నిదర్శనం. నవలకు నాయకుడు రాధేయే అయినప్పటికీ అసలు సిసలు నాయక పాత్ర అన్నపూర్ణదే.

నవల మొత్తం అంత నిస్వార్థపరమైన పాత్ర మరొకటి కనబడదు. కుటుంబాన్ని నిలబెట్టడం కోసం తన బ్రతుకంతా సమిధను చేసుకున్న వ్యక్తి అన్నపూర్ణ. అసలు మరోరకంగా చెప్పుకోవాలంటే రచయిత ఈ నవలనంతా చిననారాయుడి మొదటి భార్య, రాధేయ కన్నతల్లి బంగారమ్మ, పెంపుడు తల్లి అన్నపూర్ణ, అన్నపూర్ణ తల్లి రుక్మిణమ్మ, విప్లవనాయకుడు బలరామ్ భార్య సీతాలమ్మ, ఆవిడ కూతురు సంధ్య, అగ్రకుల ఆధిపత్యానికి ఎదురు నిలిచిన దళిత మహిళ ప్రమీల. వీళ్ళంతా నవలా శకటాన్ని ముందుకు పరుగెత్తించే చక్రాల్లోన్ని ఆకులవంటివారు. అంతేకాదు ఉత్తరాంధ్ర జీవన చదరంగంలో ముందు పీఠిన నిలిచి పోరాడిన సిపాయిలు. అందుకే ఉత్తరాంధ్ర చరిత్రలో వీరనారి గున్నమ్మ కనిపిస్తుంది. అంత ప్రత్యేకంగా పురుషపాత్ర కనిపించదు. అందుకే ఒకరకంగా ఉత్తరాంధ్ర చరిత్ర అంటే అక్కడి మహిళామణుల చరిత్రగానే గుర్తుంచుకోవాల్సి ఉంటుంది.

సాయుధ పోరాట స్ఫూర్తితో అప్పటిదాకా వ్యవసాయమే తమ సర్వస్వంగా భావించిన ఎంతోమంది యువకులు మెల్లగా విప్లవ రాజకీయాల్లో అడుగుపెట్టే క్రమానికి ప్రతీక కనకంనాయుడు పాత్ర. కొత్తగా రాజకీయాల్లోకి వస్తున్న యువకుల సాహస ప్రవృత్తి సాంప్రదాయ పాలకవర్గాల్లో వణుకు పుట్టించడం మనకు తెలుస్తుంది. అయితే, కనకంనాయుడులాంటివాళ్ళు రాజకీయాల్లో సంపాదించుకున్న దానికన్నా పోగొట్టుకున్నదే ఎక్కువ. అటువంటి వాళ్ళంతా పార్లమెంటరీ రాజకీయ పంథా నుండి విప్లవ రాజకీయ పంథాలోకి మరలడాన్ని ఉద్యమ విజయంగా భావించాల్సి ఉంటుంది. కరువు కాలంలో తిండి గింజల విషయంలో షావుకారుకి గ్రామస్తులకు జరిగిన ఘర్షణ చిలికి చిలికి గాలివానగా మారుతుంది. జనం మీద షావుకారు కేసు పెడతాడు. పోలీసులు జనాన్ని పట్టుకుపోయి విపరీతంగా కొడతారు. బయటకొచ్చిన తరువాత దానికి ప్రతిగా చందక శివయ్య అనే ఒంటరి రైతు షావుకార్ని నరికి చంపుతాడు. షావుకార్ల అరాచకాలను భరించి, భరించి సహనం సన్నగిల్లిన తరువాత శివయ్యలాంటి సామాన్యులే సింగం పిల్లల మాదిరిగా ప్రతీకారం తీర్చుకుంటారు అన్న చారిత్రక సత్యాన్ని అక్షరబద్ధం చేసి చూపించాడు అట్టాడ. విశాఖపట్నం పోర్ట్ హార్బర్ నిర్మాణంలో రాధేయతో పాటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే వ్యక్తి పైడిరాజ్. సమాజంలో దుర్మార్గులైన కొందరు వ్యక్తుల కారణంగా నేడు వీధికో కుంతీపుత్రుడు పుట్టుకొస్తున్నాడు. అటువంటి కుంతీపుత్రులకు ప్రతినిధిలాంటి పాత్ర పాపం! పైడిరాజ్ పాత్ర. పాత్ర నిడివి చిన్నదే అయినా పాఠకుల మనసుల్లో నిలిచిపోయి, వారి సానుభూతిని పొందే పాత్ర.

దళితురాలైన ప్రమీల ఓరోజు నాగావళి నదిలో అగ్రవర్ణలవారి నీలాటి రేవులో స్నానం చేస్తుంది. అది చూసిన బ్రాహ్మలు ఊళ్ళో చాలా పెద్ద ఎత్తున గొడవ చేస్తారు. అనేక వాదోపవాదాల తరువాత ప్రమీల కారణంగా అంటరానితనం నాగావళినదీ తరంగాల్లో జాడలేకుండా కొట్టుకుపోతుంది. ప్రమీల పాత్ర కూడా చిన్నదే అయినా పాఠకుల కళ్ళ ముందు మెరుపులు మెరిపిస్తుంది.

నాలుగు వందల అరవైఏడు పేజీల విస్తృత నవలలో ఎన్నో వైవిధ్యమైన జీవితాలను సందర్భోచితంగా పాఠకుల కండ్ల ముందుకు తీసుకొచ్చిన రచయిత అప్పల నాయుడుగారు ఎక్కడా పాఠకులను గందరగోళానికి గురికాకుండా కథ చెప్పడంలో గొప్ప నేర్పును ప్రదర్శిస్తాడు. గురజాడ నుండి మొదలుపెట్టి చాసో, కొకు, రావి, పంతంజలి, కారాల ఒరవడిలో ఉత్తరాంధ్ర సమగ్ర జీవిత చిత్రణను తన రచనల్లో బొమ్మకట్టి చూసిస్తున్న అట్టాడ ఈ బహుళ నవలతో దాన్ని మరింత పరిపుష్టం కావించాడని నిస్సందేహంగా చెప్పవచ్చు. తన ప్రాంత భాషను, యాసను, ఆచార వ్యవహారాలను, మొదట్లోనే చెప్పుకున్నట్టు ఉత్తరాంధ్ర చరిత్రను మొత్తం ఎర్రమందారాల మాలగా కూర్చి పాఠకుల మెదళ్ళల్లో అలంకరించాడు. నవలను చదివి రసాస్వాదనలో మునిగిపోతారో? ఉత్తరాంధ్ర చరిత్ర పుటల్లో దాగిన కఠోర నిజాల ఎరుకతో కదిలేపోతారో పాఠకుల ఇష్టం. ఇంత గొప్ప నవలను అందించిన అట్టాడగారి నుండి ఇటువంటి బహుళ ప్రయోజనమైన మరిన్ని రచనలు రావాలని ఆశిద్దాం.

బహుళ

రచయిత: ***అట్టాడ అప్పల్నాయుడు – నవల***

పేజీలు: 467, వెల: ₹ *300/–*

ప్రతులకు: ఫోన్: 944 003 1961.

చదవండి...

- మిసిమి

స్వాతంత్ర్యమే మా జన్మహక్కని... గుంటూరు జిల్లా పోరాట యోధుల శంఖారావం: తోటకూర వేంకట నారాయణ. దాదాపు వందమందికిపైగా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని త్యాగాలు చేసిన 'వీరుల' చరిత్ర ఇది. మనం అనుభవిస్తున్న స్వేచ్ఛకు విలువ తెలుసుకోవాలంటే ఇలాంటి చరిత్రలు చదవాలి. ఈనాటి విద్యార్థులకు తెలియజెప్పాలి. ఈ త్యాగమూర్తులకు ఏ చరిత్ర పుస్తకాల్లో ఇంత చోటు దక్కింది? ఒక్క గుంటూరు జిల్లాలో అదీ ఒక సామాజిక వర్గానికి ఎనభైశాతానికి పైగా ఉన్న ఈ పోరాట వీరుల చరిత్ర శాసనాలలో మిగిలిపోవాలా? వెంకటనారాయణ అక్షరబద్ధం చేశారు కాబట్టి మనకైనా తెలుస్తోంది.

పేజీలు: 224, వెల: ₹ 180/- ప్రతులకు: తోటకూర రామనీత, 2-సి, గీతా రెసిడెన్సి, ఎన్.ఆర్.టి. సెంటర్, చిలకలూరిపేట - 522616.

కాలం నేర్పిన పాఠం: శిరంశెట్టి కాంతారావు. "... పుట్టుకతోనే మన నిమిత్తం లేకుండా సాంఘిక వ్యవస్థలో సభ్యులుగా చేరిపోతాం. అందులో మన కుటుంబం, సంబంధ బాంధవ్యాలు కూడా భాగమే. దీనిని నిర్దేశించేది చట్టాలు, కట్టుబాట్లు, సలిగిదాయాలు.."

ఈ విధంగా నిర్విహించిన జీవితం ఒక ప్రకృతి ఘాతానికి ఒక వైరస్ వ్యాప్తికి అతలాకుతలైపోయి ప్రపంచం కరోనాకి ముందు కరోనా తర్వాతగా విడిపోయింది. భౌతికంగా, మానసికంగా, ప్రాణభయంతో వణికిపోతున్న ప్రాణికి దిక్కు లేకుండా పోయింది. ఈ ఇతివృత్తంలో ఎన్ని అనుభవాలు, ఎన్ని వేదనలు - ఉన్నవారు, లేనివారు, ఎవరి కష్టాలు వారివి. ఇవన్నీ ఎంతో హృదయ విదారకంగా ఏకరువు పెట్టిన కరోనా కథలు.

పేజీలు: 118, వెల: ₹ 100/- ప్రతులకు: ప్రముఖ పుస్తక షాపులు.

అశ్రుధార: రుబాయీలు. పెన్నా శివరామకృష్ణ. మనకు రుబాయీలు కొత్తేమీ కాదు. అలాగే పెన్నా శివరామకృష్ణ కొత్త రచయిత కాదు. వీరు ఇంతకు ముందే రుబాయీలను 'గజల్ సౌందర్య దర్శనం' - 'తెలుగు గజళ్లు - రుబాయీలు' రాసే ఉన్నారు. ఇప్పుడు ఈ 'అశ్రుధార' అందమైన ముఖచిత్రంతో అందించారు. అంతరాత్మ ఘోషలకు, జీవుని వేదనలకూ, అంతర్జ్వాలతో వాదనకూ తనను వీడని అశ్రువులకు నెలవే ఈ 'అశ్రుధార'.

పేజీలు: 139, వెల: ₹ 100/- ప్రతులకు: నవచేతన, నవోదయ, నవ తెలంగాణా బుక్‌హౌస్‌లు.

రక్షణ: కథల సంపుటి. డా. తాళ్లపల్లి యాకమ్మ. ఈ దశాబ్దపు వర్తమాన మార్పులను, ఎన్నో జీవితాలను, వాటిలో ఎత్తుపల్లాలను మనముందుంచారు రచయిత్రి. సామూహిక జీవన చిత్రాన్ని ఈ కథలు చిత్రిస్తాయని, స్త్రీ, దళిత వర్గాల దయనీయ స్థితి, వారి విజయ గాథలూ ఇలా అన్నీ ఈ 14 కథల్లో ఉన్నాయి. ఒక శాస్త్రవేత్తలా ఆయా పరిస్థితులను రచయిత్రి విశ్లేషించారు.

పేజీలు: 115, వెల: ₹ 100/-
ప్రతులకు: సోమారపు వీరాస్వామి, 1-6-64, నరసంపేట్ రోడ్, గుమ్ముడూరు, మహబూబాబాద్ - 506 101.
ఫోన్: 984 996 3491, 970 422 6681.

రవికిరణాలు: సత్యనీలిమ. ఇవన్నీ వచన కవితలు. అంతరంలో ఎగిరిపడే భావోద్వేగాలు. ఉక్కిరిబిక్కిరి చేస్తూ అక్షరరూపం ధరిస్తే అదే కవిత్వం అంటారు నందిని సిధారెడ్డి. ఇందులో కవితలన్నీ రచయిత్రి మనసులో నుంచి పొంగిన ఉద్వేగాల అక్షరరూపమే అనుకోవాలి. కొన్ని ఆశలు కూడా. *నింగిలోని తారలను దోసిలిలో నింపుకుని ముంగిట రంగవల్లులు వేయాలని ఆశ* అంటారు.

పేజీలు: 60, వెల: ₹ 100/- ప్రతులకు: సత్యనీలిమ, ఫోన్: 950 215 6813.

తప్పెటగుళ్లు: నటుడు, దర్శకుడు, న్యాయనిర్ణేత, రచయిత సాహితీ వైధూర్య – ఇన్ని విశేషణాలున్న డి. రాములు ఈ తప్పెటగుళ్లు ఆటవెలదుల త్రిశతి. మూడువందలు రాశారు. పద్యానికి పట్టం కడుతూ ఈ ఆటవెలదుల తప్పెటగుళ్లు ప్రవోగించిన రాములుగారు అభినందనీయులు. వీరు అంతకు పూర్వమే శతకాలు రచియించి వెలువరించారు. మూడు శతకాలు – గుండె చప్పుళ్లు, సృజనరాగాలు – ఎదలో సొదలు – ఈ త్రిశతిలో చోటుచేసుకున్నాయి. "ఆడవారికేది ఆత్మరక్షణ? ముగ్గునందు దించి – ముంచుతారు" ఇలా ఉంటాయి – చదవండి.



పేజీలు: 103, వెల: అమూల్యం.

ప్రతులకు: డి. రాములు, రచయిత, ఫస్ట్ రోడ్, అద్దంకి భవన్, 12-13 రోడ్ల మధ్య శాంతినగర్, ఏలూరు – 534 007. ఫోన్: 944 037 6688.

పద్యాల రావిచెట్టు బంగారమే: రావి రంగారావు రాసిన పద్యాలివి. వాటిని విశ్వసించినవారు డా. రామడుగు వెంకటేశ్వర శర్మ. వీరి పద్య కవితా సంపుటాలలో ముఖచిత్రం 'రావి'చెట్టే ఉంటుంది. ఈ 'అశ్వత్థ వృక్షం'లో త్రిమూర్తులూ కనిపిస్తారు. రావి రంగారావు ఎన్నో సాహితీ సంస్థలను నడిపగల సామర్థ్యం వీరిది. 'సాహిత్య సభల'కు నెలవు రావి రంగారావు నిలయం. మచిలీపట్నం, వీరు ఎక్కడ ఉంటే అక్కడ తర్వాత అమరావతి సీమ, ఈ 'రావి'చెట్టు ఊడలు పరుస్తూ అక్షరదృశ్యం చేస్తుంటుంది.

పేజీలు: 60, వెల: ₹ 50/- ప్రతులకు: నర్రా ప్రభావతి, డా. రావి రంగారావు సాహిత్య పీఠం, 101, శంఖ చక్ర నివాస్, అన్నపూర్ణ నగర్ 5వ లైను, ఈస్ట్ గోరంట్ల, గుంటూరు – 522034. ఫోన్: 924 758 1825.

కమ్మ రాజ్యాల చరిత్ర: యడ్లపల్లి అమర్‌నాథ్ కమ్మ. ఈ యువకుడు కమ్మ సామ్రాజ్యాల – పాలకుల చరిత్ర పరిశోధించి చారిత్రక పరంగా నచిత్రంగా అందిస్తున్నారు. కమ్మవారు ఏదో కమ్మ రాజ్యాల చరిత్ర ఏమిటో గత సహస్రాబ్ది కాలంగా వీలయినన్ని ప్రమాణాలతో అందించారు. చరిత్ర పాఠకులకు ఇది తప్పనిసరిగా కొత్త ఆలోచనలు రేకెత్తిస్తుంది.

పేజీలు: 240, వెల: ₹ 140/- ప్రతులకు: యడ్లపల్లి అమర్‌నాథ్ కమ్మ, ఫోన్: 939 824 5804.

కవన మంజరి: మంజుల సూర్య. ఇది కవిత్వం: వచన కవిత్వం. భారతీయ చీరకట్టు (కనికట్టు) నుంచి ప్రపంచ మహాసభలు – ఆకాంక్ష – చీకట్లో చంద్రుడు ఓ కాంతామణి కథ – ఇలా ఈమె స్పృశించని అంశం లేదు. స్పందించని స్పర్శ లేదు – ఇది మొదటి ప్రయత్నమైనా కొంతలో కొంత వచనంలో కవిత్వం నింపి మరీ వచనాన్ని తుంచి – కవిత్వమనకుండా మనకందించారు ఆస్వాదించమని.

పేజీలు: 99, వెల: ₹ 150/- ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాద్ – 500 036. ఫోన్: 040-27678430, 98487 87284.

మిసిమి
మాసపత్రిక

మీరు చందాదారులుగా చేరండి బహుమతిగా పంపండి

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ ద్వారా ఇ-మెయిల్ *(misimi90monthly@gmail.com),* ద్వారాగానీ తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

చందా వివరాలు:

₹ 360/- (సంవత్సర చందా),
₹ 720/- (రెండు సంవత్సరాలకు),
₹ 1080/- (మూడు సంవత్సరాలకు),
₹ 1440/- (నాలుగు సంవత్సరాలకు).
₹ 1,800/- (అయిదు సంవత్సరాలకు)

BHIM BHARAT INTERFACE FOR MONEY G Pay
paytm UPI PhonePe
Ph: 939 343 6969

మిసిమి ప్రచురణలు

నోబెల్ వ్యాసాలు

మిసిమి పార్థసారథి వ్యాసాలు

చిత్రకళా నీరాజనం


చార్లీ చాప్లిన్


భైరవ్

ప్రపంచ సాహిత్యం

పాలిజాతం

పెళ్లి జీవిత కథ

సిద్ధార్థ


దోసిట చిన్నుకులు

సృత్యభారతి

ప్రతులకు:
మిసిమి
కార్యాలయాన్ని
సంప్రదించండి.
ఫోన్:
994 951 6567.

మిసిమి మాసపత్రిక
Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. **040-27645536.**